

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి



సోమవారం | 26-2-2018 | పేజీలు: 20 + 16 | వెల: రూ.5.00 | సంపుటి: 14 సంచిక: 227 | శ్రీహేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: ఏకాదశి సా. 5.29 తదుపరి ద్వాదశి; నక్షత్రం: ఆరుద్ర ఉ. 8.03, పునర్వసు తె. 5.10; వర్జ్యం: సా. 6.36-8.00; దుర్ముహూర్తం: మ. 12.52-1.39, మ. 3.12-3.58; అమృతఘడియలు: తె. 3.48-5.16; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.40; సూర్యాస్తమయం: 6.18 | నిజామాబాద్ సిటీ*

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai



అపూర్వ సౌందర్యంతో, ముద్దులొలికే మాటలతో, సాటిలేని అభినయంతో ప్రేక్షకుల గుండెల్లో దశాబ్దాల తరబడి తిష్టవేసిన అందాల రాక్షసి... తెలుగు, తమిళ, హిందీ సినిమా రంగాలను ఓ ఊపు ఊపిన నటి శ్రీదేవి.. అకస్మాత్తుగా కన్నుమూసింది.

వెండితెరపై అందాల వెన్నెలలు కురిపించిన జాబిలమ్మకు మృత్యువనే గ్రహణం పట్టింది! భూలోకం మునుపెన్నడూ చూసి ఎరుగని సిరి.. తిరిగిరానంటూ మరలిరాని లోకాలకు తరలిపోయింది!! తొలి లేడీ సూపర్‌స్టార్.. యావద్భారత ప్రేక్షకుల ప్రేమాభిషేకంలో నిలువెల్లా తడిసిన దేవత.. అంతలోనే ఏదో పని ఉన్నట్టు హడావుడిగా దివికేగింది!!

"శ్రీదేవి లాంటి అద్భుతాన్ని సృష్టించిన దేవుడు ఎంతటి మహాత్ముడో అనుకున్నాం. కానీ ఆమెను ఇంత త్వరగా తీసుకుపోయిన దేవుడు ఎంత కఠినాత్ముడు?" అని ప్రేక్షక లోకం కన్నీటి సంద్రమైంది. ఆమె హఠాన్మరణాన్ని జీర్ణించుకోలేక యావత్ భారతదేశమే భోరుమంది.

ఆ అతిలోక సుందరి తన అంగుళీయకాన్ని మళ్లీ పారవేసుకుంటుందా? "భూలోకమే నవోదయం" అంటూ రెక్కలు కట్టుకుని మళ్లీ వాలుతుందా? అందాల మహోదయాన్ని తిరిగి తీసుకువస్తుందా?

లేదు... లేదు... ఆమె ఇక రాదు.. రాదు!! ఆ తార రాలిపోయింది. ఆ ఎనిమిదో అద్భుతం ఆకాశానికి ఎగిరిపోయింది. శోక శిశిరాన్ని మిగిల్చి ఆ వసంత కోకిల 54 వసంతాలకే వెళ్లిపోయింది.

దివికేగిన దేవత

అతిలోక సుందరి శ్రీదేవి హఠాన్మరణం



దుబాయ్‌లో గుండెపోటుతో కన్నుమూత

పూర్తయిన పోస్ట్‌మార్టం.. నేడు ముంబైకి భౌతికకాయం

రెండ్రోజులపాటు హోటల్ గది నుంచి బయటకురాని శ్రీదేవి?

కడసారి వీడ్కోలు పలికేందుకు తరలుతున్న అభిమానులు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

అందాల నటి శ్రీదేవి (54).. అశేష అభిమానులను శోకసంద్రంలో ముంచేస్తూ అకాలమరణం చెందారు. దుబాయ్‌లో బంధువుల ఇంట పెళ్లికి వెళ్లిన ఆమె.. శనివారం రాత్రి కార్డియాక్ అరెస్ట్ కారణంగా హోటల్లోని బాత్‌రూమ్‌లో కుప్పకూలిపోయారు. కుటుంబసభ్యులు ఆమెను స్థానిక షేక్ రాషేద్ ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యంలోనే తుదిశ్వాస విడిచారు. శ్రీదేవి భౌతికకాయాన్ని ఆస్పత్రి వర్గాలు పోలీసులకు అప్పగించగా.. అల్‌ఖుసేస్‌లోని మార్చురీలో భద్రపరిచారు. దుబాయి నుంచి తెలుగు రాష్ట్రాలకు తరలించే మృతదేహాలను చివరిగా ఉంచే చోటు అదే. ఫోరెన్సిక్ పరీక్షల నివేదిక వచ్చేంతవరకూ శ్రీదేవి భౌతిక కాయాన్ని అక్కడే ఉంచుతారు. ఆ ప్రక్రియలన్నీ వీలైనంత త్వరగా పూర్తిచేయాల్సిందిగా శ్రీదేవి భర్త బోనీకపూర్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. భారతీయ కాన్సులేట్ ఆయనకు సహకరించేందుకు అరబ్బీ భాష అనువాదకుడిని ప్రత్యేకంగా కేటాయించింది. శ్రీదేవి భౌతికకాయాన్ని వీలైనంత త్వరగా భారతదేశానికి పంపించేందుకు కృషి చేస్తున్నామని.. స్థానిక పోలీసు అధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నామని భారతీయ కాన్సుల్ జనరల్ విపుల్ చెప్పారు. పోలీసు క్లియరెన్స్ పూర్తయిన వెంటనే శ్రీదేవి భౌతికకాయాన్ని ముంబైకి తరలించేందుకు.. రిలయన్స్ దిగ్గజం అనిల్ అంబానీ తన ప్రత్యేక విమానాన్ని దుబాయ్‌కు పంపించారు. తన ఆడపడుచు కుమారుడు మోహిత్ మార్వా వివాహానికి హాజరయ్యేందుకు శ్రీదేవి నాలుగు రోజుల క్రితం కుటుంబసమేతంగా రస్ అల్ ఖైమాకు చేరుకున్నారు. 20వ తేదీన వివాహం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు దాదాపు 550 మంది అతిథులు వచ్చారు. బోనీ మొదటి భార్య కుమారుడు అర్జున్, కూతురు అన్షులా తదితరులు కూడా హాజరయ్యారు. బోనీ, శ్రీదేవి, వారి చిన్న కూతురు ఖుషీ.. పెళ్లిలో బాగా సందడి చేశారు. పెద్ద కుమార్తె జాన్వి మాత్రం.. తన తొలి చిత్రం షూటింగ్ కోసం ముంబైలోనే

మిగతా 5వ పేజీలో...

మానసిక ఒత్తిడే మింగేసిందా?

శ్రీదేవికి యాభై నాలుగేళ్లు. ప్రస్తుత జీవన ప్రమాణాల ప్రకారం చూస్తే అదేం పెద్ద వయస్సు కాదు. ఆమె నిత్యం యోగా చేస్తుంది. చురుగ్గా కనిపిస్తుంటుంది. గుండె జబ్బున్నట్లు గత వైద్య పరీక్షల్లో ఎన్నడూ తేలలేదు. కానీ, హఠాత్తుగా గుండెపోటు వచ్చింది. అందర్నీ హతాశుల్ని చేస్తూ తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలో శ్రీదేవి మరణానికి కారణమేమై ఉంటుందనే చర్చ దేశవ్యాప్తంగా మొదలైంది. తన భావోద్వేగాలను బయటపెట్టకుండా, ఎలాంటి పరిస్థితుల్లోనైనా నిబ్బరంగా ఉన్నట్టు కనిపించడం శ్రీదేవికి చిన్నప్పటి నుంచీ అలవాటు. నాలుగైదు రాష్ట్రాలు, ఎన్నో భాషలు, అన్నేసి సంస్కృతులు, ఇంకెన్నో రకాల పరిస్థితులు, మరెన్నో వ్యక్తిత్వాలు ఆమెకు సుపరిచితమే. క్లిష్ట పరిస్థితుల్లో సైతం భావోద్వేగాలను బయటికి పొక్కనీకుండా జాగ్రత్త పడేది. ఆ అలవాటే ఆమెను మానసికంగా ఒత్తిడికి గురి చేసి ఉంటుందని భావిస్తున్నారు. అందం మీద

మిగతా 5వ పేజీలో...

లోపలి పేజీల్లో...









రైతే రారాజు

రైతు సమితులు.. ఆటంబాంబులు!



రాజేంద్రనగర్‌లోని జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన రైతు సమన్వయ సమితి సదస్సులో ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్, చిత్రంలో మంత్రి నాయిని తదితరులు

కేసీఆర్ రద్దయితేనే అవి రద్దయితయి

1.62 లక్షల సభ్యులూ 1.62 లక్షల కేసీఆర్‌లు కావాలి

పెట్టుబడి సాయం పథకానికి బడ్జెట్లో రూ.12 వేలు

ఈసారి బేరర్ చెక్కులు.. రబీ నుంచి ప్రీలోడెడ్ కార్డులు

పండ్ల తోటలకూ పెట్టుబడి సాయం అందుతుంది

సబ్సిడీపై 5 వేల వరి నాటు యంత్రాలు

ఇజ్రాయెల్‌కు మండల రైతు సమితి సభ్యులు

మేలో గ్రామగ్రామానా చెక్కుల పంపిణీ

సమితి ప్రాంతీయ సదస్సులో సీఎం కేసీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రైతు సమన్వయ సమితులను రద్దు చేసే ప్రసక్తే లేదని, తాను బతికి ఉన్నంత వరకూ రైతు సమితులు ఉంటాయని ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. "కేసీఆర్ ఉన్నంత కాలమూ రైతు సమితులను ఎవ్వరూ ఏమీ చేయలేరు. కేసీఆర్ రద్దయితనే అవి రద్దయితయి" అని అన్నారు. ఏదంటే అది చేసే ప్రభుత్వం రాష్ట్రంలో ఉందని, రైతు సమన్వయ సమితులు ఆటంబాంబుల్లాగా పని

మిగతా 2వ పేజీలో...

ప్రధానికి పదిసార్లు చెప్పా

రైతుల కోసం గొప్పగా ఏదీ చేసినట్లు కనిపించలేదు

పంటలకు రెట్టింపు ధర మాటల్లోనే.. ఇతర పార్టీలతో చర్చిస్తున్నా

పోరాటం తప్పదు.. ఐక్యత రాబోతోంది: ముఖ్యమంత్రి కేసీఆర్

2

టీఆర్టీకి దాదాపు 100% హాజరు 11 | **టీఎస్ టీఆర్టీ ఎస్జీటీ (తెలుగు మీడియం) కీ** స్టడీ పేజీలో



ఓంకారం.. మోక్షసాధనం



Paramjyothi పరంజ్యోతి

ఇతర దేశాల్లో భాస అనుసంధాన సాధకం. విదేశీయులు తమ భాషలను 'ఉపయోగించే విధానం'పై అధ్యయనం చేస్తారు. మన భాషలో ధ్వని ప్రధానం. వాక్కు, అర్థం రెండూ విడదీయరానివిగా భావిస్తాం. శబ్దాన్ని 'నాదస్వరూపం'గా పిలుస్తాం. దానినే వేదాంతం 'శబ్ద బ్రహం'గా అభివర్ణించింది. నిర్గుణ, నిరంజన, స్వయంజ్యోతిర్లింగ పరమాత్మను శబ్దబ్రహ్మతో సూచిస్తాం. ప్రకృతి నిండా వ్యాపించి ఉన్న శబ్ద బ్రహ్మానికి ప్రతీక.. ఓంకారం. అది ఆ పరమాత్మకు మరోపేరు. దాని ప్రాముఖ్యత అంతా ఒక ధ్వని, ఒక సంకేతం. దానిలోని అర్థాన్ని గురించిన ప్రశ్న కన్నా దాని ధ్వని స్వరూపానికే మన శాస్త్రాల్లో ప్రాధాన్యం ఎక్కువ ఉంది. దానికి ఆధ్యాత్మికత కన్నా విజ్ఞాన తత్వం ఎక్కువ. సాధకుడు అంతరంగాన్ని కదపగలిగే శక్తి ఆ ఓంకారానికి ఉంది. మనసు లోతుల్లోని పొరల్లో దాగి ఉండే వాసనలనే మలినాలను బయటకు విరజిమ్మి ఆత్మతత్వాన్ని గుర్తుచేసేది శబ్దబ్రహ్మంగా పిలిచే ఓంకారం. ఓంకార జపం చేస్తే చిత్త మాలిన్యాలను తొలగిస్తుంరా శబ్దాన్ని ఉచ్చరిస్తే వివిధ చక్రాలపై పనిచేసి వాటిని చైతన్యవంతం చేసి లక్ష్యసిద్ధిని, ఆనందాన్ని కలిగిస్తుంది. శబ్దం నుంచే యోగం వైపు తీసుకెళ్లే సాధనం ఓంకారం. ప్రకృతి నిండా వ్యాపించిన శబ్దబ్రహ్మానికి ఓంకారం ప్రతీక. నాదబ్రహ్మాన్ని పట్టుకుంటే పరమాత్మవైపు మనం అడుగులు వేసినట్టే. అందుకే మన మహర్షులు.. ఓంకారాన్ని మోక్షసాధనంగా అభివర్ణించారు.

డా. పి. భాస్కరయోగి




బాలాలయంలో గరుడ వాహనంపై ఊరేగుతున్న కల్యాణ లక్ష్మీనరసింహుడు

లక్ష్మీనారసింహుడికి దివ్యవిమాన రథోత్సవం

యాదాద్రి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తిరు కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణ లక్ష్మీనారసింహులు ఆదివారం రాత్రి దివ్య విమాన రథంపై ఊరేగారు. యాదాద్రి ఆలయం పునఃనిర్మాణంలో ఉన్న నేపథ్యంలో ఈ రథోత్సవాన్ని ఆగమ నియమాలకు అనుగుణంగా బాలాలయ ఉత్సవ మండపంలో నిర్వహించారు. వేదమంత్రాలతో ఆలయ అర్చకులు రథాంగ హోమం జరిపారు. ఉత్సవమూర్తులకు ప్రత్యేక అలంకారం జరిపి.. స్వామివారిని ప్రచార రథంపై కొండ కింద పట్టణవీధుల్లో ఊరేగించారు. కొండ కింద స్వామివారి వైకుంఠ ద్వారం నుంచి పట్టణ ప్రధాన వీధుల గుండా భక్తుల కోలాట నృత్యాలు, భజనల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. అంతకుముందు తిరుకల్యాణ లక్ష్మీనారసింహులను గరుడ వాహనంపై ఊరేగించారు వెండి గరుడ సేవలో భాగంగా స్వామివారు.. విష్ణుమూర్తి అలంకారంలో తన ఇష్టవాహనమైన గరుత్మంతుడిపై దేవేరి శ్రీమహాలక్ష్మీ అమ్మవారి సమేతంగా ఉత్సవ మండపంలో ఊరేగారు.

సామాజిక ఉద్యమకారుడు వెల్దుర్తి హర్షవర్ధన్ కన్నుమూత

▸ నేడు మెడికల్ కాలేజీకి భౌతికాయం అందజేత



హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సామాజిక ఉద్యమకారుడు, మేధావి వెల్దుర్తి హర్షవర్ధన్ (67) కన్నుమూశారు. 3నెలలుగా బ్లడ్ కేన్సర్‌తో బాధపడుతున్న ఆయన ఇక్కడి సిటిజన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. ఆంధ్ర మహాసభ ప్రారంభకుల్లో ఒకరైన వెల్దుర్తి మాణిక్యరావు పెద్ద కుమారుడు హర్షవర్ధన్. తండ్రి ఆశయాలకనుగుణంగా ప్రజాసేవకు జీవితాన్ని అంకితం చేశారు. ప్రజాతంత్ర హక్కుల పరిరక్షణ సంస్థ (ఓపీడీఆర్)లో సిటీ యూనిట్ అధ్యక్షుడిగా హర్షవర్ధన్ రెండుసార్లు ఎన్నికై సంస్థ కార్యక్రమాలను ముందుకు తీసుకువెళ్లారు. 'నవోదయ' సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో వెలువడిన 'జీవనాడి' పత్రికలో ఆయన సహ సంపాదకుడిగా పనిచేశారు. అనేక కథలు, వ్యాసాలు రచించారు. ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీలో జనరల్ మేనేజర్‌గా చాలా కాలం పనిచేసి పదవి విరమణ చేశారు. కువైట్‌లో 'తెలుగు కళాసంస్థ' పేరిట సంస్థను ప్రారంభించి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. హర్షవర్ధన్‌కు భార్య, ఇద్దరు సంతానం. సరూర్‌నగర్‌లోని నివాసంలో ఆయన భౌతికకాయాన్ని సోమవారం అభిమానుల సందర్శనార్థనం ఉంచనున్నారు. అటు తర్వాత మెడికల్ కాలేజీకి అందజేయనున్నారు. హర్షవర్ధన్ మృతి తీరని లోటని రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి, కవి శివారెడ్డి, కథాసాహిత్య సంపాదకుడు వాసిరెడ్డి నవీన్, భారత్-చైనా మిత్ర మండలి అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, దేవిప్రియ, విమలక్క, ఓపీడీఆర్ ఉపాధ్యక్షుడు జతిన్‌కుమార్, కార్యదర్శి విజేందర్ అన్నారు.

'సహకారం'పై రాజకీయ నీడ!

▸ మంత్రి దెబ్బకు సంక్షోభంలో ఎత్తొండ పీఏసీఎస్

▸ పర్సన్ ఇన్‌చార్జి నియామకంపై వివాదం

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సహకార రంగం రాజకీయాల కారణంగా కునారిల్లుతోంది. పురోగమనంలో దూసుకెళ్తున్న నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం ఎత్తొండ పీఏసీఎస్‌కు రాజకీయ నీడ అడ్డుగా వస్తోంది. సహకార సంఘాల పాలకవర్గాల పదవీకాలం ముగియడాన్ని ఓ మంత్రి అవకాశంగా మలచుకొని చక్రం తిప్పడంతో పీఏసీఎస్ సంక్షోభం ఎదుర్కొంటోంది. ఈ ఏడాది జనవరి 31తో రాష్ట్రంలో పీఏసీఎస్‌ల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం మరో ఆరునెలలు పొడిగించింది. కానీ, ఎత్తొండ సంఘం టర్నోవర్‌ను రూ.2.3 కోట్ల నుంచి రూ.100 కోట్లకు తీసుకెళ్లిన చైర్మన్ కొత్తా సోమశేఖరరావును, పాలకవర్గాన్ని పక్కనబెట్టి ఒక అధికారిని పర్సన్ ఇన్‌చార్జిగా నియమించింది. అయితే సంఘంపై ఎలాంటి ఆరోపణలు లేకపోయినా, గతంలో ఎలాంటి విచారణలు జరగకపోయినా ఈ నిర్ణయం తీసుకోవడం వెనుక రాజకీయ కారణాలున్నాయన్న ఆరోపణలు వినవస్తున్నాయి. దీనిపై పాలకవర్గం న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. దాంతో న్యాయస్థానం పర్సన్ ఇన్‌చార్జి నియామకాన్ని సస్పెండ్ చేసింది. అయినా సహకార శాఖ అధికారులు పట్టించుకోకపోగా.. సహకార సంఘం రికార్డులను తీసుకెళ్లారు. అయితే ముందస్తు సమాచారం ఇవ్వకుండా రికార్డులను తీసుకెళ్లడంపై పాలకవర్గం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. సీసీ కెమెరాలకు గుడ్డలు చుట్టి రికార్డులను తీసుకెళ్లారంటూ కోటగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు నమోదయింది. పైగా ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన వ్యక్తుల పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. ఈ విషయాన్ని సోమశేఖరరావు అఖిలపక్ష నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. నిజామాబాద్ కమిషనర్ సూచన మేరకు అసిస్టెంట్ పోలీస్ కమిషనర్‌ను కలిసినట్లు, అయినా విచారణ జరపలేదని, ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేదని చెప్పారు. మంత్రి పోచారం ప్రోద్బలంతో ఎత్తొండ సహకార సంఘంపై కక్షగట్టి.. పోలీసులు నిందితులకు వత్తాసు పలికే విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దీంతో ప్రభుత్వం సహకార స్ఫూర్తిని నీరు గారుస్తున్నారని, అవసరమైతే ఆందోళనకు దిగుతామన్నారు.

టీఆర్ఎస్‌వి కక్షసాధింపు చర్యలు

▸ టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపక్ష నేతలపై కక్ష సాధింపులకు పాల్పడుతోందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి ఆరోపించారు. నిజామాబాద్ జిల్లా ఎత్తొండ సహకార సంఘాన్ని నిర్వీర్యం చేయాలని అధికార పార్టీ నేతలు కాంగ్రెస్‌కు చెందిన చైర్మన్ సోమశేఖర్‌రావుపై కుట్రపూరిత కేసులు పెడుతున్నారని విమర్శించారు. ఈ విషయాన్ని ఆదివారం రాష్ట్ర డీజీపీకి ఆయన లేఖ రాశారు. వివరాలను టీపీసీసీ కోశాధికారి గూడూరు నారాయణరెడ్డితో కలిసి గాంధీభవన్‌లో మల్లు రవి మీడియాకు వెల్లడించారు. ప్రభుత్వం నియమించిన పీఐసీకి వ్యతిరేకంగా సోమశేఖర్ హైకోర్టుకు వెళ్లారన్న అక్కసుతో సంఘంలోని రికార్డులను అధికారుల సాయంతో మాయం చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

రాష్ట్ర రైతు సమితి అధ్యక్షునిగా గుత్తా సుఖేందర్‌రెడ్డి

▸ సదస్సులోనే ప్రకటించిన సీఎం కేసీఆర్



హైదరాబాద్/నల్లగొండ, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రైతు సమితి అధ్యక్షునిగా నల్లగొండ ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డిని నియమించనున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఆయన రైతు బిడ్డ అని, బ్రహ్మాండమైన డెయిరీని నిర్వహించారని పేర్కొన్నారు. సహకార, డెయిరీ రంగాల్లో ఆయనకు అనుభవం ఉందన్నారు. పెద్ద కాపు అయిన ఆయన్ను పెద్ద కాపు కింద పెడుతున్నామని, ఆయనపైన పెద్ద కాపు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఇక రంజుగా కథ నడవాలంటూ చమత్కరించారు. రాష్ట్ర రైతు సమితి అధ్యక్షునిగా గుత్తాను నియమించే అవకాశం ఉందని ఆంధ్రజ్యోతి అందరి కంటే ముందే చెప్పింది. ఇప్పుడు అదే నిజమైంది.

వార్డు మెంబర్‌గా ప్రస్థానం ప్రారంభం

వార్డు మెంబర్‌గా మొదలైన గుత్తా ప్రస్థానం రాష్ట్ర సమన్వయ సమితి అధ్యక్షుడి స్థాయికి చేరింది. 1954లో నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలో రైతు కుటుంబంలో జన్మించిన ఆయన నానక్‌రామ్ భగవాన్‌దాస్ కళాశాలలో బీఎస్సీ అగ్రికల్చర్ చదువుతుండగా(1971-72) విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1978లో ఇందిరా కాంగ్రెస్ పార్టీలో చేరి 1981లో ఉరుమడ్ల గ్రామ పంచాయతీ వార్డు మెంబర్‌గా గెలుపొందారు. యువజన కాంగ్రెస్, జిల్లా కిసాన్ యూత్ సెల్ అధ్యక్షుడిగా రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. 1983లో ఆవిర్భవించిన టీడీపీలో చేరి పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా, క్రమశిక్షణ సంఘం చైర్మన్‌గా, రాష్ట్ర ఉపాధ్యక్షునిగా పని చేశారు. 1984లో చిట్యాల మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్‌గా, 1985లో చైర్మన్‌గా, 1992లో సింగిల్ విండో డైరెక్టర్‌గా, 1992-99 కాలంలో ఉరుమడ్ల పాల ఉత్పత్తిదారుల సొసైటీ చైర్మన్‌గా పనిచేయడమే కాకుండా 1992లో నార్మాక్స్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. 1995లో దేవరకొండ జడ్పీటీసీగా ఎన్నికై అదే సంవత్సరం డెయిరీ డెవలప్‌మెంట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్‌గా కూడా పని చేశారు. 1998లో నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు డైరెక్టర్‌గా, 1999లో టీడీపీ తరఫున నల్లగొండ పార్లమెంటు సభ్యుడిగా మొట్టమొదటిసారి ఎన్నికయ్యారు. 2009, 2014లో కాంగ్రెస్ పార్టీ నుంచి పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం టీఆర్ఎస్‌లో చేరి రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షుడిగా నియమితులయ్యారు.

గుత్తా సుఖేందర్‌రెడ్డి బయోడేటా

పేరు: గుత్తా సుఖేందర్‌రెడ్డి
జననం: 02-02-1954
విద్యార్హతలు: బీఎస్సీ, ఎన్‌బీ సైన్స్ కళాశాల, హైదరాబాద్
ప్రస్తుత హోదా: నల్లగొండ లోక్‌సభ సభ్యుడు
చిరునామా: 3-6-218, 601 అన్విత్ అవెన్యూ, స్ట్రీట్ నెం. 16, హిమాయత్‌నగర్, హైదరాబాద్

స్కాలర్‌షిప్ రాదంటున్నారు!

▸ మీరే ఆదుకోవాలి.. ఓ తండ్రి ఆవేదన

▸ తక్షణమే పరిష్కరించిన కేసీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రైతు సమన్వయ సమితుల ప్రాంతీయ అవగాహనా సదస్సులో ఓ తండ్రి ఆవేదనపై ముఖ్యమంత్రి కేసీఆర్ వెంటనే స్పందించారు. సదస్సులో సభ్యుల సందేహాలకు ఆయన సమాధానాలు ఇస్తున్న సమయంలో.. సూర్యాపేటకు చెందిన మాలావత్ కృష్ణ లేచి తన కూతురు ఫిలిప్పీన్స్‌లో ఎంబీబీఎస్ చదువుతోందని, ఆమెకు ఓవర్సీస్ పథకం కింద స్కాలర్‌షిప్ రాదని అధికారులు చెబుతున్నారని వాపోయాడు. మీరే ఆదుకోవాలని కంటతడి పెట్టాడు. తక్షణమే స్పందించిన కేసీఆర్.. ప్రత్యేక కేసు కింద స్కాలర్‌షిప్ మంజూరు చేస్తామని ప్రకటించారు. జిల్లా మంత్రి జగదీశ్‌రెడ్డిని కలవాలని కృష్ణకు సూచించారు.

స్థల దాతలకు సత్కారం

ప్రతి ఏఈవో క్లస్టర్లో తలపెట్టిన రైతు వేదికలకు స్థలాన్ని, డబ్బులను దానం చేయడానికి ముందుకు వచ్చిన పలువురిని సభా వేదికపై సీఎం కేసీఆర్ శాలువాలతో సత్కరించారు. ఈ రోజుల్లో ఎకరం భూమిని దానంగా ఇవ్వడానికి వచ్చిన వారు గాంధీ కంటే గొప్పవారన్నారు. దాతలను ఆయన కొనియాడారు. అనంతరం వ్యవసాయ, అనుబంధ శాఖలు కేసీఆర్‌కు ఆయన చిత్రపటాన్ని బహూకరించాయి. ఈ సభలో 13 జిల్లాల జిల్లా, మండల సమన్వయ సమితుల సభ్యులు పాల్గొన్నారు. సభా వేదికపై వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మంత్రులు హరీశ్‌రావు, నాయిని నర్సింహారెడ్డి, లక్ష్మారెడ్డి, జూపల్లి కృష్ణారావు, మహేందర్‌రెడ్డి, ఎంపీలు గుత్తా సుఖేందర్‌రెడ్డి, కేశవరావు, ప్రభుత్వ సలహాదారు డి. శ్రీనివాస్, శాసనసభ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి, 13 జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రైతే రారాజు

(మొదటిపేజీ తరువాయి)

చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని 1.62 లక్షల మంది రైతు సమితుల సభ్యులూ 1.62 లక్షల కేసీఆర్‌లు కావాలన్నారు. పెట్టుబడి సాయం పథకానికి బడ్జెట్లోనే రూ.12 వేల కోట్లు కేటాయిస్తామని తెలిపారు. ఈసారికి బేరర్ చెక్కుల రూపంలో సాయం అందజేస్తామని, వచ్చే రబీ నుంచి ప్రీలోడెడ్ కార్డులను ఇవ్వాలని నిర్ణయించామని వెల్లడించారు. రాజేంద్రనగర్‌లోని జయశంకర్ విశ్వవిద్యాలయంలో ఆదివారం జరిగిన రైతు సమన్వయ సమితి మొదటి ప్రాంతీయ సదస్సులో సీఎం కేసీఆర్ మాట్లాడారు. భోజనానంతరం సభ్యుల సందేహాలు, సూచనలపై స్పందించారు. "రాష్ట్రంలో ఏ వివాదం లేని వ్యవసాయ భూములు 1.42 కోట్ల ఎకరాలు తేలాయి. అసైన్డ్ భూముల్లోనూ 20 లక్షల ఎకరాలు వివాదం లేనివి ఉన్నాయి. మొత్తం 1.65 కోట్ల ఎకరాలకు వచ్చే ఖరీఫ్‌లో ఎకరాకు రూ.4 వేల సాయం అందుతుంది. దీనిని బేరర్ చెక్కుల రూపంలో ఇవ్వాలని నిర్ణయించాం. వచ్చే రబీ నుంచి ప్రీలోడెడ్ కార్డులు ఇస్తాం" అని తెలిపారు. పండ్ల తోటలకూ చెక్కుల పంపిణీ జరుగుతుందని, అనుమానం అక్కర్లేదని స్పష్టం చేశారు. సమితి సభ్యుల పదవులు రాజకీయ పదవులు కాబోవని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై 200 కేసులు వేశారని, ఇదేనా పద్ధతి అంటూ విమర్శించారు. రైతు సమితులతో స్థానిక సంస్థలు నిర్వీర్యమవుతాయని అంటున్నారని, ఎందుకు అవుతాయని ప్రశ్నించారు.

ఇంటికే పాస్‌పుస్తకాలు

పాస్‌పోర్టు తరహాలో ఇకపై రైతుల పాసుపుస్తకాలు ఇంటికే వస్తాయని సీఎం కేసీఆర్ తెలిపారు. ఎవరికీ దండాలూ పెట్టాల్సిన అవసరం ఉండదన్నారు. పాస్‌పుస్తకం రావడంలో ఒకరోజు ఆలస్యమైనా రూ.1000 ఫైన్ ఉంటుందన్నారు. ఈ విధానం మార్చిలో అమల్లోకి రానుందన్నారు. రైతు చనిపోతే ఆయన భార్య వివరాలు ఎమ్మార్వోకి సమర్పిస్తే మ్యుటేషన్ చేస్తారని తెలిపారు. ఈ మేరకు చట్టం తెస్తున్నట్లు చెప్పారు.

24 గంటల కరెంటు కొనసాగిస్తాం

రాష్ట్రంలో 24 గంటల కరెంటు అన్ని రంగాలకూ అందుబాటులో ఉంటుందని సీఎం కేసీఆర్ తెలిపారు. "రైతులు ఏడాదిపాటు భూగర్భ జలాలు కాపాడుకోవాలి. అక్కడక్కడా వ్యవసాయానికి 24 గంటలు కరెంటు వద్దంటున్నారు. అయినా కొనసాగిస్తాం. రైతుల్లోనే క్రమశిక్షణ రావాలి" అని స్పష్టం చేశారు. నిర్మాణంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తయితే తెలంగాణ రైతాంగం రెండు పంటలూ పండిస్తుందని, దీంతో ఏడాదికి 1.25 లక్షల కోట్ల రూపాయల విలువైన పంటలు పండుతాయని చెప్పారు. రైతు సమితి సభ్యులు కష్టపడితే ఇది వంద శాతం నిజమవుతుందన్నారు. "జిల్లాల్లో కల్తీ విత్తనాలు, మందులు, విత్తనాలు అమ్మేవారు ఎవరో తెలియదా? రైతులు సంఘటితమైతే వారిని తన్ని తరిమేయవచ్చు. ఎవరో తెలిసినా ఇన్ని రోజులూ ప్రేక్షకపాత్ర వహించారు. ఇకమీదట వాచ్ డాగ్‌లుగా వ్యవహరించి వారిని ఏరివేయాలి. వారిపై ఉక్కుపాదం మోపి నిర్మూలించాలి. రైతులు సంఘటితమై పిడికిలిలా పని చేయాలి" అని సీఎం కేసీఆర్ పిలుపునిచ్చారు. ప్రతి ఏఈవో క్లస్టర్లో రూ.12 లక్షలతో రైతు వేదిక నిర్మిస్తామన్నారు. దీనికి దాతల నుంచి స్థల సేకరణ జరపాలని, ప్రభుత్వ భూమి ఉన్నచోట దాన్ని సేకరించాలని, వీలు కాకపోతే కొనుగోలు చేయాలని సూచించారు. "ప్రతి మండల రైతు సమితికి వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఒక గది ఉంటుంది. కంప్యూటర్లు పంపిణీ చేస్తాం. ప్రతి 5 వేల ఎకరాల్లో ఏ ఎకరంలో ఏ రైతు ఏ పంట పెడుతున్నారో సేకరించాలి. పండిన పంట నియంత్రిత విధానంలో వ్యవసాయ మార్కెట్‌కు రావాలి. దీనిని ఈ యాసంగి నుంచే ప్రారంభించాలి. రైతుకు కనీస మద్దతు ధర రాబట్టాలి. రాష్ట్ర రైతు సమన్వయ సమితి వద్ద రూ.6-7 వేల కోట్ల వరకూ ఉంటాయి. ఈ మేరకు బ్యాంకులకు ప్రభుత్వం హామీగా ఉంటుంది. అడ్తీదారులు పంటలను మద్దతు ధరకు కొనకపోతే రైతు సమన్వయ సమితిలే కొంటాయి. కొనుగోలు చేసిన ధాన్యాన్ని సమితులు బియ్యం పట్టిస్తే.. దేశంలోని ఏ రాష్ట్రంలోనైనా అమ్ముకోవడానికి ప్రభుత్వం అనుమతిస్తుంది" అని వివరించారు. రైతు సమితులకు సంబంధించి త్వరలో కాల్ సెంటర్‌నూ ఏర్పాటు చేయనున్నామన్నారు. రైతు సమితి సభ్యుల సైన్యం 1.62 లక్షలుగా ఉందని, వీరంతా పిడికిలి బిగిస్తే ఏ సమస్య అయినా పరిష్కారమవుతుందని చెప్పారు. సభ్యులను దశలవారీగా అధ్యయనానికి ఇజ్రాయెల్‌కు పంపుతామన్నారు.

మేలో గ్రామగ్రామానా చెక్కుల పంపిణీ

మే నెల మొత్తం ఎమ్మెల్యేలు, ఇతర నేతలు గ్రామగ్రామాన చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తారని కేసీఆర్ తెలిపారు. చెక్కుల పంపిణీ బాధ్యత తీసుకోవాలని సమితి సభ్యులకు సూచించారు. "ఏ గ్రామంలో నంబర్ వన్‌గా చెక్కుల పంపిణీ జరుగుతుందో వారిని మొదట ఇజ్రాయెల్‌కు తీసుకెళతాం. వంద కోట్లయినా ఖర్చు చేసి అన్ని మండల కమిటీల సభ్యులను ఇజ్రాయెల్‌కు పంపుతాం" అని వెల్లడించారు. సబ్సిడీపై టార్పాలిన్లు పంపిణీ చేయాలంటూ వచ్చిన సూచనపై కేసీఆర్ స్పందిస్తూ.. రైతులకు 75 శాతం సబ్సిడీపై వాటిని పంపిణీ చేస్తామని ప్రకటించారు. మంత్రి పోచారం లక్ష్మీపుత్రుడు.. మోతుబరని, ఢిల్లీకి ప్రతినిధి బృందం వెళ్లినప్పుడు ఆయన్నే ముందు పెడుతుంటామని తెలిపారు.

మాటల్లోనే రైతుకు రెట్టింపు ఆదాయం

"దేశంలో రైతుల కోసం కాంగ్రెస్‌గానీ, బీజేపీ గానీ చేసింది ఏమీ లేదు. వారి కోసం కమిట్‌మెంట్‌తో పని చేసిన ప్రభుత్వం ఇంతవరకు రాలేదు. రైతుల కోసం ఏదైనా చేయాలని ప్రధాన మంత్రికి పదిసార్లు చెప్పాను. గొప్పగా చేసింది ఏదీ కనిపించట్లేదు" అని కేంద్ర ప్రభుత్వంపై కేసీఆర్ ధ్వజమెత్తారు. పంటలకు డబుల్ ధర ఇస్తామన్నారని, అందులో మాట తప్ప మతలబు ఏదీ లేదని చెప్పారు. "దీనిపై పార్లమెంటులో ఎంపీలు కొట్లాడుతున్నారు. ప్రాంతీయ, ఇతర పార్టీలతోనూ మాట్లాడా. ప్రజలకు, రైతులకు, రాష్ట్రానికి లాభం జరగాలంటే అద్భుతాలు జరగాలని, పోరాటాలు చేయాలని చెప్పాను. బహుశా రానున్న రోజుల్లో ఆ ఐక్యత రాబోతోంది. ఆ పరిణామాలు ఎట్లుంటయో చూడాలి" అని సీఎం అన్నారు.

20 లేఖలు రాసినా కేంద్రం నుంచి స్పందన లేదు

వ్యవసాయానికి ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయాలంటూ పలువురు సభ్యులు సీఎం కేసీఆర్‌కు సూచించారు. దాంతో, "ఈ అంశంపై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాం. 20 ఉత్తరాలూ రాశాం. కేంద్రం బుద్ధి తెచ్చుకోవాలి" అంటూ కేసీఆర్ ధ్వజమెత్తారు. కూలీ కూడా ఢిల్లీ నుంచి వేస్తామంటున్నారని మండిపడ్డారు. అడవి పందులను చంపడంపై నిషేధం ఎత్తివేసినట్లు వెల్లడించారు. వాటి బారి నుంచి పంటలను కాపాడేందుకు సోలార్ ఫెన్సింగ్‌పై పరిశీలన చేస్తామన్నారు. కోతుల బెడదపైనా ప్రభుత్వం ఆలోచన చేస్తోందనితెలిపారు.

సబ్సిడీపై వరినాటు యంత్రాలు

ప్రతి 5000 ఎకరాలకు ఎంత వ్యవసాయ యంత్ర సామగ్రి ఉందన్న లెక్కలను ఏఈవోలు తీస్తున్నారని సీఎం కేసీఆర్ తెలిపారు. ఎక్కడెక్కడ ఏవేవి లేవో వాటిని సమకూర్చుకుంటామన్నారు. ప్రతి మండలానికి 10 చొప్పున మొత్తం 5 వేల వరి నాటు యంత్రాలను సబ్సిడీపై సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ట్రాక్టర్లు ఎన్ని తక్కువ ఉన్నాయో వాటిని ఎక్కడికక్కడే సమకూర్చుకునేలా ప్రణాళిక రూపొందాలన్నారు. "భూమి దున్నుడు నుంచి పంట పండే వరకూ వ్యవసాయ యాంత్రీకరణ తప్పనిసరైంది. దీనిపై అవగాహన సమితి సభ్యులకు ఉండాలి. చివరి దశలో పంట కాలనీలు ఏర్పాటు చేస్తాం. తెలంగాణ ఆహార అవసరాలను లెక్కలు తీస్తున్నాం. రాష్ట్రంలోకి 60 లక్షల కొత్త గొర్రెలు వచ్చి చేరాయి. వీటితో వ్యవసాయానికీ ఎరువు దొరుకుతుంది. అదే రీతిలో రైతాంగాన్నీ పంట కాలనీల వైపునకు తీసుకెళ్లాలి. ఎక్కడ ఏ పంట వేసుకుంటే మంచిదన్న దానిపై వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రణాళికను అభివృద్ధి చేస్తోంది. నిర్ణీత గ్రామాల్లో, నిర్ణీత విస్తీర్ణం మేరకు పంటలు వేసుకుంటే ప్రతి పంటకూ డిమాండ్ వస్తుంది" అని వివరించారు. ఫుడ్ ప్రాసెసింగ్ కేంద్రాలు, శీతల గిడ్డంగులనూ ఏర్పాటు చేసుకోబోతున్నట్లు తెలిపారు.

పెట్టుబడి సాయం వదులుకుంటున్నా

"నేనూ రైతునే..! నాకూ పెట్టుబడి సాయం వస్తది. కానీ, నేను తీసుకోను. వదులుకుంటున్నాను" అని సీఎం కేసీఆర్ ప్రకటించారు. ధనవంతులు ఎకరాకు రూ.4 వేల పెట్టుబడి సాయం వదులుకుంటామనంటే.. వదులుకోవచ్చునన్నారు. అయితే, ఆ డబ్బులు ప్రభుత్వానికి పోవని, రాష్ట్ర రైతు సమన్వయ సమితికే వెళతాయని చెప్పారు.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	18.7	36.3
నిజామాబాద్	19.2	37.0
హైదరాబాద్	16.9	32.7
ఖమ్మం	18.0	36.0
వరంగల్	18.0	34.5



భారతీయ ముస్లింలంతా రాముని వారసులు

'జిన్నా భూతం అసదుద్దీన్ ఒవైసీ లాంటి వారిని ప్రభావితం చేస్తోంది. అందుకే దేశాన్ని ముక్కలు చేయాలనే ధోరణితో అలా మాట్లాడుతున్నారు. భారత దేశంలో బాబార్ వారసులెవరూ లేరు. ఇక్కడి ముస్లింలలో ఎవరూ విదేశీయులు కారు. భారతీయ ముస్లింలంతా రాముని వారసులే. మన పూజల్లో ఇప్పుడు తేడాలుండొచ్చు. గతంలో మాత్రం మనమంతా ఒక్కటే. మనందరికీ రాముడే పూర్వజుడు'

- కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్



బాబ్రీ మసీదు కట్టి తీరుతాం

'బాబ్రీ మసీదును మరిచిపోవాలంటూ ముస్లింలను బెదిరిస్తున్నారు. అలా బెదిరించే వారికి నేనొక్కటే చెబుతున్నా. అక్కడ మసీదు ఉండేది.. ఉంది.. భగవంతుడి కృపతో భవిష్యత్‌లోనూ ఉంటుంది. మేము మసీదును మరిచిపోయే ప్రసక్తే లేదు. సుప్రీంకోర్టు మత విశ్వాసాలను కాకుండా.. ఆధారాలను పరిగణనలోకి తీసుకుంటుందని నేను భావిస్తున్నాను'

- హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.75.71	పాత ధర 67.49
కొత్త ధర రూ.75.74	కొత్త ధర 67.54
పెరిగింది : 3 పైసలు	పెరిగింది : 5 పైసలు



సిజేరియన్ పిల్లలకు ఊబకాయం ముప్పు!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: ఊబకాయం ఉన్న తల్లులకు సాధారణ ప్రసవం కంటే సిజేరియన్ ద్వారా జన్మించే పిల్లల్లో ఊబకాయం వచ్చే అవకాశాలు ఎక్కువట. ఇలా పుట్టిన పిల్లల్లో మూడేళ్ల వయసులోనే బరువు పెరిగే అవకాశం ఐదు రెట్లు అధికమని తాజా అధ్యయనాల్లో తేలింది. డెలివరీ సమయంలో చిన్నారుల జీర్ణాశయంలో ఉండే లాంకోస్పిరసియో అనే బ్యాక్టీరియా ప్రభావితం కావడం వల్లే ఈ సమస్య వస్తుందని కెనడాలోని ఆల్బెర్టా యూనవర్సిటీకి చెందిన పరిశోధకులు తెలిపారు.

'మంచి' ఆహారంతోనే బరువు తగ్గుతారు!

వాషింగ్టన్, ఫిబ్రవరి 25: బరువు తగ్గడానికి మనం తీసుకునే మంచి ఆహారం తప్ప జన్యుపరమైన అంశాలు కారణం కాదని అంటున్నారు అమెరికాకు చెందిన పరిశోధకులు. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీకి చెందిన బృందం నిర్వహించిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. జన్యు కారణాల కంటే నిర్దేశిత ఆహార నియమాలు పాటించే వారే బరువు ఎక్కువగా తగ్గినట్టు వారు తేల్చారు. 609 మంది అధికబరువున్న వ్యక్తులను ఎంచుకొని వారికి ఏడాదిపాటు తక్కువ కొవ్వు, తక్కువ పిండిపదార్థాలు ఉన్న ఆహారాన్ని అందించారు. అయితే జన్యువులు, ఇన్సులిన్‌తో సంబంధం లేకుండా వారు 5 నుంచి 6 కేజీలు బరువు తగ్గినట్టు గుర్తించారు.


కానిస్టేబుల్‌పై చేయిచేసుకున్న కవితను వారిస్తున్న ఆలయ సిబ్బంది

డీఎస్ మనిషిని.. నన్నే అడ్డుకుంటావా..!

» కొమురవెల్లి మల్లన్న సన్నిధిలో ఓ మహిళ దౌర్జన్యం

» మహిళా కానిస్టేబుల్‌పై దాడి

చేర్యాల, ఫిబ్రవరి 25: 'నేను రాజ్యసభ సభ్యుడు డి.శ్రీనివాస్ తాలూకా మనిషిని. నన్నే అడ్డుకుంటావా.. నీ సంగతి చూస్తా..' అంటూ మహిళా కానిస్టేబుల్‌పై ఓ మహిళ కోపంతో ఊగిపోయింది. ఆమె పై చేయిచేసుకుంది. ఈ ఘటన కొమురవెల్లి మల్లన్న సన్నిధిలో జరిగింది. ఆదివారం సిద్దిపేట జిల్లా కొమురవెల్లి దేవాలయానికి హైదరాబాద్‌కు చెందిన కొప్పుల కవిత వచ్చింది. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో ఆమె వెనకదారి మెట్ల గుండా గర్భాలయానికి చేరుకునేందుకు ప్రయత్నించింది. అక్కడే విధుల్లో ఉన్న చేర్యాల పోలీస్ కానిస్టేబుల్ స్వర్ణలతారెడ్డి.. క్యూలైన్‌లో రావాలని సూచించారు. దీంతో తాను డీఎస్ మనిషినని, తననే అడ్డుకుంటావా.. అని కవిత హెచ్చరిస్తూ కానిస్టేబుల్‌పై చేయిచేసుకుంది. ఆలయ ఉద్యోగులు, సిబ్బంది వచ్చి కవితను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. స్వర్ణలతారెడ్డి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

కమ్యూనికేషన్స్‌పై విస్తృత చర్చలు

» ఐఐటీహెచ్‌లో ఎన్‌సీసీ ప్లీనరీ ప్రారంభం

కంది, ఫిబ్రవరి 25: జాతీయస్థాయి 24వ నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ కమ్యూనికేషన్స్ (ఎన్‌సీసీ) ప్లీనరీ ఆదివారం సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లో ఘనంగా ప్రారంభమైంది. తొలి రోజు కమ్యూనికేషన్స్, సిగ్నల్ ప్రాసెసింగ్, నెట్‌వర్క్ తదితర అంశాలపై ఐఐటీ హైదరాబాద్ నిపుణులు చర్చించారు. ప్లీనరీలో భాగస్వాములు అయ్యే వారి కోసం ఐఐటీ ప్రాంగణంలో ప్రత్యేక రిజిస్ట్రేషన్ విభాగాన్ని ఏర్పాటు చేశారు. నాలుగు రోజులపాటు జరుగనున్న ఈ సమావేశాల్లో కమ్యూనికేషన్స్‌పై విద్యార్థులకు విస్తృతస్థాయిలో అవగాహన కల్పించనున్నారు.

బ్యాంకుల్లో నగదుకు భద్రత ఉందా?

» బ్యాంకు ఉద్యోగుల సంఘం జాతీయ కార్యదర్శి రాంబాబు

చిక్కడపల్లి/హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): దేశంలోని బ్యాంకుల్లో ప్రజలు దాచుకున్న నగదుకు భద్రత ఉందా అని అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం జాతీయ కార్యదర్శి బీఎస్ రాంబాబు ప్రశ్నించారు. దేశంలో డిమాండ్ ప్రకారం నగదును ముద్రించాలన్నారు ఆయన. పబ్లిక్ రంగంలోని బ్యాంకులను ప్రైవేటు రంగంలోకి ఎలా మారుస్తారని ప్రశ్నించారు. కోటక్ మహీంద్రా బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ డైమండ్ జూబ్లీ వేడుకలు ఆదివారం త్యాగరాయ గాన సభలో జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న రాంబాబు.. కార్పొరేట్ సంస్థలకు ఒక్క ఏడాదిలోనే రూ.85వేల కోట్లు మాఫీ చేశారని ఆరోపించారు. అందులో కేవలం ఎస్‌బీఐ రూ.22 వేల కోట్లు మాఫీ చేసిందన్నారు. ఇలా ఒకవైపు మాఫీలు చేస్తూనే.. బ్యాంకు డిపాజిట్లలో కనీస బ్యాలెన్స్ లేదనే పేరుతో సామాన్య ప్రజల నుంచి రూ.1800 కోట్లు లూటీ చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు.

పట్టణాల్లో వీధి వ్యాపారుల కమిటీలు

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ది స్ట్రీట్ వెండర్స్ (ప్రొటెక్షన్ ఆఫ్ లైవ్లీహుడ్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ స్ట్రీట్ వెండింగ్) యాక్ట్-2014 ('సెంట్రల్ యాక్ట్ నం.7 ఆఫ్ 2017)ను అనుసరించి తెలంగాణలోని అన్ని మునిసిపాలిటీల్లోనూ పట్టణ స్థాయి వీధి వ్యాపారుల కమిటీలను నియమిస్తున్నారు. వీధివ్యాపారులకు మార్కెట్ స్థలాన్ని చూపడం, విక్రయాలకు అనుగుణంగా వసతులు కల్పించడం, బ్యాంకు రుణాలు అందించడం వంటి సాయాన్ని ప్రభుత్వం అందజేయనుంది. తెలంగాణ రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో సుమారు 50 వేల వరకు (గ్రేటర్ హైదరాబాద్ మినహా) వీధి వ్యాపారులు ఉన్నట్లు గుర్తించారు. వీరందరికీ దాదాపు గుర్తింపు కార్డులు జారీ చేశారు.

రామయ్య కల్యాణ వేడుకలకు 2న శ్రీకారం

భద్రాచలం, ఫిబ్రవరి 25: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో మార్చి 26న జరిగే శ్రీరామ నవమి కల్యాణ పనులకు 2న శ్రీకారం చుట్టనున్నారు. మార్చి 18 నుంచి ఏప్రిల్ 1 వరకు వసంతపక్ష ప్రయుక్త నవాహ్నిక శ్రీరామ నవమి తిరు కల్యాణ బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. కుల శేఖర ఆళ్వారు తిరు నక్షత్రాన్ని పురస్కరించుకొని సోమవారం స్వామి వారి ఉత్సవమూర్తుల ఆళ్వార్లకు తిరుమంజనం నిర్వహించనున్నారు.

JAWAHARLAL NEHRU TECHNOLOGICAL UNIVERSITY KAKINADA
KAKINADA - 533 003, A.P., INDIA.

AP EAMCET-2018 NOTIFICATION

(Engineering, Agriculture and Medical Common Entrance Test) (being conducted on behalf of APSCHE)

A Common Entrance Test, designated as Engineering, Agriculture and Medical Common Entrance Test - 2018 (AP EAMCET-2018) of Andhra Pradesh will be conducted through computer based test (as per G.O.Ms.No.73 Higher Education EC.2 Department dated : 28.07.2011 and amendments & G.O.Ms.No.4 Higher Education (EC) Department dated 17.01.2017) by Jawaharlal Nehru Technological University Kakinada, Kakinada for entry into the first year of the following professional courses offered for the academic year 2018 - 2019 in the State of Andhra Pradesh.

a) Engineering, Bio-Technology, B.Tech. (Dairy Technology), B.Tech. (Agr. Engg.), B.Tech. (Food Science and Technology)
b) B.Sc. (Ag)/ B.Sc. (Hort)/ B.V.Sc. & A.H/B.F.Sc.
c) B. Pharmacy, Pharma. D.

Eligible candidates who wish to apply for AP EAMCET-2018 shall submit their application through online mode only. The detailed information regarding eligibility, age, syllabi, instructions and procedure for online application are available in the website : www.sche.ap.gov.in/eamcet

Stream	Date (s)	Timings (2 Sessions per day)	Fee
Engineering (E)	22nd to 25th April 2018	10.00 am to 01.00 pm & 2:30 pm to 05:30 pm	Rs. 500/-
Agriculture (A)	25th & 26th April 2018		Rs. 500/-
E & A (Both Streams)	24th & 25th April 2018		Rs. 1,000/-

Important Dates for Online Application Process:

Commencement of Application submission	Last date for submissions without late fee	Download of Hall Tickets from website
28.02. 2018	29.03.2018	18.04. 2018

The Registration fee may be paid at AP & TS Online Centers and also through payment gateway/credit/debit card/net banking.

Last date for submission with late fee	
06.04.2018 : Rs.500/-	11.04.2018: Rs.1,000/-
16.04.2018 : Rs.5,000/- :	21.04.2018 : Rs.10,000/-

Place : KAKINADA, Date : 26-02-2018 Sd/- CONVENER, AP EAMCET-2018

భారత ప్రభుత్వం
ఆర్థిక మంత్రిత్వశాఖ, ఆదాయపు పన్ను విభాగం
టాక్స్ రికవరీ అధికారి -5, హైదరాబాద్ వారి కార్యాలయం
రూమ్ నెం. 1013, 10వ అంతస్తు, సిగ్నేచర్ టవర్స్, బొటానికల్ గార్డెన్స్ ఎదురుగా
కొండాపూర్, హైదరాబాద్- 500084, ఫోన్ నెం. 04023485951, సెల్ 8985971198

బహిరంగ వేలం ప్రకటన

2007 - 08 అసెస్‌మెంట్ సంవత్సరానికి ఆదాయపు పన్ను బాకీ ఉన్న బకాయిదారులు, శ్రీ ఎం.బి. సుదర్శన్ అండ్ అదర్స్, జీడిమెట్ల గ్రామం, హైదరాబాద్ వారి నుండి బకాయిలు రాబట్టుకొనేందుకు ఈ క్రింద పేర్కొనబడిన వ్యవసాయభూమిని, ఈ కార్యాలయంలోని ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఇన్‌కమ్ టాక్స్ లేదా దిగువ సంతకం దారుచే నియమించబడిన అధికారి 27.03.2018 ఉదయం 11.00 గంటలకు హైదరాబాద్‌లోని మాసబ్‌టాంక్‌లో ఉన్న ఇన్‌కమ్ టాక్స్ టవర్స్‌లోని 1వ హాలులో అమ్మకం సాగిస్తారని ప్రకటించడమైనది. 1961, ఆదాయపు పన్ను చట్టం, రెండవ షెడ్యూలులోని నియమనిబంధనల ప్రకారం బహిరంగవేలం జరుపబడును. వేలంలో పాల్గొనదలచిన వ్యక్తులు రు.1,50,000/- లకు డిమాండ్ డ్రాఫ్టును టాక్స్ రికవరీ అధికారి-5, హైదరాబాద్ వారి పేర డ్రా చేసి వేలం జరుపబడే తేదీన సమర్పించవలసి ఉంటుంది. వేలం యితర వివరాలు, నియమ నిబంధనలను క్రింది సంతకందారు నుండి కేంద్రప్రభుత్వ పనిదినములలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటలలోపు పొందవచ్చును. అదే విధముగా పై బహిరంగ వేలానికి ఎవరైనా ఆక్షేపణ తెలపాలని భావించినవారు లేదా ఆస్తిని క్లెయిం చేసేవారు తమ ఆక్షేపణ ఫిర్యాదును (1961, ఆదాయపు పన్ను చట్టంలోని రెండవ షెడ్యూలు, నియమం 11 క్రింద) 10.03.2018వ తేదీలోగా దిగువ సంతకం దారు వద్ద ఫైలు చెయ్యాలి.

ఆస్తి వివరాలు

వ.సం.	ప్రదేశము	సర్వే నెం.	విస్తీర్ణము	దస్తావేజు సంఖ్య	సబ్ రిజిస్ట్రార్
1	రంగారెడ్డి (ప్రస్తుత మేడ్చల్ మల్కాజిగిరి) జిల్లా, మేడ్చల్ మండలంలోని దబీల్ పూర్ (ఈ స్థలమును ఆనుకొని ఒక ఫ్యాక్టరీ ఉన్నది)	733	10 గుంటలు	17580/2007	మేడ్చల్
		733	1 ఎకరం 26 గుంటలు	16643/2007	

తేది 21.02.2018
హైదరాబాద్
సం/- ఎస్.పి.శ్రీధర్, టాక్స్ రికవరీ అధికారి - 5, హైదరాబాద్

వాగులను తోడేస్తున్నారు!



అడవి తల్లి సాక్షిగా ఇసుక దందా.. అక్రమార్కులకు మహిళా ప్రజా ప్రతినిధి అండ

» ఉమ్మడి జిల్లా మంత్రి పేరు చెప్పి మరో నేత

» ఖానాపూర్ నియోజకవర్గంలో తవ్వకాలు

» కన్నెత్తి చూడని పలు శాఖల అధికారులు

నిర్మల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రిజర్వు ఫారెస్ట్ ప్రాంతంలో అగ్గిపుల్ల పెట్టుకొని తిరిగినా కేసు రాస్తారు. అక్రమంగా చొరబడినా, అటవీ పరిధిలోని భూములను సాగు చేసినా.. సంబంధిత అధికారులు కఠినంగా వ్యవహరిస్తారు. ఇదంతా సామాన్యుల వరకే.. పెద్దలకు ఇవి వర్తించవు. వీరికి రిజర్వు ఫారెస్ట్ నిబంధనలు కూడా వంగి సలాం చేయాల్సిందే. చట్టాలను కఠినంగా అమలు చేయాల్సిన అధికార యంత్రాంగం అధికార పార్టీ నేతల ముందు చేతులు కట్టుకొని గులాంగిరి చేస్తోందన్న విమర్శలున్నాయి. అటవీ శాఖతో పాటు రెవెన్యూ, మైనింగ్ శాఖల తీరుపై అనేక ఆరోపణలు, అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్ నియోజకవర్గం అడవులకు నెలవు. ఇక్కడ పెంబి, కడెం, ఖానాపూర్, జన్నారం, ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాల్లో అడవులు విస్తరించి ఉన్నాయి. ఈ అడవుల మీదుగా అనేక నదులు పారుతున్నాయి. ముఖ్యంగా పెంబి, ఖానాపూర్, కడెం మండలాల్లోని రిజర్వు ఫారెస్ట్ పరిధిలో ఉన్న వాగులు ఇసుక దొంగలకు స్వర్గధామం. పెంబి మండలంలోని పలికేరి వాగు, బోథ్ నియోజకవర్గాన్ని ఆనుకొని ఉండే చిక్‌మాన్ వాగు, ఖానాపూర్ మండలంలోని రాజురా వాగు, కడెం మండలంలోని దోస్త్ నగర్, గంగాపూర్ వాగులు ఇసుక తవ్వకాలకు కేంద్రాలుగా మారాయి. వాగుల్లో ఇసుక తవ్వకాలకు ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. తెలంగాణ ప్రభుత్వం ఇసుక పాలసీ ప్రకారం కలెక్టర్ అధ్యక్షతన జాయింట్ కలెక్టర్, రెవెన్యూ, అటవీ, మైనింగ్ శాఖల జిల్లాస్థాయి అధికారుల కమిటీ ఇసుక తవ్వే వాగులు, కేంద్రాలను గుర్తించాలి. ఆ ప్రాంతాల్లో మాత్రమే ఇసుక తవ్వకాలు జరగాలి. ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకుంటే.. అధికారులు గుర్తించిన వాహనాల్లో మాత్రమే దరఖాస్తుదారులకు ఇసుకను చేరవేయాలి. కానీ.. ఖానాపూర్ అటవీ ప్రాంతంలో ఉన్న వాగుల్లో జరుగుతున్న ఇసుక తవ్వకాలు మాత్రం సర్కారు నిబంధనలకు విరుద్ధం. ఇసుక తవ్వుతున్న కాంట్రాక్టర్లకు అనుమతులుండవు. రిజర్వు ఫారెస్ట్ నిబంధనలను అసలే పట్టించుకోరు. ఇసుక రవాణా చేసే వాహనాలు ఎవరివో తెలియదు. వాటికి వే బిల్లులు ఉండవు. ఇంత జరుగుతున్నా.. ఆయా శాఖల యంత్రాంగం అటు వైపు కన్నెత్తి చూడదు. కానీ అక్రమ దందాకు మాత్రం అన్ని తామై చూసుకునే అధికార పార్టీ అండ మాత్రం ఉంటోంది. ఈ ఇసుక దందా అధికార పార్టీ నేతల కనుసన్నల్లో సాగుతుంటే, అధికార యంత్రాంగం వారికి వంత పాడుతోంది. ఖానాపూర్ నియోజకవర్గానికి చెందిన ఓ మహిళా ప్రజాప్రతినిధి అనుచరులే జోరుగా ఇసుక అక్రమ వ్యాపారం చేస్తున్నారు. పలికేరి వాగు, రాజురా వాగు, చిక్‌మాన్ వాగు, దోస్త్‌నగర్, గంగాపూర్ వాగుల్లో భారీ యంత్ర సామగ్రితో తవ్వకాలు చేస్తున్నారు. రిజర్వు ఫారెస్ట్‌లో భారీ వాహనాలు, యంత్ర సామగ్రి ప్రవేశంపై నిషేధం ఉన్నా.. అటవీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఎలాంటి అనుమతులు లేకుండా వాగుల్లో ఇసుక తవ్వకాలు జరుగుతున్నా మైనింగ్, రెవెన్యూ, అటవీ శాఖలు అటు వైపు కన్నెత్తి చూడడం లేదు. సదరు మహిళా ప్రజాప్రతినిధి ఒత్తిడితోనే అధికార యంత్రాంగం ఇసుక అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలున్నాయి. ఈ తవ్వకాల బాగోతంలో మహిళా ప్రజాప్రతినిధికి కొంత వాటా ఉందన్న ఆరోపణలున్నాయి. మరోవైపు ఈ మహిళా ప్రజాప్రతినిధిని వ్యతిరేకించే ఖానాపూర్ మండల స్థాయి మహిళ నేత భర్త ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి పేరు చెప్పి తవ్వకాలు సాగిస్తున్నారు. దీంతో అధికారులు చర్యలు తీసుకునేందుకు వెనకడుగు వేస్తున్నారు.

నేతల ఒత్తిళ్లు వాస్తవమే



ఖానాపూర్ నియోజకవర్గంలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని భారీగా జరిమానాలు విధించడంతో పాటు చర్యలు తీసుకుంటున్నాం. రాజకీయ ఒత్తిళ్లు, బెదిరింపులతో తహసీల్దార్లు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారు. **- ప్రసూనాంబ, ఆర్డీవో, నిర్మల్**

మాకు ఎలాంటి సంబంధం లేదు

అటవీ ప్రాంతంలో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాను అరికట్టే బాధ్యత మాకు లేదు. అదంతా అటవీ శాఖలో పని చేస్తున్న అధికారులు, సిబ్బంది చూడాల్సిందే.

- రవిశంకర్, జిల్లా మైనింగ్ అధికారి

కఠిన చర్యలు తీసుకుంటాం

రిజర్వు ఫారెస్టు నుంచి ఇసుకను తరలించేందుకు ఎవరికీ అనుమతి లేదు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

- రవీందర్, ఎఫ్‌డీవో, ఖానాపూర్

కరీంనగర్‌లో నేడు సీఎం కేసీఆర్ పర్యటన

» రైతు సమన్వయ సమితి సదస్సుకు హాజరు

» ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు పోచారం, ఈటల

కరీంనగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సీఎం కేసీఆర్ సోమవారం కరీంనగర్ జిల్లాకు రానున్నారు. రాష్ట్రంలో ప్రప్రథమంగా ఏర్పాటు చేసిన రైతు సమన్వయ సమితుల రెండో ప్రాంతీయ సదస్సులో దిశానిర్దేశం చేసేందుకు ఆయన జిల్లాకు వస్తున్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు సీఎం హైదరాబాద్ నుంచి హెలీకాప్టర్‌లో బయలుదేరి 10.30 గంటలకు కరీంనగర్ చేరుకుంటారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో రైతు సమన్వయ సమితుల ప్రాంతీయ సదస్సులో ప్రసంగిస్తారు. భోజన విరామం తర్వాత 2:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రైతులు, సమన్వయ సమితి ప్రతినిధులతో సీఎం చర్చిస్తారు. అనంతరం తీగలగుట్టపల్లిలోని కేసీఆర్ భవన్‌కు చేరుకొని రాత్రి అక్కడే బస చేస్తారు. మంగళవారం జగిత్యాల జిల్లా అంతర్గాం మండలం ముర్మూర్‌లో ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేసిన అనంతరం 11 గంటలకు బయల్దేరి చనాకా-కొరాటా బ్యారేజీ వద్దకు వెళ్లి పనులను పర్యవేక్షిస్తారు. అక్కడి నుంచి 11:55 గంటలకు బయల్దేరి ఆదిలాబాద్‌కు చేరుకుంటారు. అక్కడ ఆదిలాబాద్ నియోజకర్గ ప్రజా ప్రతినిధులతో వివిధ అంశాలపై చర్చిస్తారు. 3:05 గంటలకు శ్రీరాంపూర్‌లో జరిగే సింగరేణి కార్యక్రమంలో పాల్గొంటారు. 5 గంటలకు తిరిగి హెలీకాప్టర్‌లో హైదరాబాద్‌కు వెళ్తారు. సీఎం పర్యటన ఏర్పాట్లను మంత్రులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఈటల రాజేందర్, ఎంపీ వినోద్, కలెక్టర్ సర్ఫరాజ్ పర్యవేక్షించారు. కేసీఆర్ ఇచ్చిన హామీలు ఏమయ్యాయంటూ జిల్లా కాంగ్రెస్ నేతలు బహిరంగ లేఖలు విడుదల చేయడం, సీఎం పర్యటనను అడ్డుకుంటామని బీజేపీ జిల్లా శాఖ ప్రకటించిన నేపథ్యంలో 1500 మంది పోలీసులతో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.


సభా స్థలి వద్ద ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మంత్రి ఈటల రాజేందర్

'గొర్రెల విక్రయం'పై కదిలిన యంత్రాంగం

» మంత్రి తలసాని ఆదేశాలతో విచారణ చేసిన ఆర్డీవో

నవీపేట, ఫిబ్రవరి 25: గొర్రెల పంపిణీ పథకంలో అవకతవకలు పాల్పడేవారిని సహించేది లేదని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ స్పష్టం చేశారు. ఆదివారం ఆంధ్రజ్యోతి మెయిన్‌లో 'ఎవరి గొర్రె, ఎవరు గొర్రె' శీర్షికన ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల కలెక్టర్లతో మాట్లాడారు. గొర్రెలు, మేకల అభివృద్ధి సమాఖ్య ఎండీ లక్ష్మారెడ్డితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ వ్యవహారంలో బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిజామాబాద్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో వినోద్‌కుమార్ నవీపేట మండల రెవెన్యూ కార్యాలయంలో విచారణ జరిపారు. అనంతరం నవీపేట యాదవ సంఘం అధ్యక్షుడు నర్సింహులు యాదవ్‌తో మాట్లాడారు. మేకల సంతలో సబ్సిడీ గొర్రెలు అమ్ముతుంటే సంఘం తరపున ఎందుకు ప్రశ్నించడంలేదని అడిగారు. ఈ సందర్భంగా ఆర్డీవో 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. సబ్సిడీ గొర్రెలు ఇకపై మేకల సంతలో అమ్మకోకుండా రెవెన్యూ, పోలీసు, వెటర్నరీ సిబ్బంది, గ్రామ పంచాయతీల సిబ్బందితో నిఘా వేయడంతో పాటు సరిహద్దులలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేయడానికి తగిన చర్యలు తీసుకుంటామని వివరించారు. నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు.

వర్గీకరణ హామీని విస్మరించిన బీజేపీ: మందకృష్ణ

రామంతాపూర్/హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని బీజేపీ ఇచ్చిన హామీని విస్మరించి, మాదిగలను మోసం చేసిందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ విమర్శించారు. మాదిగ మేధావుల జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం ఆదివారం హబ్సిగూడలో జరిగింది. ఉమ్మడి ఎస్సీ రిజర్వేషన్లను 59 కులాల జనాభా ప్రాతిపదికన వర్గీకరించాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన ఈ సమావేశంలో మందకృష్ణ మాట్లాడుతూ మూడు సంవత్సరాలు గడుస్తున్నా పార్లమెంట్‌లో వర్గీకరణ అంశాన్ని ప్రవేశపెట్టని కారణంగా బీజేపీ మాదిగలకు దూరమవుతుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఎస్సీ వర్గీకరణ బిల్లు వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టాలని, ఎస్సీ వర్గీకరణను జనాభా ప్రతిపదికన చేపట్టాలని, ఎమ్మార్పీఎస్ నాయకులపై అక్రమ కేసులను ఎత్తివేయాలని కోరుతూ తీర్మానించారు.

బంగారు తెలంగాణకు నాంది 'కాళేశ్వరం'

» తెలంగాణ ఐక్యవేదిక చైర్మన్ వెంకట మల్లయ్య

మహదేవ్‌పూర్, ఫిబ్రవరి 25: బంగారు తెలంగాణ నిర్మాణానికి కాళేశ్వరం ప్రాజెక్టు నాంది అని తెలంగాణ ఐక్యవేదిక రాష్ట్ర చైర్మన్ వి. వెంకట మల్లయ్య అన్నారు. జయశంకర్ జిల్లా మహదేవ్‌పూర్ మండలంలో కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న కన్నెపల్లి పంప్‌హౌస్, అన్నారం బ్యారేజీలను దళిత సంఘాలకు చెందిన 45 మంది ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా వెంకట మల్లయ్య మాట్లాడారు.


రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని ఆసుపత్రికి తరలిస్తున్న ప్రశాంత్‌రెడ్డి

మానవత్వం చాటుకున్న ప్రశాంత్‌రెడ్డి

» క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించిన ఎమ్మెల్యే

మోర్తాడ్, ఫిబ్రవరి 25 : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరిని వెంటనే పోలీస్ వాహనంలో తరలించి పంపి మానవత్వాన్ని చాటుకున్నారు... మిషన్ భగీరథ వైస్ చైర్మన్, నిజామాబాద్ జిల్లా బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి. ఆయన ఆదివారం మోర్తాడ్ మండలంలోని గాండ్లపేట్ గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడానికి వస్తుండగా, కోరుట్లకు చెందిన ఇద్దరు వ్యక్తులు బైక్‌పై ఆర్మూర్ వైపు వెళ్తుండగా కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. అప్పుడే అటు వైపు వచ్చిన ఎమ్మెల్యే, కారును ఆపారు. క్షతగాత్రులను పోలీస్ వాహనంలో ఆర్మూర్ ఆసుపత్రికి తరలించారు.

ముగ్గురు మహిళలకు దేహశుద్ధి

» కాష్టంలో బూడిద ఎత్తుకెళ్తుండగా పట్టుకున్న స్థానికులు

పెద్దపల్లి టౌన్, ఫిబ్రవరి 25: కాష్టంలో బూడిదను ఎత్తుకెళ్తున్నారని పెద్దపల్లి జిల్లా రాగినేడులో ఆదివారం ముగ్గురు మహిళలను గ్రామస్థులు చితకబాదారు. ఆదివారం మంచిర్యాలకు చెందిన ముగ్గురు మహిళలు రాగినేడు వచ్చి ఓ కాష్టం వద్ద బూడిద, ఎముకలు ఎత్తి సంచుల్లో నింపారు. ఆటోలో సంచులు వేసుకొని వెళ్తుండగా గ్రామంలో వారిని అడ్డుకున్నారు. బూడిదను ఎందుకు తీసుకెళ్తున్నారని ప్రశ్నించగా పొంతన లేని సమాధానం ఇచ్చారు. క్షుద్రపూజలు చేసేందుకే బూడిదను తీసుకెళుతున్నారని ఆగ్రహించిన స్థానికులు వారిపై దాడి చేశారు. శ్మశాన వాటికలు తిరిగి తాము బూడిద, ఎముకలను తీసుకెళతామని, వాటిని కడిగితే ముక్కు పుడుకలు దొరుకుతాయనే ఆశతో ఇలా చేస్తున్నామని ముగ్గురు మహిళలు పేర్కొన్నారు. గ్రామస్థులు ఆటోను తనిఖీ చేయగా అందులో పెద్ద సంఖ్యలో నిమ్మకాయలు లభించాయి. దీంతో వారిని పోలీసులకు అప్పగించారు.

సుబాబుల్ లారీలను అడ్డుకున్న రైతులు

ఖమ్మం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జామాయిల్, సుబాబుల్ పంటలకు గిట్టుబాటుధర ఇవ్వాలని కోరుతూ అఖిల పక్షం ఆధ్వర్యంలో రైతులు ఆందోళనను ఉధృతం చేశారు. భద్రాచలం ఐటీసీ కర్మాగారానికి ఏపీ నుంచి వస్తున్న సుబాబుల్ లారీలను రాష్ట్ర సరిహద్దుల్లోని వివిధ ప్రాంతాల్లో అడ్డుకున్నారు. రాష్ట్ర మంత్రుల సమక్షంలో ఐటీసీ యాజమాన్యం ఒప్పుకున్న డిమాండ్లను సత్వరం అమలు చేయాలని కోరుతూ ఆదివారం నుంచి సుబాబుల్ లారీలను అడ్డుకోవాలని అఖిలపక్ష రైతు సంఘం పిలుపునిచ్చింది. ఈ ఆందోళనలో భాగంగా మధిర మండలం దెందుకూరు, బోనకల్లు మండలంలోని మధిర క్రాస్ రోడ్డు, వైరా మండలంలో పలుచోట్ల సుబాబుల్ లారీలను రైతులు అడ్డుకున్నారు. దీంతో లారీలు రోడ్డుపై నిలిచిపోయాయి. ఇప్పటికైనా బీపీఎల్ యాజమాన్యం తమ డిమాండ్లు అమలు చేయకపోతే 27 నుంచి ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని రైతు సంఘం నేతలు హెచ్చరించారు.

AMARAVATI DEVELOPMENT CORPORATION LIMITED
1-G, Anand Heights, Beside Prabhas College, Kedareswarpet, Vijayawada – 520003 (A.P.). CIN Number : U93000AP2015SGC105535

E-PROCUREMENT TENDER NOTICE

Dated : 24.02.2018

Name of Work: Design and Construction of Iconic Bridge across River Krishna on EPC basis (Package XVI) in Amaravati, Andhra Pradesh, India (2nd call) as below:

Package No	NIT No.	Name of Work	IBM Value (Rs. in Crores)
Package - XVI	31/CE/ ADC/ENG/ 2017-18 (2nd Call)	Survey, Investigation, Detail design, Construction, testing, Commissioning of 6-lane Iconic Bridge (3.2 km long) across River Krishna connecting Pavitra sangamam and N 10 Road in Amaravati on EPC Basis (Package XVI) with 5 years O&M including 5 years DLP in Amaravati, Andhra Pradesh, India.	1348.09

The bids can be downloaded on AP e-procurement portal from dt. 27.02.2018, 15:00 Hrs onwards. Due date for submission of Bids Dt. 13.03.2018 @ 16:00 Hrs. For further details, please refer to https://tender.apeprocurement.gov.in/login.html and www.ccdmc.co.in/tenders

For any further clarifications contact Dr. K. V. Ganesh Babu, +91-7095599572, ganeshbabu.adc@ap.gov.in

Chairperson & Managing Director, ADCL, Vijayawada



Authorised Dealers For Bajaj Auto Ltd.: Nizamabad BIJAY BAJAJ 08462-234013, 8341115468, VIJAYA GANAPATHI AUTOMOTIVES 08462-238239, 9859590160.
Authorised Service Centre: MORTHAD 9959279313, ARMOOR 9959908353, BODHAN 9440414119, KAMAREDDY 9849852992, BHEEMGAL 9030960100, ARMOOR 9848163064.

నియంతలు కూడా కలలను దూరం చేయలేరు

'జైలులో మనకు మిగిలేవి కలలే.. అప్రజాస్వామిక ప్రభుత్వాలు, నియంతృత్వాలు మనుషులను ఖైదు చేయవచ్చు... కానీ వారి కలలను మాత్రం దూరం చేయలేవు..' అనే కెన్యా రచయిత గూగీ వా థియాంగో సాహితీ రంగంలోనే కాదు, మానవ హక్కుల పోరాట నేతగా ఆఫ్రికాలో సంచలనాలు సృష్టించారు. ఆయన ఇంగ్లీషులోను, తన మాతృభాష గికూయూలోను రాసిన ఆత్మకథ భాగాలు, నవలలు, వ్యాసాలు 60 ప్రపంచభాషల్లోకి అనువాదమయ్యాయి. ఆయన ఆత్మకథ 'డ్రీమ్స్ ఇన్ ఏ టైమ్ ఆఫ్ వార్' పుస్తకాన్ని తాజాగా ప్రొఫెసర్ జి.ఎన్. సాయిబాబా 'యుద్ధ కాలంలో స్వప్నాలు' పేరిట తెలుగులోకి అనువదించారు. ఈ పుస్తక ఆవిష్కరణ సందర్భంగా హైదరాబాద్ వచ్చిన గూగీతో ప్రత్యేక ఇంటర్వ్యూ:



కెన్యా రచయిత గూగీ ఇంటర్వ్యూ

మీరు ఇంగ్లీషులో రాశారు. మీ మాతృభాష గికూయులో కూడా రాశారు. ఈ రెండింటిలో మీకు నచ్చిన భాష ఏది..?

చాలా మంచి ప్రశ్న అడిగారు. ప్రతి భాషకు ఒక వ్యక్తిత్వం ఉంటుంది. తెలుగు, ఇంగ్లీషు, మళయాళం, చైనీస్.. ఇలా ఒకో భాషది ఒకో వ్యక్తిత్వం. ఇది ఎంత మంది మాట్లాడుతున్నారనే విషయంపై ఆధారపడి ఉండదు. ప్రతి భాషలోను దానిని మాట్లాడే ప్రజల సంస్కృతి, చరిత్ర, జ్ఞాపకాలు నిక్షిప్తమయి ఉంటాయి. అందుకే వలసపాలకులు ముందుగా తాము విజయం సాధించిన ప్రాంతాలలోని ప్రజల సంస్కృతిపైన, భాషపైన దాడి చేస్తారు. ఎందుకంటే భాష సాధికారతకు చిహ్నం. ఉదాహరణకు 1910లో కొరియాను జపాన్ ఆక్రమించుకుంది. అప్పుడు వారు కొరియా భాషపైన.. కొరియా పేర్లపైన నిషేధం విధించారు. ఇంగ్లీషువారు అమెరికాను ఆక్రమించినప్పుడు కూడా స్థానికుల విషయంలో ఇదే జరిగింది. వలసపాలకులు స్థానిక భాషలను అవమానిస్తారు. వాటిని నిర్వీర్యం చేయాలని ప్రయత్నిస్తారు. స్థానికులను బానిసలుగా చేసుకొనే ప్రక్రియలో ఇదంతా ఒక భాగం. చరిత్రను వెదికితే ఇలాంటి ఉదంతాలు ఎన్నో కనిపిస్తాయి. ఇప్పుడు నా విషయానికి వద్దాం. నేను నా మాతృభాషలోను రాశాను. ఇంగ్లీషులోను రాశాను. కానీ నా మాతృభాషంటేనే మక్కువ ఎక్కువ. ఇప్పుడు కేవలం నా మాతృభాషలో మాత్రమే రాస్తున్నా. నా పుస్తకాలను తెలుగు సహా ప్రపంచంలో అనేక భాషల్లోకి అనువదించారు. ఈ విధంగా చూస్తే నా ప్రయోజనం నెరవేరినట్లే!

ప్రపంచంలో అనేక భాషలు అవసానదశకు చేరుకుంటున్నాయని అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ పరిస్థితిని ఎలా చూడాలి?

భాషను ఒక సమాజం అభివృద్ధి చేస్తుంది. ఆ సమాజం ఉన్నంత కాలం భాష కూడా ఉంటుంది. భాషలు వాయిద్య పరికరాలలాంటివి. ప్రపంచంలో కొన్ని వాయిద్యాలు ఉంటే చాలు.. ఇన్ని రకాలెందుకు.. అనుకుంటామా? పాటలు పాడేందుకు ఒక గొంతు ఉంటే చాలు.. రకరకాల గొంతులు ఎందుకు.. అనుకుంటామా? అనుకోం కదా.. భాష కూడా అంతే. ఒక భాషను మాట్లాడేవారి సంఖ్య ఎంత ఉన్నా పర్వాలేదు.. కానీ భాష మాత్రం మనగలగాలి. అందుకోసమే భాషల కోసం పోరాడేవారికి నా మద్దతు ఇస్తా. వారి కోసం పోరాడే యోధుడిని నేను.

భాష.. రచన.. ఈ రెండూ సంస్కృతి, సంప్రదాయాలతో ముడిపడటంతో పాటుగా మిగిలిన ప్రపంచంతో అనుసంధానం కావటానికి ఉపయోగపడేవి కదా..

అనుసంధానం కావటానికి అయితే ఫర్వాలేదు. ఇక్కడ మీకో విషయం చెప్పాలి. బానిసత్వంలో సమానత్వం ఉండదు. నేను బానిసను అని చెప్పుకోవటంలో గర్వం ఉండదు. భాష విషయం కూడా అంతే! నా ఉద్దేశంలో మాతృభాష పునాదిలాంటిది. పునాది సరిగ్గా లేకపోతే ఎప్పుడూ అలజడిగానే ఉంటుంది. రోదసిలోకి వెళ్లే రాకెట్‌కు కూడా పునాది గట్టిగానే ఉండాలి. లేకపోతే కక్ష్య తప్పుతుంది. నేను ఎయిర్‌పోర్టుల్లో చూస్తూ ఉంటా. చిన్న చిన్న పిల్లలు వాళ్ల అమ్మానాన్నలను వదిలి పరిగెత్తుతూంటారు. మధ్యలో వెనక్కి చూస్తూ ఉంటారు. అమ్మానాన్న కనిపిస్తే ముందుకు పరిగెడతారు. వారు కనబడకపోతే కంగారుపడి వెనక్కి వచ్చేస్తారు. భాష కూడా అలాంటిదే. మాతృభాషపై సాధికారత సాధించగలిగితే ప్రపంచంలో ఏ భాషలోనైనా నెగ్గుకురావచ్చు. అందుకే వలసవాదులు స్థానిక భాషలను నిర్వీర్యం చేసి ఆ స్థానంలో తమ భాషను ప్రవేశపెట్టడానికి ప్రయత్నిస్తారు.

ప్రపంచీకరణ తర్వాత ఇంగ్లీషును ప్రపంచ భాషగా భావించేవారి సంఖ్య, ఆ భాషలో రాసే రచయితల సంఖ్య పెరిగింది కదా..

నా ఉద్దేశంలో భాషల్లో హెచ్చుతగ్గులు ఉండకూడదు. నాది ఎక్కువ.. నీది తక్కువ అనే భావన కూడదు. ఇంగ్లీషు అందరికీ ఉపయోగపడే ఒక సాధనమే అయితే ఫర్వాలేదు. కానీ చాలా సందర్భాలలో అలా కనబడదు. ఇక గ్లోబలైజేషన్ అంటే గోబులేజేషన్ (మింగివేయటం). కొందరు ఇంకొందరిని మింగేస్తున్నారు. ధనిక దేశాలు మరింత ధనిక దేశాలవుతున్నాయి. పేద దేశాలు మరింత పేదరికంలో కూరుకుపోతున్నాయి. ఇక్కడ కూడా రకరకాల హెచ్చుతగ్గులు ఉన్నాయి. ప్రపంచంలో ఎక్కడ ఉన్న వనరులైనా తమవే అని భావించే దేశాలు.. కార్మికులను మాత్రం తమ దేశాలలోకి రానివ్వవు. వారిపై ఆంక్షలు విధిస్తాయి. కొందరికి మాత్రమే రాజమందిరాలు.. మిగిలిన వారందరికీ కారాగారాలు అనే సిద్ధాంతం సరికాదు.

ఈ రెండు నవలలు రాసిన తర్వాత ఇక ఇంగ్లీషులో రాయకూడదని నిర్ణయించుకున్నా! ఇప్పటికి కూడా నేను నా మాతృభాషలో సంతృప్తి కలిగించే రచనను చేయలేకపోయా! రాయటమనేది ఒక నిరంతర ప్రక్రియ. ఎప్పటికప్పుడు రాస్తూనే ఉండాలి.

మీ రచనలలో మీరు అతి ముఖ్యమైనవిగా భావించేవి ఏవైనా ఉన్నాయా?

మనలోని బాధను తొలగించుకోవటానికి రచనలు చేస్తాం. మానవుల సమస్యలు తొలగిపోవాలంటే మానవులే పోరాడాలి. ఇలా చూస్తే నేను రాసిన రచనలన్నీ ముఖ్యమైనవే. ఒకో రచన చేసేటప్పుడు ఒకో విధమైన అనుభవం ఎదురవుతూ ఉంటుంది. 'డెవిల్ ఆన్ ది క్రాస్'ను కొన్ని ప్రత్యేకమైన పరిస్థితుల్లో రాశాను. ఇది మా నా మాతృభాషలో వచ్చిన తొలి ఆధునిక నవల. 'విజార్డ్ ఆఫ్ ది క్రో' కూడా ముఖ్యమైనదే. నా మిత్రులతో సరదాగా దీనిని రెండు ఆరెంజ్‌ల మధ్య రాశాను అంటూ ఉంటా. ఈ నవలను న్యూజెర్సీలోని ఆరంజ్‌లో ప్రారంభించి కాలిఫోర్నియాలోని ఆరెంజ్ కౌంటీలో పూర్తిచేశా.

మీ పుస్తకాన్ని సాయిబాబా జైలులో అనువాదం చేశారు.. ఇది విన్నప్పుడు మీకు ఎలా అనిపించింది..?

జైలు జీవితం ఎలా ఉంటుందో నాకు తెలుసు. అందువల్ల సాయిబాబా పరిస్థితి ఎలా ఉందో నేను ఊహించుకోగలను. 1977 నుంచి 79 వరకూ నేను కెన్యాలోని కామిటి జైలులో ఉన్నా. అది హైక్యూరిటీ జైలు. నాకు ఎటువంటి సదుపాయాలు ఉండేవి కావు. తీవ్రమైన ఒత్తిడి ఉండేది. ఆ సమయంలోనే 'డెవిల్ ఆన్ ది క్రాస్' పుస్తకం రాశా. ఇలాంటి కఠినమైన పరిస్థితుల్లో బతకాల్సి వచ్చినప్పుడు.. జైలులో మనం ఒంటరిగా ఉన్నప్పుడు మనకు మిగిలేవి కలలు మాత్రమే! అప్రజాస్వామిక ప్రభుత్వాలు, నియంతృత్వాలు మనుషులను ఖైదు చేయవచ్చు. కానీ వారి కలలను మాత్రం దూరం చేయలేవు. జైలు గోడలు మనం కలలు కనే సామర్థ్యాన్ని తగ్గించవచ్చు. కానీ మన నుంచి కలలను మాత్రం వేరు చేయలేవు.

అంతటి దుర్భర పరిస్థితుల్లో కూడా మనుషులను ముందుకు నడిపించేది ఏమిటి?

భవిష్యత్తు మీద ఆశ. మీకో ఉదాహరణ చెబుతాను. విత్తును చీల్చుకొని మొలక వస్తుంది. ఈ మొలక పెరుగుతున్నప్పుడే వేరు కూడా ఉద్భవిస్తుంది. కొద్ది కాలం తర్వాత విత్తే ఉండదు. ఈ విత్తే ఆశ. వర్తమానంలోనే గతం ఉంటుంది. భవిష్యత్తు కూడా ఉంటుంది. కొన్ని సార్లు నిరంకుశ ప్రభుత్వాలు- వర్తమానం మాత్రమే మంచిదని.. గతం కానీ భవిష్యత్తు కానీ ఉండవని చెబుతూ ఉంటాయి. కానీ వాస్తవ పరిస్థితి వేరుగా ఉంటుంది. అలాంటి సమయంలోనే మనం భవిష్యత్తు కోసం పోరాడాలి. అదే మనను ముందుకు నడిపిస్తుంది. ఎప్పుడైనా వర్తమానంతో ముడిపడిన భవిష్యత్తే మంచిది. అది ఒక ప్రవాహంలాంటిది.

మీరు జీవితంలో ఒక రచయితగా రిగ్రెట్ అయిన సందర్భాలేమైనా ఉన్నాయా?

అప్పుడప్పుడు 1962 నుంచి.. అంటే నేను రాయటం మొదలుపెట్టినప్పటి నుంచి నా మాతృభాషలోనే రచనలు చేస్తే బావుండేదేమో అనే ఆలోచన వస్తుంది. ఆ సమయంలో ఇంగ్లీషులో రాయటం సాధారణమైన విషయం అనుకొనేవాడిని. నేను నా రచనలన్నీ నా మాతృభాషలోనే చేస్తే మరింత మార్పు వచ్చేదేమో అనిపిస్తూ ఉంటుంది. నాకు కూడా ఎక్కువ మనఃశాంతి దొరికేదేమో!

మీ మొదటి రెండు నవలలు- 'ద రివర్ బిట్వీన్', 'వీప్ నాట్, ఛైల్డ్'- కాలేజీలో ఉన్నప్పుడే రాశారు. అప్పటికి మీరు రచయితగా ఒక పరిపక్వ దశకు చేరుకున్నాననుకుంటున్నారా?

ఈ రెండు నవలలు ఒక ఔత్సాహికుడిగానే రాశా. ఇప్పటికీ నాకు ఒక రచయితగా అంత సంతృప్తి లేదు. నాకు ఒక రచయిత హోదా రావాలంటే నేను ఇంకా రాయాల్సి ఉంది. 'ఏ గ్రెయిన్ ఆఫ్ వీట్', 'పెటల్స్ ఆఫ్ బ్లడ్'-


ఇంటర్వ్యూ • సి.వి.ఎల్.ఎన్. ప్రసాద్

మార్పు నిరంతర ప్రక్రియ

మార్పు నిరంతరమైన ప్రక్రియ. వర్తమానంలో మార్పు చాలా నెమ్మదిగా అనిపిస్తుంది. కొన్ని సార్లు అసలు మార్పే జరగటం లేదేమో అనిపిస్తుంది. కానీ చరిత్రను గమనిస్తే.. మార్పు జరుగుతూనే ఉంటుందని.. మరింత అభివృద్ధి చెందిన సమాజం వైపు మానవుడు ప్రయాణిస్తూనే ఉంటాడని అర్థమవుతుంది. అప్పుడు నిరాశ ఉండదు. అంతే కాదు.. మార్పు ఎప్పుడూ సమాజ హితాన్ని కోరేవారివైపే ఉంటుంది.

దూరంగా ఉన్నా..

గత మూడు దశాబ్దాలుగా నేను కెన్యా నుంచి దూరంగా నివసిస్తున్నా. నేను నా దేశం నుంచి దూరంగా ఉండచ్చు. కానీ ఆ దేశం నాదనే భావన నరనరాల్లోను ఇంకిపోయింది. నేను చాలా క్లిష్టమైన పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఆ దేశ ప్రజలు నాకు మద్దతు ఇచ్చారు. 1982లో నా నవలను పబ్లిష్ చేసే ముందు కెన్యా పబ్లిషర్ హెన్రీ చకావా వేళ్లను నరికేశారు. ఇలాంటి క్లిష్టమైన పరిస్థితుల్లో కెన్యా ప్రజలే నాకు మద్దతు ఇచ్చారు. ఇస్తూనే ఉన్నారు.



హైదరాబాద్‌తో అనుబంధం

ఉగాండాలో నేను చదువుతున్నప్పుడు సూజీ థారు నా సహ విద్యార్థిని. తనను మళ్లీ కలవటం చాలా ఆనందంగా ఉంది. 1996లో నేను తొలిసారి వచ్చినప్పటి అనుభవాలు నాకు ఇంకా జ్ఞాపకమున్నాయి. ఒక రోజు ఉదయాన్నే లేచి మేము వరంగల్‌కు బయలుదేరాం. మీలాగే ఒక జర్నలిస్టు మిత్రుడు కారులోనే ఇంటర్వ్యూ చేస్తున్నాడు. మధ్యలో ఒకచోట టీ తాగటానికి ఆగాం. ఆ షాపు ఓనరు టీ కాచే పద్ధతి.. నా చిన్నప్పుడు కెన్యాలో భారతీయులు టీ కాచుకొనే పద్ధతిని గుర్తు చేసింది. నా చిన్నతనం గుర్తుకొచ్చింది. ఇది ఒక మరచిపోలేని అనుభవం. వరంగల్ వెళ్లినప్పుడు ఒక స్తూపాన్ని చూశాం. అప్పుడు మమ్మల్ని కలవటానికి అనేక మంది వచ్చారు. ఇప్పుడు దాన్ని కూల్చేశారట. ఇలా హైదరాబాద్‌తో ముడిపడిన అనుభూతులు అనేకమున్నాయి.

సాహిత్య గ్రంథాల పరిచయం

తెలంగాణ సాహిత్య అకాడమి ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ప్రచురించిన సాహిత్య గ్రంథాల పరిచయం కార్యక్రమం ఫిబ్రవరి 28 ఉ.10గం.ల నుంచి రవీంద్ర భారతి మినీ కాన్ఫరెన్స్ హాల్, హైదరాబాద్ నందు జరుగుతుంది. అధ్యక్షత నందిని సిధారెడ్డి, ముఖ్య అతిథి ముర్రా వెంకటేశం. జి. అంజయ్య, గురిజాల రామశేషయ్య, కె.పి. అశోక్‌కుమార్, బుజంగరెడ్డి, వెలుదండ నిత్యానందరావు, చంద్రబోసు, కె.వి. రమణాచారి, హరగోపాల్ తదితరులు పాల్గొంటారు.

- ఏనుగు నరసింహారెడ్డి

'నది కాలం అతడు' ఆవిష్కరణ

రవూఫ్ రాసిన 'నది కాలం అతడు' (ఇస్మాయిల్ ఇతివృత్త కవితా సంపుటి) ఆవిష్కరణ మార్చి 4 సా.6గం.లకు సుందరయ్య విజ్ఞాన కేంద్రం షోయబ్‌హాల్, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ నందు జరుగుతుంది. అధ్యక్షత ఏనుగునరసింహారెడ్డి; ఆవిష్కర్త కె. శివారెడ్డి; ఆత్మీయ అతిథి వాడ్రేవు చినవీరభద్రుడు; వక్తలు శిఖామణి, జి.లక్ష్మీనరసయ్య, శిలాలోలిత. తొలి పలుకులు: యాకూబ్.

- అశోక్ కుమార్

పద్య కవితలకు ఆహ్వానం

తణుకు శ్రీనన్నయ భట్టారక పీఠం 'ప్రసార మాధ్యమాలు - ప్రభావాలు' అంశంపై పద్య కవితలను ఆహ్వానిస్తున్నది. 2018 మార్చి 3వ తేదీ లోగా ఐదు పద్యాలను మాత్రమే రాసి చిరునామా: శ్రీసుశర్మ, నన్నయ భట్టారక పీఠం, తణుకు-534211, తణుకు, ప.గో. జిల్లా, ఆం.ప్ర.కు పంపాలి. మార్చి 18న విజేతలకు సత్కారం. వివరాలకు 9848355806.

- సుశర్మ

కవితల పోటీ

మార్చి 21న ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా 'వంతెన' కవిత్వ బులిటిన్ కవిత్వ పోటీలు నిర్వహిస్తుంది. సామాజిక స్పృహ కలిగిన కవితలను 25పంక్తులకు మించకుండా చిరునామా: చిత్తలూరి, 'వంతెన' కవిత్వ బులిటిన్, కెరాఫ్ అమూల్యాచందు కప్పగంతు, డోర్.నం.29-27-23, సూర్యనారాయణ వీధి, సూర్యారావు పేట, విజయవాడ-2కు పంపాలి. కవితలు పంపేవారు చందాదారులై ఉండాలి. వివరాలకు 9059824800.

- చిత్తలూరి



మళ్లీ అక్కడే...

నిన్ను మనసారా కళ్లలో నింపుకున్న చోటే
నీ దోసిట్లో నా కన్నీటి ముత్యాలను దాచుకున్న చోటే...
అన్నేళ్లకు చూసిన మైమరపో
ప్రాణం పోతున్నంత ఆత్రుతో
ఆ క్షణాల కోసమే దాచుకున్న పారవశ్యమో
మరేదో...

ఆ చోటే
నా ఒడిలో నీ ఊసులు పొదువుకున్న చోటే
నిలువలేక నీ గుండెలకి నా ఆవేదన అదుముకున్న చోటే
నేనంటే నువ్వు కూడా అని శ్వాసనాపి నీతో చెప్పుకున్న చోటే
మళ్లీ అక్కడే...

ఆ చోటే
నిన్ను మొత్తంగా నాలోకి నింపుకుని, కొత్త నాకు జన్మనిచ్చుకున్న చోటే
జ్ఞాపకాలతో పనేం లేదని నిర్ధారించుకున్నాక,
జీవితమంటే నేనేం కాదని... ప్రాణాల్ని నీ పాదాలకింద తొక్కిపెట్టి..
నిర్దాక్షిణ్యంగా నను విడిచెళ్లిన చోటే
కనిపిస్తావు కదూ..?

ఆ చోటే
మళ్లీ అక్కడే...

■ శారద యామిని
saaradayamini@gmail.com

కాలాన్ని అధిగమించే ప్రయత్నం నాది - నిఖిలేశ్వర్

'నన్నయ్యను నరేంద్రుడి బొందలోనే నిద్ర పోనియ్యి' అంటూ దిగంబర కవిగా సంచలనం సృష్టించిన నిఖిలేశ్వర్ తన 50 ఏళ్ల కవితా ప్రస్థానం సందర్భంగా బృహత్ కవితా సంపుటిని వెలువరించారు. తెలుగు సాహిత్యరంగాన పేరెన్నిక గన్న ఆయన తెలంగాణ నుంచి వెలుగులోకి వచ్చిన ఆధునిక కవులలో ఒకరు. ప్రస్తుతం సాహితీరంగంలో తనకున్న విస్తృత పరిచయాలను పురస్కరించుకుని తన జ్ఞాపకాలను పదిల పరిచే రచనలో ఉన్నారు. సాహిత్యవిలువలు, నిబద్ధతే ప్రధానమని చెప్పే నిఖిలేశ్వర్‌తో సంభాషణ.

గతించిన 50 ఏళ్ల సామాజిక, రాజకీయ పరిణామాలకు మీరు ప్రత్యక్ష సాక్షి, భాగస్వామి. మీ రచనలను ఎట్లా నిర్వచించుకుంటారు?

నా తొలి యవ్వన కాలాన పరిచయమైన వట్టికోట ఆళ్వారు స్వామి, మహాకవి మఖ్దూం, దాశరథి నుంచి శ్రీశ్రీ, చలం వంటి మహా రచయితల వరకు, తరిమెల నాగిరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వర్ రావుల వంటి గొప్ప నాయకుల సాన్నిహిత్యంలోనే నా కవిత్వం, రచనా దృక్పథం రూపు దిద్దుకున్నది. కవిత కావచ్చు, వ్యాసాలు కావచ్చు వాటిలో నేను ప్రవచించే ప్రగతిశీల ప్రజాస్వామిక విలువలు, నిబద్ధతే నాకు ముఖ్యం. మహా రచయిత ప్రేమ్ చంద్ ప్రభావం అపారం. దేశ విదేశాల కవితాపఠనం, ఉర్దూ, హిందీ మహారచయితల అధ్యయనం నా నేపథ్యంలో ఉన్నది తెలంగాణ సాయుధ పోరాటానికి గుండెకాయ వంటి భువనగిరిలో నేను పుట్టాను. ఏదో విధంగా అందులో భాగస్వామ్యం ఉన్న కుటుంబం మాది. చిన్నప్పుడే తండ్రి కాలం చేయడంతో మా అమ్మ ఈ నగరానికి వచ్చి కార్మికురాలిగా పనిచేస్తూ నన్ను పెంచి చదివించింది. అందుకే కావచ్చు 50 ఏళ్లుగా నేను తెలుగు సాహిత్యరంగంలో నిలదొక్కుకోగలిగాను. రచన అనేది నాకు కెరీర్ కాదు, బాధ్యత. 1960ల నుంచి 2000 వరకు దేశ విదేశాల సాహిత్య పరిణామాలపై అనేక వ్యాసాలు రాశాను. ఎప్పటి కప్పుడు పుస్తకాలు వేసుకోకపోవడం వల్ల నష్టం జరిగింది. ఏమైనా కాలాన్ని అధిగమించే ప్రయత్నం నాది.

తెలుగు సాహిత్య రంగాన దళిత, స్త్రీ, ముస్లిం, ఇప్పటి తెలంగాణ సాహిత్య ఉద్యమం వరకు మీ కళ్ల ముందే రూపు దిద్దుకున్న గొప్ప చరిత్రలో మీ భాగస్వామ్యం ఏమేరకు ఉన్నది?

క్రియాశీల రచయిత ఎవరైనా చరిత్రకు ప్రేక్షకునిగా ఉండలేడు. నేనూ అంతే. దళిత, స్త్రీవాద, ముస్లిం, తెలంగాణ సాహిత్య ఉద్యమాలు కావచ్చు, నేను కాలంతో పయనించాను. ఇప్పటి తరానికి తెలియకపోవచ్చు. దళిత సాహితోద్యమం తెలుగులో రగులు కోకముందే అంటే 1975లోనే మరాఠీ దళిత సాహిత్యాన్ని పరిచయం చేశాను. బహుశా ఆ కారణంవల్లే సలంద్ర, బొజ్జతారకంవంటి అంబేద్కరిస్టులు నాకు సన్నిహితులయ్యారు. 1990లకు ముందే నేను అనువదించిన మరాఠీ కథల పుస్తకం వెలువడింది. తెలంగాణ సాహిత్యోద్యమానికి స్థానికత పునాదిగా చెబుతున్నారు. ఆ లెక్కన నేను నాలుగు శతాబ్దాల సాక్షిగా నా మహానగరం అన్న పేరుతో హైదరాబాద్‌పై కవితా సంకలనం ప్రచురించాను. ఇక్కడే పుట్టి ఈ నగరాన్ని ప్రేమించిన మహాకవులు సరోజినీ నాయుడు, హరిన్ చట్టో, మఖ్దూంల వరసలో వెలువడిన సంకలనం నాది. 35ఏళ్ల క్రితమే ప్రచురించాను. నా మరో సంపుటి 'జ్ఞాపకాల కొండ' కూడ తెలంగాణ సాహిత్యోద్యమం క్రమంలోనే వెలువడింది. ఏనాడైనా సార్వజనీన భావాలతో పయనించే నేను



నిర్దిష్టమైన సాహిత్య ఉద్యమాలకు ఎడంగా లేను. కాకపోతే వాటి పరిమితులు తెలిసినవాన్ని. నేను మౌలికంగా ప్రజాస్వామికవాదిని. 1981లో నేను సంపాదకునిగా ఉన్నప్పుడే ప్రజాసాహితి పత్రిక పక్షాన జనసాహితి సభ్యుల పూనికతో తెలంగాణ సాయుధ పోరాటం నేపథ్యంలో వెలువడిన సాహిత్యం కళారంగాలపై ప్రత్యేక సంచిక వెలువడింది. తెలుగులోనే తెలంగాణ పోరాట నేపథ్యంలో వెలువడిన తొలి సంచిక అది. తెలంగాణ సాయుధపోరాట సాహిత్య ఉద్యమంలో మహా గాయకుడు పాల్ రాబ్సన్ భాగస్వామ్యాన్ని, హంస్ పత్రిక పక్షాన ప్రేమ్ చంద్ సహచరి శివరాణిదేవి వెలువరించిన ప్రత్యేక సంచిక గురించి వెలుగులోకి తెచ్చింది అందులోనే. చిత్తప్రసాద్ గురించి మోహన్, తెలంగాణ పోరాటం ప్రభావంపై జయధీర్ తిరుమల రావు పరిశోధనాత్మక వ్యాసం వెలువరించారు. ఈ సంచిక తర్వాతే తెలంగాణ పోరాట సాహిత్యోద్యమంపై పరిశోధనలు ఊపందుకున్న విషయాన్ని గమనించాను.

దిగంబర కవితా ఉద్యమం ఆనాటి భారతదేశ ఆధునిక సాహిత్య రంగంపై విశేషమైన ప్రభావం నెరిపింది. ఈ క్రమంపై మీ అభిప్రాయం చెప్పండి.

ఆ ఉద్యమం మొదలైన రోజులలో అంతర్జాతీయంగా అల్లకల్లోలంగా ఉన్నది. భారతదేశాన నెహ్రూ ప్రభావం బీటలు వారుతున్న కాలమది. అంటే 1965. మరోరకంగా భారతదేశంలో అప్పటికే వేళ్లూనుకున్న ఫ్యూడల్ విలువలకు, రాజ్యాంగబద్ధ ప్రజాస్వామిక విలువలకు మధ్య ఘర్షణ మొదలైంది. దీని ప్రతిఫలనమే దిగంబర కవిత. ఫ్రెంచ్, ఆంగ్లంతో సహా ఆయా భారతీయభాషలలోకి అనువాదమై అనేక కవితా ఉద్యమాలకు ప్రేరణైంది. ఈనాటి తెలంగాణ రాజధాని నుంచి తెలుగులో వెలువడి భారతదేశాన్ని ప్రభావితం చేసిన కవితోద్యమంగా దిగంబర కవిత చరిత్ర శాశ్వతం.

దిగంబర కవిత ఉద్యమ పూర్వరంగం?

దిగంబర కవితా ఉద్యమం ఏకాఏకిన రూపు దిద్దుకున్నదేమీ కాదు. అంతకు ముందు కాలాన ప్రపంచ వ్యాప్తంగా బీట్ జనరేషన్, బ్లాక్ పొయెట్రీ, ఫెమినిస్టు, బ్రిటన్‌లో యాంగ్రీ యంగ్‌మెన్ మూవ్‌మెంట్ కవితా ఉద్యమాలు మొదలయ్యాయి. ఆనాటికి నిజాం కళాశాల విద్యార్థిని. బియేలో ఫిలాసఫీ, ఇంగ్లీషు లిటరేచర్ చదువుతున్న కాలంలోనే వాటిని అధ్యయనం చేశాను. యాంగ్రీ యంగ్‌మెన్ కవితా ఉద్యమం నన్ను బాగా ఆకర్షించింది. వెంటనే ఒక వ్యాసం రాశాను. రాసి గోల్కొండ పత్రికలో అచ్చయ్యింది. దాని పేరు 'కోపోద్రిక్త యువతరం'. ఇదే పేరుతో కవిత కూడా రాశాను. నామిత్రులు జ్వాలాముఖి, అరిపిరాల విశ్వం, మురళీధర్, కెకెఆర్‌ల స్నేహం నా సాహిత్య వ్యక్తిత్వాన్ని రూపు దిద్దుకోవడానికి దోహదపడింది. అదేఒరవడిలోకొన్ని కవితలు రాశాను. నా 50 ఏళ్ల కవితా సంపుటిలో వీటిని చూడవచ్చు. అటు తర్వాతే రాత్రి కవితా సంకలనం వెలువడింది.

ఇంటర్వ్యూ • సామిడి జగన్‌రెడ్డి


అంధ ప్రపంచం మధ్య...

ఒక చిన్ని కత్తి తీసుకొచ్చి
కోడికత్తిలాంటి కత్తి- ఎదురుగ్గా నుంచున్నాడు
చేయి చాచి తీసుకో ఈ పుష్పమన్నాడు.
చిన్నపిల్లని నాకేం తెలుసు-
మరకలుండకూడదన్నాను
నెత్తురు మరకలుండకూడదన్నాను
పూల మీద కన్నీరు కురవకూడదన్నాను-
ఇది పువ్వుగాదు కత్తి అన్నాడు
నాకు కత్తి వద్దు- పువ్వే కావాలన్నాను-
అతను గాల్లో చేతులు తిప్పి
కళ్లలాంటి రెండు పూలను సృష్టించాడు-
అది పువ్వో కత్తో కన్నో తెలియనిదాన్ని-
నాకు పూలంటే యిష్టం
చిన్నిపిల్ల పెదాల్లాంటి పూలంటే యిష్టం-
లోకం నెత్తుటి పూలను సృష్టిస్తుంటే
ఏడ్చి ఏడ్చి గుడ్డిదాన్నయ్యాను-
ఎవరో వీపు రుద్ది- సమాధుల గుండా నడిపించి
చేల మధ్య నుంచోబెట్టారు
చేత్తో తడిమి చూశాను
వరికంకులు చేతికి తగిలాయి-
బంగారం వాసనేసింది. నా పక్క నుంచి
ఒక పాములాంటి కాలవ పాకిపోయింది
నేనక్కడ నుంచుని ఆకాశం కేసి చూశాను
ముక్కుతో పీల్చాను.
నాకు పూలు కావాలంటే కత్తులిచ్చారు
కత్తులెందుకంటే కళ్లు తీశారు-
అంధ ప్రపంచం మధ్య, అణగారిన జాతుల
కథ చెబుతూ ఒక సంగీతపక్షిగా మారిపోయాను

■ కె. శివారెడ్డి

(డా. చంద్రశేఖరరావుగారికి...)





103 డిగ్రీల జ్వరంతో పాట

సినిమాల్లో క్రమశిక్షణకు, అంకితభావానికి మారుపేరు శ్రీదేవి. 1989 ఆమె 'చాల్‌బాజ్' సినిమా చేస్తున్నారు. అందులో 'న జానే కహా సే ఆయీ హై' పాట చిత్రీకరణ జరుగుతోంది. అది వానపాట. ఆ సమయంలో ఆమె 103 డిగ్రీల జ్వరంతో బాధ పడుతున్నారు. అయినా, షూటింగ్ మొత్తం డిస్ట్రబ్ అవుతుందని ఆమె పాట చిత్రీకరణకు అంగీకరించారు. అంత జ్వరంలోనూ వాన పాటలో డాన్స్ చేశారు. ఆ చిత్రీకరణలోనే ఆమె కుప్పకూలారు. సినిమాల్లో శ్రీదేవి కమిట్‌మెంట్‌కు దీనిని ఒక ఉదాహరణగా చెబుతారు. అలాగే, షూటింగ్ పది గంటలకు ఉందంటే, ఎప్పుడూ ఆమె అంతకు ముందే సెట్‌కు చేరుకునేవారని సినీ ప్రముఖులు చెబుతారు.

శ్రీదేవి తొలి చిత్రం బంగారుతల్లి



పాలకొల్లు, ఫిబ్రవరి 25: శ్రీదేవి నటించిన తొలి చిత్రం బంగారు తల్లి. ఈ చిత్ర నిర్మాత చేగొండి హరిరామజోగయ్య. దర్శకుడు చాణక్య. 1969లో చిత్రీకరించారు. షూటింగ్ పశ్చిమ గోదావరిలో జరిగింది. అప్పుడు శ్రీదేవికి ఐదేళ్లు. రమాప్రభ చిన్ననాటి పాత్రలో శ్రీదేవి నటించారు. మదర్ ఇండియా హిందీ సినిమాను బంగారుతల్లిగా రీమేక్ చేశారు. "రూ.5లక్షలు ఖర్చయింది. జమున ప్రధాన పాత్రధారి. నాగభూషణం విలన్. బాలనటిగా శ్రీదేవి ఎంతో ప్రతిభ కనబర్చింది" అని జోగయ్య 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.

తీరని లోటు: సీఎం కేసీఆర్



ప్రముఖ నటి శ్రీదేవి హఠాన్మరణం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'తన అందం, అభినయంతో ఎంతోమంది అభిమానులను సంపాదించుకున్న శ్రీదేవి చిన్న వయసులోనే మరణించడం దురదృష్టకరం' అని కేసీఆర్ పేర్కొన్నారు.

జీర్ణించుకోలేకపోతున్నా: సచిన్



శ్రీదేవి ఇక లేరన్న విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నానని క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ అన్నారు. 'చిన్నప్పటి నుంచీ శ్రీదేవిని చూస్తూ పెరిగాం. ఆమె మృతి బాధాకరం' అన్నారు.



ఆలిండియా సూపర్‌స్టార్

చిరంజీవి.. తెలుగు ప్రజల గుండెల్లో సుప్రీం హీరో! రజనీకాంత్.. తమిళ తలైవా!!
అమితాబ్‌బచ్చన్.. హిందీ చిత్ర సీమను ఏలిన మేటి నటుడు!
షారుక్‌ఖాన్, ఆమిర్ ఖాన్, సల్మాన్ ఖాన్.. ముగ్గురూ బాలీవుడ్ బాద్షాలు!!

సినిమా పరిశ్రమలో ఈ తరహా స్టార్‌డమ్ నటులకు కొత్త కాదు. కానీ.. కథానాయికల ఆధిపత్యం అమితంగా ఉన్న సినిమారంగంలో.. నటీమణుల్లో ఆ స్థాయి.. అందునా దేశం మొత్తం ఆరాధించే స్థాయి సూపర్‌స్టార్‌డమ్ అందుకున్న నటి.. శ్రీదేవి ఒక్కత్తే. శ్రీదేవికి ముందు, తర్వాత చాలామంది నటీమణులున్నా.. పాన్ ఇండియా సూపర్‌స్టార్ అంటే ఆమే. ఇటు దక్షిణాదిని.. అటు ఉత్తరాదినీ రెండు తరాలపాటు ఒక ఊపు ఊపిన నటి శ్రీదేవి. బాలనటిగా ఆమె దక్షిణాది సినిమాల్లో మాత్రమే నటించిందని అనుకుంటారు. హిందీలోనూ ఆమె 'జూలీ (1975)' అనే సినిమాలో బాలనటిగా చేసింది. సూపర్ హిట్టయిన పదహారేళ్ల వయసు హిందీ రీమేక్‌తో 1978లో హిందీలో కథానాయికగా పరిచయమైంది. 1983లో వచ్చిన 'హిమ్మత్‌వాలా' బాలీవుడ్‌లో ఆమె స్థానాన్ని సుస్థిరం చేసింది. అమితాబ్ నుంచి ఖాన్ త్రయం దాకా.. బాలీవుడ్ హీరోలకు దేశవ్యాప్తంగా అభిమానులు ఉండొచ్చు గానీ.. వారిని 'తమ'వారుగా భావించేంత వీరాభిమానులు లేరు. కానీ, శ్రీదేవి మాత్రం ఇటు ఉత్తరాదిన.. అటు దక్షిణాదిన.. ఒకే స్థాయి అభిమానాన్ని సంపాదించుకుంది. ఆమె ఎప్పటికీ వన్ అండ్ ఓన్లీ!!

చివరి చిత్రం డిసెంబరులో..

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: అతిలోకసుందరి శ్రీదేవి ఇక వెండితెరపై కనిపించదని బాధపడేవారెందరో. 2017లో ఆమె నటించిన 'మామ్' చిత్రమే చివరిదన్న అభిప్రాయం ఉంది. కానీ, ఆమె ఈ లోకాన్ని విడిచి వెళ్లినా వెండితెరపై మరోసారి మెరవనున్నారు. షారుక్, కత్రినా, అనుష్క శర్మలు నటించిన 'జీరో' సినిమాలో శ్రీదేవి ముఖ్య పాత్రలో కనిపించనున్నారని బాలీవుడ్ వర్గాల తాజా సమాచారం. ఆనంద్ ఎల్.రాయ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో.. ఓ పార్టీ సన్నివేశంలో షారుక్, ఆలియాభట్, కరిష్మాకపూర్‌తో కలిసి శ్రీదేవి హల్‌చల్ చేయనున్నారట. ఈ చిత్రం డిసెంబరు 21న విడుదల చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

అప్పుడే 'మృతదేహం' అయిపోయిందా?

▸▸ టీవీ చానళ్లపై రిషికపూర్ ఆగ్రహం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: శ్రీదేవి మరణవార్తను టీవీ చానళ్లు ప్రసారం చేస్తున్న తీరును ఒకప్పటి ఆమె సహనటుడు రిషికపూర్ తప్పుబట్టారు. 'మృతదేహం' అని సంబోధించడంపై ట్విటర్‌లో ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మృతదేహాన్ని రాత్రికి ముంబయికి తీసుకువస్తారంటూ అన్ని టీవీ చానళ్లు వార్తలు ప్రసారం చేస్తున్నాయి. ఇంత హఠాత్తుగా ఓ వ్యక్తి గుర్తింపును కోల్పోయి.. మృతదేహం అయిపోయిందా?' అంటూ ట్వీట్ చేశారు. రిషి ఇలా ఆగ్రహంతో ట్వీట్ చేయడం ఇదే మొదటిసారి కాదు. గత ఏడాడి తన సహనటుడు వినోద్‌ఖన్నా మృతి చెందినప్పుడు.. ఆయన అంత్యక్రియలకు కొత్త తరం నటులెవరూ రాకపోవడాన్ని ట్విటర్‌లో రిషి తప్పుబట్టారు.


నేను గొంతెమ్మ కోరికలు కోరేదాన్ని కాదు

▸▸ బాహుబలి వివాదంపై శ్రీదేవి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి), ఫిబ్రవరి 26 : బాహుబలి వివాదంపై దివంగత శ్రీదేవి తన మనసులోని మాటను ఒక ఇంటర్వ్యూలో వ్యక్తం చేశారు. ఈ సినిమాలో శివగామిదేవి పాత్రను రమ్యకృష్ణ చేసిన సంగతి తెలిసిందే. ఈ పాత్రకు శ్రీదేవి అయితే బాగుంటుందని మొదట అనుకున్నారు. దర్శకుడు రాజమౌళి కూడా ఆ పాత్ర కోసం ఆమెను సంప్రదించారు. అయితే శివగామిదేవి పాత్రకు ఆమె భారీగా డిమాండ్ చేశారని, హిందీ వర్షన్ హక్కులు కూడా అడిగారని మొదట్లో వార్తలొచ్చాయి. ఈ విషయాన్ని జక్కన్న ఒక ప్రైవేటు కార్యక్రమంలో బహిర్గతం చేశారు. జక్కన్న వ్యాఖ్యలపై శ్రీదేవి ఒక ఇంటర్వ్యూలో స్పందించారు. 'నేను అలా అడగలేదు. ఇప్పటికే 300 సినిమాల్లో నటించాను. ఒకే నిర్మాతతో వరుసగా నాలుగైదు సినిమాల్లో పని చేశాను. నేను గొంతెమ్మ కోరికలు కోరేదాన్నే అయితే, ఇన్ని సినిమాల్లో నటించడం నాకెలా సాధ్యమైంది? ఎవరో రాజమౌళికి అలా చెప్పి ఉంటారు' అని ఆమె తెలిపారు. ఆమె ఎప్పుడూ వివాదాల జోలికి వెళ్లలేదు. ఇదే ఆమె మొదటి, చివరి వివాదం.

'చాందిని'తో హిందీలోనూ డబ్బింగ్



ఐదు భాషల్లో నటించిన శ్రీదేవి కొన్ని భాషల్లో తానే స్వయంగా డబ్బింగ్ చెప్పుకొనేది. ఇందుకు ఆయా భాషలు నేర్చుకొనేది కూడా. శ్రీదేవి తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ సినిమాల్లో నటించింది. 1975లోనే ఆమె బాలీవుడ్‌లో అడుగు పెట్టింది. హిందీలో ఆమె తొలి సినిమా జూలీ. అప్పట్లో ఆమెకు హిందీ రాదు. దాంతో, తొలి రోజుల్లో నాజ్.. ఆ తర్వాతి రోజుల్లో రేఖ డబ్బింగ్ చెప్పారు. 1989లో 'చాందిని' వరకు ఆమె 43 సినిమాలు చేసినా వీరిద్దరి గొంతే బాలీవుడ్‌లో వినిపించింది. కానీ, చాందినీ సినిమాతో శ్రీదేవి స్వయంగా డబ్బింగ్ చెప్పుకొన్నారు. ఆ తర్వాతి నుంచి అన్ని సినిమాల్లోనూ ఆమెదే వాయిస్!

జయలలిత జయంతి రోజే..



శ్రీదేవికి చిన్నతనం నుంచీ తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలితతో సన్నిహిత సంబంధాలు ఉండేవి. 1971లో 'ఆదిపరాశక్తి' సినిమా తీశారు. అందులో జయలలిత పార్వతీదేవిగా నటిస్తే.. శ్రీదేవి బాలనటిగా మురుగుడు పాత్ర పోషించారు. ఆ సినిమాలో జయలలిత ఒడిలో శ్రీదేవి కూర్చునే సన్నివేశం ఎందరికో మరపురాని జ్ఞాపకం. ఆ ఫొటో అప్పట్లో, ఆ తర్వాత కూడా చక్కర్లు కొట్టేది. ఆ ఫొటోనే ఇటు జయలలితకు, శ్రీదేవికి కూడా ఎంతో ఇష్టం. ఇక, చెన్నైలో జరిగిన భారత చలనచిత్ర శత వార్షికోత్సవాల్లో తమిళనాడు ముఖ్యమంత్రిగా జయలలిత నటి శ్రీదేవిని ఘనంగా సత్కరించారు. ఆ సందర్భంగా ఇరువురూ తమ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. జయలలిత మరణించినప్పుడు.. లక్షలాది మంది తమిళ ప్రజలకు అమ్మగా సేవలందించిన మహా నాయకురాలిని కోల్పోయామని శ్రీదేవి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఇక, జయలలిత జయంతి రోజునే శ్రీదేవి మరణించడం ఆమె అభిమానులకు తీరని శోకాన్ని మిగిల్చింది.



ఇద్దరిని గదిలో ఉంచి తాళం వేశారట!

▸▸ జయప్రద, శ్రీదేవిని కలిపేందుకు రాజేశ్‌ఖన్నా, జితేంద్ర యత్నం

ముంబై, ఫిబ్రవరి 25: అక్క పాత్రలో జయప్రద.. చెల్లెలి పాత్రలో శ్రీదేవి.. వారిద్దరి నడుమ నిలిగిపోయే పాత్రలో శోభన్‌బాబు... కట్ చేస్తే అది దేవత చిత్రం! ఆ చిత్రంలో జయప్రద, శ్రీదేవి పోటీపడి నటించారు. ఆ పోటీ టాలీవుడ్‌లో తమ ప్రతి చిత్రంలోనూ కొనసాగించారు. ఆపై బాలీవుడ్ బాటపట్టినప్పుడు అక్కడా అదే పోటీ. ఆ పోటీ ఎంతవరకు దారి తీసిందంటే.. ఒకరికొకరు ఎదురుపడ్డప్పుడు కనీసం పలకరించుకునేవారు కాదట!! అది.. 1984లో మక్సద్ సినిమా షూటింగ్ సెట్. ఆ సినిమాలో రాజేశ్ ఖన్నా, జితేంద్ర కథనాయకులు. వారి సరసన జయప్రద, శ్రీదేవి నాయికలు. సెట్స్‌లో జయప్రద, శ్రీదేవి తీరును గమనించిన రాజేశ్ ఖన్నా, జితేంద్ర ఓ పనిచేశారట! ఆ ఇద్దరు కథానాయికలను మేకప్ గదిలో ఉంచి బయటి నుంచి తాళం వేశారట. గంట తర్వాత తలుపులు తీసి చూస్తే.. ఒకరికిఒకరు వ్యతిరేకంగా కూర్చొని ఉన్నారట! ఇద్దరిని కలపాలన్న తమ ప్రయత్నాలు బెడిసికొట్టాయని అప్పట్లో ఆ అగ్రనాయకులు చెబుతుండేవారు. కానీ.. 25ఏళ్లకు ఎస్పీ నేత అమర్‌సింగ్ రాయబారంతో రాజీ యత్నాలు ఫలించాయి. ఓ కార్యక్రమంలో భర్త బోనీకపూర్‌తో శ్రీదేవి రాగా.. అక్కడికే జయప్రదతో అమర్‌సింగ్ వెళ్లారు. అంతా కలిసి ఒకే టేబుల్‌పై అల్పాహారం తీసుకున్నారు. కాసేపు జయప్రద, శ్రీదేవి ముచ్చటించుకున్నారు. ఈ ఫొటో మీడియాలో రావడంతో ఇరు నాయికల అభిమానులు ఉబ్బితబ్బిబ్బయ్యారు.

శ్రీదేవిపై కాంగ్రెస్ రాజకీయం

▸▸ తామే పద్మశ్రీ ఇచ్చామని ట్వీట్.. ధ్వజమెత్తిన అభిమానులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: ప్రఖ్యాత నటి శ్రీదేవి మృతిపై సంతాపం తెలుపుతూ కాంగ్రెస్ చేసిన ట్వీట్ పెను దుమారం రేపింది. శ్రీదేవి మరణాన్ని కూడా రాజకీయం చేస్తున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో కాంగ్రెస్ పార్టీపై విమర్శలు వెల్లువెత్తాయి. నెటిజన్లు, శ్రీదేవి అభిమానులు కాంగ్రెస్ పార్టీపై దుమ్మెత్తిపోశారు. తీవ్ర విమర్శలు రావడంతో కాంగ్రెస్ తొలుత చేసిన ట్వీట్‌ను డిలీట్ చేసింది. శ్రీదేవి మృతిపై ఆదివారం ఉదయం కాంగ్రెస్ పార్టీ స్పందిస్తూ.. "శ్రీదేవి అకాల మరణం బాధాకరం. ఆమె అద్భుతమైన నటి. మన హృదయాల్లో నిలిచిపోయే లెజెండ్. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాం. 2013లో యూపీఏ ప్రభుత్వ హయాంలో ఆమెకు పద్మశ్రీ అవార్డు అందజేశాం" అని ట్విటర్‌లో పేర్కొంది. దీనిపై నెటిజన్లు తీవ్రంగా స్పందించారు.

- గబ్బర్‌సింగ్ పేరిట ఉన్న ట్విటర్ హ్యాండిల్‌లో 'నెహ్రూ ప్రధానిగా ఉన్నప్పుడే శ్రీదేవి పుట్టారు అని కూడా కాంగ్రెస్ ట్వీట్‌లో పేర్కొనాల్సింది' అని ఎద్దేవా చేశారు. మరికొందరు అభిమానులు "శ్రీదేవి మరణానికి ప్రధాని మోదీని నిందించొద్దు" అని పేర్కొన్నారు.



- ప్రముఖ క్రికెటర్ జడేజా స్పందిస్తూ.. 'బాలీవుడ్ ఐకాన్ శ్రీదేవి మృతిని కాంగ్రెస్ రాజకీయం చేస్తోంది. ఇది మానవత్వానికే మాయని మచ్చ' అని ట్వీట్ చేశాడు.
- అమిత్ సాహా అనే మరో నెటిజన్.. 'శ్రీదేవి కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు పుట్టింది. బీజేపీ అధికారంలో ఉన్నప్పుడు చనిపోయింది' అని కూడా చెప్పాల్సిందని విమర్శించాడు. మరో వ్యక్తి 'ఆమె లెజెండరీ నటి అని, ఆమె స్థాయి జాతీయ అవార్డు కంటే గొప్పదని' పేర్కొన్నాడు.
- "పద్మశ్రీ అనేది పౌరులకు దేశం అందించే పురస్కారం. ఓ రాజకీయ పార్టీ ఇచ్చేది కాదు" అని రచయిత, బ్లాగర్ సందీప్ ఘోష్ ట్వీట్ చేశారు.

ఇలా నెటిజన్లు విమర్శలు గుప్పించడంతో కొద్ది గంటల తర్వాత కాంగ్రెస్ పార్టీ తొలి ట్వీట్‌ను తొలగించి "శ్రీదేవి మృతి బాధాకరం. ఆమె అద్భుతమైన నటి. ఎప్పటికీ మన హృదయాల్లో నిలిచిపోయే లెజెండ్. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాం" అని ట్వీట్ చేసింది.



దివికేగిన దేవత

(మొదటి పేజీ తరువాయి)

ఉండిపోయారు. పెళ్లి కార్యక్రమాలు ముగిశాక కపూర్ కుటుంబ సభ్యులందరూ తిరుగుపయనమయ్యారు. బోనీ కుటుంబం అక్కడి నుంచి దుబాయ్‌కు వచ్చి షాపింగ్ నిమిత్తం జుమేరియాలోని ఎమిరేట్స్ టవర్స్ హోటల్‌లో బస చేశారు. ముంబైలో తన స్నేహితుడి కుమార్తె పుట్టినరోజు వేడుక ఉండడంతో ఫిబ్రవరి 22న బోనీకపూర్ ఇండియాకు చేరుకుని.. శనివారంనాడే మళ్లీ దుబాయ్‌కి వచ్చారు. ఆ రెండు రోజులూ ఆమె అసలు హోటల్ గది నుంచి బయటకు రాలేదని సమాచారం. ఆ రోజు రాత్రి భోజనానికి వెళ్లేందుకు సిద్ధమయ్యే క్రమంలో.. 11-11.30 గంటలకు హోటల్‌లోని బాత్‌రూమ్‌కు వెళ్లిన శ్రీదేవి కార్డియాక్ అరెస్ట్‌తో స్పృహతప్పి పడిపోయారు. అప్పటికి కొద్దిసేపటి ముందే బోనీ సోదరుడు సంజయ్‌కపూర్ ముంబైకి వచ్చారు. వచ్చిన వెంటనే శ్రీదేవి మరణవార్త తెలుసుకుని మీడియాకు ధ్రువీకరించారు. 'అవును, నటి శ్రీదేవి ఇకలేరు. శనివారం రాత్రి 11.00-11.30 గంటల సమయంలో ఆమె చనిపోయారు. ఇప్పుడే దుబాయ్ నుంచి ముంబై చేరుకున్నా. మళ్లీ దుబాయ్ వెళ్తున్నా.' అని ఆదివారం అర్ధరాత్రి ఓ ఆంగ్ల పత్రికకు ప్రకటన విడుదల చేశారు. శ్రీదేవికి ఇంతకుముందు గుండెకు సంబంధించిన అనారోగ్యాలేవీ లేవని ఆయన చెప్పారు. 'శ్రీదేవి హఠాన్మరణం చెందడంతో కుటుంబమంతా తీవ్ర దిగ్భ్రాంతిలో ఉన్నాం. గుండెపోటు వచ్చిన సందర్భంలో ఆమె హోటల్ బాత్‌రూంలో ఉన్నారు.' అని ఆదివారం ఉదయం దుబాయ్‌లో మీడియాతో చెప్పారు. శ్రీదేవి భౌతికకాయాన్ని భారతదేశానికి వెంటనే తీసుకురావాలనుకున్నప్పటికీ స్థానిక నిబంధనల ప్రకారం నడుచుకోవాల్సి వస్తోందని తెలిపారు. "ఇది ఇక్కడ (దుబాయ్‌లో) సాధారణ ప్రక్రియ. మనం ఏ దేశంలో ఉన్నామో ఆ నిబంధనలను పాటించాల్సిందే." అని సంజయ్‌కపూర్ పేర్కొన్నారు. శ్రీదేవి భౌతికకాయానికి ఎంబామింగ్ చేసి భారత్‌కు పంపేసరికి సోమవారం సాయంత్రం అవుతుందని దుబాయ్‌లోని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. జుహూ (ముంబై)లోని పవన్‌హన్స్ దహనవాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు సమాచారం. అలాగే, మంగళవారం ముంబైలోని బోట్‌క్లబ్‌లో శ్రీదేవి ఆత్మశాంతికి ప్రార్థనలు నిర్వహించనున్నారు. శ్రీదేవి మరణవార్త తెలుసుకున్న అభిమానులు వేలాదిగా ముంబైలోని ఆమె నివాసం వద్దకు చేరుకున్నారు. ఆమెకు కడసారి నివాళులర్పించేందుకు తండోపతండాలుగా తరలివస్తున్నారు. పరిస్థితిని అదుపులో ఉంచేందుకు పోలీసులు అక్కడ బందోబస్తు ఏర్పాటు చేశారు.

మానసిక ఒత్తిడే మింగేసిందా?

(మొదటి పేజీ తరువాయి)

ఆరాటం, పిల్లల భవిష్యత్తుపై ఆందోళన, ఏ విషయాన్నీ బయటకు పొక్కనివ్వని మనస్తత్వం... ఇవన్నీ శ్రీదేవి జీవితానికి శాపంగా మారాయని అంచనా వేస్తున్నారు. 15 శాతం కార్డియాక్ అరెస్టులకు మానసిక ఒత్తిడి, కుంగుబాటులే కారణమని వైద్యులు చెబుతున్నారు.

ఆమెకు జీవితమే చాలెంజ్

శ్రీదేవి పర్ఫెక్ట్‌నెస్‌కు మరో పేరు. వయసుతో నిమిత్తం లేకుండా అందరికీ ఆమె అంటే ఇష్టం. ముక్కుపచ్చలారని ప్రాయంలోనే మెగాఫోన్ ముందు నిలుచుంది. తోటి పిల్లలు మాతృభాషలో కూడా మాటలు నేర్వని ప్రాయంలోనే శ్రీదేవి పొరుగు భాషల్లోనూ మాట్లాడింది. బాలీవుడ్‌లో అడుగు పెట్టే వరకూ ప్రతీక్షణం ఆమె తల్లి రాజేశ్వరి వెన్నంటే ఉంది. ఎక్కడ ఎలా ప్రవర్తించాలి? ఎవరితో ఎలా మాట్లాడాలి? పూసగుచ్చినట్టు నేర్పించేది. రాజేశ్వరి ఉన్నంత వరకూ శ్రీదేవి తల్లి కొంగుచాటు అమ్మాయే. సినిమా అంటేనే గ్లామర్ ఫీల్డ్. మనిషి ముక్కు సూటిగా ఉండకూడదు. ముక్కు మాత్రం అందంగా ఉండాలి. మనసులో మాట పెదాలు దాటకూడదు. నవ్వు మాత్రం పెదాలమీద మరింత అందంగా తళుకులీనాలి. ఇండస్ట్రీ నేర్పిన పాఠాలతోనే ఆమె ముక్కును ఆపరేషన్ ద్వారా తీర్చిదిద్దుకొంది. తర్వాత కూడా అందాన్ని ఇనుమడింపజేసే పలు శస్త్రచికిత్సలను చేయించుకుంది. బాలీవుడ్‌లో 'హిమ్మత్‌వాలా'తో శ్రీదేవి పెద్ద హిట్ అందుకుంది. తర్వాత కూడా ఎన్నెన్నో విజయవంతమైన చిత్రాలు. అంతలోనే మిథున్ చక్రవర్తితో పెళ్లి వ్యవహారం.. తూచ్ అని అనడం, అప్పటికే పెళ్లయిన బోనీ కపూర్‌ని పెళ్లి చేసుకోవడం జరిగిపోయాయి. ఇద్దరు పిల్లల తల్లి అయిన తర్వాత కూడా శ్రీదేవి ఆహార్యానికి అత్యంత ప్రాధాన్యమిచ్చింది. ఎప్పుడూ మంచి ఛాయతో కనిపించాలని ఆరాటపడింది. రీ ఎంట్రీ చిత్రం 'ఇంగ్లిష్ వింగ్లిష్'లో ఆమెను చూసిన వారంతా అవాక్కయ్యారు. 'నిజంగానే అతిలోక సుందరి శ్రీదేవి' అని కితాబిచ్చారు. బాలీవుడ్ గుసగుసల ప్రకారం ఆ సినిమా కోసం శ్రీదేవి రెండు సర్జరీలు చేయించుకుంది. అందుకే ఆమె అంత బాగా తెరపై మెరిసిందనే వార్తలు వచ్చాయి. తర్వాతి చిత్రం 'మామ్'. అందులో దవడ ఎముకలు కనిపిస్తూ, కళ్లు లోపలికి పీక్కుని పోయి కనిపించిందామె. 'పాత్ర డిమాండ్ మేరకే అలా కనిపించాను. ఆ పాత్రకున్నటి మేని మెరుపులు అవసరం లేదు' అని విలేకరులకు సమాధానమిచ్చింది. అందులో నిజం లేదన్నది ఒక వాదన. అంతకుముందు చేయించుకున్న సర్జరీ తాలూకు ప్రభావం తగ్గిపోయి అలా కనిపించిందని అంతా అన్నారు. దాంతో ఆమెలో ఒత్తిడి మొదలైంది. 'నేను దేనికీ అంత తేలిగ్గా సంతృప్తి చెందను' అని శ్రీదేవి గతంలో ఓ సారి చెప్పిన మాటల్ని ఇక్కడ గుర్తు చేసుకోవాలి. శ్రీదేవి అందం విషయంలో రాజీపడలేదు. బరువు పెరగకూడదనే ఉద్దేశంతో భోజనం చేయకుండా విటమిన్ల మీద ఆధారపడి కూడా జీవించిందట. దానికి తోడు ఇటీవలే వెయిట్‌లాస్ సర్జరీ చేయించుకున్నట్టు కూడా మరో వార్త వినిపిస్తోంది. బాలీవుడ్ తారలతో అత్యంత సన్నిహితంగా మెలిగే పియాలీ గంగూలీ ఫేస్‌బుక్‌లో చేసిన పోస్టు ఇప్పుడు సంచలనం సృష్టిస్తోంది. శ్రీదేవిపై బరువు తగ్గాలన్న ఒత్తిడి అధికంగా ఉందని తెలిపారు. 54 ఏళ్ల వయస్సులో మడతలేని చర్మంతో నలభై ఏళ్ల లోపు మహిళలాగా కనబడాల్సిన ఒత్తిడి ఆమెను సర్జరీలకు పురిగొల్పిందన్నారు. ఐదేళ్ల క్రితం తానామెను కలిసినపుడు ఎంతో అందంగా ఉన్నప్పటికీ ఆమెలో అంతులేని దిగులు తొంగి చూస్తోందని చెప్పారు. శ్రీదేవి తరచూ దక్షిణ కాలిఫోర్నియాలోని క్లీనిక్‌లను సందర్శించేదని చెప్పారు.

ఒత్తిడి పెంచిన కుమార్తె కెరీర్

'శ్రీదేవి సర్జరీలు చేయించుకుని బరువు తగ్గలేదు. తన కుమార్తె తొలి చిత్రం ఎలా ఉండబోతుందోననే స్ట్రెస్ ఆమెలో ఎక్కువగా ఉంది. జాన్వి ఎలా చేస్తుందో.. ఎలా చేయగలుగుతుందో.. అనే టెన్షన్ శ్రీదేవిలో ఎక్కువగా ఉంది' అని బాలీవుడ్‌లో శ్రీదేవి సన్నిహితులు అంటున్నారు. 'బాహుబలి' చిత్రంలో శివగామిగా నటించే అవకాశం తొలుత శ్రీదేవికే వచ్చింది. కానీ దాన్ని చేజేతులా జారవిడుచుకోవడం, ఆ చిత్రం పెద్ద హిట్ కావడం కూడా ఆమెను మానసికంగా కాస్త ఇబ్బందికి గురిచేశాయి. దానికితోడు ఎన్నో ఏళ్ల తర్వాత ఆమె తమిళంలో నటించిన 'పులి' బాక్సాఫీస్ దగ్గర బోల్తాపడింది.





జురాసిక్ పార్క్ మిస్!

టాలీవుడ్.. బాలీవుడ్.. కోలీవుడ్.. శాండల్‌వుడ్.. మాలీవుడ్.. అన్నిటిలోనూ సూపర్ స్టార్‌గా వెలుగొందిన శ్రీదేవి హాలీవుడ్‌ను మాత్రం కొద్దిలో మిస్సయింది! అద్భుతమైన అవకాశం వచ్చినా.. ఆమె తన బిజీ షెడ్యూల్ కారణంగా కాదనుకుంది. 1993లో రిలీజైన హాలీవుడ్ వండర్ 'జురాసిక్ పార్క్' సినిమాలో నటించాల్సిందిగా స్టీవెన్ స్పీల్‌బర్గ్ తొలుత శ్రీదేవినే అడిగారు. కానీ, అప్పటికే ఆమె బాలీవుడ్‌లో ఖుదాగవా, దిలావర్, గురుదేవ్, రూప్ కీ రాణి, చోరోంకీ రాజా, రియాసత్, చంద్రముఖి తదితర సినిమాలతో బిజీగా ఉన్నారు. దాంతో, స్పీల్‌బర్గ్ ఆఫర్‌ను ఆమె తిరస్కరించారు. ఒకవేళ, జురాసిక్ పార్క్ సినిమాలో కూడా నటించి ఉంటే శ్రీదేవి పేరు హాలీవుడ్‌లో కూడా మార్మోగి ఉండేది. 'ప్రపంచ సుందరి'గా మన నిలువెత్తు తెలుగు అందం విరాజిల్లేది. అయితే, ఆ సినిమాలో తనకు లీడ్ రోల్ ఇవ్వలేదని, అందుకే ఆమె తిరస్కరించారనే కథనాలూ ఉన్నాయి.

నన్ను పెళ్లి చేసుకోమన్నారు



నేను చెన్నైలో డాక్టర్‌గా పనిచేస్తున్న రోజుల్లో శ్రీదేవి ఇల్లు మా ఇంటి ఎదురుగానే ఉండేది. ఆమెను పెళ్లి చేసుకొమ్మని ప్రతిపాదనలు వచ్చాయి. అప్పటికింకా నేను సినిమాల్లోకి రాలేదు. సినిమా వాళ్లను చేసుకోకూడదని అనుకున్నా. దాంతో ఆ సంబంధం మిస్సయ్యింది. -నటుడు రాజశేఖర్

ఎంతో బాధాకరం: ప్రధాని మోదీ



శ్రీదేవి అకాల మరణం ఎంతో బాధ కలిగించిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. 'శ్రీదేవి ఎన్నో విభిన్నమైన, గుర్తుండిపోయే పాత్రలు పోషించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలి' అని ట్విటర్‌లో పీఎంవో పేర్కొంది.

కలచివేసింది: వెంకయ్య



'శ్రీదేవి హఠాన్మరణం కలచివేసింది. ఆమె విభిన్నమైన ప్రతిభ కలిగిన నటి. దక్షిణాది భాషలు, హిందీ సినిమాల్లో నటించిన గొప్ప ప్రతిభావంతురాలు' అని ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు నివాళులర్పించారు.

దేవీ మౌనమా..
శ్రీదేవీ మౌనమా!

అతిలోకసుందరి ప్రేమ కోసం బోనీ పరితాపం

ఆమె పరిచయ భాగ్యానికి ఆపసోపాలు.. నిర్మాతగా శ్రీతో సినిమాలు.. ప్రేమ, పెళ్లి





తొలిచూపులోనే ఆమెపై అతడికి ప్రేమ! గుండెలనిండుగా ఆరాధనా భావం. నెచ్చెలి పరిచయం కోసం ఎన్నో తిప్పలు.. చివరికి పెళ్లి కోసం ఆమె తల్లి ద్వారానే రాయబారాలు!! నటి శ్రీదేవీని పెళ్లాడేందుకు బోనీకపూర్ చేసిన ప్రయత్నాలు ఓ రసవత్తర ప్రేమ కథా చిత్రానికి ఏమాత్రం తక్కువ కాదు. తెలుగు, తమిళ చిత్రసీమల్లో శ్రీదేవి స్టార్‌గా వెలిగిపోతున్న రోజులవి. అప్పట్లో బోనీకపూర్ చిత్రపరిశ్రమకు కొత్త. టీవీలో ఒక తమిళ చిత్రాన్ని చూశారు. అందులో కథానాయిక ఆయనకు బాగా నచ్చేసింది. ఆమే శ్రీదేవి. ఆ చిత్రంలో ఆమె నటనను చూసి పిచ్చిపిచ్చిగా ప్రేమలో పడ్డారు. వెంటనే శ్రీదేవిని కలవాలని ముంబై నుంచి చెన్నైకి వచ్చారు బోనీ. కానీ ఆయనకు ఆమె దర్శనభాగ్యం దక్కలేదు. తర్వాత హిందీ చిత్రం 'సోల్వా సావన్' చిత్రంలో శ్రీదేవిని మళ్ళీ చూశాక, ఆమెను ఎలాగైనా కలిసి తీరాల్సిందేనని తీర్మానించుకున్నారు. ఏదో సినిమా చిత్రీకరణ నిమిత్తం శ్రీదేవి ముంబైలో ఉన్నారని తెలుసుకుని సెట్స్‌కు వెళ్లారు. బోనీ ముచ్చట తీరింది. అయితే, ఆ అతిలోకసుందరి ముక్తసరిగా మాట్లాడారు. అప్పట్నుంచి చాలా రోజులపాటు బోనీతో శ్రీదేవి పొడిపొడిగానే మాట్లాడేవారు. బోనీకి మాత్రం శ్రీదేవిపై రోజు రోజుకు అభిమానం పెరుగుతోంది. ఆమెతో ఒక చిత్రం తీయాలని నిర్ణయించుకున్నారు. ఆ సమయంలోనే తమ్ముడు అనిల్‌కపూర్ హీరోగా 'మిస్టర్ ఇండియా' నిర్మించడానికి ఆయన సన్నాహాలు చేస్తున్నారు. అందులో కథానాయికగా శ్రీదేవిని తీసుకోవాలనుకున్నారు బోనీ. శ్రీదేవిని సంప్రదిస్తే.. 'మా అమ్మగారిని అడగండి' అంటూ అవే ముక్తసరి మాటలు! శ్రీదేవి తల్లి మాత్రం బోనీకి మాటిచ్చేశారు. కానీ పారితోషకం రూ.10 లక్షలు ఇస్తేనే కూతురు సినిమా చేస్తుందన్నారు. రూ.11 లక్షలు తీసుకోండంటూ బోనీ ఖుషీ అయ్యారు.

వచ్చీరాని తెలుగులో మాటలు

'మిస్టర్ ఇండియా' చిత్రీకరణలో మెల్ల మెల్లగా బోనీ-శ్రీదేవి మధ్య మాటలు పెరిగాయి. అయితే, ఇద్దరికీ భాషా సమస్య ఏర్పడింది. బోనీకి హిందీ, ఇంగ్లిష్ బాగావచ్చు. శ్రీదేవిదేమో అప్పటికి వచ్చీరాని హిందే. ఇంగ్లిషు కూడా అంతంతే తెలుసు. అప్పటికీ దర్శకుడు బాపూతో 'హమ్ పాంచ్' (మనవూరి పాండవులుకు హిందీ రీమేక్)తో పాటు తెలుగులో మరో రెండు చిత్రాలు నిర్మించిన అనుభవం ఉన్న బోనీకి తెలుగు మాట్లాడడం కొద్దిగా అలవడింది. దీంతో ఇద్దరూ తెలుగులో మాట్లాడుకునేవారు. యశ్‌చోప్రా 'చాందినీ' చిత్రీకరణ కోసం స్విట్జర్లాండ్‌కు శ్రీదేవి వెంట బోనీ కూడా వెళ్లారు. ఇలాంటి సందర్భాలు ఇద్దరి మధ్య బంధాన్ని పెంచాయి.

శ్రీదేవి ప్రేమను మోనాతో పంచుకొని..

ఒకానొక దశలో తాను శ్రీదేవితో ప్రేమలో పడ్డానంటూ బోనీ స్వయంగా తన భార్య మోనాతో చెప్పారు. ఈ విషయంలో భార్యాభర్తల మధ్య ఎన్నోసార్లు గొడవలు జరిగాయి. శ్రీదేవి తల్లి మాత్రం బోనీకి తన కూతురును ఇచ్చేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేశారు. ఇదంతా జరిగాకే.. శ్రీదేవికి తన ప్రేమ విషయాన్ని బోనీ చెప్పారు. అయితే, ఆమె అంత త్వరగా ఒప్పుకొంటేనా! బోనీ కపూర్ ప్రపోజ్ చేసిన మూడు నెలల తర్వాత శ్రీదేవి 'యస్' చెప్పారు. చివరికి.. 1996 జూన్ 2న వీరి వివాహం జరిగింది.

మిథున్ చక్రవర్తితో పెళ్లయిందా!?



మిథున్ చక్రవర్తితో శ్రీదేవికి పెళ్లయిందా!? అంటే.. 1980ల్లో ఎక్కడ చూసినా ఇదే చర్చే! ఇద్దరూ అనేక సినిమాల్లో కలిసి నటించారు. సెట్స్‌లో చాలా సన్నిహితంగా ఉండేవారు. 'హిట్ జంట'గా ముద్ర పడింది. సినిమాల్లో ఇద్దరి కెమిస్ట్రీ బాగుండేదనే ప్రచారమూ ఉండేది. దాంతో మిథున్‌కు, శ్రీదేవికి పెళ్లయిందని ప్రచారం జరిగింది. ఇద్దరూ 1985లో రహస్యంగా గుడిలో పెళ్లి చేసుకున్నారని, 1988లో తెగతెంపులు చేసుకున్నారని అంటారు. మిథున్ సైతం కొద్దిమంది సన్నిహితులకు తమ వివాహ ధ్రువీకరణ పత్రం చూపించాడని చెబుతారు. వారి పెళ్లి వార్త తెలియడంతో మిథున్ భార్య యోగిత ఆత్మహత్యకు ప్రయత్నించిందనే కథనాలూ వచ్చాయి. శ్రీదేవిని మిథున్ తన రెండో భార్యగా తెచ్చుకుంటే తనకు అభ్యంతరం లేదని ఆమె ప్రకటించడం అప్పట్లో కలకలం రేపింది. అయితే, ఈ అంశానికి సంబంధించి ఇటు శ్రీదేవి కానీ అటు మిథున్ కానీ ఎప్పుడూ పెదవి విప్పలేదు. కానీ, తొలుత యోగితకు విడాకులు ఇచ్చేందుకు సిద్ధమని చెప్పిన మిథున్.. ఆ తర్వాత వెనకడుగు వేయడంతో శ్రీదేవి తెగదెంపులు చేసుకుందని అంటారు.



శ్రీదేవిని ద్వేషిస్తున్నాను

ఆమెను చంపిన దేవుడినీ!.. ఫేస్‌బుక్‌లో రామ్‌గోపాల్ వర్మ ఆవేదన

శ్రీదేవి ఆకస్మిక మృతి వార్త.. ఆమెను ఎంతగానో అభిమానించే దర్శకుడు రామ్ గోపాల్ వర్మను విషాదంలో ముంచెత్తింది. శ్రీదేవి పట్ల తన అభిమానాన్నీ, ఆమె మరణం పట్ల ఆవేదననూ ఆయన ఫేస్‌బుక్‌లో వ్యక్తపరిచారిలా..



శ్రీదేవిని చంపేసినందుకు నేను దేవుణ్ణి ద్వేషిస్తున్నాను, మరణించినందుకు శ్రీదేవిని కూడా ద్వేషిస్తున్నాను!

నాకు అదేపనిగా కలలు కనే అలవాటుంది. రాత్రి నిద్ర లేచిన ప్రతిసారీ నా సెల్‌ఫోన్ చెక్ చేసుకుంటూ ఉంటాను. హఠాత్తుగా శ్రీదేవి ఇక లేరన్న మెసేజ్ కనిపించింది. ఇది పీడకలలో లేదంటే ఆకతాయి చేష్టో అని అనుకున్నాను. మళ్లీ నిద్రలోకి జారిపోయాను. గంట తరువాత నేను తిరిగి లేచేసరికి, దాదాపు యాభై మెసేజ్‌లు ఉన్నాయి. అన్నిట్లోనూ అదే వార్త.

అవి నేను విజయవాడలో ఇంజనీరింగ్ కాలేజీకి వెళ్తున్న రోజులు. 'పదహారేళ్ళ వయసు' సినిమాలో మొదటిసారిగా ఆమెను చూశాను. ఆమె అందానికి ముగ్ధుణ్ణయిపోయాను. ఆమె నిజంగా మనిషి కాదనీ, మానవ రూపంలో దిగి వచ్చిన దేవత అనీ అనుకున్నాను. దేవుడు చాలా ఉల్లాసంగా ఉన్న సమయంలో, మానవాళికి ప్రత్యేక బహుమానంగా ఇవ్వడానికి ఆమెను సృష్టించినట్టు అనిపిస్తుంది. శ్రీదేవితో నా ప్రయాణం నేను 'శివ' కోసం సన్నాహాలు చేసుకుంటున్నప్పుడు ప్రారంభమైంది. చెన్నైలో నటుడు నాగార్జున ఆఫీసుకు నేను నడిచే వెళ్లేవాడిని. ఆ పక్క వీధిలోనే శ్రీదేవి ఉండేవారు. నేను తరచూ శ్రీదేవి ఇంటి గేటు ముందు నిలబడి తదేకంగా చూస్తూ ఉండేవాడిని. ఆమె కనిపించకపోతుందా? అని ఆశపడేవాడిని. ఆ తరువాత 'శివ' విడుదలైంది. పెద్ద హిట్ అయింది. ఒక నిర్మాత నా దగ్గరకు వచ్చారు. "శ్రీదేవితో సినిమా చేసే ఆసక్తి ఉందా?" అని అడిగారు. "మీకేమైనా పిచ్చా? ఆమెను కేవలం చూడడం కోసం నేను చచ్చిపోతాను" అన్నాను. ఆయన శ్రీదేవితో మీటింగ్ ఏర్పాటు చేశారు. ఆ రాత్రి మేము వెళ్ళేసరికి ఆమె ఇంట్లో కరెంట్‌లేదు. ఆ నిర్మాత, నేను కొవ్వొత్తి వెలుగులో ముందు గదిలో కూర్చున్నాం. కాసేపటికి ఆమె వచ్చారు. నాతో పని చెయ్యడం ఇష్టమేనని చెప్పారు. కొవ్వొత్తి వెలుగులో నా ముందు శ్రీదేవి కూర్చున్న దృశ్యం నా మనసులో ఒక సొగసైన పెయింటింగ్‌లా ముద్ర వేసుకుంది.



అది ఆమెకు రాసిన ప్రేమలేఖ!

ఆమె రూపం నా మెదడులో, నా గుండెలో పూర్తిగా నింపుకొని 'క్షణ క్షణం' స్క్రిప్ట్ రాయడం మొదలుపెట్టాను. ఆ సినిమా నేను ఆమెకు రాసిన ఒక ప్రేమ లేఖగా నేను భావిస్తాను. 'క్షణ క్షణం' సినిమా తీస్తున్నంత కాలం, ఆమె ఆకర్షణ, అందం మాత్రమే కాదు, ఆమె వ్యక్తిత్వం, నడవడిక కూడా నన్ను కళ్లు తిప్పుకోనివ్వకుండా చేశాయి. ఆమె తన చుట్టూ ఒక కనిపించని గోడ కట్టుకున్నారు. ఎవర్నీ దాన్ని దాటనివ్వలేదు. ఆ గోడ వెనకాల ఆమె హుందాతనం, ఆత్మ గౌరవం నిలబెట్టుకున్నారు. ఆమె పాపులారిటీ, స్టార్‌డమ్ నమ్మశక్యం కానట్టు కనిపిస్తాయి. 'క్షణ క్షణం' క్లైమాక్స్ నంద్యాలలో తీస్తున్నాం. శ్రీదేవి వచ్చారని తెలియడంతో నంద్యాల స్తంభించిపోయింది. వేలాదిమంది ఆమె కారు వెనకాల పరిగెడుతుంటే ఒక ధూళి మేఘం కనిపించేది. అంతటి సూపర్ స్టార్‌ను నేను ఎన్నడూ చూడలేదు. శ్రీదేవి దేవుడు ఎన్నడూ సృష్టించనంత అందమైన మహిళ. ఏ వెయ్యేళ్లకో ఒకసారి ఇలాంటి అపూర్వమైన కళాఖండాల్ని దేవుడు సృష్టిస్తూ ఉంటాడు. ఆమె మరి లేరంటే నేను నమ్మలేకపోతున్నాను. నేనింకా ఒక పీడకల కంటున్నానన్న ఆశతో ఉన్నాను. కానీ కాదని నాకు తెలుసు!

నేను శ్రీదేవిని ద్వేషిస్తున్నాను
ఆమె కూడా చివరికి కేవలం ఒక మానవ మాత్రురాలని నేను గ్రహించేలా చేసినందుకు
ఆమె గుండె కూడా జీవించడానికే కొట్టుకున్నందుకు
ఆమెకు కూడా మిగిలిన వాళ్ళలాగే ఆగిపోయే గుండె ఉన్నందుకు
ఆమె మరణం గురించి తెలియజేసే సందేశాల్ని చూడడానికి నేను బతికి ఉండడాన్ని ద్వేషిస్తున్నాను
ఆమెను చంపినందుకు నేను దేవుణ్ణి ద్వేషిస్తున్నాను
మరణించిందుకు శ్రీదేవిని ద్వేషిస్తున్నాను
శ్రీదేవీ... నువ్వెక్కడున్నా నేను ప్రేమిస్తున్నాను... నేను ఎల్లప్పటికీ ప్రేమిస్తూనే ఉంటాను.

శ్రీదేవి మృతిపై ఆర్జీవీ ట్వీట్లు

ఈసారి ఆ దేవుడే ఒక జాము రాతిరి ఆ జాబిలమ్మకు శాశ్వతంగా జోలపాడాడు. తన జాజి కొమ్మను ఎక్కువకాలం భూలోకంలో ఉంచలేక శాశ్వతంగా తన దరికి చేర్చుకున్నాడు.

'క్షణ క్షణం' షూటింగ్‌లో ఒక అద్భుతమైన ఎక్స్‌ప్రెషన్ ఇచ్చినందుకు తన (శ్రీదేవి) కాళ్లకి దండం పెడుతుంటే వెంకటేష్ అడ్డుకున్నారు.

దేవుడు అహంకారి, మనం మహా మానవులుగా భావించే బ్రూస్ లీ, శ్రీదేవి లాంటి వాళ్ళను అర్ధంతరంగా చంపి తన శక్తిని అప్పుడప్పుడూ అనవసరంగా ప్రదర్శిస్తూ ఉంటాడు. దేవుడి మీద బ్రూస్ లీ రెండు ముష్టి ఘాతాలు కురిపించాలని నేను కోరుకుంటున్నాను, ఒకటి అతని కోసం, మరొకటి శ్రీదేవి కోసం.

నేను నా కెరీర్‌లో తీసిన అత్యుత్తమమైన పాట 'జామురాతిరి జాబిలమ్మ' (క్షణ క్షణం).

శ్రీదేవి గురించి ఇది నా ఆఖరి ట్వీట్... తను ఇంకా బ్రతికుందనే ఊహించుకుంటాను... "శ్రీదేవి గారూ! నేను ఇంత నవ్వించిన తరువాత కూడా మీరు నన్నింతగా ఏడిపించడం అన్యాయం... ఇంకెప్పటికీ మీతో మాట్లాడను... లైఫ్ లాంగ్ కటీఫ్!

శ్రీదేవి మూలాలు తిరుపతిలోనే!



తల్లి ఇక్కడే పుట్టి చెన్నై వెళ్లారు

తాత తిరుపతిలో బస్సుల ఓనర్

తండ్రి శివకాశిలోని తెలుగురెడ్డి

ప్రతీ పుట్టినరోజుకు తిరుపతి వచ్చేవారు

హైదరాబాద్, ఫిబ్రవరి 25: అతిలోక సుందరి శ్రీదేవి మూలాలు తిరుపతిలోనే ఉన్నాయి. ఆమె తల్లి రాజేశ్వరమ్మ సొంతూరు తిరుపతి. తాత కటారి వెంకటస్వామి రెడ్డి తిరుపతి-గ్యారపల్లి-జమ్మలమడుగు మధ్య బస్సులు నడిపేవారు. ఆయన జమ్మలమడుగులో నర్సుగా పనిచేస్తున్న వెంకటరత్నమ్మను ప్రేమించి కులాంతర (బలిజ) వివాహం చేసుకున్నారు. ఆ తర్వాత ఆయన రుయా ఆసుపత్రిలో ఉద్యోగం సంపాదించారు. ఆయనకు ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు. పెద్ద కుమారుడు బాల సుబ్రహ్మణ్యం కాగా, తర్వాత రాజేశ్వరమ్మ, సుబ్బరామయ్య, అనసూయమ్మ, అమృతమ్మ, శాంతమ్మ జన్మించారు. అందరూ తిరుపతిలోని 93-టీకే వీధిలోని ఇంట్లో ఉండేవారు. బాలసుబ్రహ్మణ్యం చెన్నైలో ఉద్యోగం సంపాదించారు. తనవెంట తమ్ముడు, చెల్లెళ్లందర్నీ చెన్నై తీసుకెళ్లాడు. రాజేశ్వరమ్మకు సినీ నటి కావాలన్న తపన ఉండేది. మిగతా వాళ్లంతా ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. ఆమె నటిగా ప్రయత్నిస్తూ రంగారావు అనే చిన్నస్థాయి నటుడిని ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి సూర్యకళ అనే కుమార్తె కలిగింది. రంగారావు హఠాత్తుగా అదృశ్యమయ్యారు. అనంతరం రాజేశ్వరమ్మ శివకాశికి చెందిన తెలుగువాడు అయ్యప్పన్ రెడ్డిని వివాహం చేసుకున్నారు. సూర్యకళను అమ్మమ్మ, తాతయ్యలు తెచ్చి పెంచుకున్నారు. అప్పటికే అయ్యప్పన్‌రెడ్డికి భార్య, కుమారుడు ఉన్నారు. అయ్యప్పన్‌రెడ్డి చెన్నైలో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేసేవారు. ఆయన తన భార్యను ఒప్పించి రాజేశ్వరమ్మను వివాహం చేసుకున్నారు. రాజేశ్వరమ్మకు ఇద్దరు కుమార్తెలు... శ్రీదేవి, శ్రీలత కలిగారు. అయ్యప్పన్ రెడ్డి మరణించిన తర్వాత కూడా ఆయన కుమారుడే ఇంటి వ్యవహారాలు చూసుకొనేవాడు. శ్రీదేవి దక్షిణాదిన తారాపథంలో దూసుకుపోతున్నపుడు కూడా అన్న చెప్పినట్లే నడుచుకొనే వారు. శ్రీలతను మధురైకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యే సంజీవ్‌కు ఇచ్చి పెళ్లి చేశారు. శ్రీదేవి అక్క సూర్యకళను రాజేశ్వరమ్మ మేనత్త కుటుంబంలో (ఎ.రంగంపేట) ఇచ్చి వివాహం చేశారు. సూర్యకళ కుమార్తె గులాబీ సినిమా హీరోయిన్ మహేశ్వరి. ఎ.రంగంపేటలో 1970లో శ్రీదేవి పది రోజులపాటు గడిపిందట. శ్రీదేవిని పసిబిడ్డగాఉన్నప్పటి నుంచి పిన్ని అనసూయమ్మే పెంచింది. ఇప్పుడామె తిరుపతిలో ఉన్నారు. శ్రీదేవి ఏటా ఆగస్టు 13న పుట్టినరోజును తిరుమల వేంకటేశ్వరుని సన్నిధిలో జరుపుకొనే వారు. శ్రీదేవి పిన్ని కుమార్తె ప్రసన్నలక్ష్మి స్విమ్స్‌లో అసిస్టెంట్ డైరెక్టర్. శ్రీదేవి తిరుపతి వస్తే ఆమె ఇంట్లోనే ఉండేవారు. శ్రీదేవికి బోనీకపూర్‌తో వివాహం జరిగినప్పటి నుంచి శ్రీదేవికి బంధువులతో ఎడం పెరిగింది. తల్లి రాజేశ్వరమ్మ బ్రెయిన్ ఆపరేషన్ సమయంలో జరిగిన పొరపాటుకు అమెరికా ఆసుపత్రి నుంచి భారీ పరిహారం వచ్చింది. దాని విషయంలో శ్రీదేవి, శ్రీలత మధ్య పొరపొచ్చాలు వచ్చాయి. తర్వాత ఒక్కటయ్యారు. గత పదేళ్లలో మహేశ్వరి వివాహంతో పాటు మరికొన్ని వేడుకలకు మాత్రమే శ్రీదేవి వచ్చారు.

శ్రీదేవిని పెంచింది నేనే

తిరుపతి, ఫిబ్రవరి 25: శ్రీదేవి మృతిని ఆమె కుటుంబసభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. తిరుపతిలో ఉన్న ఆమె పిన్ని అనసూయమ్మ ఈ వార్త విని తల్లడిల్లిపోయారు. బాల్యంలో శ్రీదేవిని తానే పెంచానని చెబుతూ కన్నీటి పర్యంతమయ్యారు. ఆమెతో ఉన్న అనుబంధాన్ని ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో పంచుకున్నారు. 'నేను చెన్నైలో ఉన్నప్పుడు శ్రీదేవి చిన్న పాప. తనని నేనే పెంచాను. నాకు వివాహం కావడంతో తిరుపతికి వచ్చేశాను. అలాగే శ్రీదేవి కూడా పెళ్లి చేసుకుని ముంబై వెళ్లిపోయింది' అన్నారు. శ్రీదేవి తల్లి.. తన అక్క ముంబైలో చనిపోయిందని, ఆ తర్వాత అప్పుడప్పుడు ఫోన్‌లో మాట్లాడేవారని గుర్తుచేసుకున్నారు. తిరుపతికి వస్తే మాత్రం తప్పకుండా తన ఇంటికి వచ్చేవారని చెప్పారు. ప్రస్తుతం తాను లేవలేని పరిస్థితిలో ఉండడంతో పిల్లలు మాత్రమే ముంబై వెళ్లారంటూ కన్నీటిపర్యంతమయ్యారు.





‘దర్’లో వైవిధ్యం ఏముంది?

షారుఖ్ ఖాన్ ప్రతినాయకుడిగా విశేష ఆదరణ పొందిన బాలీవుడ్ మూవీలో కథానాయిక జూహీ చావ్లా స్థానంలో శ్రీదేవియే నటించాల్సి ఉంది. ఆమెను దర్శకుడు యశ్‌చోప్రా సంప్రదించినప్పుడు “ఆ పాత్రలో వైవిధ్యం ఏముంది?” అని తిరస్కరించారు. అలాగే మధురీ దీక్షిత్‌కు కథానాయికగా బాలీవుడ్‌లో సుస్థిర స్థానం సంపాదించిపెట్టిన ‘బేటా’ చిత్రం కోసం తొలుత శ్రీదేవినే సంప్రదించారు. అప్పటికే అనిల్ కపూర్‌తో చాలా సినిమాలు చేశానంటూ ఆమె ఒప్పుకోలేదు. ‘బాహుబలి’ చిత్రంలో శివగామి పాత్రనూ ఆమె వదులుకున్నారు. కెరీర్‌లో కొన్ని గొప్ప సినిమాలను వదులుకొన్న శ్రీదేవికి అదేస్థాయిలో హిట్ చిత్రాలు అనుకోకుండా వరించాయి. 1986లో వచ్చిన నగీనా సినిమా కోసం జయప్రదను తీసుకోవాలనుకున్నారు. అదే ఏడాది రిలీజ్ అయిన చాందినీ చిత్రం కోసం తొలుత రేఖను సంప్రదించారు. జయ, రేఖలు ఒప్పుకోకపోవడతో శ్రీదేవి ఈ చిత్రాల్లో హీరోయిన్‌గా తళుక్కుమన్నారు.


తనపైనే కథలు రాస్తున్నారంది



“శ్రీదేవి నాతో తరచూ ఫోన్లో మాట్లాడుతూ ఉంటుంది. సౌత్‌లో అప్‌డేట్స్ గురించి అడుగుతుంది. సెకండ్ ఇన్నింగ్స్ బాగుందని, తనపైనే కథలు తయారు చేస్తున్నారని చెప్పింది. ముంబయికి రావాలని ఆహ్వానించింది. నటిగా 50 ఏళ్ల ఫంక్షన్ చేసినపుడు వస్తానని చెప్పా.

- కృష్ణంరాజు, నటుడు

శ్రీదేవి ఓ ఐకాన్: అడ్వాణీ



భారత సినీ రంగంలో శ్రీదేవి ఓ ఐకాన్ అని బీజేపీ నేత ఎల్‌కే అడ్వాణీ అభివర్ణించారు. ఆమె మృతి వార్త విని తాను షాక్‌కు గురయ్యానన్నారు. పలు భాషల్లో నటించిన శ్రీదేవి జాతీయ సమైక్యతకు నిదర్శనంగా నిలిచిందన్నారు.

శ్రీదేవి బహుముఖ ప్రజ్ఞాశాలి: రాహుల్



శ్రీదేవిని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ బహుముఖ ప్రజ్ఞాశాలిగా అభివర్ణించారు. ఆమె నటనా కౌశల్యం ఎన్నో భాషలు, ప్రాంతాలకు విస్తరించిందని ట్వీట్ చేశారు. శ్రీదేవి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మెరిల్ స్ట్రీప్‌కు పెద్ద ఫ్యాన్!



కోట్లాదిమంది భారతీయులు శ్రీదేవి అంటే పడిచచ్చిపోతారు. శ్రీదేవి మాత్రం.. ఎన్నో ఆస్కార్ అవార్డులు గెలుచుకున్న హాలీవుడ్ నటి మెరిల్ స్ట్రీప్‌కు అభిమాని. ఈ విషయాన్ని శ్రీదేవి స్వయంగా చెప్పారు. సినిమాల్లో ఆమెలా నటించాలని ఉందనే వారు. మెరిల్ స్ట్రీప్ చేసిన విభిన్న పాత్రలు చేయడమంటే తనకి ష్టమని చెప్పేవారు. “నేను మెరిల్ స్ట్రీప్‌కు పెద్ద ఫ్యాన్‌ను. నా కెరీర్‌ను నేను ఎప్పుడూ ప్లాన్ చేసుకోలేదు. కానీ, అవకాశం వస్తే, మెరిల్ చేసిన పాత్రల్లాంటివి చేయాలని కోరుకుంటాను” అని ఇండియా టుడే మహిళా సదస్సులో శ్రీదేవి చెప్పారు.



జాన్వీ.. కష్టపడితేనే నిలబడతావ్

ఇదే కూతురికి శ్రీదేవి చివరి సలహా



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: వెండితెరపై తన బిడ్డ అరంగేట్రాన్ని కళ్లారా చూడాలనుకుంది! మరో నాలుగునెలలైతే ఆ కల కళ్లముందు సాక్షాత్కరించేది! ఇంతలో మృత్యువు ఆమెను కబళించింది. సినిమానే జీవితంగా.. సినిమానే ప్రపంచంగా బతికిన శ్రీదేవికి ఇద్దరు కూతుళ్లు జాన్వీ, ఖుషీ. పెద్దకూతురు జాన్వీ కథానాయికగా వెండితెరకు పరిచయమవుతున్న ‘ధడక్’ బాలీవుడ్ సినిమా జూలై 20న విడుదల కానుంది. జాన్వీకి మీరిచ్చే సలహా ఏమిటని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో శ్రీదేవిని ప్రశ్నించగా.. ‘తల్లిగా నేనైనా సరే, ఇతర ఏ తల్లయినా సరే.. తన బిడ్డలు ఏ రంగాన్ని ఎంచుకున్నా మంచి మార్గంలో వెళ్లాలని సూచిస్తాం. కష్టపడితేనే నిలబడతాం. నేను నాబిడ్డకు ఇచ్చే సలహా ఇదొక్కటే’ అని బదులిచ్చింది. ఇదే తన బిడ్డకు శ్రీదేవి చివరి సలహా. సినీరంగంలో ఎదురయ్యే ఒత్తిళ్లు, సవాళ్లపై మాట్లాడుతూ, ‘ఎవరైనా ఒత్తిళ్లు, సవాళ్లను ఎదుర్కోవాల్సిందే. వాటి నుంచి తప్పించుకోలేం. తాను (జాన్వీ) కూడా వాటిని భరించాల్సిందే. తల్లిగా నేను తొలుత భయపడ్డాను. కానీ.. జాన్వీ పట్టుదలను చూస్తే ఆనందమేస్తోంది. నేను సినిమారంగంలో నిలదొక్కుకోవడానికి మా అమ్మ ఎంతో సహకరించింది. మా అమ్మలానే నేను కూడా నా బిడ్డను ప్రోత్సహిస్తాను’ అని శ్రీదేవి బదులిచ్చింది.

నిన్న మోనా.. ఇప్పుడు శ్రీదేవి

బిడ్డల తెరంగేట్రం చూడకుండానే పరలోకాలకు

ముంబై, ఫిబ్రవరి 25: తమ పిల్లలను తెరపై చూసుకోవాలనే మురిపెం ఏ నటులకు ఉండదు? శ్రీదేవి కూడా తన పెద్ద కుమార్తె జాన్వీ విషయంలో అలాగే ఆలోచించారు. తనలాగే హీరోయిన్‌గా చేయాలని పరితపించారు. అయితే.. ఆ ముచ్చట తీరేలోపే ఆమె తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. జాన్వీ కథానాయికగా తెరంగేట్రం చేస్తున్న హిందీ సినిమా ‘ధడక్’ ఇంకా చిత్రీకరణ దశలోనే ఉంది. దురదృష్టవశాత్తు బోనీకపూర్ మొదటి భార్య మోనా విషయంలోనూ ఇదే జరిగింది. ఆమె తన కుమారుడు అర్జున్ కపూర్‌ను హీరోగా చూడాలనుకున్నారు. అర్జున్ తొలి సినిమా ‘ఇషాక్‌జాదే’ రెండు నెలల్లో విడుదలవుతుందనగా మోనా కన్నుమూశారు.

వో దర్ద్ భరే “లమ్హే”..



తండ్రి అయ్యప్పన్ మరణించినప్పుడు శ్రీదేవి.. యశ్‌చోప్రా సినిమా ‘లమ్హే’ షూటింగ్ కోసం లండన్‌లో ఉన్నారు. తండ్రి అంతిమ సంస్కారానికి హాజరయ్యేందుకు హుటాహుటిన స్వదేశానికి వచ్చారు. అంత్యక్రియలు పూర్తయిన వెంటనే షూటింగ్‌లో పాల్గొనేందుకు మళ్లీ లండన్ వెళ్లారు. అంత విషాదంలోనూ సహ నటుడు అనుపమ్ ఖేర్‌తో హాస్యసన్నివేశ చిత్రీకరణలో పాల్గొన్నారు.

బోర్ కొట్టించను!

అందంగా ఉన్నావంటే స్పందించను

‘సెక్స్ సైరన్’ను అనడం బాధిస్తుంది

‘చీరలోనూ సెక్సీ’ అంటే ఏం చేయను?

ఇప్పటికైతే ఆర్టిస్టుగా సంతృప్తి లేదు

నేను అమ్మానాన్నల చాటు అమ్మాయిని..!

1987 నాటి ఇంటర్వ్యూలో శ్రీదేవి

ముంబై, ఫిబ్రవరి 25: తమిళ, తెలుగు, కన్నడ చిత్రసీమలను ఏలిన సామ్రాజ్ఞి... ఆపై బాలీవుడ్‌లో అడుగిడి సంచలనాలు సృష్టించారు శ్రీదేవి! అందం, అభినయంతో తొలి లేడీ సూపర్‌స్టార్‌గా కీర్తి ప్రతిష్ఠలను ఆర్జించారు. ఆమె ప్రభ దేదీప్యమానంగా వెలిగిపోతున్నప్పుడు... క్షణం తీరిక లేకుండా కెరీర్ సాగిపోతున్నప్పుడు 1987లో ఓ ప్రముఖ ఇంగ్లిషు దినపత్రికకు ఇంటర్వ్యూ ఇచ్చారు. జనం ఆమెను బాలీవుడ్ ‘సెక్స్ సైరన్’గా పిలవడం గురించి... దీనికి భిన్నంగా తమిళ ప్రేక్షకులు తనను ఎలా చూస్తారు... నిజ జీవితంలో శ్రీదేవి ఏంటి... ఎలా స్థిరపడాలని అనుకుంటున్నదీ ఆ ఇంటర్వ్యూలో వివరించారు.

- **బాలీవుడ్‌లో ‘సెక్స్ సైరన్’గా మీ ఇమేజ్ గురించి ఏమనుకుంటారు?**

చాలా బాధపడతాను. ఎవరైనా వచ్చి ఫలానా సినిమాలో చాలా అందంగా కనిపించావంటే నేను స్పందించను. బాగా నటించావంటే మాత్రం గర్వపడతాను.

- **ఎక్స్‌పోజింగ్ చేస్తారు కాబట్టే మీరు నంబర్ వన్ అయ్యారని అంటారు?**

అలా అయితే ఎవరు ఎక్కువ ఎక్స్‌పోజింగ్ చేస్తే వాళ్లు నంబర్ వన్ కావాలి. మరి వాళ్లెందుకు కావడం లేదు? చీరలోనూ సెక్సీగా కనిపిస్తున్నానంటే నేనేం చేయను?

- **వివిధ పాత్రలు... వైవిధ్య నటనతో తమిళంలో మంచి పేరు తెచ్చుకున్నారు. బాలీవుడ్‌కు వచ్చేసరికి ఆ ఇమేజ్‌ను ఎందుకు మార్చేశారు?**

తమిళనాట నా సహజ నటనను చూడటానికి ఇష్టపడ్డారు. హిందీ సినిమాల్లో గ్లామర్, రిచ్‌నెస్, మసాలా కావాలి. నా దురదృష్టం ఏమిటంటే... హిందీలో నా మొదటి పెద్ద హిట్... ఒక కమర్షియల్ సినిమా (హిమ్మత్‌వాలా). నటనకు అవకాశమున్న పాత్ర పోషించిన సద్మా సినిమా ఫ్లాప్ అయింది. ఇలా నాకు గ్లామర్ పాత్రలు ఇవ్వడమే మొదలుపెట్టారు. కానీ, నేను బాగా నటించగలనని ఏదో ఒక రోజు నిరూపించుకుంటా. ఇప్పటివరకైతే ఆర్టిస్టుగా సంతృప్తి లేదు.

- **నంబర్ వన్‌గా చాలా కాలం ఉంటానని అనుకుంటున్నారా?**

జీవితాంతం నేను నంబర్ వన్‌గా ఉండలేను. ప్రేక్షకులకు బోర్ కొట్టించను. యువతరం వచ్చి నా స్థానాన్ని భర్తీ చేసినప్పుడు సినిమాలు వదిలేస్తా.

- **నిజమైన శ్రీదేవి అంటే...**

అందరు అమ్మాయిల్లాగే సాధారణ వ్యక్తిని. అమ్మానాన్నల చాటు బిడ్డని. బయట పార్టీలకు వెళ్లడ నాకిష్టం లేదు. ఇంట్లో అమ్మానాన్నలతో ఉండటమే ఇష్టం.

- **జీవితంపై మీ దృక్పథాన్ని స్టార్‌డమ్ మార్చేసిందా?**

అది జీవితమంటే ఏంటో తెలుసుకునే అవకాశం ఇవ్వలేదు. నేనేం కావాలనుకుంటే అవి నా దగ్గరకే వస్తున్నాయి.

- **మీరు చేసిన పాత్రలు మీ జీవన శైలిపై ప్రభావం చూపాయా?**

నేను పోషించిన పాత్రలకు, నా వ్యక్తిగత జీవితానికి పోలిక లేదు.

- **ధైర్యంగా డ్యాన్సులు చేసేస్తారు... కానీ అమాయకంగా కనపడతారు!**

అది నటన కాదు. నాది బేబీ ఫేస్... అది మారదు.

- **కెమెరా ముందు పూర్తి భిన్నంగా కనపడతారు...?**

ఎందుకంటే నేను చాలా ప్రొఫెషనల్. నేను ఏదీ పెద్దగా ప్లాన్ చేసుకోను. నేను నటన నేర్చుకోలేదు. లోపల నుంచి అది సహజంగా వస్తుంది.

- **నటనకు స్వస్తి పలికాక ఏం చేస్తారు?**

పెళ్లి చేసుకుని స్థిరపడతాను. పిల్లలంటే నాకు చాలా ఇష్టం.

నవరస నటరాణి



13 ఏళ్లకు రజనీకి సవతి తల్లిగా..

15 ఏళ్లకే ‘పదహారేళ్ల వయసు’

వసంత కోకిల, మిస్టర్ ఇండియా, ఖుదాగవా మైలురాళ్లు

అమాయక మల్లి, చలాకీ సీమా.. కన్నీరుపెట్టించే బేనజీర్.. ఇంగ్లిషు నేర్చుకునే శశి వైవిధ్య పాత్రల మహారాణి శ్రీదేవి. గోపాల్‌తో తాళి కట్టించుకోవాలనుకున్న మల్లిలో నిరాశానిస్పృహలు. రైలు వచ్చి ఆగింది.. వెళ్లింది. జైలు నుంచి విడుదలైన గోపాల్.. ఆ రైల్లో నుంచి దిగలేదు. ఆమె ఆవేదన.. రోదనగా మారింది. ఇంటికి తిరుగు ముఖం పట్టింది అంతలో వెనుక నుంచి “మల్లీ” అంటూ పిలుపు! కన్నీళ్లు.. కాస్త ఆనందభాష్పాలయ్యాయి. ‘పదహారేళ్ల వయసు చిత్రంలోని పతాక సన్నివేశంలో శ్రీదేవి పలికించిన భావోద్వేగాలు అభిమానులు మరిచిపోలేరు!

పేరు ‘పదహారేళ్ల వయసు’ అయినా ఆ చిత్రం చేసేటప్పటికి ఆమె వయసు 15 ఏళ్లు మాత్రమే!! ఈ సినిమాలో.. ప్రత్యేకించి క్లైమాక్స్‌లో శ్రీదేవి వైవిధ్యమైన నటనపై దర్శకుడు రాఘవేంద్రరావు ఎన్నో సందర్భాల్లో ప్రశంసలు గుప్పించారు. ఈ చిత్రమే కాదు.. కెరీర్‌లో ఎన్నో సినిమాలు ఆమె వైవిధ్యమైన నటనకు ప్రతీకలుగా నిలిచాయి. 1976లో వచ్చిన తమిళ చిత్రం ‘మూంద్రు ముడిచ్చు’లో నటించేటప్పటికి శ్రీదేవి వయస్సు 13 ఏళ్లే. ఆ చిత్రంలో రజనీకాంత్‌కు ఆమె సవతితల్లిగా నటించారు. కెరీర్‌లో చిరుప్రాయంలోనే ఆమె ఇలా బరువైన పాత్రలో భావోద్వేగాలను పండించారు. ‘వసంత కోకిల’ చిత్రంలో ఆమె నటన విమర్శకుల నుంచి సైతం ప్రశంసలను అందుకుంది. రోడ్డు ప్రమాదం బారిన పడిన యువతి.. గతం మరిచి (ఆమ్నేసియా) పోయి ఆరేళ్ల బాలికగా ప్రవర్తించే పాత్రలో శ్రీదేవి జీవించారు. ఈ చిత్రానికి తమిళచిత్రం ‘మూంద్రమ్ పిరై’ మాతృక. ‘సద్మా’ పేరుతో వచ్చిన హిందీ రీమేక్‌లోనూ శ్రీదేవి నటనకు అభిమానులు ఫిదా అయ్యారు. 1992లో వచ్చిన ‘మిస్టర్ ఇండియా’ చిత్రకథ అనిల్ కపూర్, అమ్రిశ్‌పురి చుట్టూ తిరిగేదే అయినా ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్టుగా సీమా పాత్రలో శ్రీదేవి కథనాన్ని రక్తికట్టించారు. ‘ముగాంబో’ నుంచి దేశాన్ని కాపాడే బాధ్యతలో ఓ వైపు సీరియస్ పాత్ర పోషిస్తూనే ‘మిస్టర్ ఇండియా’తో ప్రేమలో పడి చలాకీ యువతిగా చలాకీ రోల్‌తో తనదైన ముద్రవేశారు. వర్షం పాట ‘కాటేనహీ కట్‌తే యే దిన్ యేరాత్’లో సీమాగా తన ‘అదృశ్య ప్రియుడి’తో ఆమె పండించిన రొమాన్స్ నభూతో.. అన్నట్టుగానే ఉంటుంది. అదే ఏడాది వచ్చిన ‘ఖుదాగవా’ చిత్రం శ్రీదేవీ నటనా వైదుష్యానికి ప్రతీకగా నిలిచింది. ఆ చిత్రంలో తల్లీకూతుళ్లుగా వైవిధ్యమైన పాత్రలతో చిత్రానికి ప్రాణం పోసింది. అఫ్ఘానిస్థాన్ నేపథ్యంతో సాగే కథలో భర్త బాద్షాఖాన్ (అమితాబ్)కు దూరమై ‘వో ఆయేగా’ అంటూ దీనంగా ఎదురుచూసే వయసు మళ్లిన ‘బేనజీర్’ పాత్ర ఆమెకు గొప్ప పేరు తెచ్చిపెట్టింది. అలాగే లమ్హేలో పల్లవి, పూజగా ద్విపాత్రాభినయంతో వైవిధ్యమైన నటనను ప్రదర్శించింది. కెరీర్ ద్వితీయార్థంలో వచ్చిన ఇంగ్లిష్ వింగ్లిష్, మామ్ చిత్రాలూ ఆమెకు మునుపటి స్థాయిలోనే పేరు తెచ్చిపెట్టాయి. ఇంగ్లిషు సరిగా రాదంటూ భర్త, పిల్లలు ఆటపట్టిస్తుంటే వారికి తెలియకుండా పట్టుదలతో ఇంగ్లిషు నేర్చుకునే శశి పాత్రలో శ్రీదేవి ఔరా అనిపించుకున్నారు. న్యూయార్క్ టుటోరియల్‌లో ఆంగ్లభాష నేర్చుకునే క్రమంలో ఆమె తడబాటు, దాన్ని అధిగమిస్తూ ట్యూటర్ అబ్బురపడేలా సంధించే ప్రశ్నలు, మిగతా మిత్రులతో ఆమె సంభాషణల దృశ్యాలు కట్టిపడేస్తాయి.

తల్లి మాట కోసమే ‘దేవరాగం’లో: లలిత

తిరువనంతపురం, ఫిబ్రవరి 25: “అప్పుడు శ్రీదేవికి మూడున్నరేళ్ల వయసు.. కెమెరా అంటే ఏంటో తెలీదు.. ప్రముఖ దర్శకుడు భరతన్ ఒక సబ్బు ప్రకటన కోసం కృష్ణుడి వేషంలో ఉన్న శ్రీదేవి ఫొటో తీసుకున్నారు. ఆ తర్వాత ఏళ్లు గడిచిపోయాయి. శ్రీదేవి సినిమాల్లో అత్యున్నత దశలో ఉన్నారు. ఆ సమయంలో భరతన్ దేవరాగం సినిమా కోసం శ్రీదేవిని నటించాలని కోరడానికి ఆమె ఇంటికి వచ్చారు. శ్రీదేవి తల్లి రాజేశ్వరి.. భరతన్‌కు మాటిచ్చారు. ఆ సమయంలోనే అనారోగ్య బారిన పడి శస్త్రచికిత్స కోసం అమెరికా వెళ్లారు. ఆ క్లిష్ట సమయంలోనూ తల్లి మాటను నిలబెట్టడానికి దేవరాగంలో శ్రీదేవి నటించారు” అని భరతన్ భార్య కేపీఏసీ లలిత గుర్తు చేసుకున్నారు.

కామరాజర్ వల్లే సినీ ప్రవేశం

చెన్నై, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): శ్రీదేవి బాలనటిగా సినీరంగంలో ప్రవేశించటానికి దివంగత మాజీ ముఖ్యమంత్రి కామరాజ నాడార్ కారణమయ్యారు. శ్రీదేవి తండ్రి అయ్యప్పన్, ఆయన స్నేహితుడు బాలు నాయక్కర్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు. ఓరోజు నాలుగేళ్ల శ్రీదేవిని ఆమె తండ్రి కామరాజర్ వద్దకు తీసుకెళ్లారు. కామరాజర్.. ఈ బాలిక సినిమాల్లో నటిస్తే బాగుంటుందని చెప్పారు. తమిళ సినీ గేయ రచయిత కన్నదాసన్‌కు కబురు చేసి సిఫారసు చేయమన్నారు. ఆయన శ్రీదేవిని నిర్మాత చిన్నప్పదేవర్‌కు పరిచయం చేశారు. తాను తీస్తున్న ‘తునైవన్’ చిత్రంలో బాల కుమారస్వామి (మురుగన్) పాత్రలో నటించేందుకు తగిన బాలిక కోసం అన్వేషిస్తున్న ఆయన.. శ్రీదేవిని చూడగానే ఎంపిక చేశారు.

మూడు భాషల్లో పదహారేళ్ల వయసు



సూపర్ డూపర్ బ్లాక్ బస్టర్ ‘పదహారేళ్ల వయసు’ సినిమాను మూడు భాషల్లో తీస్తే.. అన్నిటిలోనూ శ్రీదేవే హీరోయిన్. తొలుత ఈ సినిమాను తమిళంలో ‘16 వయదినిలే’ పేరిట తీశారు. అందులో కమలహాసన్‌తో శ్రీదేవి నటించారు. విషాదాంతమైన దీని క్లైమాక్స్‌ను సుఖాంతం చేస్తూ తెలుగులో ‘పదహారేళ్ల వయసు’ పేరిట రాఘవేంద్రరావు తీశారు. ఇందులో శ్రీదేవి చంద్రమోహన్‌తో కలిసి ఆడి పాడారు. ఇక ఇదే సినిమాను హిందీలో ‘సోల్వా సావన్’ పేరిట చిత్రీకరించారు. అందులో అమోల్ పాలేకర్‌తో రొమాన్స్ చేశారు. అలాగే, తెలుగులో శోభన్‌బాబుతో కలిసి ‘దేవత’ సినిమాలో నటించిన శ్రీదేవి.. హిందీలో ‘హిమ్మత్‌వాలా’లోనూ అదే పాత్రలో నటించారు.

తల్లి ఆమే.. మనవరాలు ఆమే.. ప్రేయసీ ఆమే!

ఒకే హీరోతో ఇటు మనవరాలిగా అటు ప్రేయసిగా నటించడం అంటే మాటలా!? మరో హీరోకు తల్లిగా భార్యగా నటించడమంటే!? ఇటువంటి ఎన్నో విభిన్న పాత్రలు పోషించిన ఘనత శ్రీదేవిదే. 1976లో వచ్చిన తమిళ చిత్రం ‘మూంద్రు ముడిచ్చు’లో నటించేటప్పటికి శ్రీదేవి వయసు 13 ఏళ్లే. ఆ చిత్రంలో రజనీకాంత్‌కు ఆమె సవతి తల్లిగా నటించారు. ఆ తర్వాత 1989లో వచ్చిన హిందీ చిత్రం ‘చాల్‌బాజ్’లో రజనీ సరసన ఆమె హీరోయిన్‌గా ఆడి పాడారు. ఇక, ‘బడి పంతులు’ సినిమాలో ఎన్టీఆర్‌కు శ్రీదేవి మనవరాలిగా నటించారు. ఆ తర్వాత ఎన్టీఆర్‌తో శ్రీదేవి చేసిన రొమాన్స్ ఓ తరానికి గిలిగింతలు పెట్టింది. వేటగాడు సినిమాలో వానపాట ‘ఆకుచాటు పిందె తడిసె’ యువ హృదయాల్లో సృష్టించిన విధ్వంసం అంతా ఇంతా కాదు. బొబ్బిలి పులి, సర్దార్ పాపారాయుడు, జస్టిస్ చౌదరి, అనురాగ దేవత, గజ దొంగ, కొండవీటి సింహం తదితర చిత్రాల్లో శ్రీదేవి నటన అసామాన్యం. నిజానికి, బాలనటి నుంచి మూడు దశాబ్దాలకు పైగా కెరీర్ ఉండడమే విభిన్న పాత్రలకు కారణం.







● తండ్రీకొడుకులతో రొమాన్స్!

తెలుగులోనూ హిందీలోనూ కూడా తండ్రీ కొడుకులతో నటించిన ఘనత శ్రీదేవికి దక్కుతుంది. తెలుగులో అక్కినేని నాగేశ్వరరావుతో ఆరు సినిమాల్లో నటించిన శ్రీదేవి.. ఆ తర్వాత నాగార్జునతోనూ ఐదు చిత్రాల్లో నటించారు. హిందీలోనూ తండ్రీకొడుకులు ధర్మేంద్ర, సన్నీ డియోల్‌తో ఆమె నటించింది. వాస్తవానికి, హీరోయిన్ల కెరీర్ పరిమిత కాలమే. ఇప్పుడైతే ఐదారేళ్ల లోపునకు పరిమితమైంది. కానీ గతంలో 10-15 ఏళ్లు ఉండేది. దాంతో ఒక తరంతో నటించడమే ఎక్కువ. కానీ, బాలనటి నుంచి ‘మామ్’ వరకూ శ్రీదేవి కెరీర్ 35 ఏళ్లు. దాంతో తండ్రీకొడుకులతో పనిచేసే అవకాశం ఆమెకు దక్కింది. అక్కినేనితో ఆమె ‘ముద్దుల మొగుడు, శ్రీరంగనీతులు, బంగారు కానుక, ప్రేమ కానుక, ప్రేమాభిషేకం, సత్యం-శివం’ సినిమాల్లో ఆడిపాడారు. ఆ తర్వాత నాగార్జునతో తెలుగులో ‘ఆఖరి పోరాటం, గోవిందా గోవిందా’ సినిమాల్లో రొమాన్స్ చేశారు. ఆయనతోనే హిందీలో ‘ఖుదాగవా, గ్రేట్ రాబరీ, మిస్టర్ బేచారా’ సినిమాలు చేశారు. ఇక బాలీవుడ్‌లో ధర్మేంద్రతో ‘ఫరిస్తే, నాకాబందీ, సోనే పె సుహాగ్, వతన్ కే రఖ్‌వాలే, సుల్తానత్, జానీదోస్త్’ సినిమాలు చేస్తే.. ఆయన కొడుకు సన్నీ డియోల్‌తో ‘చాల్‌బాజ్, నగీనా, జోషిలాయె, మే తెరా దుష్మన్, రామావతార్, సుల్తానత్’ సినిమాల్లో నటించారు.



ముందే రాలిన తారలు!

అతిలోకసుందరి శ్రీదేవి మాత్రమే కాదు...వెండితెరపై తమ అందచందాలు, నటనతో ఆకట్టుకున్న ఎంతో మంది హీరోయిన్లు చిన్న వయస్సులోనే తనువు చాలించారు. కారణాలేవైనా..వారిని తలచుకుంటే ఇప్పటికీ వారి లావణ్యం కళ్లముందు కదలాడుతుంది.



సావిత్రి

మహానటి, అందాలనటి ఇలా ఏం చెప్పినా తక్కువే అవుతుంది. అగ్రనటులు ఎన్టీఆర్, ఏఎన్ఆర్‌లకు దీటుగా నటించి, కళ్లతోనే హావభావాలు పలికించేది. దక్షిణాదిన వెండితెరపై ఒక వెలుగువెలిగినా..జీవిత చరమాంకంలో చాలా ఇబ్బంది పడింది. 47 ఏళ్ల వయస్సులో కన్నుమూసింది.



సౌందర్య

దక్షిణాదిలో టాప్ హీరోయిన్. హిందీతోపాటు దక్షిణాదిలోని అన్ని భాషల్లోనూ నటించింది. అందం, అభినయంతో తెలుగువారికి ఎంతో దగ్గరైంది. 32 ఏళ్ల వయస్సులో 2004లో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో చనిపోయింది.



దివ్యభారతి

టీనేజ్ వయస్సులోనే బాలీవుడ్, టాలీవుడ్‌లను షేక్ చేసింది. 14 ఏళ్లకు తెరంగేట్రం చేసినా..తన 16వ ఏట బొబ్బిలిరాజాతో తెలుగువారికి దగ్గరైంది. ముంబైలోని తన అపార్ట్‌మెంట్ బాల్కనీ నుంచి కింద పడి చనిపోయింది. అప్పటికి ఆమె వయస్సు 19 ఏళ్లు.



సిల్క్‌స్మిత:

హీరోయిన్‌గా కెరీర్ మొదలుపెట్టినా వ్యాంప్ పాత్రలతో పేరు తెచ్చుకుంది. సిల్క్‌స్మిత ఉంటే సినిమా హిట్ అనే పేరు వచ్చింది. ప్రత్యేకమైన డైలాగ్ డెలివరీతోనే వీక్షకులను కట్టిపడేసేది. 35 ఏళ్ల వయస్సులో ఆర్థిక ఇబ్బందులు తాళలేక చెన్నైలో ఆత్మహత్య చేసుకుంది. సిల్క్‌స్మిత జీవిత కథ ఆధారంగానే డర్టీపిక్చర్ తీశారు.

ఎనిమిదో ఏట.. తృటిలో తప్పిన ప్రాణాపాయం

అప్పుడు శ్రీదేవికి ఎనిమిదేళ్లుంటాయి. శోభన్‌బాబు 'నా తమ్ముడు సినిమాలో ఒక సీన్‌ను తీస్తున్నారు. శ్రీదేవి పరిగెత్తుకుంటూ రోడ్డు దాటే సీన్ అది. ఆ చిత్ర దర్శకుడు.. దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు తండ్రి కేఎస్ ప్రకాశరావు అయినప్పటికీ ఆ సీన్‌ను రాఘవేంద్రరావు డైరెక్ట్ చేశారు. అప్పటికి యువకుడైన ఆయన.. ఇంగ్లిష్ సినిమాల ప్రభావంతో సీన్ సహజంగా రావాలంటూ శ్రీదేవిని మద్రాస్ మౌంట్‌రోడ్‌లో నిజంగానే ట్రాఫిక్‌లో పరిగెత్తమన్నారు. ఇవతలివైపు నిలబడి.. తాను చేతిరుమాలు ఊపగానే పరుగెత్తుకుంటూ రావాలని సూచించారు. చిన్నపిల్ల కావడంతో అందులో ప్రమాదాన్ని ఆలోచించని శ్రీదేవి.. ఆయన కర్చీఫ్ ఊపగానే రోడ్డుకు అడ్డంగా పరిగెత్తేశారు. కన్నుమూసి తెరిచేలోపు.. ఒక కారు ఆమె కాలిని తాకి వెళ్లిపోయింది. శ్రీదేవి కింద పడిపోయింది. అదృష్టవశాత్తూ దెబ్బలు తగల్లేదు. అనంతర కాలంలో అదే రాఘవేంద్రరావుతో శ్రీదేవి 24 సినిమాలు చేసింది.



మధుబాల

మొగల్-ఏ-ఆజం, నీల్ కమల్ వంటి చిత్రాల పేరు చెబితే మధుబాల గురించి చర్చించకుండా ఉండలేరు. అప్పట్లో వెండితెర రారాణిగా గుర్తింపు పొందింది. మంచి నటిగా రాణిస్తున్న సమయంలోనే 36 ఏళ్ల వయస్సులో గుండె సంబంధ ఇబ్బందులతో కన్నుమూసింది.

ఆర్తి అగర్వాల్

పదహారేళ్లకే సినీ అరంగేట్రం చేసిన ఈ ముద్దుగుమ్మ తెలుగులో చాలా హిట్ చిత్రాల్లో నటించింది. బేరియాట్రిక్ సర్జరీ కోసం విదేశాలకు వెళ్లి..అక్కడ అనారోగ్యంతో 31 ఏళ్ల వయస్సులోనే మృతిచెందింది.



శ్రీదేవితో పోలికే అదృష్టం!

దివ్యభారతి ఒకనాటి మాట

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: ఎవరినైనా శ్రీదేవితో పోల్చితే గొప్ప అదృష్టంగా భావిస్తారు. ఒకానొక దశలో దివంగత దివ్యభారతిని శ్రీదేవితో పోల్చారట! దివ్యభారతి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఈ విషయాన్ని చెప్పారు. 'శ్రీదేవితో నన్ను పోల్చడం థ్రిల్ కలిగించింది. ఆమె గొప్ప అందగత్తె. నా కన్నా శ్రీదేవి ఎంతో అందంగా ఉంటారు' అని అన్నారు.



జియాఖాన్

మత్తెక్కించే నిషా కళ్లతో, సొగసైన సౌందర్యంతో ఆకట్టుకున్న నటి. సూపర్ స్టార్ అమితాబ్‌తోనే నిశ్శబ్ద్ సినిమాలో రొమాన్స్ చేసి ఔరా అనిపించింది. నిజ జీవితంలో ప్రేమ వ్యవహారం బెడిసి కొట్టడంతో 25 ఏళ్ల వయస్సులో ముంబైలో ఆత్మహత్య చేసుకుంది.

పుట్టిన రోజంటే అసహ్యం!



పుట్టిన రోజంటే అందరికీ పండుగ రోజు! దానిని ఎంతో ఉత్సాహంగా, ఉల్లాసంగా వేడుకగా జరుపుకోవడానికి ఆరాటపడతారు. సినీ నటులంటే చెప్పాల్సిందేమీ లేదు. అరవై ఏళ్లు వచ్చినా ఎంతో ఆర్భాటంగా పుట్టిన రోజులను జరుపుకొంటారు. కానీ, అందాల నటి శ్రీదేవికి మాత్రం పుట్టిన రోజు జరుపుకోవడమంటే అసహ్యమట. ఓ సందర్భంలో ఆమెనే ఈ విషయాన్ని స్పష్టం చేశారు.



పర్వీన్ బాబీ

బాలీవుడ్ మార్లిన్ మన్రో ఎవరంటే ఇప్పటికీ పర్వీన్ బాబీ పేరు చెబుతారంటే అతిశయోక్తి కాదు. అమర్ అక్బర్ ఆంటోని, దీవార్, క్రాంతి, షాన్ వంటి సినిమాల్లో పర్వీన్ నటనకు వీక్షకులు ఫిదా అయ్యారు. కొన్నాళ్లు మానసిక సమస్యలతో ఇబ్బంది పడిన ఆమె 55 ఏళ్ల వయస్సులో ఆత్మహత్య చేసుకుంది.

మీనాకుమారి

బాలీవుడ్‌లో ఫిమేల్ గురుదత్‌గా పేరు తెచ్చుకున్న నటి. విషాద పాత్రల్లో ఒదిగిపోయేది. నిజ జీవితం కూడా అలాగే సాగింది. తను నటించిన పాకీజా చిత్రం విడుదలైన మూడు వారాల తర్వాత తీవ్ర అనారోగ్యంతో 38 ఏళ్ల వయస్సులోనే మృతిచెందింది.



స్మితా పాటిల్

80వ దశకంలో బాలీవుడ్‌లో ఒక వెలుగు వెలిగిన తార. ప్రముఖ నటుడు రాజ్‌బబ్బర్‌ను పెళ్లి చేసుకుంది. మధ్యతరగతి మహిళలకు దగ్గరగా సినిమాల్లో ఆమె నటన ఉండేది. అనారోగ్య సమస్యలతో 31 ఏళ్ల వయస్సులోనే కన్నుమూసింది.



కత్తి దూసిన అందం!



పాతికేళ్ల కిందటి 'జగదేక వీరుడు... అతిలోక సుందరి' చిత్రంలో శ్రీదేవి అందాల సురకన్యగా నటించింది. అందులో ఇంద్రజగా ఆమె యవ్వనం శాశ్వతం. తర్వాత పాతికేళ్లు గడిచిపోయాక కూడా ఆమె వయస్సు అక్కడే నిలిచిపోయింది. కాలంతోపాటు కరిగిపోని యవ్వనం సొంతం చేసుకుంది. ఈ క్రమంలో ఆమె అనేక ఆపరేషన్లు చేయించుకుందనేది కాదనలేని వాస్తవం. అందాన్ని శాశ్వతం చేసుకోవాలన్న ఆరాటం ప్రాంతాలకు అతీతంగా సినీ జగత్తుకు మొత్తానికి ఉంది. శ్రీదేవి మరణానికి సౌందర్య సాధన ఆపరేషన్లకు సంబంధం లేకపోయినా ఆమె హఠాన్మరణం తర్వాత కాస్మెటిక్ సర్జరీ ఒక్కసారిగా దేశమంతటా చర్చనీయాంశమైంది.

కాస్మెటిక్ సర్జరీ వ్యక్తిగత విషయం. కానీ, దేశంలో అందం కోసం ఆపరేషన్లకు వెళుతున్న నటీనటుల జాబితా ఆందోళన కలిగించేదే. సౌందర్య పరిశ్రమ డిమాండ్లు వారిని అసాధ్యమైన కొలతలను సాధించుకొనేందుకు అడ్డదారి తొక్కేట్లు చేస్తున్నాయి. చివరకు సాధారణ ప్రపంచంలో మహిళలను కూడా ఆత్మన్యూనతా భావంతో సౌందర్య ఆపరేషన్లకు వెళ్లేట్లు చేస్తోంది. శ్రీదేవి ముక్కు మార్పిడి ఆపరేషన్ ఒకప్పుడు దేశమంతా చర్చనీయాంశమైంది. కరీనాకపూర్ సైజ్ జీరో కూడా అంతే సంచలనం సృష్టించింది. అనూష్క శర్మ పెదాలను దొండపండులా మార్చుకోవడం కూడా అంతే సంచలనమైంది.

తారలంతా అదే దారి

బొద్దుగా ఉండే కరీనా కపూర్ 2009లో జీరో సైజ్ పేరుతో నాజూకుగా మారడం దేశమంతటా చర్చనీయాంశమైంది. పత్రికల నిండా సైజ్ జీరో కబుర్లే. 27 ఏళ్ల వయస్సులో తాను ఒక పాత్ర కోసం సన్నబడ్డానని, దాన్ని ఇంత పెద్ద అంశం చేస్తారని అనుకోలేదని కరీనా వాపోయారు. బాంబే వెల్వెట్ సినిమా కోసం పెదాలు పొంగేట్లు చేసుకున్న అనుష్క శర్మ ఇటీవల ఇంటర్వ్యూలో పెదాలకు బొటాక్స్ ఇంజక్షన్ చేయించుకున్నట్లు వెల్లడించారు. శ్రీదేవితోపాటు కరిష్మా కపూర్, కంగన, ప్రియాంక చోప్రా, శిల్పాశెట్టి, శ్రుతిహాసన్... వీరంతా ముక్కు సరి చేయించుకున్న వాళ్లే. ఈ విషయంలో సినీ తారలకు స్ఫూర్తి మైఖేల్ జాక్సనే. ఆయన మొహంలోని ప్రతీ అంగుళం సర్జరీ చేయించుకున్నారు. కాస్మటిక్ సర్జరీలు ప్రయోగదశలో ఉన్నప్పుడే ఆయన తనపై ప్రయోగాలు చేసుకున్నారు. ప్రాణాలను రిస్క్‌లో పెట్టుకున్నారు. 1990ల్లో ఆయనకు సర్జరీలు చేసిన వైద్యుడు 2009లో ఒక పత్రికకు ఇంటర్వ్యూ ఇస్తూ రెండేళ్ల వ్యవధిలో మైఖేల్ జాక్సన్ 12 సర్జరీలు చేయించుకున్నట్లు వెల్లడించారు. నిజానికి అవన్నీ అక్కర్లేని ఆపరేషన్లేనని చెప్పారు. ఆయనే ఒత్తిడి చేయడంతో మార్పులు చేయక తప్పలేదన్నారు. భారతీయుల్లో తెల్లదనం పిచ్చి ఎలా ఉంటుందో చెప్పనక్కర్లేదు. బాలీవుడ్ డ్రీమ్‌గర్ల్ హేమమాలిని అందమైన చర్మం కోసం ప్రత్యేక చికిత్సలు చేయించుకుంది. కాజోల్ కూడా చర్మంలో నల్లదనం తగ్గేందుకు మెలనిన్ చికిత్స చేయించుకుంది.



మార్పు మొదలైంది

రూపలావణ్యం ముఖ్యం కాదనే ధోరణి క్రమంగా భారతీయుల్లో పెరుగుతోంది. 2013లో నటి నందితాదాస్ నల్లదనం కూడా అందమేనని ప్రచారం మొదలెట్టారు. మచ్చలేని అందం కోసం ఆరాటపడటం అత్యంత ప్రమాదకరమని బాలీవుడ్ నటి సోనమ్‌కపూర్ అన్నారు. అది ఖర్చుతో కూడుకొన్నదే కాకుండా ఎప్పటికైనా మన ఆశల్ని కుప్ప కూల్చేదేనని చెప్పారు.

దుబాయిలో మరణిస్తే..

విధి విధానాలు పాటించడం తప్పనిసరి.. సెలబ్రిటీలైనా సామాన్యులైనా ఒకటే

శ్రీదేవి దుబాయ్‌లో మరణించారు! ఆమె పార్థివ దేహం ఎప్పుడెప్పుడు వస్తుందా అని భారత్‌లోని ఆమె కుటుంబ సభ్యులతోపాటు అభిమానులంతా ఎదురు చూస్తున్నారు! శ్రీదేవి పార్థివ దేహాన్ని సత్వరమే పంపించాలంటూ భారత్‌లోని అత్యున్నత స్థాయి వర్గాలు దుబాయ్ అధికార వర్గాలకు ఫోన్ల మీద ఫోన్లు చేశాయి! పలువురు పెద్దలు నేరుగా రంగంలోకి దిగారు. కానీ, శనివారం రాత్రి మరణించిన శ్రీదేవి భౌతిక కాయం సోమవారం కానీ భారత్ వచ్చే అవకాశాల్లేవు! అత్యున్నత స్థాయి వర్గాలు జోక్యం చేసుకున్నా ఫలితం లేకపోయింది. ఇందుకు కారణం.. దుబాయ్‌లోని చట్టాలే! అక్కడి చట్టాలు.. విదేశీ ఎంబసీలు, ప్రభుత్వాల ప్రభావంతో పని చేయవు. నిబంధనల ప్రకారమే పని చేస్తాయి. శ్రీదేవి విషయంలో ఇది మరోసారి రుజువైంది.

పోస్టుమార్టం, పరీక్షల తర్వాతే అప్పగింత

శ్రీదేవి భౌతిక కాయం అందుకే ఆలస్యం

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

దుబాయ్ నుంచి తెలుగు రాష్ట్రాలకు తరలించే వందలాది మృతదేహాలను అల్ ఖుసేస్‌లోని పోలీసు మార్చురీలోనే భద్రపరుస్తారు. సెలబ్రిటీ అయిన శ్రీదేవి భౌతిక కాయాన్ని కూడా అక్కడే భద్రపరిచారు. ఫోరెన్సిక్ పరీక్షలు పూర్తయిన తర్వాతే ఆమె పార్థివ దేహాన్ని అప్పగిస్తామని అక్కడి పోలీసులు తేల్చి చెప్పారు. పోస్టుమార్టం, ఇతర వైద్య పరీక్షలు పూర్తయ్యే సరికే కార్యాలయ పని వేళలు ముగిశాయి. దాంతో, పరీక్ష నివేదికలను పూర్తిగా అధ్యయనం చేయనిదే తుది నివేదికను జారీ చేయలేనని వాటిని నిర్వహించిన డాక్టర్ ఖాలీద్ అల్ అబురైఖీ స్పష్టం చేశారు. డాక్టర్ల నివేదిక రాకుండా మృతదేహాన్ని తాము అప్పగించలేమని పోలీసులు చెప్పారు. సోమవారం ఉదయం వైద్య నివేదికలు అందిన తర్వాత మరణ ధ్రువీకరణ పత్రం జారీ చేస్తారని, ఆ తర్వాతే పోలీసు క్లియరెన్స్ లభిస్తుందని తెలుస్తోంది. అనంతరం దుబాయిలోని భారతీయ కాన్సులేటు శ్రీదేవి పాస్ పోర్టును రద్దు చేసి మరణ సర్టిఫికెట్‌ను జారీ చేస్తుంది. ఆమె మృతదేహన్ని భారత్‌కు తీసుకెళ్లడానికి ఎన్‌వోసీ జారీ చేస్తుంది.



విధి విధానాలు ఇవీ!

మరణం ఎలా సంభవించినా (సహజం, ప్రమాదం, అనుమానాస్పదం) పోలీసులకు తప్పకుండా సమాచారం ఇవ్వాలి. ఆస్పత్రుల్లో చనిపోతే అవే తెలుపుతాయి. బయట ఎక్కడ జరిగినా 999 నంబరుకు ఫోన్ చేసి తెలపాలి. పోలీసులు వచ్చి బలాఖ్ అల్ వఫాత్ (మరణ సమాచారాన్ని)ను నమోదు చేసి, మృతదేహాన్ని అల్ రాషేద్ ఆస్పత్రి లేదా అల్ ఖుసేస్ మార్చురీకి తరలిస్తారు. చికిత్స పొందుతూ మరణిస్తే ఆస్పత్రుల మార్చురీలో భద్రపరుస్తారు. ఫోరెనిక్స్ నిపుణులు మృతదేహాన్ని పరీక్షిస్తారు. అనేక సందర్భాల్లో పోస్టుమార్టం చేస్తారు. ఆ తర్వాత మరణానికి కారణాలను విశ్లేషిస్తూ నివేదిక జారీ చేస్తారు. మృతుల పాస్ పోర్టు, వీసా పరిశీలించి పోలీసులు ధ్రువీకరిస్తారు. ధ్రువీకరణను పోలీసులకు అందిస్తే, వారు మృతదేహాలను అప్పగించాలని నాలుగు పత్రాలను ఆస్పత్రి, ఎయిర్‌లైన్స్, మృతదేహాన్ని రసాయనాలతో ప్యాకింగ్ (ఎంబాలింగ్) చేసే విభాగం, విమానాశ్రయం లేదా శ్మశాన వాటికకు జారీ చేస్తారు. వాటిని ఆస్పత్రిలో అందిస్తే, అది మరణ ధ్రువీకరణను అరబ్బీ భాషలో జారీ చేస్తుంది. దానిని వీసా వ్యవహారాల కార్యాలయంలో అందిస్తే వీసా రద్దు చేస్తారు. అరబ్బీ భాషలో ఉండే ఆ కాగితాలను ప్రధానంగా మరణ ధ్రువీకరణను ఆంగ్లంలోకి అనువాదించి భారతీయ కాన్సులేట్‌కు ఇస్తారు. పాస్‌పోర్టు సహా మొత్తం అన్ని డాక్యుమెంట్లను సమర్పిస్తే కాన్సులేట్ ఎన్వోసీ జారీ చేస్తుంది. ఇందుకు మృతుల బంధువులు స్టాంప్ పేపర్‌పై నోటరీ అఫిడవిట్ పంపించాలి.

మృతులకు అంటువ్యాధులు ఉన్నట్లు తేలితే ఎన్వోసీ జారీకి ఇబ్బందులు ఎదురవుతాయి. అలాగని, దుబాయిలో అంత్యక్రియలు జరపడం కూడా అంత తేలిక కాదు. చివరకు, అన్ని పత్రాలనూ తీసుకెళ్లి అల్ మోహైసనా కేంద్రానికి వెళ్ళి అందజేసి, 1750 దిర్హాంలు (సుమారు రూ.31 వేలు) చెల్లిస్తే ఎంబాలింగ్ చేస్తారు. మార్చురీలో చట్టబద్ధ వీసా ఉన్నవాళ్లు సాక్షి సంతకం చేస్తే మృతదేహాన్ని అల్ మోహైసనాకు తరలిస్తారు.

ప్యాకింగ్ తర్వాత 210 దిర్హాం (రూ.3700)లు అద్దె తీసుకొని ప్రత్యేక వాహనంలో దుబాయి విమానాశ్రయం కార్గో విభాగానికి తీసుకెళ్లి, అక్కడ కొన్ని గంటలపాటు పెట్టిన తర్వాత విమానంలో ఎక్కిస్తారు. దుబాయిలో ఎవరైనా మరణిస్తే సహాయం కోసం భారతీయ వలంటీర్లు సీపీ మాథ్యూను 00971553090506, పాడే ఉమాలను 00971504675876 నంబర్లలో సంప్రదించవచ్చు.

హువే 5జి మోడమ్ ఆవిష్కరణ



బార్సెలోనా (స్పెయిన్): చైనాకు చెందిన హువే ప్రపంచంలోనే తొలి కమర్షియల్ 5జి మోడమ్‌ను ఆవిష్కరించింది. ఇది సెకనుకు 2,000 మెగాబిట్‌ల (ఎంబిపిఎస్) వేగాన్ని అందిస్తుందని కంపెనీ తెలిపింది. "హువే బలాంగ్ 5జి01 ప్రపంచంలోనే తొలి 3జిపిపి 5జి కమర్షియల్ చిప్‌సెట్. దీని గరిష్ఠ వేగం 2.3జిబిపిఎస్ (సెకనుకు గిగాబిట్) ఉంది" అని హువే సిఇఒ (కన్స్యూమర్ బిజినెస్ గ్రూప్) రిచర్డ్ యు తెలిపారు. ప్రస్తుతం భారత్‌లో రిలయన్స్ జియో సగటున సెకనుకు 21 మెగాబిట్ వేగంతో వైర్‌లెస్ బ్రాడ్‌బ్యాండ్‌ను అందిస్తోంది. ఫిక్స్‌డ్ బ్రాడ్‌బ్యాండ్ సర్వీసులు అందిస్తున్న స్పెక్ట్రా 1జిబిపిఎస్ వేగాన్ని ఆఫర్ చేస్తోంది.

నీరవ్ విదేశీ ఆస్తులపై ఇడి ఆరా

మెహుల్ చోక్సీ అసెట్స్‌పైనా కన్ను.. డజనుకుపైగా దేశాలను వివరాలు కోరనున్న ఏజెన్సీ



ముంబై/న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి)లో వెలుగుచూసిన రూ.11,400 కోట్ల ఘరానా మోసానికి సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) దర్యాప్తును విస్తృతం చేయనుంది. ఈ కేసులో ప్రధాన నిందితులైన వజ్రాభరణాల డిజైనర్ నీరవ్ మోదీ, గీతాంజలి జెమ్స్ యజమాని మెహుల్ చోక్సీలకు విదేశాల్లోని ఆస్తులపై ఆరా తీయనుంది. ఇందుకోసం డజనుకు పైగా దేశాల నుంచి వివరాలు కోరనుంది. ఇందుకు సంబంధించి లెటర్ రెగొటరీస్ (ఎల్‌ఆర్) జారీ చేయాలని కోరుతూ దర్యాప్తు ఏజెన్సీ ముంబై కోర్టును ఆశ్రయించనున్నట్లు అధికారిక వర్గాలు తెలిపాయి.

పిఎన్‌బి స్కాం ఎఫెక్ట్!

నీరవ్ మోదీ, చోక్సీలకు చెందిన సంస్థలు 15-17 దేశాలకు విస్తరించినట్లుగా ఇడి గుర్తించింది. వీరిద్దరి ఆస్తుల వివరాలు కోరుతూ ఆ దేశాలకు ఏజెన్సీ ఎల్‌ఆర్‌లను పంపనుంది. బెల్జియం, హాంకాంగ్, స్విట్జర్లాండ్, అమెరికా, బ్రిటన్, దుబాయ్, సింగపూర్, దక్షిణాఫ్రికాతో పాటు పలు దేశాలకు ఈ ఎల్‌ఆర్‌లను పంపనున్నట్లు తెలుస్తున్నది. పిఎన్‌బి 2011లో జరిపిన ఆడిట్ నివేదికలను సమర్పించాలని ఆర్‌బిఐని కూడా ఇడి కోరింది.

అవసరమైతే విదేశీ ఆస్తుల జప్తు!

మోదీ, చోక్సీల విదేశీ ఆస్తులు, వాటి మూలాలపై ఇడి దర్యాప్తు చేయనుంది. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలతో వీరు విదేశాల్లో ఆస్తులను కూడబెట్టినట్లు దర్యాప్తులో తేలితే మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్‌ఎ) కింద వాటిని సైతం ఏజెన్సీ జప్తు చేయనుంది. ఈ కేసులో ఇడి ఇప్పటివరకు రూ.6,393 కోట్లకు పైగా ఆస్తులను అటాచ్ చేసింది.

మోదీ, ఆయన భార్యకు ఇడి సమన్లు

నీరవ్ మోదీ, ఆయన భార్య అమీ, మెహుల్ చోక్సీలకు ఇడి ఇప్పటికే సమన్లు జారీ చేసింది. ముంబైలోని తమ జోనల్ కార్యాలయంలో హాజరు కావాలని వారిని ఆదేశించింది. ఒకవేళ వారు ఈ సమన్లను బేఖాతరు చేస్తే గనుక, ప్రత్యేక పిఎంఎల్‌ఎ కోర్టును ఆశ్రయించి వారికి వ్యతిరేకంగా నాన్ బెయిలబుల్ వారంట్లు జారీ చేయాలని ఏజెన్సీ కోరనున్నట్లు సమాచారం.

మీరూ రుణాలిచ్చారా..?

పిఎన్‌బికి వేల కోట్లకు కుచ్చుటోపీ పెట్టిన నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీలకు మీరేమైనా రుణాలిచ్చారా..? అని మొత్తం 16 బ్యాంకులకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) లేఖలు రాసింది. వీరిద్దరికి ఇచ్చిన రుణాలపై పూర్తి వివరాలివ్వాలని బ్యాంకులను కోరింది. ఈ బ్యాంకు లన్నింటి నుంచి వివరాలు అందిన తర్వాత నీరవ్ మోదీ ఘరానా మోసం విలువ రూ.20 వేల కోట్లు దాటవచ్చని కొందరు అంచనా వేస్తున్నారు. మొత్తంగా డజనుకుపైగా బ్యాంకులు నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీలకు రుణాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ రుణాల విలువ రూ.5,000-10,000 కోట్ల స్థాయిలో ఉండే అవకాశం ఉంది. ఇక మెహుల్ చోక్సీకి చెందిన కంపెనీలకు 37 బ్యాంకులు రూ.3 వేల కోట్ల స్థాయిలో రుణాలిచ్చాయి. మోదీ కంపెనీలకు సైతం 17 బ్యాంకులు అంతే మొత్తంలో రుణాలిచ్చాయి.

పిఎన్‌బి ఇడిపై కొనసాగిన సిబిఐ విచారణ

నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీలకు ఇచ్చిన వేల కోట్ల రుణాలకు సంబంధించి పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఇడి) బ్రహ్మాజీ రావును సిబిఐ వరుసగా రెండోరోజూ విచారించింది. 35 ఏళ్ల క్రితం విజయా బ్యాంక్‌లో ప్రొబేషనరీ ఆఫీసర్‌గా తన ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించిన రావు.. పిఎన్‌బిలో ముంబై జోన్‌ను పర్యవేక్షక బాధ్యతలు చేపట్టిన అధికారుల్లో ఒకరు. ముంబై జోన్ బ్రాంచీలోనే ఈ ఘరానా మోసం జరిగింది. ఈ కేసుకు సంబంధించి రావుతో పాటు ఇతర అధికారులను కూడా సిబిఐ ప్రశ్నించింది. వారిని దోషులుగా పరిగణించడంలేదుకానీ ఈ మోసం ఎలా జరిగింది, దాన్ని బ్యాంకెలా గుర్తించింది, బ్యాంకింగ్ ప్రక్రియలో విధానపరమైన ఇబ్బందులు, అతిక్రమణలకు సంబంధించి పూర్తి అవగాహనకు వచ్చేందుకు వీరిని ఏజెన్సీ అధికారులు విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

త్వరితగతిన విచారణకు ఐసిఎఐ హామీ

పిఎన్‌బి కుంభకోణంలో ఆడిటర్ల పాత్ర కూడా ఉందన్న ఆరోపణలపై ఐసిఎఐ (ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా) కూడా విచారణ జరుపుతోంది. బ్యాంకు సీనియర్ అధికారుల నుంచి స్టేట్‌మెంట్‌లను సేకరించినట్లు, త్వరితగతిన విచారణ పూర్తి చేస్తామని ఐసిఎఐ హామీ ఇచ్చింది. పిఎన్‌బి, గీతాంజలి జెమ్స్‌కు చెందిన ఆడిటర్లకు ఈ సంస్థ ఇప్పటికే షోకాజు నోటీసులు జారీ చేసింది. ఈ కేసులోని సమస్యాత్మక అంశాలపై అధ్యయనం చేసి పరిష్కార చర్యలను సూచించేందుకు ఉన్నత స్థాయి బృందాన్ని కూడా ఏర్పాటు చేసింది.

కార్పొరేట్లకు రుణాలివ్వడం ఆపొద్దు: ఇండస్ట్రీ

పిఎన్‌బి కుంభకోణం నేపథ్యంలో కార్పొ రేట్ సంస్థలకు రుణాలివ్వడం నిలిపి వేయ వద్దని పారిశ్రామిక వర్గాలు కోరాయి. రుణ వితరణ వృద్ధి పునరుద్ధరణ బాట పట్టడంతో పాటు దేశ ఆర్థిక వృద్ధి రేటు గరిష్ఠ స్థాయికి దూసుకెళ్లనున్న తరుణంలో కార్పొరేట్లకు రుణాలు నిలిపివేస్తే దేశానికెంతో నష్టమని వారు హెచ్చరించారు. ఆర్థిక మోసాలకు చెక్ పెట్టేందుకు పటిష్ఠమైన నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, బ్యాంకుల్లో అత్యున్నత కార్పొరేట్ పాలన ప్రమాణాలను అమలు చేయాలన్నారు. అంతేకాదు, ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో కేంద్రం తన వాటాను వీలైనంత త్వరగా 52 శాతానికి తగ్గించుకోవాలని వారు సూచించారు. ఆ తర్వాత వాటాను క్రమంగా 33 శాతానికి తగ్గించుకునేలా రోడ్‌మ్యాప్‌ను రూపొందించాలన్నారు.

మాపై ప్రభావం ఉండదు: సూరత్ వ్యాపారులు

పిఎన్‌బి స్కామ్ నేపథ్యంలో బ్యాంకులు రుణాల మంజూరు నిబంధనలను కఠినతరం చేసినా తమ వ్యాపారాలపై అంతగా ప్రభావం ఉండబోదని సూరత్ డైమండ్ ఇండస్ట్రీ ప్రతినిధులు ధీమా వ్యక్తం చేశారు. వజ్రాల కటింగ్, పాలిషింగ్ పనులు చేపట్టే ఎస్‌ఎంఇల నుంచి మున్ముందు బ్యాంకు రుణాలకు డిమాండ్ మరింత పెరగవచ్చన్నారు. సూరత్‌లో 6వేలకు పైగా డైమండ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఉన్నాయని, అందులో కేవలం 100 బడా సంస్థలు మాత్రమే బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుంటాయని జెమ్స్ అండ్ జువెలరీ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ (జిజెఇపిసి) రీజినల్ ఛైర్మన్ దినేష్ నవాడియా తెలిపారు. ఎస్‌ఎంఇలు ప్రైవేట్ రుణదాతలపైనే ప్రధానంగా ఆధారపడతాయన్నారు.

మోసం కొండంత.. కవరేజీ పిసరంత!

పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి)లో రూ.11,400 కోట్లు, ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ (ఒబిసి)లో రూ.390 కోట్లు.. ఇలా వరుసబెట్టి వెలుగు చూస్తున్న ఘరానా మోసాలు బ్యాంకింగ్ ఇండస్ట్రీని పునరాలోచనలో పడేశాయి. ఉద్యోగుల మోసాలతో వ్యాపారానికి నష్టం జరగకుండా బీమా కవరేజీ పెంచుకోవాలని బ్యాంకులు ఆలోచిస్తున్నాయి. వేలు, వందల కోట్లలో మోసాలు బయటికొస్తున్న నేపథ్యంలో కనీస నష్టపరిహార పాలసీ కంటే అధిక రిస్క్ కవరేజీ ఏర్పాటు చేసుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని ఓ ప్రభుత్వ రంగ బ్యాంక్‌కు చెందిన ఉన్నతాధికారి అభిప్రాయపడ్డారు. ఉద్యోగుల ప్రమేయమున్న మోసాల నుంచి బ్యాంకు ఆస్తులను కాపాడుకోవాలంటే అంతర్గత నిఘా, రిస్క్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను మరింత పటిష్ఠం చేయడంతోపాటు వీటి వల్ల ఆర్థికంగా నష్టపోకుండా ఉండేలా బీమా కవరేజీని పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పిఎన్‌బి కూడా కనీస నష్టపరిహార పాలసీ ప్రకారం.. ఉద్యోగుల మోసాల వల్ల కలిగే నష్టపోకుండా ఉండేందుకు కేవలం రూ.2 కోట్లకు బీమా కవరేజీ తీసుకుంది. కానీ నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ బ్యాంకు సిబ్బందితో కలిసి చేసిన రూ.11,400 కోట్ల మోసంతో పోలిస్తే బీమా కవరేజీ విలువ 0.2 శాతం మాత్రమే. ఒబిసికి చెందిన ఢిల్లీ శాఖకు ఓ వజ్రాల ఎగుమతి వ్యాపారి రూ.390 కోట్లకు కుచ్చుటోపీ పెట్టాడు. రోటోమాక్ పెన్నుల తయారీదారు విక్రమ్ కొఠారీ రూ.3,695 కోట్ల రుణాలు ఎగవేశాడు.

గడిచిన ఆర్థిక సంవత్సరం (2016-17)లో రూ.2,424.74 కోట్ల (మొత్తం 837 కేసులు) మోసాలు జరిగినట్లు దేశంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ అయిన ఎస్‌బిఐ ప్రకటించింది. అందులో రూ.2,360.37 కోట్ల (278 కేసులు) మోసాలు రుణాల మంజూరుకు సంబంధించినవి. అంతర్గత ఆడిటింగ్, రిస్క్ మేనేజ్‌మెంట్ వ్యవస్థపై నమ్మకంతో బ్యాంకులు పెద్ద మొత్తంలో బీమా కవరేజీ తీసుకునేందుకు ఆసక్తిగా లేవు. కానీ ఈ మధ్యకాలంలో వెలుగుచూసిన వరుస కుంభకోణాలు కవరేజీ పెంచుకునేలా బ్యాంకులపై ఒత్తిడి పెంచాయి. ఈమధ్య జరిగిన ఇండియన్ బ్యాంకర్స్ అసోసియేషన్ (ఐబిఎ) సమావేశంలోనూ ఈ విషయం చర్చకు వచ్చినట్లు బ్యాంక్ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు.

రూ.25,000 కోట్ల పబ్లిక్ ఆఫర్లు

నిధుల సమీకరణకు సిద్ధమవుతున్న డజనుకుపైగా కంపెనీలు



న్యూఢిల్లీ : తొలి పబ్లిక్ ఆఫర్ల (ఐపిఒ) హడావుడి మళ్లీ మొదలవుతోంది. రానున్న నెలల్లో డజనుకుపైగా కంపెనీలు ఐపిఒల ద్వారా 25,000 కోట్ల రూపాయల నిధులను సమీకరించేందుకు సిద్ధం అవుతున్నాయి. క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబికి సమర్పించిన ముసాయిదా పత్రాల ప్రకారం ఈ సంస్థలు తమ విస్తరణ ప్రాజెక్టులు, నిర్వహణ మూలధన అవసరాల కోసం ఈ నిధులను సేకరించనున్నాయి. ఈ కంపెనీల్లో హిందుస్తాన్ ఏరోనాటిక్స్, ఐసిఐసిఐ సెక్యూరిటీస్, భారత్ డైనమిక్స్, ఇండియన్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఎనర్జీ, బార్బిక్యూనేషన్ హాస్పిటాలిటీ, ఫ్లెమింగో ట్రావెల్ రిటైల్ వంటి కంపెనీలు ఉన్నాయి. వీటి పబ్లిక్ ఇష్యూలకు సెబి ఆమోదం తెలిపింది. రైట్స్, మిశ్రధాతు నిగమ్ లిమిటెడ్, బంధన్ బ్యాంక్, ఇండోస్టార్ క్యాపిటల్ ఫైనాన్స్, నజారా టెక్నాలజీస్, రూట్ మొబైల్ వంటి కంపెనీలు సెబి ఆమోదం కోసం ఎదురుచూస్తున్నాయి. ఈ కంపెనీల మొత్తంగా 25,000 రూపాయలు సమీకరించే అవకాశం ఉంటుందని మర్చంట్ బ్యాంకర్లు చెబుతున్నారు. న్యూజెన్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్, అంబర్ ఎంటర్‌ప్రైజెస్ ఇండియాతోపాటు మరో మూడు కంపెనీలు ఇప్పటికే క్యాపిటల్ మార్కెట్లోకి వచ్చాయి. సెకండరీ మార్కెట్ వాల్యూయేషన్ అధికంగా ఉన్న నేపథ్యంలో ఈ ఏడాదిలో పబ్లిక్ ఇష్యూల హడావుడి ఎక్కువగానే ఉంటుందని పరిశీలకులు అంటున్నారు. 2017 సంవత్సరంలో 36 కంపెనీలు పబ్లిక్ ఇష్యూల ద్వారా 67,000 కోట్ల రూపాయలు సమీకరించాయి. తమ బ్రాండ్ పేరును పెంచుకోవడానికి, పెట్టుబడులు పెట్టిన ఇన్వెస్టర్లు తమ వాటాను విక్రయించుకోవడానికి వీలుగా కొన్ని కంపెనీలు పబ్లిక్ ఇష్యూకు వస్తున్నాయి. రెగ్యులేటజరీపరంగా సానుకూల నియంత్రణ వాతావరణంతోపాటు ఇన్వెస్టర్ల సెంటిమెంట్ మెరుగ్గా ఉండటం వల్ల ఐపిఒ మార్కెట్ జోరుకు అవకాశం ఏర్పడుతోందని విశ్లేషకులు చెబుతున్నారు.

నేడు హిండ్‌కాన్ కెమ్ ఐపిఒ ప్రారంభం

కెమికల్ ఉత్పత్తుల తయారీ కంపెనీ హిండ్‌కాన్ కెమికల్స్ పబ్లిక్ ఇష్యూ సోమవారం నాడు ప్రారంభించనుంది. ఈ ఇష్యూ ద్వారా 7.73 కోట్ల రూపాయలు సమీకరించాలని కంపెనీ భావిస్తోంది. నిర్వహణ మూలధన అవసరాలు, కార్పొరేట్ అవసరాల కోసం ఇష్యూ ద్వారా వచ్చే నిధులను కంపెనీ వినియోగించుకోనుంది. 27,60,000 ఈక్విటీ షేర్లను పది రూపాయల ముఖ విలువతో కంపెనీ జారీ చేయనుంది. ఒక్కో షేరు నగదు ధర 28 రూపాయలుగా ఉంది. ఫిబ్రవరి 28న ఇష్యూ ముగుస్తుంది. 2016-17 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ 33.94 కోట్ల రూపాయల రాబడిని సాధించింది. ఇందులో 32.14 శాతం వాటా ఎగుమతి మార్కెట్లదే.

వచ్చే ఎంపిసి భేటీలో వడ్డీ రేట్ల పెంపు తప్పదు

- పొంచి ఉన్న ద్రవ్యోల్బణం ముప్పు
- మోర్గాన్ స్టాన్లీ

న్యూఢిల్లీ : త్వరలో వడ్డీ రేట్ల పెంపు తప్పక పోవచ్చనే అంచనాలు వినిపిస్తున్నాయి. వచ్చే పరపతి, ద్రవ్య సమావేశాల్లోనే ఆర్‌బిఐ ద్రవ్య విధాన కమిటీ (ఎంపిసి) దీనిపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అంతర్జాతీయ ఆర్థిక సేవల సంస్థ మోర్గాన్ స్టాన్లీ అంచనా వేసింది. ఈ మేరకు ఆదివారం ఒక పరిశోధనా నివేదిక విడుదల చేసింది. అయితే వడ్డీ రేట్ల పెంపు ద్రవ్యోల్బణంపై ఆధారపడి ఉంటుందని తెలిపింది. 'మా పరిశీలనతో పాటు ఫిబ్రవరి పరపతి, ద్రవ్యవిధాన సమీక్ష సందర్భంగా ఎంపిసి చేసిన వ్యాఖ్యలు చూస్తుంటే, ఇప్పటికిప్పుడు కాకపోయినా తదుపరి సమావేశంలో వడ్డీ రేట్లు పెంచుతారని భావిస్తున్నాం' అని ఆ నివేదికలో పేర్కొన్నారు. పెరుగుతున్న ముడి చమురు ధర, ఉత్పత్తి వ్యయాలు, దిగుమతి సుంకాలు పెరగడం, ఆహార ధాన్యాల మద్దతు ధర పెంచడం, ప్రభుత్వ ఉద్యోగుల హెచ్‌ఆర్‌ఎ నిదానంగా పెరగడం వంటి కారణాలతో దేశంలో ద్రవ్యోల్బణం మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేసింది. రిటైల్ ద్రవ్యోల్బణం 4.5 శాతం మించితే ఆర్‌బిఐ ఆలస్యం చేయకుండా వడ్డీ రేట్ల పెంపునకు సిద్ధమవుతుందని పేర్కొంది.

పారిశ్రామికీకరణే కీలకం : సిటీ గ్రూప్

జిడిపిలో పారిశ్రామిక రంగం వాటా 25 శాతానికి పెరిగితే తప్ప 2025 నాటికి పెట్టుబడుల వృద్ధి రేటు రెండంకెలకు చేరే అవకాశం లేదని సిటీ గ్రూప్ పేర్కొంది. పెరిగే జనాభాకు అవసరమైన ఉద్యోగాలు కల్పించాలన్నా తయారీ రంగ అభివృద్ధి తప్పనిసరని స్పష్టం చేసింది. వృద్ధి రేటును పరుగులు పెట్టించడంలో శ్రామికుల ఉత్పత్తి సామర్థ్యం, పెట్టుబడుల వృద్ధి రేటు కీలకంగా ఉంటాయని పేర్కొంది.

మొబైల్ టవర్ల విక్రయం తర్వాతే

ఐడియా-వొడా డీల్‌కు ఆమోదం

బార్సెలోనా (స్పెయిన్): టెలికాం కంపెనీలైన ఐడియా, వొడాఫోన్‌ల విలీనానికి ప్రభుత్వం నుంచి ఆమోదం లభించడానికి మరింత సమయం పట్టనుంది. ఈ రెండు కంపెనీలు టవర్ సేల్ ఒప్పందాన్ని పూర్తి చేసుకున్న తర్వాతనే వీటి విలీనానికి ప్రభుత్వం ఆమోద ముద్ర వేయనుంది. అమెరికన్ టవర్ కార్పొరేషన్ (ఎటిసి)తో వొడాఫోన్, ఐడియా మొబైల్ టవర్ విక్రయ లావాదేవీ ముగియాల్సి ఉంది. ఇది పూర్తయితే ఐడియా, వొడాఫోన్‌ల విలీనానికి ప్రభుత్వం ఆమోదం తెలియజేస్తుందని ప్రభుత్వ సీనియర్ అధికార వర్గాలు చెబుతున్నాయి. ఐడియా టవర్లను కొనుగోలు చేసేందుకు 4,000 కోట్ల రూపాయలు, వొడాఫోన్ మొబైల్ టవర్ల కొనుగోలు 3,850 కోట్ల రూపాయలు ఎటిసి చెల్లించనుంది. కాగా కంపెనీలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి వాటాను 100 శాతానికి పెంచేందుకు అనుమతి ఇవ్వాలని ఐడియా ప్రభుత్వాన్ని కోరింది. దీనికి కూడా ఆమోదం ఇంకా రాలేదు.

డాక్టర్ రెడ్డీస్ శ్రీకాకుళం ప్లాంట్‌కు ఎఫ్‌డిఎ ఓకే

న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్ శ్రీకాకుళంలోని ఫార్ములేషన్స్ ప్లాంట్.. అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ మండలి (యుఎస్ ఎఫ్‌డిఎ) నుంచి ఎస్టాబ్లిష్‌మెంట్ ఇన్‌స్పెక్షన్ రిపోర్ట్ (ఇఐఆర్)ను అందుకుందని డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ వెల్లడించింది. శ్రీకాకుళంలోని ఎపిఐ మాన్యుఫ్యాక్చరింగ్‌కు ఒఎఐ (అఫీషియల్ యాక్షన్ ఇండికేటెడ్) హోదాను కొనసాగిస్తూ ఎఫ్‌డిఎ ఈ ఆదేశాలిచ్చిందని తెలిపింది. అయితే ఇఐఆర్‌లో ఎలాంటి అంశాలున్నాయనేది మాత్రం కంపెనీ వెల్లడించలేదు. అయితే ప్లాంట్‌కు సంబంధించి ఎఫ్‌డిఎ మరిన్ని వివరాలు అడిగిందని, అలాగే పెండింగ్ విషయాలకు సంబంధించి సదరు సంస్థతో ఎప్పటికప్పుడు చర్చిస్తూ వివరాలను అందజేస్తున్నట్లు డాక్టర్ రెడ్డీస్ తెలిపింది. వాస్తవానికి ఎఫ్‌డిఎ తన ఆడిట్ సందర్భంగా అభ్యంతరకర పరిస్థితులు ఉన్నట్లు గుర్తించినట్లయితే ఒఎఐ స్టేటస్‌ను జారీ చేస్తుంది. గత ఏడాది ఆంధ్రప్రదేశ్‌లోని ఎపిఐ మాన్యుఫ్యాక్చరింగ్ ప్లాంట్ తనిఖీ సందర్భంగా ఎఫ్‌డిఎ రెండు అభ్యంతరాలు లేవనెత్తగా వాటిని పరిష్కరించినట్లు డాక్టర్ రెడ్డీస్ తెలిపింది.

మైనర్ అప్‌ట్రెండ్, నిరోధం 10700

టెక్ వ్యూ





నిఫ్టీ గత వారం 10300 వరకు దిగజారి రికవరీ సాధించిన అనంతరం కన్సాలిడేట్ అయి చివరికి శుక్రవారం బలమైన రికవరీతో పాజిటివ్‌గా ముగిసింది. వీక్లీ చార్టుల్లో ఎగువకు రివర్సల్ బార్ పాటర్న్ ఏర్పడినందువల్ల రానున్న కాలంలో అప్‌ట్రెండ్‌కే ఆస్కారం ఉంది. ఈ సారి ఏర్పడిన కరెక్షన్‌లో 900 పాయింట్ల వరకు (10 శాతం) దిగజారింది. పలు మిడ్ క్యాప్, స్మాల్‌క్యాప్ స్టాక్‌లు 20 శాతం వరకు దిగజారాయి. శుక్రవారం నాడు అమెరికా స్టాక్ మార్కెట్ కూడా బలంగా క్లోజయినందు వల్ల మరింత రికవరీకే ఆస్కారం ఉంది. తదుపరి ప్రధాన నిరోధం, ట్రెండ్ నిర్ణాయక స్థాయి 10700. మరింత ముందుకెళ్లాలంటే ఇక్కడ బలం ప్రదర్శించడం తప్పనిసరి.

బుల్లిష్ స్థాయిలు...

రెండు వారాల క్రితం ఏర్పడిన ప్రధాన టాప్ 10630 స్థాయిలో ఇప్పుడు మరో పరీక్ష ఎదురు కానుంది. ఇక్కడ స్వల్పకాలిక కన్సాలిడేషన్‌కు ఆస్కారం ఉంది. మరింత అప్‌ట్రెండ్ కోసం ఈ స్థాయి కన్నా పైన బలంగా క్లోజ్ కావాలి. తదుపరి టార్గెట్ 10700. ఆ పైన నిలదొక్కుకున్నప్పుడే స్వల్పకాలిక అప్‌ట్రెండ్‌లో ప్రవేశిస్తుంది.

బేరిష్ స్థాయిలు...

10630 వద్ద విఫలమైతే బలహీనత ముప్పు ఏర్పడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 10500 కన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనతలో ప్రవేశిస్తుంది.

బ్యాంక్ నిఫ్టీ : ఈ ఇండెక్స్ గత వారం 25000 వద్ద కన్సాలిడేట్ అయి బలంగా క్లోజ్ కావడం ట్రెండ్‌లో సానుకూలత సంకేతం. నిరోధ స్థాయి 25800. మరింత అప్‌ట్రెండ్ కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. తదుపరి టార్గెట్ 26200. మరింత బలహీనత ప్రదర్శిస్తే మాత్రం దిగువన 25000 వద్ద బలమైన మద్దతు ఉంది.

స్వల్పకాలిక వ్యూహం : గట్టి స్టాప్‌లాస్‌తో ట్రేడర్లు ప్రస్తుత స్థాయిల్లో అప్రమత్తతో కూడిన స్వల్పకాలిక బై పొజిషన్లు పరిశీలించవచ్చు.

పాటర్న్ : మరింత రికవరీ బాట పడితే అడ్డంగా కనిపిస్తున్న రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్ 10700 వద్ద నిరోధం ఉంది. అడ్డంగానే కనిపిస్తున్న మద్దతు ట్రెండ్‌లైన్ కన్నా చాలా పైనే ఉండడం తక్షణ డౌన్‌ట్రెండ్ ముప్పు లేదనేందుకు సంకేతం. గత వారం 100 డిఎంఎ వద్ద మద్దతు తీసుకుంది. మరింత అప్‌ట్రెండ్ కోసం 20, 50 డిఎంఏల వద్ద నిలదొక్కుకోవాలి.

టైమ్ : ఈ సూచిక ప్రకారం సోమ, బుధవారాల్లో తదుపరి రివర్సల్స్ ఉన్నాయి.

సోమవారం స్థాయిలు..
నిరోధం : 10560, 10630
మద్దతు : 10500, 10410

భారత్ ఫైనాన్షియల్ (రూ.1001) - కొనుగోలు స్థాయిలకు చేరువలో..		
రూ.1000 ఎగువన అప్‌ట్రెండ్	మొదటి నిరోధం రూ.1050	రెండో నిరోధం రూ.1100
రూ.980 దిగువన డౌన్‌ట్రెండ్	మొదటి మద్దతు రూ.950	రెండో మద్దతు రూ.920

బయోకాన్ (రూ.622) - కొనుగోలు స్థాయిలకు చేరువలో..		
రూ.620 ఎగువన అప్‌ట్రెండ్	మొదటి నిరోధం రూ.650	రెండో నిరోధం రూ.680
రూ.600 దిగువన డౌన్‌ట్రెండ్	మొదటి మద్దతు రూ.575	రెండో మద్దతు రూ.550

■ వాసిరాజు సుందర్ రాజా
www.sundartrends.in

నిఫ్టీ వ్యూహం..


మార్కెట్ స్ట్రాటజీ

ఫిబ్రవరి 5వ తేదీ నాటి మార్కెట్ స్ట్రాటజీలో నిఫ్టీకి సంబంధించిన వ్యూహం ఇవ్వటం జరిగింది. ఫిబ్రవరి నెల కాంట్రాక్టుల ముగింపు నాటికి నిఫ్టీ 10577 కంటే దిగువన ముగిస్తే గరిష్ఠ లాభం 5,775 రూపాయలు పొందవచ్చని చెప్పటం జరిగింది. సూచించిన విధంగా నిఫ్టీ 10400 కంటే దిగువన ముగియటంతో ఈ వ్యూహంలో ఉన్న వారందరు ఈ లాభాన్ని పొందారు.

ఇక ఈ వారం కూడా నిఫ్టీకి సబంధించిన హైబ్రిడ్ వ్యూహం ఇస్తున్నాం. ఇందులో నిఫ్టీ ఫ్యూచర్ ఒక లాట్ 10507లో షార్ట్ చేయాలి. 10400 పుట్స్ రెండు లాట్లు ఒక్కొక్కటి 119 రూపాయల చొప్పున షార్ట్ చేయాలి. దీనికి అదనంగా 10600 కాల్ ఒక లాట్ 108 రూపాయల్లో కొనుగోలు చేయాలి.

మార్చి కాంట్రాక్ట్ ముగింపు నాటికి నిఫ్టీ 10163 ఎగువన ఎక్కడ ముగిసినా కచ్చిత లాభం పొందుతారు. ముఖ్యంగా నిఫ్టీ 10200 పైన ముగిస్తే కచ్చిత లాభం 2,775 రూపాయలు పొందవచ్చు. ఈ వ్యూహంలో వచ్చే గరిష్ఠ లాభం 17,775 రూపాయలు. అయితే నిఫ్టీ విపరీతంగా తగ్గి 10163 కంటే దిగువకు వస్తే మాత్రం నష్టం వచ్చే అవకాశం ఉన్నందున నిఫ్టీ ఈ స్థాయి సమీపించగానే లాభనష్టాలతో సంబంధం లేకుండా వ్యూహం నుంచి బయటకు రావాలి.

– గొండాల రాంబాబు



ఫామ్‌గేట్ ధర (కిలో) రూ.		వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	75.00	విజయవాడ	79.00
కరీంనగర్	76.00	గుంటూరు	79.00
వరంగల్	77.00	ఒంగోలు	81.00
మహబూబ్‌నగర్	75.00	చిత్తూరు	75.00
కర్నూలు	75.00	నెల్లూరు	75.00
విశాఖపట్నం	83.00	అనంతపురం	76.00
గోదావరి	78.00		



రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.15		నెక్ (100 గుడ్లు)	
హైదరాబాద్	355.00	చిత్తూరు	388.00
వరంగల్	357.00	చెన్నై	395.00
విజయవాడ	358.00	నమక్కల్	380.00
గోదావరి	358.00	బెంగళూరు	385.00
విశాఖపట్నం	360.00	ముంబై	400.00

ఈ వారం ట్రెండ్ కూడా సానుకూలమే

ఆస్ట్రో గైడ్

(ఫిబ్రవరి 26-మార్చి 2 తేదీల మధ్య వారానికి)

గత వారం నిఫ్టీ : 10491 (+39)

నిఫ్టీ గత వారం 10499-10303 నడుమ సంచరించి కేవలం 39 పాయింట్ల లాభంతో వారం గరిష్ఠ స్థాయిలో ముగిసింది. ముందుగా సూచించిన విధంగానే వరుసగా మూడు వారాల నష్టాల అనంతరం గత వారం తొలిసారిగా పాజిటివ్ ధోరణిలో క్లోజయింది. ఈ వారంలో కూడా ఎగువకు పయనించే ఆస్కారమే ఉంది.

- చంద్రుడు కుంభ, మీన రాశుల సంచార సమయంలో చేస్తాడు. కుంభ రాశి సంచార సమయంలో నిఫ్టీ 10613-10303 పాయింట్ల మధ్యన సంచరించి 303 పాయింట్ల పరిధి ఏర్పరచుకుంది. ఆ తర్వాత 10341 పాయింట్ల కనిష్ఠ, 10497 పాయింట్ల గరిష్ఠ స్థాయిల వరకు వెళ్లింది. ఇప్పుడు ఈ రెండు స్థాయిల్లో దేన్ని బ్రేక్ చేస్తుందో చూడాలి.
- స్వల్పకాలిక ట్రెండ్ చాలా బేరిష్‌గా మారింది. మధ్యకాలిక ధోరణిలో బుల్లిష్‌గాను, దీర్ఘకాలిక ధోరణిలో మరింత బుల్లిష్‌గాను ఉంది. 10650 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలంలో కూడా బుల్లిష్ అవుతుంది.
- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 10639, 10610, 10415, 10094 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.
- ప్రస్తుతం నిఫ్టీ 100, 200 డిఎంఎల కన్నా పైన ట్రేడవుతోంది. నిఫ్టీ 200 డిఎంఎ కన్నా పైన ఉండడం 50 డిఎంఏ 200 డిఎంఎ కన్నా పైకి రావడం (గోల్డెన్ క్రాస్) దీర్ఘకాలిక ట్రెండ్ బుల్లిష్‌గా ఉందనేందుకు సంకేతం.

బ్రేకౌట్ స్థాయి : 10650
బ్రేక్‌డౌన్ స్థాయి : 10250

నిరోధ స్థాయిలు : 10650, 10725 (10575 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు : 10325, 10250, 10175 (10400 దిగువన బేరిష్)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

ఇన్వెస్టర్లకు సూచన

వారం ప్రారంభ స్థాయి అత్యంత కీలకం. ఇండెక్స్ గత వారం ప్రారంభ స్థాయి కన్నా పైన ట్రేడవుతూ ఉంటే లాంగ్ పొజిషన్లను పరిశీలించవచ్చు.

గ్రహగతులివే..

- మిథునంలోని పునర్వసు పాదం 1 నుంచి సింహంలోని పుబ్బ పాదం 2 మధ్యలో చంద్ర సంచారం
- కుంభంలోని శతభిషం పాదం 3-4 మధ్యలో రవి సంచారం
- కుంభంలోని పూర్వాభాద్ర పాదం 1-3 మధ్యలో బుధ సంచారం
- కుంభంలోని పూర్వాభాద్ర పాదం 2-4 మధ్యలో శుక్ర సంచారం
- వృశ్చికంలోని జ్యేష్ఠ పాదం 3-4 మధ్యలో కుజ సంచారం
- ధనుస్సులోని మూల పాదం 4లో కర్కాటక నవాంశలో శని సంచారం
- తులలోని విశాఖ పాదం 3లో మిథున నవాంశలో బృహస్పతి సంచారం
- కర్కాటకంలో రాహువు, మకరంలో కేతువు ధనుస్సు, మీన నవాంశల్లో సంచారం

సాధారణంగా మెరుగు (సోమవారానికి)

తిథి : ఫాల్గుణ శుద్ధ ఏకాదశి **నక్షత్రం :** పునర్వసు

అశ్విని, మఖ, మూల నక్షత్ర జాతకులు, కర్కాటక, వృశ్చిక రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

ట్రెండ్ మార్పు వేళలు : 1.31

ధోరణి : గ్రహగతులను బట్టి నిలకడ/నిస్తేజంగా ప్రారంభమై 10.20 నుంచి 12.15 వరకు మెరుగ్గా ట్రేడవుతూ తదుపరి 2.15 వరకు నిస్తేజంగా ఉండి చివరి గంటలో తిరిగి మెరుగ్గా మారే ఆస్కారం ఉంది.

ట్రేడింగ్ వ్యూహం...

నిఫ్టీ ఫ్యూచర్స్ 10.30 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా పైన ట్రేడవుతుంటే తగు స్టాప్ లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 12.15 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 12.30 తర్వాత ఎటిపి కన్నా దిగువకు వస్తే షార్ట్ పొజిషన్లు తీసుకుని 2 గంటల సమయంలో క్లోజ్ చేసుకోవాలి. 2.30 తర్వాత ఎటిపి కన్నా పైన ఉంటే మరిన్ని లాంగ్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయంలో క్లోజ్ చేసుకోవలసి ఉంటుంది.

నిరోధం : 10425, 10460
మద్దతు స్థాయిలు : 10340, 10305

గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.



ఇ-ప్రాసీడింగ్స్‌తో పెనుమార్పులు

పన్నుల శాఖకు డిజిటల్ కన్నులు

ప్రపంచమంతా డిజిటల్‌మయం అయిపోతున్నది. ప్రధాని మోదీ డిజిటల్ ఇండియా ప్రాజెక్ట్‌తో ప్రభుత్వ సంస్థలు డిజిటైజేషన్ దిశగా చర్యలు తీసుకుంటున్నాయి. ఆదాయ పన్ను శాఖ కూడా అసెసీలు ఐటి కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఇ- అసెస్‌మెంట్‌కు శ్రీకారం చుట్టింది. ప్రయోగాత్మకంగా కొన్ని నగరాల్లో పరిశీలించిన తర్వాత ఇప్పుడు దేశవ్యాప్తంగా దీనిని విస్తరిస్తున్నారు. ఇ-ప్రోసిడింగ్స్ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు 1961 ఐటి చట్టంలోని సెక్షన్ 143ను సవరించి సబ్‌సెక్షన్ 3 తర్వాత కొత్తగా సబ్‌సెక్షన్ 3ఎను చేరుస్తున్నారు. ఈ కొత్త చర్యలు వాటి ప్రభావంపై ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ జిసి రెడ్డి వివరిస్తున్నారు.



ఇ-ప్రాసీడింగ్స్ సౌలభ్యం

ఇ-ప్రొసీడింగ్స్ వల్ల అసెసింగ్ అధికారి, అసెసీ మధ్య జరిగే ఉత్తర, ప్రత్యుత్తరాలు, నోటీసులు, ప్రశ్నలు, ఆదేశాలన్నీ ఎలక్ట్రానిక్ పద్ధతిలో జరుగుతాయి. ఐటి శాఖ నుంచి సమాచారం అందిన వెంటనే అసెసీ అవసరమైన సమాచారాన్ని, అటాచ్‌మెంట్స్‌ను ఇ-ఫైలింగ్ పోర్టల్ ద్వారా అప్‌లోడ్ చేస్తే సరిపోతుంది. అసెస్‌మెంట్ అధికారి ఆదాయ పన్ను శాఖ బిజినెస్ అప్లికేషన్ (ఐటిబిఎ) మాడ్యూల్‌లో ఈ సమాచారాన్ని చూసి, అవసరమైన చర్యలు తీసుకుంటారు. దీని వల్ల విలువైన సమయం ఆదా కావడంతో పాటు అసెస్‌మెంట్ ప్రొసీడింగ్స్‌లో భాగంగా ఐటి శాఖ అడిగే ప్రశ్నలకు అవసరమైన సమాధానాల్ని ఎప్పుడైనా, ఎక్కడి నుంచైనా సమర్పించే అవకాశం అసెసీకి ఏర్పడుతుంది. incometaxindiaefiling.gov.in పోర్టల్ అసెసీ ఖాతాలోని 'మై అకౌంట్'లో ఐటి అధికారులకు, అసెసీకి మధ్య జరిగిన కమ్యూనికేషన్ వివరాలన్నీ నమోదై ఉంటాయి. అవసరమైనప్పుడు పన్ను చెల్లింపుదారుడు ఈ వివరాలను చూసుకోవచ్చు. ప్రస్తుతం నాన్ కార్పొరేట్ పన్ను చెల్లింపుదారులకు మాత్రమే ఇ-ప్రొసీడింగ్స్ వర్తింపజేస్తున్నా మున్ముందు కార్పొరేట్ పన్ను చెల్లింపుదారులకు కూడా ఈ సౌలభ్యం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

ఐటి చట్టంలో మార్పులు

ఇ-అసెస్‌మెంట్ కోసం ఐటి చట్టంలోని సెక్షన్ 143తో పాటు మరిన్ని సెక్షన్లలో సవరణలు చేశారు. ముఖ్యంగా సెక్షన్ 2 (23సి)లో పేర్కొన్న 'వినడం' (హియరింగ్) అనే పదానికి మరింత విస్తృత అర్థం కల్పించారు. ఎలక్ట్రానిక్ పద్ధతిలో జరిపే డేటా, డాక్యుమెంట్ల సమాచారాన్ని కూడా ఇక 'హియరింగ్'గానే పరిగణిస్తారు. ఈ సవరణ జూన్ 1, 2016 నుంచే అమల్లోకి వచ్చింది.

స్క్రూటినీ కేసులు

స్క్రూటినీ కేసులకు సంబంధించిన అసెస్‌మెంట్‌లన్నీ ఇకపై ఎలక్ట్రానిక్ పద్ధతిలోనే జరుగుతాయి. ఈ మేరకు సిబిడిటి సెక్షన్ 143 (2) కింద జారీ చేసే నోటీసు ఫార్మాట్‌నూ సవరించింది. స్క్రూటినీ కోసం ఎంపిక చేసిన కేసుల ప్రొసీడింగ్స్ అన్నీ ఐటి శాఖ ఇ-ఫైలింగ్ వెబ్‌సైట్‌లో అసెసీకి చెందిన ఖాతా ద్వారా జరుగుతాయి.

- స్క్రూటినీ పూర్తయిన వెంటనే పన్ను అధికారి ఆర్డర్ జారీ చేసి పిడిఎఫ్ ఫార్మాట్‌లో దానిని అసెసీ ఇ-మెయిల్‌కు పంపిస్తారు.

మినహాయింపులు

సోదాలకు సంబంధించిన అసెస్‌మెంట్ కేసులు ప్రస్తుతం ఇ-అసెస్‌మెంట్ పరిధిలోకి రావు. పెండింగ్‌లో ఉన్న స్క్రూటినీ కేసులకు మాత్రమే ప్రస్తుతం ఇ-ప్రొసీడింగ్ సదుపాయం వర్తిస్తుంది. అలాగే ఎవరైనా అసెసీ తన కేసును ఇ-ప్రొసీడింగ్ పద్ధతిలో చేపట్టేందుకు అభ్యంతరం వ్యక్తం చేసినా, ఆ కేసు అసెస్‌మెంట్‌ను సంప్రదాయ పద్ధతిలోనే పూర్తి చేయాలి.

విధిగా పాటించాల్సిందే...

అధికారులు

- అసెసీలకు పంపే నోటీసులు, ప్రశ్నలను టాక్స్ అధికారి పిడిఎఫ్ ఫార్మాట్‌లో తన అధికారిక ఇ-మెయిల్ నుంచి డిజిటల్ సంతకంతో పంపాలి. అసెసీ ఐటి రిటర్న్‌లో పేర్కొన్న ఇ-మెయిల్ ఐడికి మాత్రమే వీటిని పంపించాలి. అసెసీ పాన్ నంబర్, అసెస్‌మెంట్ ఇయర్, ఏ సెక్షన్ కింద నోటీసు జారీ చేస్తున్నారు, నోటీసు సీరియల్ నంబరు... వగైరా తెలియజేయాలి.
- ఒకవేళ పన్ను చెల్లింపుదారుడు పేర్కొన్న ఇ-మెయిల్ ఐడికి నోటీసులు, సమాచారం పంపించడంలో విఫలమైతే, ఐటి అధికారుల దగ్గర ఉన్న మరో ఇ-మెయిల్‌కు వీటిని పంపించవచ్చు. లేదా అనుమతించిన ఇతర పద్ధతుల్లోనూ అసెసీకి పంపించవచ్చు. అయితే ఇ-మెయిల్ ద్వారా పంపించలేక పోవడానికి కారణం ఏమిటో రికార్డు చేయాలి.

అసెసీలు

- సమాధానం ఇచ్చేటపుడు అసెసీ కూడా సబ్జెక్ట్ మాటర్, పాన్ నంబర్, సమాధానం ఇస్తున్న నోటీసు సీరియల్ నంబరు పేర్కొనాలి. సమాధానంగా పంపించే అటాచ్‌మెంట్ల సైజ్ 10 ఎంబి కంటే తక్కువ ఉండాలి. 10 ఎంబి కంటే ఎక్కువ ఉంటే చిన్న చిన్నవిగ విడగొట్టి పంపించవచ్చు. అయితే అలా పంపించే ప్రతి అటాచ్‌మెంట్‌లో నోటీసు నంబరు, తేదీ, పేజీల సంఖ్య తప్పనిసరిగా పేర్కొనాలి.
- పన్ను చెల్లింపుదారు, టాక్స్ అధికారి మధ్య జరిగే ఇ-మెయిల్ ఉత్తర ప్రత్యుత్తరాలను e-assessment@incometax.gov.in లో కాపీ చేసి అడిట్ ట్రెయిల్ అవసరాల కోసం భద్రపరచాలి.

వెసులుబాట్లు

పన్ను అధికారుల నుంచి వచ్చిన నోటీసులకు, ఇతర విషయాలకు సాంకేతిక సమస్యల వలన అసెసీ ఇ-మెయిల్ ద్వారా సమాధానం ఇవ్వలేనపుడు. ఫిజికల్‌గా కూడా ఆ విషయాలను పన్ను చెల్లింపుదారులకు తెలియజేయవచ్చు. అదే సమయంలో ఇ-మెయిల్ ఎర్రర్ మెసేజ్ కాపీని eassessment@incometax.gov.inకు ఫార్వర్డ్ చేయాలి. అందులో పాన్ నంబరు, అసెస్‌మెంట్ ఇయర్ తప్పనిసరిగా పేర్కొనాలి.

ఇ-ప్రాసీడింగ్స్‌తో లాభాలు

- ఐటి శాఖ ఆఫీసుకు వెళ్లకుండా ఐటి శాఖతో సంప్రదించే అవకాశం. దీనివల్ల అసెసీతో పాటు, ఐటి శాఖకు సమయం ఆదా.
- ఇ-ప్రొసీడింగ్స్‌తో ఎఒ-అసెసీ మధ్య నిరంతర సమాచార మార్పిడి.
- ఇ-ఫైలింగ్ పోర్టల్ ద్వారా అవసరమైన సమాచారంతో పాటు, అవసరమైన అటాచ్‌మెంట్స్ అప్‌లోడ్ చేయవచ్చు.
- అసెసీ సమర్పించిన సమాచారాన్ని ఎఒ ఐటిబిఎ ద్వారా ఆన్‌లైన్‌లోనే చెక్ చేసుకునే ఏర్పాటు.
- ఆన్‌లైన్ సబ్‌మిషన్‌తో పేపర్ ఆదా. తద్వారా పర్యావరణకూ మేలు.

ఇ-ప్రాసీడింగ్ నియమాలు

ఇ-మోడ్ అసెస్‌మెంట్‌కు ముందు విచారణ :సెక్షన్ 142 (1) క్లాజ్ 2 కింద అసెసీకి ఇ-ఫైలింగ్ ఖాతా ద్వారా నోటీసులు జారీ చేయాలి. ఈ నోటీసులకు సమాధానం ఇచ్చే ముందు రూల్ 14 కింద అసెసీ వివరాలను సరి చూసుకోవాలి.

డిజిటల్ సంతకం: అసెసింగ్ అధికారి జారీ చేసే నోటీసులు, సమాచారంపై డిజిటల్ సంతకం ఉండాలి.

సమాధానం గడువు: అసెస్‌మెంట్ అధికారి అడిగిన సమాచారాన్ని, వివరాలను, నిర్ణీత తేదీ ఆఫీసు పని గంటల లోపు ఆన్‌లైన్ ద్వారా అందించాలి.

గడువు ముగిసే సందర్భాల్లో..

అసెస్‌మెంట్ అధికారి (ఎఒ) సూచించిన గడువుకంటే వారంరోజుల ముందే సమాచారాన్ని అందించడం మంచిది.. ఇతర సందర్భాల్లో ప్రొసీడింగ్స్ ముగిసి సంబంధిత ఎఒ తుది ఆదేశాలు జారీ చేయక ముందే అసెసీ అవసరమైన సమాచారం సబ్మిట్ చేయడం మంచిది. ఒకవేళ అసెస్‌మెంట్ అధికారి ఇ-సబ్‌మిషన్ గడువు ముందే క్లోజ్ చేయాలుకుంటే క్లోజ్ చేయవచ్చు. అయితే ఎలక్ట్రానిక్ ఆర్డర్ షీట్‌లో 'విచారణ ముగిసింది' అని ఎఒ తప్పనిసరిగా పేర్కొనాలి. కొన్ని అసాధారణ సందర్భాల్లో మాత్రం మరింత సమాచారం ఎలక్ట్రానిక్ ఫార్మాట్‌లో సమర్పించేందుకు అనుమతించవచ్చు. అయితే ఎఒ ఆ విషయాన్ని ఐటిబిఎ ప్రాంతీయ ఉన్నతాధికారికి తెలియజేయాలి.

ఇ-ప్రాసీడింగ్స్ వర్తించని ప్రత్యేక సందర్భాలు

- ఐటి చట్టంలోని సెక్షన్ 131 నిబంధనల కింద అసెసీ ఖాతా పుస్తకాలు లేదా అసలు పత్రాలు ఎఒ స్వయంగా పరిశీలించాల్సిన అవసరం ఏర్పడినప్పుడు.
- అసెసీకి సంబంధించి థర్డ్ పార్టీ విచారణ లేదా దర్యాప్తు కోసం నోటీసులు జారీ చేసినపుడు.
- సంబంధిత అసెసీ లేదా శాఖ ఎవరైనా సాక్షిని విచారించాల్సి అవసరం ఏర్పడినపుడు.
- ఎఒ షోకాజ్ నోటీసు జారీ చేయాలనుకుంటున్నప్పుడు, వివరణ ఇచ్చేందుకు అసెసీ విజ్ఞప్తి చేసినప్పుడు.

విద్యా సంస్థలు ఎంత పన్ను చెల్లించాలి?



రాంబాబు గొండాల

మన దేశ రాజ్యాంగం ప్రకారం విద్య అనేది ప్రాథమిక హక్కు. దీనికి అనుగుణంగానే ప్రభుత్వం విద్యకు సంబంధించి అనేక ప్రోత్సాహకాలను, రాయితీలను అందిస్తోంది. అలాగే వస్తు సేవల పన్ను (జిఎస్‌టి)లో కూడా విద్య, విద్యాలయాలకు సంబంధించి అనేక మినహాయింపులు ఇవ్వటం జరిగింది. అయితే వీటికి కొన్ని పరిమితులున్నాయి. ముందుగా విద్యా సంస్థలకు సంబంధించిన సేవలను స్థూలంగా రెండు రకాలుగా విభజించారు.

మొదటిది విద్యా సంస్థలు స్వయంగా అందించే సేవలు అంటే ఏదైనా ఒక విద్యా సంస్థ విద్యార్థులకు, అధ్యాపకులకు, అందులో పనిచేసే ఉద్యోగస్తులకు అందించే సేవలు.. వీటికి జిఎస్‌టి నుంచి పూర్తి మినహాయింపు ఉంది. అంటే ఒక విద్యా సంస్థ విద్యార్థుల నుంచి వసూలు చేసే ఫీజులకు, బోధన, బోధనేతర సిబ్బందికి అందించే సేవలకు అంటే వారి భోజనానికి, వసతి, రవాణా మొదలైన వాటికి పూర్తి మినహాయింపు ఉంది.

ఇక రెండోది విద్యా సంస్థలు బయటి వారి నుంచి పొందే సేవలు అంటే వారి విద్యార్థుల రవాణా నిమిత్తం బయట వ్యక్తులు బస్ పాస్ సదుపాయం కల్పించటం, బయటి వ్యక్తులు కల్పించే సెక్యూరిటీ, హౌజ్ కీపింగ్, కేటరింగ్ సదుపాయాలు (ఔట్‌సోర్సింగ్ లాంటివి).. వీటికి కూడా పన్ను నుంచి మినహాయింపు లభిస్తుంది. అయితే ఇలా బయట వ్యక్తుల నుంచి పొందే సేవలకు మినహాయింపు పొందటానికి ప్రాథమిక విద్య నుంచి హయ్యర్ సెకండరీ లేదా తత్సమాన కోర్సులను బోధించే స్కూల్స్ లేదా కాలేజీలకు మాత్రమే అర్హత ఉంది.

విద్యా సంస్థలు మూడు రకాలు

- ప్రాథమిక (ప్రైమరీ) విద్య నుంచి హయ్యర్ సెకండరీ లేదా తత్సమానమైన కోర్సులను బోధించే స్కూల్ లేదా కాలేజీ
- ఐటిఐ వంటి ఒకేషనల్ కోర్సులను అందించే సంస్థలు
- ఏదైనా గుర్తింపు పొందిన క్వాలిఫికేషన్ లేదా కోర్సు పొందటానికి అవసరమైన పాఠ్యాంశాలు బోధించే సంస్థలు

ఇవి మాత్రమే విద్యా సంస్థ కిందకు వస్తాయి. అంటే ఇవి అందించే సేవలకు మాత్రమే పన్ను నుంచి మినహాయింపు ఉంది. ఇందులో మూడో రకం గురించి వివరంగా తెలుసుకుందాం. ఉదాహరణకు బిఎ, బికాం లేదా ఇంజనీరింగ్, మెడికల్ విద్యను అందించే కాలేజీలు లేదా పోస్ట్ గ్రాడ్యుయేషన్‌కు అంటే ఎంఎ, ఎంకాం లాంటి కోర్సులు బోధించే కాలేజీలు, ఆయా కోర్సులకు సంబంధించి పాఠ్యాంశాలు బోధిస్తాయి. అలాకాకుండా ఇంజనీరింగ్, మెడిసిన్ ఎంట్రెన్స్‌కు సంబంధించి కోచింగ్ ఇచ్చే కాలేజీలు విద్యా సంస్థ కిందకు రావు. ఎందుకంటే డిగ్రీ పొందటానికి అవసరమైన పాఠ్యాంశాలను అవి బోధించటం లేదు. ఆయా డిగ్రీలను ఇచ్చే కాలేజీల ఎంట్రెన్స్ కోసం మాత్రమే అవి కోచింగ్ ఇస్తున్నాయి. అంతే కానీ అవి అందించే కోచింగ్‌తో విద్యార్థికి ఎలాంటి సర్టిఫికెట్ లభించదు. కాబట్టి ఇలాంటి కోచింగ్ కోసం వసూలు చేసే ఫీజు మీద జిఎస్‌టి వర్తిస్తుంది.

బ్యాంక్, వివిధ పోటీ పరీక్షల కోసం కోచింగ్ అందించే సంస్థలు కూడా విధిగా జిఎస్‌టి కట్టాల్సి ఉంటుంది. ఎందుకంటే అవి అందించే కోచింగ్‌తో విద్యార్థికి ఎలాంటి సర్టిఫికెట్ లభించదు. విద్యా సంస్థ నిర్వచనంలోకి (పైన పేర్కొన్న మూడు రకాలు) వచ్చే ఏ సంస్థ అయినా.. అది విద్యార్థులకు, బోధన, బోధనేతర సిబ్బందికి అందించే సేవలన్నింటికి జిఎస్‌టి మినహాయింపు లభిస్తుంది.

జిఎస్‌టికి సంబంధించిన వీడియోలను https://goo.gl/bzX8s1 ద్వారా వీక్షించవచ్చు.

గమనిక : ఈ వ్యాసాల ద్వారా ఇస్తున్న సమాచారం కేవలం అవగాహన కోసం మాత్రమే. పాఠకులు ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు సంబంధిత చట్టాలు/నిబంధనలను కూలంకషంగా పరిశీలించాలి.

ఇదీ జీఎస్‌టీ



అవెన్యూ సూపర్ మార్కెట్స్ (డీమార్ట్)

షేర్ షాట్



డీమార్ట్ పేరుతో దేశవ్యాప్తంగా సూపర్ మార్కెట్లను నిర్వహిస్తున్న కంపెనీ ఇది. దాదాపు 42 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఎనిమిది రాష్ట్రాల్లో మొత్తం 138 స్టోర్స్‌ను నిర్వహిస్తోంది. అత్యధిక స్టోర్లను పశ్చిమ, దక్షిణ భారతదేశంలో కలిగి ఉంది. ఆహార సంబంధిత సరుకుల విక్రయం ద్వారా 54 శాతం ఆదాయం వస్తుండగా, నాన్ ఫుడ్ (ఎఫ్ఎంసిజి) 20 శాతం, జనరల్ మర్చండైజ్ ద్వారా 26 శాతం రాబడి వస్తోంది. నిర్వహణా వ్యయాలను తగ్గించుకోవటం ద్వారా నిత్యావసర సరుకులను తక్కువ ధరకు అందించటం అనే బిజినెస్ మోడల్‌లో స్టోర్స్‌ను నిర్వహిస్తోంది. అన్ని స్టోర్స్‌ను సొంతంగా కలిగి ఉండటం ద్వారా అద్దె వ్యయాలను తగ్గించుకోగలుగుతోంది. సాధారణంగా అద్దె వ్యయాలు 8 శాతం మేర ఉంటాయి. వీటిని ఆదా చేయటం ద్వారా రుణాలపై వడ్డీ చెల్లింపుల భారాన్ని తగ్గించుకోగలుగుతోంది. మధ్య తరగతి, ఎగువ మధ్యతరగతి జనాభా అధికంగా ఉండే ప్రాంతాల్లో స్టోర్స్‌ను ఏర్పాటు చేస్తోంది. అన్ని స్టోర్లు సొంతంగా కలిగి ఉండటంతో అసెట్ టర్నోవర్ నిష్పత్తి ఆశాజనక స్థాయిలో ఉంది. దీనికితోడుగా ఇదే రంగంలోని మిగతా కంపెనీలతో పోల్చితే ఇన్వెంటరీ టర్నోవర్ నిష్పత్తితోపాటు అధిక అమ్మకాలను కలిగి ఉంది. దీంతో ఎంఆర్‌పి ధరలకన్నా తక్కువకు సరుకులను వినియోగదారులకు అందించగలుగుతోంది. ప్రతి స్టోర్ సగటున ఏటా 23 శాతం వృద్ధి రేటు సాధిస్తూ వస్తోంది. 2011-12లో 2,200 కోట్ల రూపాయల టర్నోవర్ ఉండగా 2016-17 నాటికి ఇది 12,000 కోట్ల రూపాయలకు చేరుకుంది. విక్రయించే వస్తువుల్లో నిత్యావసరాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్న కారణంగా సేల్స్ వాల్యూమ్స్‌లో పెరుగుదల ప్రోత్సాహకరంగా ఉంటోంది.

అలాగే మిగతా కంపెనీలతో పోల్చితే అత్యధిక నిర్వహణ లాభ మార్జిన్లను కూడా కలిగి ఉంది. అనుబంధ సంస్థ అవెన్యూ ఇ-కామర్స్ లిమిటెడ్‌లోని మిగిలిన 5079 శాతం వాటాలను 49.21 కోట్ల రూపాయలకు కొనుగోలు చేసింది. ఆన్‌లైన్ రిటైల్ అమ్మకాల వ్యాపారంలో ఉన్న ఈ కంపెనీ 2016-17లో 1.2 కోట్ల రూపాయల టర్నోవర్‌ను సాధించింది. గత ఏడాది మార్చిలో పబ్లిక్ ఇష్యూకు వచ్చినప్పుడు సంస్థాగత ఇన్వెస్టర్ల వాటా 104 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబ్ కాగా రిటైల్ ఇన్వెస్టర్ల వాటా 278 రెట్లు ఓవర్‌సబ్‌స్క్రైబ్ అయిన సంగతి తెలిసిందే.

- టి బ్రహ్మాచారి
హెడ్, అసోసియేషన్ ఆఫ్ టెక్నికల్ మార్కెట్ ఎనలిస్ట్, హైదరాబాద్ చాప్టర్
tbchary@gmail.com

గమనిక : ఈ శీర్షికలో అందించే రికమండేషన్ల ఆధారంగా జరిపే లావాదేవీలకు ఇన్వెస్టర్లదే పూర్తి బాధ్యత. వారి లాభనష్టాలకు ఆంధ్రజ్యోతి పత్రిక, కాలమిస్ట్ ఎలాంటి బాధ్యత వహించరు. లావాదేవీలు చేపట్టే ముందు మీ వ్యక్తిగత ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ సలహా తీసుకోండి.

ఫండమెంటల్స్

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉన్నాయి. రాబడులు 22.6 శాతం మేర వృద్ధి చెంది 4,094 కోట్ల రూపాయలకు చేరుకున్నాయి. స్థూల లాభం 18.6 శాతం పెరిగి 670 కోట్ల రూపాయలకు చేరుకుంది. స్థూల లాభ మార్జిన్లు కూడా 16.4 శాతం పెరిగాయి. కేంద్రీకృత ప్రొక్యూర్‌మెంట్ విధానంతో వ్యయాలను గణనీయంగా తగ్గించుకోవటంతో మార్జిన్లు పెరిగాయి. నికర లాభం 151.80 కోట్ల రూపాయల నుంచి 251.76 కోట్లకు పెరిగింది. ఇపిఎస్ 47 శాతం వృద్ధి చెంది 3.97 రూపాయలకు చేరింది. ఓ నీల్ ఇపిఎస్ రేటింగ్ 96గా ఉంది.

96 శాతం లిస్టెడ్ కంపెనీల కన్నా మెరుగైన రాబడులను కలిగి ఉంది. రిటర్న్ ఆన్ ఈక్విటీ 18.34 శాతంగా ఉంది. ప్రమోటర్ వాటా 82.2 శాతంగా ఉండగా సంస్థాగత ఇన్వెస్టర్ల వాటా 7.13 శాతంగా ఉంది. ఇటీవల మ్యూచువల్ ఫండ్స్ వాటా స్వల్పంగా 0.06 శాతం మేర పెరిగింది. మొత్తం ఎఫ్ఐఐల వాటా 3.57 శాతం కాగా,138 ఎఫ్ఐఐలు ఇందులో మదుపు చేశాయి. మూడో త్రైమాసికంలో కొత్తగా ఐదు స్టోర్లను ప్రారంభించింది. దీంతో మొత్తం స్టోర్ల సంఖ్య 141కు పెరిగింది.

టెక్నికల్స్

నాలుగు నెలల (91 రోజుల) కన్సాలిడేషన్ ప్యాట్రన్ నుంచి బయటపడింది. స్టాక్ అప్‌ట్రెండ్‌లో రెక్టాంగిల్ బ్రేకౌట్ సాధారణంగా వేగంగా లక్ష్యాలను చేరుకుంటుంది. వాల్యూమ్స్ గత మూడు రోజులుగా 50 రోజుల సగటు కన్నా ఎక్కువగా నమోదవుతున్నాయి. బ్రేకౌట్ కూడా భారీ వాల్యూమ్స్‌తో జరిగింది. ఈ షేరు లిస్ట్ అయిన దగ్గర నుంచి ఆర్ఎస్ఐ బుల్లిష్ జోన్‌లో ట్రేడవుతూ ప్రస్తుతం చాలా పటిష్ఠంగా 64 స్థాయికి ఎగువన ఉంది. స్వల్ప, దీర్ఘకాల మూవింగ్ సగటులకు ఎగువన ట్రేడవుతూ ఉంది. అనేక సందర్భాల్లో 50 డిఎంఎ వద్ద మద్దతును కూడగట్టుకుని పెరుగుతూ వస్తోంది. మూమెంటమ్ ఇండికేటర్లన్నీ బుల్లిష్ సెంటిమెంట్‌ను సూచిస్తున్నాయి. ఓ నీల్ రిలేటివ్ ప్రైస్ స్ట్రెంత్ గరిష్ఠంగా 81 వద్ద ఉంది. ఈ షేరును 1,283 రూపాయలకు ఎగువన కొనుగోలు చేయవచ్చు. స్టాప్‌లాస్ 1,178 రూపాయలు. స్వల్పకాలిక లక్ష్యం 1,460 రూపాయలు. దీర్ఘకాలిక లక్ష్యం 1,735 రూపాయలు. ఈ లక్ష్యాన్ని వచ్చే 18 నెలల్లో చేరుకోవచ్చు.

8 లక్షల ఎకరాలకు నీరందకుంటే రాజీనామా చేస్తారా?

- మంత్రి హరీశ్‌కు ఎమ్మెల్యే డీకే అరుణ సవాల్
- 24 గంటల కరెంటు ఒక పెద్ద స్కాం
- మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారు



వీపనగండ్ల, ఫిబ్రవరి 25 : 'పాలమూరు జిల్లా నెట్టెంపాడు భీమా, కోయిల్ సాగర్, కేఎల్ఐ ప్రాజెక్టుల ద్వారా ఎనిమిది లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోందని మంత్రి హరీశ్ అంటున్నారు.. అంత నీరు అందకుంటే ఆయన రాజీనామాకు సిద్ధం కావాలి' అని ఎమ్మెల్యే డీకే అరుణ సవాల్ విసిరారు. వనపర్తి జిల్లా వీపనగండ్లలో ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి ఆదివారం ఆమె భూమి పూజ చేసిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న 24 గంటల కరెంట్ సరఫరా పెద్ద స్కాం అని, అది సామాన్య ప్రజలకు అర్థం కాదన్నారు. రూ.1.50 పైసల నుంచి రూ.2కు యూనిట్ కరెంట్ దొరికే పరిస్థితి ఉన్నా, ఎక్కువకు కొన్నట్లు చూపించి.. టీఆర్ఎస్ పార్టీ నాయకులు వేల కోట్లు దండుకుంటున్నారని ఆరోపించారు. తెలంగాణ ప్రజలను దోచుకోనే పన్నాగమే మిషన్ భగీరథ అని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టును 10 వేల కోట్లతో డిజైన్ చేసిందన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం దానిని రీ డిజైన్ చేసి 60 వేల కోట్లకు పెంచి ప్రజలను ముంచేందుకు కుట్ర పన్నిందని విమర్శించారు. రూ. 16,500 కోట్లు మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు.

బీసీల సంక్షేమానికి నిధులు పెంచాలి: జాజుల

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): బీసీల సంక్షేమానికి వచ్చే రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. కనీసం రూ.20వేల కోట్ల నిధులు కేటాయించాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు బీసీలకు ప్రణాళికను తెచ్చి దానికి చట్టబద్ధత కల్పించాలన్నారు. బీసీల సమస్యలపై కుల సంఘాలతో మార్చి 2న హైదరాబాద్‌లో సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. బీసీల సమస్యల సాధనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేందుకు కార్యాచరణను ఈ సమావేశంలో నిర్ణయిస్తామని తెలిపారు.

ప్రజాస్వామ్య విరుద్ధంగా రైతు సమితులు: చాడ

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా రైతు సమన్వయ సమితులను ఏర్పాటు చేసిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి విమర్శించారు. వ్యవసాయంపై అనుభవంలేని వారు, ఇతర వృత్తుల వారిని ఈ సమితులకు సారథులుగా నియమించటం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ నుంచి ఎంపీగా గెలుపొందిన గుత్తా సుఖేందర్‌రెడ్డిని రైతు సమన్వయ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నిక చేయడం పార్టీ ఫిరాయింపులకు పరాకాష్టగా అభివర్ణించారు. రైతు సమన్వయ సమితుల ఏర్పాటుతో టీఆర్ఎస్ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడిందని ఆరోపించారు.

టీఆర్టీకి దాదాపు 100% హాజరు

- నేడు స్కూల్ అసిస్టెంట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి: టీఎస్‌పీఎస్సీ

హైదరాబాద్, నల్లగొండ, నిజామాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): టీఎస్‌పీఎస్సీ చరిత్రలోనే తొలిసారి ఓ పరీక్షకు దాదాపు 100శాతం హాజరు నమోదైంది. ఆదివారం జరిగిన టీఆర్టీకి 99శాతంపైగా అభ్యర్థులు హాజరయ్యారని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వాణీప్రసాద్ తెలిపారు. ఉదయం నిర్వహించిన ఎస్జీటీ, మధ్యాహ్నం నిర్వహించిన ఎస్జీటీ ఇంగ్లిష్ మీడియం పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్టు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షల్లో 99శాతం హాజరు నమోదైందని తెలిపారు. సోమవారం నిర్వహించనున్న స్కూల్ అసిస్టెంట్ (ఆన్‌లైన్) పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు వాణిప్రసాద్ తెలిపారు. స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ సబ్జెక్టు పరీక్షను సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, స్కూల్ అసిస్టెంట్ - ఇంగ్లిష్ మీడియం మ్యాథ్స్, సోషల్ సబ్జెక్టుల పరీక్షలను మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తామని వెల్లడించారు. ఉదయం నిర్వహించే పరీక్షను హెచ్ఎండీఏ పరిధిలోని 10 కేంద్రాల్లో, సాయంత్రం నిర్వహించే పరీక్షను 5 కేంద్రాల్లో నిర్వహిస్తామన్నారు. ఆన్‌లైన్ పరీక్షల నిర్వహణను టీఎస్‌పీఎస్సీ ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ కేంద్రం నుంచి మానిటరింగ్ చేస్తామన్నారు.

గోధుమ పిండిని తెలంగాణలో ఏమనంటారు?

ఆదివారం ఎస్జీటీ పరీక్షలో భాగంగా వచ్చిన ప్రశ్న ఇది. ఆప్షన్లుగా తైదం, సైదం, మైదం, తైద పిండి అని ఇచ్చారు. పరీక్ష కోసం సిలబస్‌ను మించి ప్రిపేర్ అయ్యామని, అయితే పరీక్షలో ప్రశ్నలు ఆ స్థాయిలో లేవని, చాలా సులువుగా ఇచ్చారని పలువురు అభ్యర్థులు అభిప్రాయపడ్డారు. కాగా.. నిజామాబాద్, కామారెడ్డి సహా పలు జిల్లాల నుంచి వచ్చిన అభ్యర్థులు హైదరాబాద్‌లో పరీక్ష కేంద్రాలను వెతుక్కోవడంలో ఇబ్బందులు పడ్డారు.

ఈ-పాలనలో భేష్.. హిమాచల్ ప్రదేశ్

- అన్ని రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకోవాలని కోరనున్న కేంద్రం
- నేటినుంచి హైదరాబాద్‌లో ఈ-గవర్నెన్స్ జాతీయ సదస్సు

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నిత్యం హింసాత్మక ఘటనలకు కేంద్ర బిందువుగా నిలిచే జమ్ము కశ్మీర్, ఉద్రిక్త వాతావరణాన్ని తలపించే చైనా.. సరిహద్దులుగా ఉన్న రాష్ట్రం హిమాచల్ ప్రదేశ్. ఈ కొండ ప్రాంతంలో ఎప్పుడు, ఏం జరుగుతుందోనన్న ఆందోళన ఉంటుంది. కానీ, ఇందుకు భిన్నంగా ఆ రాష్ట్రం సుపరిపాలనలో దూసుకెళ్తోంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ అవినీతి రహిత, పారదర్శక పాలనలో దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. 70 లక్షల జనాభా, 12 జిల్లాలు, 84 శాతం అక్షరాస్యత కలిగిన ఈ రాష్ట్రం.. గత దశాబ్ద కాలంలో ఈ-పాలనలో మరే రాష్ట్రమూ సాధించని ఘనతల్ని సొంతం చేసుకుంది. ఈ-పాలనలో మెరుగైన ఫలితాలు సాధిస్తున్న రాష్ట్రాలకు కేంద్రం ప్రత్యేక అవార్డులను అందిస్తుండగా.. ప్రతి ఏటా అత్యధిక అవార్డులను హిమాచల్ ప్రదేశే కైవసం చేసుకుంటోంది. కాగా ఈ-పాలనపై 21వ జాతీయ సదస్సు సోమవారం నుంచి హైదరాబాద్‌లో రెండు రోజులపాటు జరగనుంది. ఈ నేపథ్యంలో.. ఐటీ వినియోగంలో ఈ చిన్న రాష్ట్రం సాధించిన పెద్ద విజయాలపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రస్తావించనుంది. హిమాచల్ ప్రదేశ్ పయనిస్తున్న బాటలో తాము పయనిస్తామని కేంద్రం ప్రకటించనుంది. ఇతర రాష్ట్రాలూ అక్కడి పథకాలను అధ్యయనం చేయాలని, వాటిని మార్గదర్శకంగా తీసుకోవాలని సదస్సులో పాల్గొనున్న రాష్ట్రాలను కోరనుంది.

చైనాను అభినందించిన భారత్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: పొరుగుదేశం చైనాను భారత్ అభినందించింది. ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్)లో ఆ దేశం ఉపాధ్యక్ష స్థానాన్ని పొందిన నేపథ్యంలో.. ఉగ్రవాదం, మనీలాండరింగ్‌పై అలుపెరుగని పోరాటం సాగించాలని కోరింది. మిత్రదేశమైన పాక్ విషయంలో చైనా వ్యవహరించిన తీరును భారత విదేశీవ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రవీశ్ కుమార్ ట్విటర్‌లో ప్రశంసించారు. ఉగ్రవాదానికి ఆర్థిక సాయం అందిస్తున్న దేశాల జాబితాలో పాక్‌ను చేర్చాలనే అమెరికా ప్రతిపాదనను టర్కీ మినహా.. అన్ని దేశాలు ఆమోదించాయి. తొలుత చైనా కూడా దీన్ని వ్యతిరేకిస్తుందని అంతా భావించినా.. పాక్‌కు ఒక అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేయడం వరకే తన పాత్రను పరిమితం చేసింది.

● జానాను కలిసిన టీచర్స్ అసోసియేషన్ నాయకులు



తమ సమస్యలపై హైదరాబాద్‌లోని జానారెడ్డి నివాసంలో ఆయనను కలిసిన యూఎస్‌పీఎస్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు

కాంగ్రెస్ సమరోత్సాహం!

నేటి నుంచే 'ప్రజా చైతన్య యాత్ర'.. చేవెళ్ల నుంచి షురూ

- తొలిదశ మార్చి 9 వరకు
- రోజుకు రెండు నియోజకవర్గాలు
- గ్రామాల్లోనే బస.. కార్యకర్తలతో భేటీ

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): బస్సుయాత్ర ప్రకటనతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం కనిపిస్తోంది! డిసెంబరులోనే ఎన్నికలు వస్తాయని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించడంతో ఈ యాత్రను ఎన్నికల ప్రచారంగానే భావిస్తున్నారు. 'ప్రజా చైతన్య బస్సుయాత్ర'లో టీఆర్ఎస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై జనంలో చైతన్యం తెచ్చేందుకు సన్నద్ధమయ్యారు! సోమవారం ప్రారంభమవుతున్న తొలి దశ యాత్రను విజయవంతం చేసేందుకు రాష్ట్ర నేతలు, కార్యకర్తలు భారీఎత్తున చేవెళ్ల చేరుకుంటున్నారు. కేసీఆర్ సర్కారు నాలుగేళ్ల పాలనలో ప్రజల ఆకాంక్షలను ఎలా నీరు గార్చిందో, హక్కులను ఎలా కాలరాసిందో వివరిస్తామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. రెండు పడకగదుల ఇళ్లు, దళితులకు మూడెకరాల భూమి, 12 శాతం రిజర్వేషన్లు, లక్ష ఉద్యోగాలు, కేజీ టు పీజీ ఉచిత విద్య, ముస్లిం రిజర్వేషన్లు, రుణమాఫీ, రైతు ఆత్మహత్యలు, దళితులపై దాడులు సహా వివిధ అంశాల్లో ప్రభుత్వం ప్రజలను వంచించిందని, వాటన్నింటినీ తెలియజేస్తామని కాంగ్రెస్ ముఖ్యులు తెలిపారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడం, కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నింపడమే లక్ష్యంగా బస్సు యాత్ర చేపట్టామని నేతలు స్పష్టం చేస్తున్నారు.

సానుకూలంగా మార్చారు..

బస్సుయాత్రకు షెడ్యూలు తయారుచేసిన తొలి దశలో కొందరు నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. కానీ, ఉత్తమ్ నేతలందరినీ ఒప్పించి అనుకున్న ప్రకారం యాత్ర షెడ్యూలును ఖరారు చేశారు. ముఖ్యనేతలందరి ఇళ్లకూ వెళ్లి.. అభ్యంతరాలను, అభిప్రాయాలను సేకరించారు. వారిని సముదాయించి యాత్రకు సంసిద్ధుల్ని చేశారు. బస్సు యాత్రలో భాగంగా నాయకులు నియోజకవర్గాల్లోనే బస చేస్తారు. అక్కడ రాత్రిళ్లు కార్యకర్తలతో సమావేశమవుతారు. తొలుత 26 నుంచి 28 వరకు యాత్ర చేస్తారు. మూడు రోజుల విరామం అనంతరం మార్చి 4న తిరిగి ప్రారంభమై 9 వరకు సాగుతుంది. సోమవారం ఉదయం 10 గంటలకు నాంపల్లి దర్గాలో, 11 గంటలకు ఆరె మైసమ్మ గుడిలో, 12 గంటలకు మొయినాబాద్ చర్చిలో ప్రార్థనలు నిర్వహించిన అనంతరం ప్రజా చైతన్య యాత్ర చేవెళ్లకు బయలుదేరుతుంది. 27న తాండూరు, సంగారెడ్డి; 28న జహీరాబాద్, నారాయణఖేడ్; మార్చి 4న బోధన్, నిజామాబాద్; 5న ఆర్మూర్, బాల్కొండ; 6న నిర్మల్, మెట్‌పల్లి; 7, 8, 9 తేదీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాల్లోని నియోజకవర్గాలన్నీ పర్యటిస్తారు. 12 నుంచి బడ్జెట్ సమావేశాలు జరిగే అవకాశం ఉన్నందున తొలిదశ యాత్ర ముగుస్తుంది. సమావేశాల అనంతరం మలి దశ యాత్ర మొదలై మేలో అన్ని నియోజకవర్గాల్లో పర్యటించి జూన్ 1 న భారీ బహిరంగ సభ నిర్వహిస్తారు. దానికి ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ వస్తారు. ఆయన మధ్యలో బస్సు యాత్రకు వచ్చే అవకాశముందని సమాచారం.

కేసీఆర్ పాలనపై నిశ్శబ్ద విప్లవం

- అన్ని వర్గాల్లో పెరుగుతున్న వ్యతిరేకత
- కార్యకర్తల వల్లే కాంగ్రెస్‌కు పూర్వవైభవం: ఉత్తమ్
- కార్యకర్తలు కాంగ్రెస్‌కు వెలకట్టలేని ఆస్తి: పొన్నాల

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల్లో సీఎం కేసీఆర్ పాలనపై వ్యతిరేకత నెలకొందని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆరోపించారు. ఇది నిశ్శబ్ద విప్లవంలా వ్యాపిస్తోందని, ప్రభుత్వ వ్యతిరేకతను ఓట్లుగా మలుచుకునేందుకు ప్రతి నిమిషం విలువైనదిగా భావించి కష్టపడి పనిచేయాలని కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం ఇందిరాభవన్‌లో



గాంధీభవన్‌లో తెలంగాణ గుండె చప్పుడు ఆడియో సీడీని ఆవిష్కరిస్తున్న ఉత్తమ్‌కుమార్ రెడ్డి

జరిగిన ఎన్ఎస్‌యూఐ పూర్వ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం కేసీఆర్ ఈ నాలుగేళ్లలో అమలు చేయలేదని, కనీసం చివరి బడ్జెట్‌లోనైనా నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళితులకు మూడెకరాల భూమి, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, నిరుద్యోగులకు ఉద్యోగాలు తదితర ఏ ఒక్క హామీని అమలు చేయలేదని మండిపడ్డారు. బడ్జెట్‌లో హామీల అమలుకు నిధులు కేటాయించాలన్న డిమాండ్‌తో సోమవారం నుంచి మొదటి విడత 'ప్రజా చైతన్య బస్సు యాత్ర'ను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. 'కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను సీఎం కొనుగోలు చేశారు. కేసులు పెట్టించారు. బీజేపీలోకి పెద్దఎత్తున వలసలు ఉంటాయని ప్రచారం చేశారు. ఇన్ని ప్రతికూల పరిస్థితులను ఎదు రొడ్డి కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పూర్వ వైభవాన్ని సంతరించుకుంది' అని ఉద్వేగంగా అన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ తనకు విశ్వసనీయంగా తెలిపినదాని ప్రకారం ఈ డిసెంబరులోనే ఎన్నికలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి కార్యకర్త, నేత పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో రాహుల్‌గాంధీని ప్రధానిగా చూసే లక్ష్యంతో ప్రతి కార్యకర్త పనిచేయాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బస్సు యాత్రతో టీఆర్ఎస్ పాలనపై టీపీసీసీ దండయాత్ర మొదలుపెట్టిందని వ్యాఖ్యానించారు. ఎన్ఎస్‌యూఐ పూర్వ కార్యకర్తల సమ్మేళనానికి అపూర్వ స్పందన వచ్చిందని టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య అన్నారు. 1977, 1983-84నాటి కార్యకర్తలు నేటి సమావేశానికి హాజరయ్యారని చెప్పారు. వారి అనుభవాలతో త్వరలోనే ఓ పుస్తకాన్ని ప్రచురించే ఆలోచన చేస్తున్నామని చెప్పారు.

వీహెచ్- అనిల్ మధ్య వాగ్వాదం

ఏఐసీసీ కార్యదర్శి వీ. హనుమంతరావు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అనిల్‌కుమార్ యాదవ్ మధ్య సమావేశంలో వాగ్వాదం జరిగింది. వీహెచ్ ప్రసంగిస్తుండగా యూత్ కాంగ్రెస్ కార్యక్రమాల గురించి కూడా మాట్లాడాలని అనిల్ కోరారు. యూత్ కాంగ్రెస్ కార్యక్రమాలకు మాకు సమాచారం ఇవ్వకుండానే నిర్వహిస్తున్నారు.. ఎందుకు మాట్లాడాలి..? అని వీహెచ్ ప్రశ్నించారు. దీంతో ఇరువురు నేతల మధ్య ఉత్తమ్ సమక్షంలోనే వాగ్వాదం చోటు చేసుకుంది. మరోవైపు ఉత్తమ్ సమక్షంలో ఖమ్మం జిల్లా డోర్నకల్ నుంచి టీఆర్ఎస్, టీడీపీలకు చెందిన నేతలు కాంగ్రెస్‌లో చేరారు.

బార్ అసోసియేషన్లకు సహాయం

- అడ్వొకేట్స్ వెల్ఫేర్ ట్రస్టు తీర్మానం

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని బార్ అసోసియేషన్లు, కొత్తగా న్యాయవాదవృత్తిలోకి వచ్చిన వారికి తెలంగాణ అడ్వొకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ద్వారా సహాయ, సహకారాలు అందనున్నాయి. తెలంగాణ ప్రభుత్వ అడ్వొకేట్ జనరల్ కార్యాలయంలో ఆదివారం ట్రస్టు సమావేశం జరిగింది. అడ్వొకేట్ జనరల్ ప్రకాశ్‌రెడ్డి, రాష్ట్ర న్యాయ శాఖ కార్యదర్శి నిరంజన్‌రావు, ప్రభుత్వ ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, ట్రస్టు కార్యదర్శి, ప్రభుత్వ న్యాయ శాఖ లీగల్ అడ్వయిజర్ రామాంజనేయులుతో పాటు ట్రస్టు సభ్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. వివరాలను రామాంజనేయులు మీడియాకు వెల్లడించారు. రాష్ట్రంలోని 18,059 మంది న్యాయవాదులకు రూ. 2 లక్షల ఆరోగ్య బీమాను ట్రస్టు ద్వారా ఉచితంగా అందిస్తామన్నారు. 'ప్రమాదవశాత్తు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా న్యాయవాదులు మృతి చెందితే వారి కుటుంబాలకు రూ. 10 లక్షల సాయం అందనుంది. సభ్యుల సంఖ్యను బట్టి బార్ అసోసియేషన్లకు రూ. 50వేల నుంచి రూ. 5 లక్షల గ్రాంట్‌ను అందిస్తాం. కొత్తగా న్యాయవాద వృత్తిలోకి వచ్చిన (ఐదేళ్ల లోపు) వారికి ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తాం' అని వివరించారు.



అడ్వొకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్ సమావేశంలో పాల్గొన్న ప్రకాశ్ రెడ్డి, నిరంజన్‌రావు తదితరులు



విచారణ జరపండి

- బాధ్యులపై చర్యలు తీసుకోండి
- గొర్రెల విక్రయంపై తలసాని

హైదరాబాద్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పంపిణీ చేసిన సబ్సిడీ గొర్రెలను మార్కెట్ లో విక్రయించడం, ఇతర రాష్ట్రాలకు తరలించడం వంటి ఘటనలపై విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను పశు సంవర్ధక, మత్స్య, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆదేశించారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో వచ్చిన "ఎవరి గొర్రె.. ఎవరు గొర్రె?" కథనంపై ఆయన స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో మంచి ఉద్దేశంతో గొల్ల, కురుమలకు గొర్రెల పంపిణీ కార్యక్రమం చేపట్టిందన్నారు. పుణెలో పర్యటిస్తున్న మంత్రి ఆదివారం నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల కలెక్టర్లతో, గొర్రెలు మరియు మేకల అభివృద్ధి సమాఖ్య మేనేజింగ్ డైరెకర్ లక్ష్మారెడ్డితో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వ లక్ష్యాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

బోన్సాయ్ మొక్కలకు ప్రచారం కల్పించాలి

హైదరాబాద్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): బోన్సాయ్ మొక్కల పెంపకం వల్ల కలిగే ప్రయోజనాలు తెలిసేలా విస్తృత ప్రచారం కల్పించాలని పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఈ మొక్కలను ఔషధ మూలికలుగా అనేక వ్యాధులకు ఉపయోగించినట్లు ఆధారాలు ఉన్నాయన్నారు. మహారాష్ట్రలోని పుణెలో జరుగుతున్న బోన్సాయ్ అంతర్జాతీయ సదస్సు ముగింపు సందర్భంగా ఆదివారం నాటి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇంట్లో బోన్సాయ్ మొక్కలు పెంచితే మనుషులు కూడా ఒత్తిడి నుంచి ఉపశమనం పొందుతారన్నారు. ఇలాంటి సదస్సులు హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తే తెలంగాణ ప్రభుత్వం అన్ని రకాల సహకారం అందిస్తుందన్నారు. పచ్చదనాన్ని పెంపొందించేందుకు తెలంగాణలో హరిత హారం కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.

వయసు పెంపుపై రగడ!

- పదవీ విరమణ వయసు పెంచాల్సిందే
- పెంచితే ఊరుకునే ప్రసక్తే లేదు
- రెండుగా చీలిన వైద్యవిద్య అధ్యాపకులు
- సర్కారుకూ కొరవడిన స్పష్టత

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్య అధ్యాపకుల పదవీ విరమణ వయసు పెంపుపై ప్రొఫెసర్లు రెండు వర్గాలుగా చీలిపోయారు! పదవీ విరమణ వయసును పెంచాల్సిందేనని ఓ వర్గం అంటుండగా.. వద్దని మరో వర్గం డిమాండ్ చేస్తోంది! కొందరు అధ్యాపకులైతే పదవీ విరమణ వయసు పెంపును తీవ్రంగా వ్యతిరేకిస్తూ నాలుగు రోజులుగా గాంధీ ఆస్పత్రితో పాటు నిజామాబాద్, మహబూబ్‌నగర్ వైద్య కళాశాలల్లో ఆందోళనలు కొనసాగిస్తున్నారు. వయసు పెంచాలని మరో వర్గం ప్రభుత్వ పెద్దలతో లాబీయింగ్ చేస్తోంది. తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘంలోనూ రెండు వర్గాలుగా మారారు. ప్రస్తుతం రాష్ట్రంలో వైద్య విద్యను బోధిస్తున్న అధ్యాపకుల పదవీ విరమణ వయసు 58ఏళ్లు. దీన్ని 65కు పెంచాలన్న డిమాండ్ గట్టిగా వినిపిస్తోంది. రాష్ట్రంలో ఏడు బోధనాస్పత్రులున్నాయి. వాటిలో ప్రొఫెసర్ల కొరత కారణంగా వైద్య సీట్లు కోల్పోవాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయని, భారత వైద్య మండలి(ఎంసీఐ) తనిఖీలకు వచ్చే సమయంలో హడావుడిగా ఇతర కళాశాలల్లో పనిచేస్తున్న వారిని రప్పించి తమ కళాశాల అధ్యాపకులుగా చూపిస్తున్నారని కొందరు ప్రొఫెసర్లు చెబుతున్నారు. అధ్యాపకుల పదవీ విరమణ వయసు పెంచితే ఇలాంటి సమస్యలు ఉండవని, ఆంధ్రప్రదేశ్‌లో కూడా పదవీ విరమణ వయసు 63 చేశారని అంటున్నారు. ఇక్కడ కూడా కనీసం 63కు పెంచితే బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు. కొద్ది రోజుల కింద వైద్య ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి జరిపిన సమీక్షలో అధ్యాపకుల పదవీ విరమణ వయసు పెంపుపై చర్చించారు. ఆ సమావేశంలో పెంచాలనే యోచన చేశారు. కానీ, దానిపై పూర్తి స్థాయి నిర్ణయం జరగలేదు.

కొరతపై భిన్నాభిప్రాయాలు

వైద్య విద్యలో అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ పోస్టులుంటాయి. అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు ఐదేళ్ల అనుభవం వస్తే అసోసియేట్ అవుతారు. నాలుగేళ్లు అసోసియేట్ ప్రొఫెసర్‌గా చేస్తే ప్రొఫెసర్ అవుతారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు లేకపోతే నేరుగా భర్తీ చేసుకోవచ్చు. ప్రొఫెసర్లను మాత్రం అనుభవంతోనే భర్తీ చేయాల్సి ఉంటుంది. ఒక ప్రొఫెసర్‌కు 30 ఎంబీబీఎస్, 3 పీజీ సీట్లు ఇస్తారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే ఏడు వైద్య కళాశాలలు ఉన్నాయి. గాంధీ, ఉస్మానియా, కాకతీయ, నిజామాబాద్, రిమ్స్, మహబూబ్‌నగర్‌తో పాటు కొత్తగా ఈ విద్యా సంవత్సరం నుంచి సిద్దిపేట వైద్య కళాశాలలో ప్రవేశాలు ప్రారంభం కానున్నాయి. అన్ని కళాశాలల్లో కలిపి 1,350 ఎంబీబీఎస్, 1,200 పీజీ సీట్లు ఉన్నాయి. కానీ, అందుకు తగ్గట్టుగా ప్రొఫెసర్లు లేరని సీనియర్లు చెబుతున్నారు. మొత్తం 40 శాతం కూడా అధ్యాపకులు లేరంటున్నారు. 2500మంది అవసరం ఉండగా.. కేవలం 1800 మందే ఉన్నారని తెలంగాణ రాష్ట్ర వైద్య అధ్యాపకుల అసోసియేషన్ చెబుతోంది. వైద్య విద్య విభాగం ఉన్నతాధికారులు మాత్రం ఎంసీఐ నిబంధనల మేరకు సరిపడ అధ్యాపకులు ఉన్నారని చెబుతున్నారు. పదవీ విరమణ వయసు పెంచక.. అధ్యాపకుల భర్తీని పూర్తిస్థాయిలో చేపట్టకపోతే ఆ ప్రభావం వైద్య సీట్లపై పడే ప్రమాదం ఉందని నిపుణులు అంటున్నారు.

పెంపుపై ఆందోళనలు

అధ్యాపకుల పదవీ విరమణ పెంపును కొందరు అధ్యాపకులు తీవ్రంగా వ్యతిరేకిస్తూ దశలవారీగా పెద్దఎత్తున ఆందోళనలకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వం ఈ విషయంలో వెంటనే స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు. అవసరమైతే విధులను కూడా బహిష్కరిస్తామని హెచ్చరిస్తున్నారు. మరోవైపు పదవీ విరమణ వయసును పెంచాలని తెలంగాణ ప్రభుత్వ వైద్య అధ్యాపకుల అసోసియేషన్ డిమాండ్ చేస్తోంది. దీనిపై ఇప్పటికే ప్రభుత్వానికి లేఖ రాసింది. అధ్యాపకుల పదవీ విరమణ వయసు 58 నుంచి 65కు పెంచాలని కోరింది.

పెంచితే ఊరుకోం

పదవీ విరమణ వయసును పెంచొద్దు. పెంచితే పదోన్నతులు ఆగిపోతాయి. 70మంది ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు పదవీ విరమణ చేయనున్నారు. వయసు పెంచితే చాలామంది పదోన్నతులు లేకుండానే రిటైరయ్యే ప్రమాదం ఉంటుంది.

-పల్లం ప్రవీణ్, తెలంగాణ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

పెంచకపోతే నష్టమే

అధ్యాపకుల కొరత తీవ్రంగా ఉంది. 4-5 నెలల్లో 70 మంది అధ్యాపకులు పదవీ విరమణ చేయబోతున్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో అధ్యాపకుల కొరత తీవ్రం అవుతుంది. వైద్య సీట్లను కోల్పోయే ప్రమాదం ఉంది.

-నర్సింహారావు, రాష్ట్ర ప్రభుత్వ వైద్య అధ్యాపకుల సంఘంజనరల్ సెక్రటరీ

భూవివాదాల పరిష్కారానికి ప్రత్యేక ట్రైబ్యునళ్లు

- జిల్లాల్లో రెండంచెల రెవెన్యూ కోర్టులుండాలి
- భూవివాదాలపై ఏటా 25 వేల కోట్లు ఖర్చు
- రౌండ్‌టేబుల్ భేటీలో నిపుణులు

హైదరాబాద్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): భూవివాదాల పరిష్కారానికి ప్రత్యేక ట్రైబ్యునళ్లు అవసరమని, జిల్లా స్థాయిలో రెండంచెల రెవెన్యూ కోర్టులను ఏర్పాటు చేయాలని న్యాయ, రెవెన్యూ నిపుణులు అభిప్రాయపడ్డారు. "దేశంలో భూవివాద పరిష్కార వ్యవస్థలు-రెవెన్యూ కోర్టులు" అన్న అంశంపై ఆదివారం నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో హైకోర్టు మాజీ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రకాశ్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు రెవెన్యూ, న్యాయ నిపుణులు మాట్లాడుతూ.. శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న పద్ధతులను అధ్యయనం చేయాలన్నారు. దేశంలో 66%, రాష్ట్రంలో 68% కోర్టు కేసులు భూములకు సంబంధించినవేనని, భూవివాదాల వల్ల సామాన్య ప్రజలు ఏటా రూ.25 వేల కోట్లు ఖర్చు చేయాల్సి వస్తోందన్నారు. జస్టిస్ ప్రకాశ్‌రావు మాట్లాడుతూ.. భూవివాదాలను పరిష్కరించడంలో తహసీల్దార్లు, ఆర్డీవోలు కీలకంగా పనిచేయాలని సూచించారు. వీరిచ్చిన ఆర్డర్లపై అప్పీల్ చేసుకునేందుకు జిల్లా స్థాయిలో ఓ ప్రత్యేక ట్రైబ్యునల్ ఉండాలన్నారు. ఈ ట్రైబ్యునల్‌లో జిల్లా రిటైర్డ్ జడ్జి, రెవెన్యూ శాఖకు చెందిన ఉన్నతాధికారి ఉంటే మేలు జరుగుతుందన్నారు. సమావేశంలో నల్సార్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ బాలకిష్టారెడ్డి, తెలంగాణ తహసీల్దార్ల అసోసియేషన్ అధ్యక్షుడు లచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిపుణుల సూచనలు

- జిల్లాకో ప్రత్యేక ట్రైబ్యునల్ ఏర్పాటు చేయాలి. ఇందులో న్యాయ, రెవెన్యూ నిపుణులుండాలి.
- ఇతర రాష్ట్రాల్లోని ట్రైబ్యునల్ పనితీరును అధ్యయనం చేయాలి.
- ఒక ఆర్డర్ వచ్చాక ఒకేసారి వివిధ కోర్టుల్లో అప్పీల్ చేసుకునే అవకాశం ఉండకూడదు.
- దేశమంతా ఒకే సర్వే విధానం ఉండాలి.
- అటవీ, దేవాదాయ శాఖలతోనూ రెవెన్యూ శాఖకు సమన్వయం ఉండాలి.
- రెవెన్యూ సిబ్బందికి భూపరిపాలనకు సంబంధించి ఎక్కువ సమయం కేటాయించే అవకాశం కల్పిస్తూ ఇతర పనులు తగ్గించాలి.

నీట్ సందేహాలు సమాధానాలు

నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్) - యూజీ నోటిఫికేషన్ వెలువడింది. దేశ వ్యాప్తంగా మెడికల్, డెంటల్ కోర్సుల్లో ప్రవేశానికి ఉద్దేశించిన ఈ పరీక్షను మే 6న సీబీఎస్ఈ (సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్) నిర్వహిస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో ఈ పరీక్ష గురించి జరిగిన చర్చ మరే పరీక్ష విషయంలో జరగలేదని చెప్పొచ్చు. తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ప్రత్యేక నిబంధనల కారణంగా ఈ పరీక్షకు మన విద్యార్థులు అర్హులేనా? సెంట్రల్ పూల్‌లో చేరితే లాభమా? నష్టమా? సిలబస్ తదితర అంశాలపై విద్యార్థులు, తల్లిదండ్రులకు ఎన్నో సందేహాలు. ఈ నేపథ్యంలో ఆయా సందేహాలకు సమాధానాలివిగో..



ప్ర: నీట్ నిర్వహణలో సీబీఎస్ఈ పాత్ర?

జ: నీట్ విషయంలో సీబీఎస్ఈ పాత్ర పరిమితంగానే ఉంటుంది. పరీక్ష నిర్వహణ, ఫలితాల వెల్లడి, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖకు ఆల్ ఇండియా ర్యాంకుల జాబితాను పంపించడం వరకు సీబీఎస్ఈ బాధ్యత. ఈ జాబితా ద్వారానే ఆల్ ఇండియా కోటా కింద ఉండే 15 శాతం సీట్లకు కౌన్సిలింగ్ నిర్వహిస్తారు. ఏఎఫ్ఎంసీ, ఈఎస్ఐ, బీహెచ్‌యూ, ఏఎంయూ, డీమ్డ్ యూనివర్సిటీలు ఆల్ ఇండియా కోటాలో ఉంటాయి.

ప్ర: పరీక్షలో తెలుగు మాధ్యమాన్ని ఎంచుకుంటే ఆల్ ఇండియా కోటాకు పోటీ పడొచ్చా?

జ: మాధ్యమంతో ఎటువంటి సంబంధం లేదు. నీట్‌లో నిర్దేశించిన విధంగా అర్హత సాధిస్తే చాలు, ఆల్ ఇండియా కోటాకు పోటీ పడొచ్చు.

ప్ర: నీట్ రాయడానికి కావల్సిన అర్హతలు, వయోపరిమితి?

జ: 50 శాతం మార్కులతో (ఓబీసీ / ఎస్సీ / ఎస్టీ విద్యార్థులకు 40 శాతం, జనరల్ దివ్యాంగులు 45 శాతం, మిగతా కేటగిరీ దివ్యాంగులకు 40 శాతం చాలు) 12వ తరగతి / తత్సమానం (ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ / బయోటెక్నాలజీ, ఇంగ్లీష్ సబ్జెక్టులతో) పూర్తి చేసిన వారు అర్హులు. చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

వయసు: 17 ఏళ్లు (డిసెంబర్ 31, 2018) నాటికి. నిబంధనల మేరకు ఓబీసీ / ఎస్సీ / ఎస్టీ / దివ్యాంగులకు వయోపరిమితిలో ఐదేళ్ల సడలింపు ఉంటుంది.

ప్ర: నీట్ ద్వారా కాకుండా ఎంబీబీఎస్ / బీడీఎస్ కోర్సుల్లో చేరే అవకాశం ఉందా?

జ: లేదు. దేశంలో (ఎయిమ్స్, జిప్‌మర్ మినహా) అన్ని రకాల కాలేజీలు / యూనివర్సిటీల్లోని ఎంబీబీఎస్ / బీడీఎస్ కోర్సుల్లో 100 శాతం సీట్లను (మేనేజ్‌మెంట్ / ఎన్ఆర్ఐ కోటా కూడా) నీట్ ద్వారానే భర్తీ చేయాలి. మరే విధమైన ప్రక్రియలో సీట్లను భర్తీ చేయడానికి అవకాశం లేదు.

ప్ర: నీట్‌ను ఎన్ని ప్రాంతీయ భాషల్లో నిర్వహిస్తున్నారు?

జ: హిందీ, ఇంగ్లీష్‌తోపాటు తెలుగు, కన్నడ, బెంగాలీ, గుజరాతీ, మరాఠీ, ఒరియా, ఉర్దూ, తమిళం, అస్సామీ భాషల్లో కూడా నీట్‌ను నిర్వహిస్తారు. తెలుగు విద్యార్థులకు ప్రశ్నపత్రం తెలుగు / ఇంగ్లీష్ భాషల్లో ఉంటుంది. అనువాదంలో ఏవైనా దోషాలు ఉంటే ఇంగ్లీష్ ప్రశ్నను ప్రామాణికంగా తీసుకోవాలి. ఇంగ్లీష్‌ను లాంగ్వేజ్‌గా ఎంచుకున్న వారికి ఇంగ్లీష్‌లో మాత్రమే ప్రశ్నపత్రం ఉంటుంది.

ప్ర: ఎంచుకున్న పరీక్ష కేంద్రాన్ని సీబీఎస్ఈ మార్చే అవకాశం ఉందా?

జ: ఉంది. ఈ విషయంలో సీబీఎస్ఈకి పూర్తి అధికారాలు ఉన్నాయి. విద్యార్థి ఆప్షన్ ఇచ్చిన మూడు సెంటర్లు కాకుండా మరో కేంద్రాన్ని కేటాయించే అధికారం సీబీఎస్ఈకి ఉంది. అంతేకాకుండా రోల్ నెంబర్ అలాట్‌మెంట్ అయిన తరవాత పరీక్ష కేంద్రాన్ని మార్చుకునే అవకాశం లేదు.

ప్ర: దరఖాస్తు సమయంలో వివరాలను తప్పుగా నమోదు చేస్తే, తిరిగి వాటిని సరి చేసుకునే అవకాశం ఉంటుందా?

జ: దరఖాస్తును పూర్తి చేసే ముందు ఇన్ఫర్మేషన్ బులెటిన్‌ను జాగ్రత్తగా చదవడం మంచిది. తద్వారా తప్పులకు అవకాశం ఉండదు. ఏవైనా తప్పులు దొర్లి ఉంటే వాటిని సరి చేసుకోవడానికి దరఖాస్తు గడువు ముగిసిన వారం తరవాత అవకాశం ఇస్తారు. ఆ సమయంలో వివరాలను సరి చేసుకోవాలి. అటుపై తిరిగి అవకాశం ఇవ్వరు.

ప్ర: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ ద్వారా ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్, బయాలజీ సబ్జెక్టులతో 12వ తరగతి పూర్తి చేసిన వారు నీట్‌కు అర్హులేనా?

జ: కాదు. గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించి చేసిన చట్ట సవరణ మేరకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ లేదా ప్రైవేట్‌గా ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్, బయాలజీ సబ్జెక్టులతో 12వ తరగతి పూర్తి చేసిన వారు నీట్‌కు అనర్హులు. అంతేకాకుండా 10+2 స్థాయిలో బయాలజీ / బయోటెక్నాలజీని అదనపు సబ్జెక్ట్‌గా చదివిన వారు కూడా అనర్హులే.



ప్ర: ఆల్ ఇండియా కోటా 15 శాతంలో రిజర్వేషన్లు ఏవిధంగా ఉంటాయి?

జ: ఆల్ ఇండియా కోటాలోని 15 శాతం సీట్లలోని మొత్తంలో 15 శాతం సీట్లను ఎస్సీ విద్యార్థులకు, 7.5 శాతం సీట్లను ఎస్టీ విద్యార్థులకు కేటాయిస్తారు. 27 శాతం సీట్లను ఓబీసీ (నాన్ క్రీమీలేయర్) విద్యార్థులతో భర్తీ చేస్తారు. దివ్యాంగులకు 5 శాతం సీట్లు ఉంటాయి.

ప్ర: మెరిట్ లిస్ట్‌ను రూపొందించడానికి కనీస ప్రాతిపదిక ఏమిటి?

జ: నీట్‌లో కనీసం 50 శాతం పర్సంటైల్ మార్కులను మెరిట్ లిస్ట్ రూపకల్పనలో ప్రామాణికంగా తీసుకుంటారు. ఓబీసీ / ఎస్సీ / ఎస్టీ / దివ్యాంగులకు ఇది 40 శాతంగా ఉంది. జనరల్ కేటగిరీ దివ్యాంగులకు 45 శాతం పర్సంటైల్ కావాలి.

ప్ర: రాష్ట్రాలు ప్రత్యేకంగా మెరిట్ లిస్ట్‌ను రూపొందిస్తాయా?

జ: ఆల్ ఇండియా ర్యాంక్, కేటగిరి ప్రాతిపదికగా రాష్ట్రాలు ప్రత్యేకంగా మెరిట్ లిస్ట్‌ను రూపొందించుకుంటాయి. దాని ఆధారంగా ప్రవేశాలను నిర్వహిస్తాయి.

ప్ర: నీట్ ఫలితాలను ఎప్పుడు ప్రకటిస్తారు? ఏవిధంగా తెలుసుకోవచ్చు?

జ: నీట్ ఫలితాలను జూన్ 5న విడుదల చేస్తారు. ఫలితాలను www.cbseneet.nic.in, www.cbseresults.nic.in ద్వారా తెలుసుకోవచ్చు.

ప్ర: నీట్ పరీక్షకు సంబంధించి పూర్తి గైడ్‌లైన్స్‌ను ఎక్కడ నుంచి పొందొచ్చు.

జ: నీట్ పరీక్షకు సంబంధించిన గైడ్‌లైన్స్ (ఇన్ఫర్మేషన్ బులెటిన్)ను నీట్ - యూజీ 2018 వెబ్‌సైట్ (cbseneet.nic.in) నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ప్ర: నీట్ స్కోర్ ఎంత కాలం చెల్లుబాటవుతుంది?

జ: నీట్ స్కోర్ 2018-19 విద్యా సంవత్సరానికి మాత్రమే చెల్లుబాటవుతుంది.

ప్ర: పరీక్ష కేంద్రానికి ఎప్పుడు చేరుకోవాలి? వెంట ఏమి తీసుకురావాలి?

జ: దేశ వ్యాప్తంగా మే 6న నీట్ పరీక్షను నిర్వహిస్తారు. ఆ రోజు ఉదయం 7.30 నుంచి పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు. 9.30 తరవాత అనుమతించరు. పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోగ్రాఫ్‌ను అతికించిన అడ్మిట్ కార్డును విద్యార్థులు పరీక్ష కేంద్రానికి తీసుకు రావాలి. పరీక్ష రాయడానికి ఉపయోగపడేవి తప్ప మిగతా ఏవిధమైన వస్తువులను తీసుకురావడానికి వీల్లేదు.

ప్ర: అడ్మిట్ కార్డులను ఏవిధంగా పొందాలి?

జ: అడ్మిట్ కార్డులను ఎవరికీ నేరుగా పంపరు. వెబ్‌సైట్ నుంచి అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవాలి.

ప్ర: ఓఎంఆర్ షీట్స్‌ను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తారా? ఆన్సర్ షీట్‌ను రీచెక్ చేసే అవకాశం ఉంటుందా?

జ: ఓఎంఆర్ షీట్, రెస్పాన్సెస్‌ను మెషీన్ ద్వారా ఇమేజ్ రూపంలోకి మారుస్తారు. వీటిని వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తారు. అప్పుడు వాటిని వీక్షించవచ్చు. అయితే రీచెకింగ్ సౌకర్యం మాత్రం ఉండదు.

ప్ర: ఏవైనా సందేహాలు ఉంటే ఓఎంఆర్ షీట్, రెస్పాన్సెస్‌ను చాలెంజ్ చేయవచ్చా?

జ: ఏవైనా సందేహాలు ఉంటే ఓఎంఆర్ షీట్, రెస్పాన్సెస్‌ను చాలెంజ్ చేయవచ్చు. ఇందుకు ఆన్‌లైన్‌లో ప్రతి రెస్పాన్స్‌కు రూ. 1000 ఫీజుగా చెల్లించాలి. అయితే చాలెంజ్‌ను అంగీకరించినప్పటికీ కూడా రూ. 1000ని తిరిగి చెల్లించరు.

ప్ర: ఈ-మెయిల్, ఫోన్ వివరాలను తప్పుగా ఎంటర్ చేస్తే ఎలా?

జ: రిజిస్ట్రేషన్ సమయంలో ఈ-మెయిల్, ఫోన్ వివరాలను ఒకటికి రెండు సార్లు సరి చూసుకోవాలి. ఎందుకంటే ఒక్కసారి వివరాలను తప్పుగా నమోదు చేస్తే తిరిగి సరి చేసుకునే అవకాశం ఉండదు.

ప్ర: రిజిస్ట్రేషన్ సమయంలో జనరల్ కేటగిరీ తప్పుగా ఎంచుకున్నాను. అదే కేటగిరీ ఫీజును చెల్లించాను. దీన్ని ఏవిధంగా సరి చేసుకోవాలి?

జ: నమోదు చేసిన వివరాలను ఎడిట్ చేసుకునే అవకాశం కల్పిస్తారు. ఆ సమయంలో వివరాలను సరి చేసుకోవాలి. ఫీజులో ఏదైనా తేడా ఉంటే దాన్ని కూడా చెల్లించాల్సి ఉంటుంది.

ప్ర: నీట్ రాసే విషయంలో ఏవైనా పరిమితులు ఉన్నాయా?

జ: నీట్ రాసే విషయంలో ఎటువంటి పరిమితులు లేవు. ఆసక్తి మేరకు ఎన్నిసార్లయినా నీట్ రాయొచ్చు.

ప్ర: ఇటీవల ఆధార్ నెంబర్‌ను జారీ చేశారు. దరఖాస్తు సమయంలో ఆధార్ వివరాలు మ్యాచ్ కావడం లేదనే మెసేజ్ వస్తుంది. ఏం చేయాలి?

జ: ఆధార్ వివరాలను యూఐడీఏఐ మెయిన్ సర్వర్‌లో అప్‌లోడ్ చేయకుంటే ఇటువంటి సమస్యలు వస్తాయి. ఆ సమయంలో ఆధార్ నెంబర్ బదులు 17 అంకెల ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ నెంబర్‌ను నమోదు చేయాలి. తరవాత సెలెక్షన్ ఐడెంటిఫికేషన్ టైప్ కాలమ్‌లో ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ నెంబర్‌ను ఎంచుకోవాలి.

ప్ర: నీట్ ద్వారా ఎన్ని రకాల సీట్లను భర్తీ చేస్తారు?

జ: నీట్ ద్వారా ఆల్ ఇండియా కోటా, రాష్ట్ర ప్రభుత్వాల కోటా, సెంట్రల్ ఇన్‌స్టిట్యూషన్స్ / యూనివర్సిటీలు / డీమ్డ్ యూనివర్సిటీలు, సెంట్రల్ పూల్ కోటాలోని సీట్లను భర్తీ చేస్తారు. ప్రైవేట్ మెడికల్ / డెంటల్ కాలేజీల్లోని స్టేట్ / మేనేజ్‌మెంట్ / ఎన్ఆర్ఐ కోటా సీట్లకు కూడా నీట్ ర్యాంక్‌నే ప్రాతిపదికగా తీసుకుంటారు.

ఎగ్జామ్ గైడ్

ప్ర: ఆల్ ఇండియా కోటా అంటే ఏమిటి?

జ: సుప్రీం కోర్టు తీర్పు కారణంగా దేశ వ్యాప్తంగా మెడికల్, డెంటల్ కోర్సుల్లో ప్రవేశం పొందాలంటే నీట్‌లో అర్హత సాధించటం (ఎయిమ్స్, జిప్‌మర్ సంస్థలకు మినహాయింపు ఉంది) తప్పనిసరి. ఈ పరీక్షలో భాగస్వామ్యమైన అన్ని రాష్ట్రాలు.. తమ రాష్ట్రాల్లోని మెడికల్ / డెంటల్ కోర్సుల్లో 15 శాతం సీట్లను ఆల్ ఇండియా కోటాకు కేటాయించాల్సి ఉంటుంది. వీటినే ఆల్ ఇండియా కోటా సీట్లుగా పేర్కొంటారు. ఆల్ ఇండియా కోటాలోని 15 శాతం సీట్ల కోసం ఎవరైనా పోటీ పడొచ్చు. దీనికి సంబంధించిన మెరిట్‌లిస్ట్‌ను సీబీఎస్ఈ రూపొందిస్తుంది. దాని ఆధారంగా ఆన్‌లైన్‌లో కౌన్సిలింగ్ నిర్వహిస్తుంది. ఏఎఫ్ఎంసీ, ఈఎస్ఐ, బీహెచ్‌యూ, ఏఎంయూ, డీమ్డ్ యూనివర్సిటీలు ఆల్ ఇండియా కోటాలో ఉంటాయి. ఆల్ ఇండియా కోటా పోగా మిగతా 85 శాతం సీట్లను స్థానిక విద్యార్థులతో ఆయా రాష్ట్రాలు భర్తీ చేస్తాయి. ఈ సందర్భంలో ఆయా రాష్ట్రాల్లోని రిజర్వేషన్లకు అనుగుణంగా అడ్మిషన్లను నిర్వహిస్తారు.

ప్ర: ఈ సారి పరీక్షా విధానం, సిలబస్‌లో ఏవైనా మార్పులు జరిగాయా?

జ: లేదు. గతంలో మాదిరిగానే నీట్‌ను ఆఫ్‌లైన్‌లో (పెన్ అండ్ పేపర్) ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ నుంచి 180 ప్రశ్నలు ఇస్తారు. సరైన సమాధానానికి 4 మార్కుల చొప్పున 720 మార్కులకు పరీక్ష ఉంటుంది. నెగిటివ్ మార్కింగ్ కూడా ఉంది. ప్రతి తప్పునకు ఒక మార్కు కోత విధిస్తారు. సమాధానాలను గుర్తించడానికి మూడు గంటల (180 నిమిషాలు) సమయం ఇస్తారు. సిలబస్‌లో కూడా ఎటువంటి మార్పులు లేవు.

ప్ర: సిలబస్ ఏవిధంగా ఉంటుంది?

జ: మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) 2013లో నిర్దేశించిన ఉమ్మడి సిలబస్ ఆధారంగా నీట్ ప్రశ్నపత్రాన్ని రూపొందిస్తారు.

ప్ర: తెలుగు భాషను ఎంచుకున్న వారు పరీక్ష కేంద్రంగా ఢిల్లీని ఎంపిక చేసుకోవచ్చా?

జ: తెలుగు భాషను ఎంచుకున్నవారు పరీక్ష కేంద్రంగా ఢిల్లీని ఎంపిక చేసుకునే అవకాశం లేదు. దేశంలోని మిగతా నగరాలకు కూడా ఈ నియమం వర్తిస్తుంది. పరీక్ష కేంద్రం కేటాయింపు పూర్తిగా కంప్యూటర్ ద్వారా జరుగుతుంది. అభ్యర్థి ఎంచుకున్న ప్రాంతీయ భాషను బట్టి సంబంధిత రాష్ట్రంలోని పరీక్ష కేంద్రాన్ని మాత్రమే ఎంచుకోవాలి. ఆ రాష్ట్రంలో మాత్రమే సదరు భాష ప్రశ్నపత్రాన్ని అందిస్తారు. మరేతర రాష్ట్రం లేదా కేంద్రంలో అందుకు అవకాశం లేదు. కాబట్టి స్వరాష్ట్రంలోని పరీక్ష కేంద్రాన్ని ఎంపిక చేసుకోవాలి. అంతేకాకుండా పరీక్ష మాధ్యమాన్ని ఒకసారి ఎంపిక చేసుకున్న తరవాత మార్చుకోవడానికి కూడా వీల్లేదు.

ప్ర: తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఆల్ ఇండియా కోటాలోని 15 శాతం సీట్లకు పోటీ పడొచ్చా? ప్రవేశాలకు సంబంధించి ఎటువంటి నిబంధనలను పాటిస్తారు?

జ: తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఆల్ ఇండియా కోటాలోని 15 శాతం సీట్లకు పోటీ పడొచ్చు. ఈ మేరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు తమ సమ్మతిని తెలియజేస్తూ ఉత్తరాలు కూడా రాశాయి. ఈ క్రమంలో తమ రాష్ట్రాల్లోని సీట్లలో 15 శాతం సీట్లను ఆల్ ఇండియా కోటాకు ఇవ్వడానికి కూడా అంగీకరించాయి. కాబట్టి తెలుగు విద్యార్థులు ఆల్ ఇండియా కోటాకు పోటీపడొచ్చు. ఈ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లోని సీట్లను 15:15:70 నిష్పత్తిలో భర్తీ చేస్తారు. అంటే ఆల్ ఇండియా కోటాకు 15 శాతం సీట్లు, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల కోటా 15 శాతం సీట్లు (ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం కారణంగా), స్థానికులకు 70 శాతం సీట్లు అందుబాటులో ఉంటాయి. తెలుగు రాష్ట్రాల విద్యార్థులు గమనించాల్సిన మార్పు.. ఈ సంవత్సరం నుంచి ఆయుష్ కోర్సులకు (ఆయుర్వేద, హోమియోపతి, యునానీ, నేచురోపతి వంటివి) కూడా నీట్ ర్యాంక్‌నే ప్రాతిపదికగా తీసుకుంటారు. వ్యవసాయ, ఫార్మసీ కోర్సుల కోసం ఎంసెట్ రాయాల్సి ఉంటుంది.

జాబ్ కార్నర్

కేంద్రీయ విద్యాలయ

హైదరాబాద్ - ఉప్పల్‌లోని కేంద్రీయ విద్యాలయ (1, 2) కాంట్రాక్ట్ ప్రాతిపదికన టీచర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.


- **కాంట్రాక్ట్ వ్యవధి:** 2019 మార్చి 31 వరకు
- **అర్హత:** పీజీటీ పోస్టులకు సంబంధిత విభాగంలో కనీసం 50 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణులై ఉండాలి. లేదా రెండేళ్ల ఇంటిగ్రేటెడ్ పోస్ట్‌గ్రాడ్యుయేట్ తోపాటు బీఈడీ లేదా తత్సమాన అర్హత ఉండాలి.
- టీజీటీ పోస్టులకు నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ డిగ్రీ కోర్సు లేదా 50 శాతం మార్కులతో జనరల్ డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. సీటెట్ పేపర్ - 2 అర్హత పొంది ఉండాలి. కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ / స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా
- **ఇంటర్వ్యూకి అర్హులైన అభ్యర్థుల జాబితా విడుదల తేదీ:** మార్చి 12
- **ఇంటర్వ్యూ / స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించే తేదీలు:** పీజీటీ (కంప్యూటర్ సైన్స్ / హిందీ / ఫైనాన్షియల్ మార్కెటింగ్ మేనేజ్‌మెంట్) / టీజీటీ (సోషల్ స్టడీస్/ హిందీ / సంస్కృతం / ఆర్ట్ ఎడ్యుకేషన్) / ప్రైమరీ టీచర్ / డేటా ఎంట్రీ ఆపరేటర్/ జర్మన్ టీచర్/ ఆర్ట్ & క్రాఫ్ట్ కోచ్ పోస్టులకు మార్చి 14; కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్ / ఎడ్యుకేషనల్ కౌన్సెలర్/ యోగా కోచ్ / డ్యాన్స్ కోచ్ / డాక్టర్ / స్టాఫ్ నర్స్ / స్పోర్ట్స్ కోచెస్ (తాక్వాండో/ హాకీ/ రోప్ స్కిప్పింగ్) పోస్టులకు మార్చి 15
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 3, 2018.
- **హార్డ్‌కాపీ చేరేందుకు చివరి తేదీ:** మార్చి 7, 2018.
- **చిరునామా:** The Principal, K.V.No. 1, Uppal, Hyderabad
- **వెబ్‌సైట్:** www.kv2uppal.edu.in

భారత పునరుజ్జీవన ఉద్యమానికి పునాది...

పోటీ పరీక్షల ప్రత్యేకం
హిస్టరీ

పందొమ్మిదో శతాబ్దం ప్రారంభం నాటికి భారతదేశంలో అనేక మూఢ విశ్వాసాలు, దురాచారాలు ఉండేవి. అవి... సతీసహగమనం, బాల్య వివాహాలు, విగ్రహారాధన, వితంతు వివాహాలకు వ్యతిరేకత, దేవదాసీ వ్యవస్థ మొదలైనవి. వీటికి వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం కోసం సాంఘిక, సాంస్కృతిక పునరుజ్జీవ ఉద్యమాలు జరిగాయి.

రాజా రామ్మోహన్ రాయ్‌ని మనదేశంలో పునరుజ్జీవ ఉద్యమాలకు ఆద్యుడిగా చెబుతారు. ఇతడు నశించి పోతున్న హిందూ సమాజానికి, మతానికి పునరుజ్జీవనం కల్పించాడు.



రాజా రామ్మోహన్ రాయ్

ఇతడు 1774లో బెంగాల్‌లోని రాధానగర్‌లో జన్మించాడు. కానీ ఇతని జీవిత కథ - లేఖలు ప్రచురించిన సోఫియా డాబ్సన్ కేలెట్ మాత్రం రామ్మోహన్ రాయ్ 1772లో పుట్టినట్లు పేర్కొంది. ఇతని తండ్రి రమాకాంత్ రాయ్. రామ్మోహన్ రాయ్ ముస్లిం సంస్కృతి, సంఘీభావాలతో ప్రభావితమై 16 ఏళ్ల వయసులో విగ్రహారాధనను ఖండిస్తూ ఒక భాష్యాన్ని రచించాడు. కుటుంబంలో జరిగిన కొన్ని సంఘటనలతో మనసు చలించి సమాజంలో ఉన్న మూఢ విశ్వాసాలను తొలగించడానికి పూనుకున్నాడు. 1804 - 14 కాలంలో ఈస్టిండియా కంపెనీ ఉద్యోగిగా జాన్ డిగ్బీ వద్ద కొంతకాలం పని చేశాడు. సతీ సహగమనాన్ని వ్యతిరేకిస్తూ తీవ్ర పోరాటం చేశాడు. ఇతని కృషి ఫలితంగా 1829లో సతీ సహగమనాన్ని నిషేధించారు. హరి హరానంద తీర్థ స్వామి పండితుని సహాయంతో తాంత్రిక గ్రంథాలు ప్రతిపాదించాడు. ఇతని కృషి ఫలితంగా 1835లో బెంటింగ్ ఆంగ్ల విద్యను ప్రవేశ పెట్టాడు. ఇతన్ని భారతదేశపు మొదటి ఆధునిక మానవునిగా భావిస్తారు. 1825లో వేదాంత విద్యాలయాన్ని నెలకొల్పి ఏకేశ్వరోపాసన బోధించాడు. 1825లో ఆగస్టు 20న కలకత్తాలో బ్రహ్మ సమాజాన్ని స్థాపించాడు.

బ్రహ్మ సమాజం

బ్రహ్మ సమాజానికి మొదటి సెక్రటరీ తారాచంద్ చక్రవర్తి. బ్రహ్మ సమాజం విగ్రహారాధనను, బహుదేవతారాధనను తిరస్కరించింది. శనివారం సాయంత్రాల్లో తరచుగా జరిగే బ్రహ్మ సమాజ సభల్లో ఉపనిషత్తుల అధ్యయనం జరిగేది. ఏకేశ్వరోపాసన ఈ సమాజ ముఖ్య లక్ష్యం. అందుకే ఈ సమాజాన్ని ఏక భగవానుని సమాజం అంటారు. ఈ సమాజీకులు గాయత్రీ మంత్రాన్ని ఇష్టపడేవారు.

రచించిన గ్రంథాలు

రాజా రామ్మోహన్ రాయ్ 12 భాషలను నేర్చుకొన్నాడు. అన్ని మత గ్రంథాలను అధ్యయనం చేశాడు. మతాలన్నింటిలో చెడు అంశాలు ఉన్నాయని హిందూ మతంలోని లోటుపాట్లను సరిదిద్దుకుంటే ఇంతకు మించిన మతం ఉండదని తెలియజేశాడు. బైబిల్‌ని అధ్యయనం చేసి జీసెస్ నైతిక ఆధ్యాత్మిక విలువలను వివరిస్తూ గ్రంథాలు రచించాడు. వేదాంత సారం, జీసెస్ బోధనలు (1820), శాంతి సంతోషాలకు మార్గం, క్రీస్తు సూక్తులు అనే గ్రంథాలు రచించారు. పర్షియన్ మత గ్రంథాలను అధ్యయనం చేసి గిఫ్ట్ టు మోనోథీయిస్ట్ (పర్షియా), ఖురాన్‌ను అధ్యయనం చేసి తహవత్ ఉల్ బహవద్దీన్ (1803) అనే గ్రంథాలను రాశాడు.

రాజా రామ్మోహన్ రాయ్ బిరుదులు

- భారతదేశ పునరుజ్జీవ పితామహుడు, పయనీర్ ఆఫ్ న్యూ ఇండియా, భారత సాంస్కృతిక పునరుజ్జీవ పితామహుడు, ప్రాక్‌పశ్చిమ ఆలోచనా విధానాల సమ్మేళనానికి ప్రతినిధి, రాజా (మొగల్ చక్రవర్తి 2 అక్బర్ ఇచ్చింది) బిరుదులు ఉన్నాయి.

స్థాపించిన పత్రికలు

- మిరాతే - ఉల్ - అక్బర్ (పర్షియా భాష - వార పత్రిక)
- సంవాద కౌముది (బెంగాలీ - వార పత్రిక, ఇది భారతీయులు ప్రారంభించిన మొదటి పత్రిక)
- బంగదూత్

సమాజ కార్యక్రమాలు

రాజా రామ్మోహన్ రాయ్ తన స్నేహితులైన అలెగ్జాండర్ డఫ్ (స్కాటిష్ మిషనరీ సభ్యుడు), డేవిడ్ హర్వారీ (డచ్ వాచీ తయారీదారుడు)ల ప్రోత్సాహంతో బెంగాల్‌లో హిందూ కళాశాల (1817), వేదాంత కళాశాల (1825)ను స్థాపించాడు.

వేదాలు, ఉపనిషత్తులు ఏకేశ్వరోపాసనను సమర్థిస్తున్నాయని చెబుతూ వాటిలోని కొన్ని శ్లోకాలను బెంగాలీ భాషలోకి అనువదించాడు. వారసత్వపు హక్కు, సంపద హక్కులను మహిళలకు కల్పించడం కోసం కృషి చేశాడు. జ్యూరీ చట్టాన్ని రద్దు చేయాల్సిందిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాడు. భారతదేశంలో పాశ్చాత్య భావాలను పెంపొందించడానికి ప్రయత్నించాడు. ఇతడు సామ్రాజ్యవాద వ్యతిరేకి. 1828లో దక్షిణ అమెరికాలో స్పానిష్ తిరుగుబాటు విజయవంతమైనందుకు ప్రజా విందు ఇచ్చాడు.

మరణం

1833లో మొగల్ చక్రవర్తి రెండో అక్బర్ పని నిమిత్తం లండన్ వెళ్లి అక్కడ బ్రిస్టల్ స్టేపుల్‌టన్‌లో సెప్టెంబరు 27న మరణించాడు. బ్రిస్టల్ నగరంలోనే రామ్మోహన్ రాయ్ సమాధి ఉంది. అనంతరం రామచంద్ర విద్యా బగీష్ బ్రహ్మ సమాజానికి ప్రధాన ప్రతినిధి అయ్యాడు. బ్రహ్మ సమాజ సిద్ధాంతాలపై సమాచార చంద్రికలో వ్యాసాలు వచ్చేవి. దేవేంద్రనాథ్ ఠాగూర్, కేశవ చంద్ర సేన్‌లు బ్రహ్మ సమాజ సిద్ధాంతాలను వ్యాప్తి చేశారు.



బి.వి. నారాయణరెడ్డి



మేరీ రజత పంచ్

అమిత్‌కు స్వర్ణం

సోఫియా (బల్గేరియా): స్ట్రాండ్జా బాక్సింగ్ మెమోరియల్ టోర్నమెంట్‌లో భారత బాక్సర్లు అదరగొట్టారు. ఈ అంతర్జాతీయ ఈవెంట్‌లో హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగిన ఒలింపిక్ పతక విజేత మేరీకోమ్, సీమా పూనియా రజత పతకాలు సాధించగా.. యువ బాక్సర్ అమిత్ ఫాంగాల్ స్వర్ణ పతకంతో మెరిశాడు. పురుషుల 49 కిలోల కేటగిరి ఫైనల్లో అమిత్.. మొరాకో బాక్సర్ సయ్యద్ మొర్దాజీని చిత్తుచేసి వరుసగా రెండో అంతర్జాతీయ స్వర్ణం సాధించాడు. గతనెల ఇండియా ఓపెన్‌లోనూ అమిత్ విజేతగా నిలిచాడు. మహిళల 48 కిలోల విభాగం ఫైనల్లో మేరీ.. సెవెదా అసెనోవా (బల్గేరియా) చేతిలో ఓడి రజతంతో సంతృప్తిపడింది. సీమ (+ 81 కి.) తుదిపోరులో అన్నా ఇవనోవా (రష్యా) చేతిలో ఓడింది.

సమీర్‌దే స్విస్ ఓపెన్

బాసెల్ (స్విట్జర్లాండ్): భారత స్టార్ షట్లర్ సమీర్ వర్మ అంతర్జాతీయ వేదికపై సత్తాచాటాడు. మధ్యప్రదేశ్‌కు చెందిన ఈ యువ షట్లర్ స్విస్ ఓపెన్‌లో చాంపియన్‌గా నిలిచాడు. ఆదివారం జరిగిన సింగిల్స్ ఫైనల్లో సమీర్ 21-15, 21-13తో జాన్ ఓ జొర్గెన్‌సన్ (డెన్మార్క్)పై గెలిచి ట్రోఫీ అందుకున్నాడు. గతేడాది సయ్యద్ మోడీ ఇండియా గ్రాండ్ ప్రీ టైటిల్ నెగ్గిన 23ఏళ్ల సమీర్.. రెండేళ్లక్రితం హాంకాంగ్ ఓపెన్ సూపర్‌సిరీస్‌లో రన్నరప్‌గా నిలిచాడు.



విరాట్‌కు విశ్రాంతి

- ధోనీకి కూడా
- రోహిత్‌కు పగ్గాలు
- సిరాజ్‌కు చోటు
- ముక్కోణపు సిరీస్‌కు భారత జట్టు



న్యూఢిల్లీ: టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీతో పాటు సీనియర్ ఆటగాడు ఎంఎస్ ధోనీకి శ్రీలంకలో జరిగే ముక్కోణపు టీ20 సిరీస్ నుంచి విశ్రాంతి కల్పించారు. దక్షిణాఫ్రికాతో జరిగిన చివరి టీ20లో వెన్ను నొప్పి కారణంగా కోహ్లీ ఆడని విషయం తెలిసిందే. మార్చి 6 నుంచి జరిగే ఈ ట్రై సిరీస్ కోసం జాతీయ సెలెక్షన్ కమిటీ ఆదివారం 15 మందితో కూడిన భారత జట్టును ప్రకటించింది. ఈ టోర్నీలో మూడో జట్టుగా బంగ్లాదేశ్ పాల్గొంటుంది. రోహిత్ శర్మకు జట్టు సారథ్య బాధ్యతలు అప్పగించారు. ఇటీవలి సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో విశేషంగా రాణించిన పలువురు ఆటగాళ్లకు జట్టులో చోటు కల్పించారు. మొత్తం ఆరు మార్పులు చేసిన ఈ జట్టుకు శిఖర్ ధవన్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ధోనీ కోరిక మేరకు అతడికి విశ్రాంతి కల్పించినట్టు సెలెక్షన్ కమిటీ చైర్మన్ ఎమ్మెస్కే ప్రసాద్ తెలిపారు. అంతేకాకుండా సఫారీ పర్యటనలో మూడు ఫార్మాట్లలోనూ ఆడిన పేసర్లు భువనేశ్వర్, బుమ్రాలతో పాటు ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాకు కూడా రెస్ట్ ఇచ్చారు. 'పని ఒత్తిడితో పాటు మున్ముందు జరిగే పర్యటనలను కూడా దృష్టిలో ఉంచుకుని నిదాహస్ ట్రోఫీకి జట్టును ఎంపిక చేశాం. మా ఫాస్ట్ బౌలర్లకు తగిన విశ్రాంతినిస్తే వారి అథ్లెటిక్ ప్రదర్శన మెరుగవ్వడంతో పాటు గాయలబారిన పడకుండా ఉండడం జరుగుతుంది' అని ఎమ్మెస్కే పేర్కొన్నారు. అలాగే చైనామన్ బౌలర్ కుల్దీప్ యాదవ్ కూడా జట్టులో లేడు. ఇక ఇద్దరు వికెట్ కీపర్లలో ఒకడిగా యువ ఆటగాడు రిషబ్ పంత్ జట్టులోకి వచ్చాడు. విజయ్ హజారేలో దుమ్ము రేపిన హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్‌కు మరో అవకాశం దక్కింది.



సిరాజ్

భారత జట్టు: రోహిత్ (కెప్టెన్), ధవన్, రాహుల్, రైనా, పాండే, దినేశ్ కార్తీక్, హుడా, వాషింగ్టన్ సుందర్, చాహల్, అక్షర్, విజయ్ శంకర్, శార్దూల్ ఠాకూర్, ఉనాద్కట్, సిరాజ్, రిషబ్ పంత్.

కోహ్లీ చేతికి ఐసీసీ గద

కేప్‌టౌన్: ఐసీసీ టెస్టు జట్టు ర్యాంకింగ్స్‌లో నెంబర్‌వన్‌గా నిలిచినందుకు టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ వరుసగా రెండో సారి చాంపియన్‌షిప్ గద అందుకున్నాడు. శనివారం దక్షిణాఫ్రికాతో చివరి టీ20 ముగిసిన అనంతరం ఈ కార్యక్రమం జరిగింది. ఐసీసీ తరపున భారత జట్టు మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్, గ్రేమ్ పొలాక్ ఈ గదను కోహ్లీకి అందించారు. గత నెల జొహాన్నెస్‌బర్గ్‌లో మూడో టెస్టులో విజయం అనంతరం భారత జట్టు వరుసగా రెండో ఏడాదీ అగ్రస్థానాన్ని కాపాడుకుంది. ఈ చాంపియన్‌షిప్‌తో పాటు మిలియన్ డాలర్ల ప్రైజ్‌మనీ కూడా భారత జట్టుకు దక్కింది. వాస్తవానికి ఈ ర్యాంకింగ్స్‌కు ఏప్రిల్ 1 కటాఫ్ తేదీ అయినప్పటికీ భారత్‌ను అధిగమించే అవకాశం ఏ జట్టుకూ లేదు. ధోనీ కెప్టెన్‌గా ఉన్నప్పుడు 2009 నవంబర్ నుంచి 2011 ఆగస్టు వరకు అత్యధిక కాలం టీమిండియా నెంబర్‌వన్‌గా కొనసాగింది.

'భారత జట్టు ఎలా ఆడగలదో వచ్చే ఏడాదిన్నర కాలంలో తెలిసిపోతుంది'
- కఠినమైన దక్షిణాఫ్రికా పర్యటనకు ముందు కోచ్ రవిశాస్త్రి వ్యాఖ్యలివి.

బౌన్సీ, పేస్ పిచ్‌లపై గతంలో ఎన్నడూ మెరుగైన ప్రదర్శన చేయని భారత్ ఆటతీరు కారణంగా కోచ్ వ్యాఖ్యలను పెద్దగా ఎవరూ పట్టించుకోలేదు. కానీ సీన్ కట్ చేస్తే.. దాదాపు రెండు నెలల పర్యటనలో టీమిండియా అక్కడ అద్భుతమే చేసి చూపింది. ఆడిన మూడు ఫార్మాట్లలో రెండు ట్రోఫీలను స్వదేశానికి తీసుకొచ్చింది. క్లిష్టమైన టెస్టు సిరీస్‌లోనూ ఢీ అంటే ఢీ అనే రీతిలోనే పోరాడగలిగింది. జట్టు అద్భుత విజయాల వెనక కెప్టెన్ విరాట్ కోహ్లీ సూపర్ షోనే కారణం అనుకుంటే పొరపాటే. కచ్చితంగా భారత బౌలర్ల ఆధిపత్యానికి సింహభాగం దక్కుతుంది. అలాంటి పిచ్‌లపై సఫారీ బౌలర్లకన్నా మనోళ్లు మిన్నగా రాణించి మున్ముందు ఆసీస్, ఇంగ్లండ్ పర్యటనలకు గొప్ప భరోసానిచ్చినట్టయ్యింది.

భరోసానిచ్చారు



- సఫారీ గడ్డపై ఆకట్టుకున్న భారత బౌలర్లు
- భవిష్యత్ పర్యటనలపై నమ్మకం

దక్షిణాఫ్రికాలో దాదాపు రెండునెలల సుదీర్ఘ పర్యటనను భారత జట్టు చిరస్మరణీయంగా ముగించుకుంది. స్వదేశంలో గత రెండేళ్లుగా వచ్చిన జట్టును వచ్చినట్టుగా చితక్కొడుతూ సిరీస్‌ల మీద సిరీస్‌లు సాధించిన భారత్‌కు సఫారీ టూర్ అసలైన సవాల్‌గా నిలుస్తుందని క్రీడా పండితులు ముందే తేల్చారు. ప్రధానంగా బ్యాట్స్‌మెన్ రాణింపుపైనే అందరూ ఆలోచించారు. అంచనాలకు తగ్గట్టుగానే కెప్టెన్ విరాట్ కోహ్లీ అన్ని ఫార్మాట్లలోనూ దూసుకెళ్లి పతాక శీర్షికలకెక్కాడు. కానీ ఒక్కసారి టూర్‌ను అవలోకిస్తే మూడు ఫార్మాట్లలోనూ అందరి అభిమానాన్ని గెలుచుకుంది మాత్రం బౌలర్లే.. ఎందుకంటే ఊహించని విధంగా రాణించిన వీరి ప్రతిభ కారణంగానే ఓ టెస్టుతో పాటు వన్డే, టీ20 సిరీస్‌లను కూడా భారత్ ఖాతాలో వేసుకోగలిగింది. సీమ్‌కు అనుకూలించడంతో పాటు కొన్నిసార్లు మందకొడిగా ఉన్న వికెట్లపై ఆతిథ్య జట్టు బౌలర్లే కొన్నిసార్లు విఫలమవగా, భారత బౌలింగ్ విభాగం మాత్రం దూసుకెళ్లింది. టెస్టు సిరీస్‌లో దక్షిణాఫ్రికా ఒక్కసారి మాత్రమే 300 రన్స్ దాటగలిగిందంటే భారత బౌలింగ్ స్థాయి ఏంటో తెలిసిపోతుంది. తమ వంతు బాధ్యతను ఏ దశలోనూ బౌలర్లు వమ్ము చేయలేదు. కానీ బ్యాట్స్‌మెన్ నుంచి భారీఇన్నింగ్స్‌లు రాకపోవడంతో వారి కృషి నిష్ఫలమైంది. భారత బ్యాటింగ్ ఆర్డర్ కూడా రాణిస్తే ఫలితం వేరేలా ఉండేది. ముఖ్యంగా భువనేశ్వర్ బౌలింగ్ విభాగానికి నేతృత్వం వహించాడు. న్యూలాండ్స్‌లో జరిగిన తొలి టెస్టు తొలి రోజున భువనేశ్వర్ తన స్వింగ్ పవర్‌తో 12 పరుగులకే తొలి మూడు వికెట్లను పడగొట్టాడు. టెస్టుల్లో అరంగేట్రం చేసిన బుమ్రా కూడా ఫర్వాలేదనిపించాడు. ఇషాంత్, షమి మాత్రం ఆశించిన స్థాయిలో రాణించలేదు.

మూడు ఫార్మాట్లలోనూ నిలకడ..

ఈ టూర్‌లో భారత బౌలర్ల ప్రదర్శన టెస్టు ఫార్మాట్‌కే పరిమితం కాలేదు. తొలి రెండు టెస్టులను ఓడడంతో సిరీస్ కోల్పోయిన భారత్ ఆ తర్వాత వన్డే, టీ20 ఫార్మాట్‌లో బెబ్బులిలా చెలరేగింది. దెబ్బకు దెబ్బ అన్నట్టుగా ఆ రెండు సిరీస్‌లనూ గెలుచుకుని ప్రొటీస్‌కు షాక్ ఇవ్వగలిగింది. దీనికి కోహ్లీ అసాధారణ ఆటతోపాటు స్పిన్నర్లు, పేసర్ల రాణింపు ఉంది. టెస్టుల్లో పేసర్లు భువీ, బుమ్రా, షమి విరుచుకుపడగా వన్డేలకు వచ్చేసరికి అంతా స్పిన్‌మయం అయ్యింది. తమ సొంత గడ్డపై లెగ్గీ ద్వయం చాహల్, కుల్దీప్ సుడులు తిరిగే బంతులతో విధ్వంసం చేస్తుంటే సఫారీ బ్యాట్స్‌మెన్ చేష్టలుడిగి చూడాల్సి వచ్చింది. వన్డే సిరీస్‌ను 5-1తో దక్కించుకోవడం వెనక వీరిద్దరి కృషే ఎక్కువ. మొత్తం ఆరు మ్యాచ్‌ల్లో 33 వికెట్లు పడగొట్టి ద్వైపాక్షిక సిరీస్ లో అత్యధిక వికెట్లు తీసిన భారత స్పిన్ జోడీగా రికార్డు సృష్టించింది. ఇందులో కుల్దీప్ 17, చాహల్ 16 వికెట్లు తీశారు. శార్దూల్ చివరి వన్డే ఒక్కటే ఆడినా 4 వికెట్లు తీయగలిగాడు. టీ20 సిరీస్‌కు వచ్చేసరికి భువనేశ్వర్ మరోసారి చెలరేగాడు. తన అమ్ములపొది నుంచి చురకత్తిలాంటి నకుల్ బాల్‌ను బయటికి తీసి సఫారీలను కోలుకోలేకుండా చేశాడు. టెస్టుసిరీస్ (16)లోనే కాకుండా టీ20 సిరీస్ (7)లోనూ అత్యధికవికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. మరోవైపు ఎన్నో ఆశలు పెట్టుకున్న హార్దిక్ పాండ్యా తొలి టెస్టులో మాత్రమే బ్యాటింగ్‌తో భేష్ అనిపించుకున్నా ఆ తర్వాత రెండు విభాగాల్లోనూ ఉసూరుమనిపించాడు.

ఆ రెండు టూర్లలోనూ వీరే కీలకం..

ఓవరాల్‌గా సఫారీ పర్యటనలో భారత బౌలర్ల దమ్ము ఏంటో తెలిసొచ్చింది. స్వదేశంలోనే కాదు విదేశీ గడ్డపైనా సత్తా చూపించగలమని నిరూపించుకున్నారు. 2019 వన్డే ప్రపంచకప్‌కు ముందు భారత జట్టు ఇంగ్లండ్, ఆస్ట్రేలియాలో పర్యటించనుంది. ఈనేపథ్యంలో కోహ్లీ భీకరఫామ్‌కు తోడు వీరి బౌలింగ్ దాడి కూడా జట్టుకు ప్రధాన ఆయుధంగా మారనుంది. సఫారీ టూర్‌లాగే ఆ రెండు దేశాల్లో సిరీస్‌లనూ బౌలర్ల అండతో టీమిండియా మధురస్మృతిగా మిగుల్చుకోవాలనుకుంటోంది. ముఖ్యంగా భారత్ ప్రధాన బలం బ్యాటింగ్ మాత్రమే కాదు.. బౌలర్లు కూడా ఎక్కడైనా అదుర్స్ అని ప్రత్యర్థి జట్లకు హెచ్చరిక పంపినట్టయ్యింది.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

హాకీ చూసేందుకు క్యూ లైన్‌లో!



ధ్యాన్‌చంద్

కోల్‌కతా: మేజర్ ధ్యాన్‌చంద్. భారత హాకీ ఆల్‌టైమ్ బెస్ట్ ప్లేయర్. హాకీ స్టిక్‌తో మైదానంలో అతను చేసే మాయాజాలాన్ని చూసేందుకు ప్రపంచం మొత్తం కళ్లప్పగించేది. అలాంటి ధ్యాన్‌చంద్ హాకీ మ్యాచ్‌లను చూసేందుకు టిక్కెట్ల కోసం క్యూలైన్‌లో నిలబడాల్సి వచ్చిందంటే నమ్మగలమా! భారత క్రీడా చెత్త రాజకీయాల కారణంగా హాకీ దిగ్గజానికి ఈ పరిస్థితి ఎదురైంది. ఒలింపిక్ గోల్డ్ మెడలిస్ట్, మాజీ కెప్టెన్ గుర్బక్ష్ సింగ్ 'మై గోల్డెన్ డేస్' పేరిట రాసిన ఆత్మకథలో ఈ విషయం వెలుగు చూసింది. 1962లో అహ్మదాబాద్ ఇంటర్నేషనల్స్ జరుగుతున్న సమయంలో.. పటియాలా జాతీయ క్రీడా శిక్షణ సంస్థ (ఎన్ఐఎస్), భారత హాకీ సమాఖ్య మధ్య గొడవ కారణంగా ధ్యాన్‌చంద్‌కు ఈ అవమానం ఎదురైందని తెలిపాడు. 'అప్పుడు ఎన్ఐఎస్ చీఫ్ కోచ్‌గా పనిచేస్తున్న ధ్యాన్‌చంద్.. ఈ టోర్నీ కోసం తన ట్రైనీలతో కలిసి పటియాలా నుంచి అహ్మదాబాద్ వచ్చాడు. కానీ, నిర్వాహకులు ఆయనకు అడ్మిషన్ కార్డు కూడా ఇవ్వలేదు. దాంతో, ఆయన తన ట్రైనీతో కలిసి ప్రతి మ్యాచ్ టిక్కెట్ల కోసం క్యూలో నిల్చోవాల్సి వచ్చింది. ధ్యాన్‌చంద్ ఈ పరిస్థితి ఎదురవడం చాలా దురదృష్టకరమ'ని గుర్బక్ష్ పుస్తకంలో పేర్కొన్నాడు.

ఫ్లోర్‌లో అరుణకు ఏడో స్థానం



అరుణ

మెల్‌బోర్న్: జిమ్నాస్టిక్స్ వరల్డ్‌కప్ వాల్ట్‌లో చారిత్రక కాంస్య పతకం నెగ్గిన హైదరాబాదీ బుద్దారెడ్డి అరుణ రెడ్డి ఫ్లోర్‌లో మాత్రం పతకానికి చాలా దూరంలో ఉండిపోయింది. ఆదివారం జరిగిన మహిళల ఫ్లోర్ ఫైనల్లో అరుణ 10.833 పాయింట్ల స్కోరుతో ఏడో స్థానంతో సరిపెట్టింది. వాల్ట్‌లో పతకంతో తనపై ఒక్కసారిగా అంచనాలు పెరిగినా.. వాటిని అరుణ అందుకోలేకపోయింది. పురుషుల పారలల్ బార్స్ ఫైనల్లో రాకేశ్ 13.433 స్కోరుతో ఏడో స్థానంతో సరిపెట్టాడు. కామన్వెల్త్, ఆసియా క్రీడల కాంస్య విజేత ఆశీష్ కుమార్ వాల్ట్‌లో 13.583 స్కోరుతో ఎనిమిదో స్థానంతో సంతృప్తి చెందాడు.

గవర్నర్ అభినందనలు

హైదరాబాద్: అరుణారెడ్డిని తెలుగు రాష్ట్రాల గవర్నర్ నరసింహన్ అభినందించారు. దేశం గర్వించే ప్రదర్శన చేసిన అరుణ.. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

ప్రతీ పతకం నాన్నకే అంకితం!

వరల్డ్‌కప్‌లో కాంస్యంతో అంతర్జాతీయ స్థాయిలో పతకం నెగ్గాలన్న తన కోరిక ఎట్టకేలకు నెరవేరిందని హైదరాబాద్ జిమ్నాస్ట్ అరుణ రెడ్డి చెప్పింది. 'ఇది నా తొలి అంతర్జాతీయ పతకం. దీని గురించి వర్ణించేందుకు నాకు మాటలు చాలడం లేదు. గత 13 ఏళ్ల నుంచి చాలా సీరియస్‌గా కెరీర్‌ను నిర్మించుకున్నా. ఎంతో కఠోరంగా శ్రమిస్తున్నా. చివరకు వరల్డ్ కప్ పతకంతో నా ఆశ తీరింద'ని అరుణ చెప్పింది. 'నేను నెగ్గే ప్రతీ పతకాన్ని మా నాన్నకే అంకితం ఇస్తా' అని చనిపోయిన తండ్రిని గుర్తు చేసుకొని ఉద్వేగంగా తెలిపింది. వరల్డ్‌కప్‌లో అరుణ ప్రదర్శనపై సహచర ప్లేయర్, ఒలింపిక్ జిమ్నాస్ట్ దీపా కర్మాకర్ సంతోషం వ్యక్తం చేసింది. 'నిన్ను చూసి గర్విస్తున్నా అరుణ..! ఈ అద్భుత విజయానికి నీకు శుభాకాంక్షలు'అని ట్వీట్ చేసింది. దీపతో కలిసి అరుణ 2011 నుంచి జాతీయ క్యాంప్‌ల్లో కోచ్ బిశ్వేశ్వర్ నంది దగ్గర శిక్షణ తీసుకుంటోంది. ఇన్నాళ్లూ దీప తర్వాత అరుణే అని జిమ్నాస్టిక్స్ సర్కిల్స్‌లో వినిపించిన మాట. ఇదే విషయాన్ని ప్రస్తావించిన అరుణ.. 'భారత జిమ్నాస్టిక్స్‌కు దీప పర్యాయపదంగా మారిపోయింది. కానీ, ఇకపై అక్కడ అరుణ రెడ్డి కూడా ఉన్నదని తెలుసుకుంటార'ని పేర్కొన్నది. 'మేమిద్దరం 2011 నుంచి కలిసి శిక్షణ తీసుకుంటున్నాం. మేం ప్రత్యర్థులం కాదు.. కాలేము కూడా. ఇద్దరం అక్కాచెల్లెళ్లలా స్నేహంగా ఉంటాం. వాస్తవంగా దీప హార్డ్ వర్క్ నాకు స్ఫూర్తినిస్తుంది. దీప, కోచ్‌లు నంది, బ్రిజ్ కిశోర్ నా సామర్థ్యంపై ఉంచిన నమ్మకం వల్లనే ఈ పతకం నెగ్గగలిగా. ఈ ఆటలో నాకంటూ ఒక స్థానం ఏర్పరుచుకున్నందుకు ఆనందంగా ఉంద'ని తెలిపింది. ఇక, గాయంతో వచ్చే కామన్వెల్త్ క్రీడల నుంచి దీప తప్పుకోగా.. ఆమె కోసం కామన్వెల్త్‌లో పతకం నెగ్గుతానని అరుణ చెప్పింది.

ఆంధ్ర జోరుకు బ్రేక్

- సెమీస్‌లో విహారిసేన ఓటమి
- ఫైనల్‌కు సౌరాష్ట్ర




జడేజా (56)

న్యూఢిల్లీ: విజయ్ హజారే ట్రోఫీలో ఆంధ్ర అజేయ జైత్రయాత్రకు బ్రేక్ పడింది. దేశవాళీ అత్యున్నత వన్డే టోర్నీలో తొలిసారి సెమీస్‌కు వచ్చి చరిత్ర సృష్టించిన ఆంధ్ర జట్టు ఫైనల్‌కు చేరుకోవడంలో విఫలమైంది. ఆదివారం జరిగిన రెండో సెమీఫైనల్లో విహారిసేన 59 పరుగుల తేడాతో సౌరాష్ట్ర చేతిలో పరాజయంపాలైంది. తొలుత సౌరాష్ట్ర 49.1 ఓవర్లలో 255 పరుగులకు ఆలౌటైంది. అర్పిత్ వసవదా (58), రవీంద్ర జడేజా (56) అర్ధ సెంచరీలతో రాణించారు. ఆంధ్ర బౌలర్లలో కార్తీక్ రామన్ (4/69) నాలుగు, శివకుమార్, అయ్యప్ప చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్య ఛేదనలో విహారిసేన 45.3 ఓవర్లలో 196 పరుగులకే ఆలౌటై ఓడిపోయింది. సుమంత్ (42), డీబీ రవితేజ (42) పోరాటం వృథా అయింది. వీరిద్దరూ ఐదో వికెట్‌కు 59 పరుగులు జోడించడంతో ఓ దశలో ఆంధ్ర 150/4తో పటిష్ఠ స్థితిలో నిలిచింది. కానీ, సౌరాష్ట్ర బౌలర్ ధర్మేంద్రసిన్ జడేజా (10-0-40-4) ధాటికి.. 46 పరుగుల తేడాతో చివరి ఆరు వికెట్లు కోల్పోయిన ఆంధ్రకు ఓటమి తప్పలేదు. మంగళవారం జరిగే తుదిపోరులో కర్ణాటకతో సౌరాష్ట్ర తలపడనుంది.

పాక్‌లో అర్ధరాత్రి సాహసాలు వద్దు..

- గంగూలీకి ముషారఫ్ ఫోన్





న్యూఢిల్లీ: అది 2004లో పాకిస్థాన్‌లో భారత్ పర్యటన. ఆ సిరీస్ నెగ్గిన ఆనందాన్ని ఆస్వాదించేందుకు భారత సారథి గంగూలీ అర్ధరాత్రి లాహోర్ వీధుల్లోకి వెళ్లొచ్చాడు. అంతే.. నాటి పాక్ అధ్యక్షుడు పర్వేజ్ ముషారఫ్ నుంచి గంగూలీకి ఫోన్. దేశాధినేత అయినా.. ఎంతో మర్యాదగా దాదాను పలుకరించిన పర్వేజ్.. ఓ సున్నితమైన హెచ్చరిక కూడా చేశారు. పాక్‌లో అర్ధరాత్రివేళ వీధుల్లో తిరిగే సాహసం చేయొద్దని, దానికంటే వసీం అక్రమ్ భయంకరమైన ఇన్-కట్టర్లను ఎదుర్కోవడం సులభమని చెప్పారు. త్వరలో విడుదల కానున్న తన ఆత్మకథ 'ఏ సెంచరీ ఇజ్ నాట్ ఎనఫ్'లో గంగూలీ ఈ విషయాన్ని వివరించాడు.

భారత్‌దే టీ20 సిరీస్

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికాతో ఉత్కంఠభరితంగా సాగిన మూడో టీ20లో భారత జట్టు ఏడు పరుగులతో విజయం సాధించింది. దీంతో 2-1తో సిరీస్ దక్కించుకుని సఫారీ పర్యటనను ముగించింది. శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత భారత్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 172 రన్స్ చేసింది. ధవన్ (47), రైనా (43) రాణించారు. ఛేదనలో ప్రొటీస్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 165 పరుగులే చేసింది. డుమిని (55) అర్ధ సెంచరీతో ఆకట్టుకున్నాడు. ఆఖర్లో జోంకర్ (24 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 49) చెలరేగి ఉత్కంఠ పెంచాడు. చివరి ఓవర్లో 19 రన్స్ కావాల్సిఉండగా భువనేశ్వర్ కట్టుదిట్టమైన బౌలింగ్‌తో భారత్‌ను గెలిపించాడు.

నార్వేకు అగ్రపీఠం



ప్యాంగ్‌చాంగ్ (దక్షిణ కొరియా): పక్షంరోజులకుపైగా సందడి చేసిన వింటర్ ఒలింపిక్స్‌కు ఆదివారం తెరపడింది. ముగింపు వేడుకలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమార్తె ఇవాంకా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ పోటీల్లో జర్మనీ, నార్వే చెరో 14 స్వర్ణాలతో సమంగా నిలిచాయి. అయితే, ఓవరాల్ పతకాల్లో జర్మనీ (31) కంటే ముందంజలో నిలిచిన నార్వే (39) అగ్రపీఠం దక్కించుకుంది. కెనడా (11 స్వర్ణాల) మూడోస్థానంలో నిలిచింది. 2022 వింటర్ ఒలింపిక్స్ బీజింగ్ (చైనా)లో జరగనుంది.

శతక్కొట్టిన టేలర్

- తొలి వన్డేలో ఇంగ్లండ్‌పై కివీస్ గెలుపు

హామిల్టన్: ఇంగ్లండ్‌తో సిరీస్‌ను న్యూజిలాండ్ అద్భుత విజయంతో ఆరంభించింది. రాస్ టేలర్ (113) సెంచరీకి తోడు లాథమ్ (79) అర్ధ శతకంతో రాణించడంతో తొలి వన్డేలో కివీస్ మూడు వికెట్ల తేడాతో ఆతిథ్య ఇంగ్లండ్‌ను ఓడించింది. ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ఆతిథ్య జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లకు 284 పరుగులు చేసింది. బట్లర్ (79), జో రూట్ (71), జేసన్ రాయ్ (49) మెరుపులు మెరిపించారు. అనంతరం టేలర్, లాథమ్‌తోపాటు ఆఖర్లో మిచెల్ శాంట్నర్ (27 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లతో 45 నాటౌట్) చెలరేగడంతో కివీస్ మరో 4 బంతులు మిగిలుండగానే 7వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది.

అమిత్‌షాకు దర్శనమివ్వని మాత

మాతా మాణికేశ్వరి దర్శనం కోసం అరగంట నిరీక్షణ

నారాయణపేట, ఫిబ్రవరి 25: బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాకు మహామందిరంలో చుక్కెదురైంది. అరగంట నిరీక్షణ తర్వాత కూడా మాతా మాణికేశ్వరి దర్శనమివ్వకపోవడంతో.. వెనుదిరిగారు. కర్ణాటక షాపూర్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి హాజరైన ఆయన.. తన సతీమణితో కలిసి సాయంత్రం హెలికాప్టర్‌లో యానగుందికి చేరుకున్నారు. అక్కడి నుంచి ప్రత్యేక వాహనంలో కొండపైనున్న మహామందిరానికి వెళ్లారు. అక్కడ వీరిద్దరూ సంకల్ప పూజలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ వీరిని సత్కరించి, ప్రసాదం అందించింది. ఆ తర్వాత అమిత్‌షా దంపతులు అరగంట నిరీక్షించినా.. మాతా మాణికేశ్వరి దర్శకం కాకపోవడంతో వెనుదిరిగారు. కాగా.. మాతా మాణికేశ్వరి సాయంత్రం 6.10 నుంచి గంట పాటు భక్తులకు దర్శనమిచ్చారు.


మహామందిరంలో అమిత్‌షా దంపతుల సంకల్ప పూజలు

రైతుల పేరుతో మోసం

ఓరియెంటల్ బ్యాంకును ముంచిన సింభోలీ షుగర్స్

▸ రూ. 250 కోట్ల రుణాలు.. సీబీఐ కేసు నమోదు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: ఓరియెంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ (ఓబీసీ)లో మరో భారీ కుంభకోణం బయటపడింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ స్కాం తర్వాత ఓబీసీ, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలలో వజ్రాల వ్యాపారుల మోసాలు ఇదివరకే వెలుగు చూశాయి. తాజాగా.. రైతుల పేరుతో దేశంలోని ప్రఖ్యాత చక్కెర కర్మాగారాల్లో ఒకటైన సింభోలీ షుగర్స్ రూ. 250 కోట్ల మోసానికి పాల్పడిందని కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) నిగ్గు తేల్చింది. ఈ కేసులో.. సింభోలీ షుగర్స్ సీఎండీ గుర్మిత్ సింగ్ మాన్, డిప్యూటీ ఎండీ గుర్పాల్ సింగ్, ప్రధాన ఆర్థికాధికారి సహా పలువురు డైరెక్టర్లను నిందితులుగా పేర్కొంది. వీరితోపాటు.. ఓబీసీ మీరట్ బ్రాంచికి చెందిన అధికారులు, సిబ్బందిని నిందితుల్లో చేర్చింది. 2011లో సింభోలీ షుగర్స్ మీరట్‌లోని ఓబీసీ అధికారులను సంప్రదించింది. 5,762 మంది రైతులకు పంట రుణాలివ్వాలని కోరింది. ఈ మేరకు వారంతా బ్యాంకు ఖాతాలు తెరుస్తారని నమ్మించింది. ఇందుకు సంబంధించి బ్యాంకుకు తప్పుడు కేవైసీలను అందించింది. రుణం మంజూరయ్యే సమయంలో.. రైతులందరికీ తామే విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు అందించామని పేర్కొంటూ.. రూ. 148.59 కోట్లు 'ఎస్క్రో అకౌంట్'లోకి బదిలీ చేయించుకుంది. ఈ మొత్తాన్ని ఆర్‌టీజీఎస్ ద్వారా ఎస్‌బీఐ, పీఎన్‌బీ, యూకో బ్యాంకుల్లోని ఖాతాలకు బదిలీ చేసుకుంది. సింభోలీ షుగర్స్ 2015లోనూ ఇదే తరహాలో రూ. 110 కోట్ల రుణాన్ని తీసుకుంది.


ఆరోవిల్ స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని తపాలాబిళ్లను విడుదల చేస్తున్న మోదీ

మహిళే దిక్సూచి

ఇప్పుడు ఆమె నేతృత్వంలోనే అభివృద్ధి.. అమ్మ వల్లే కొడుకులకు గుర్తింపు

▸ 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: 'పరిపూర్ణ స్త్రీత్వం అంటే సంపూర్ణ స్వాతంత్ర్యమని స్వామి వివేకానంద చెప్పారు. వర్తమాన ప్రపంచంలో మహిళలను సామాజిక, ఆర్థిక రంగాల్లో సమాన భాగస్వాములను చేయాల్సిన బాధ్యత మనందరిదీ' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. మహిళాభివృద్ధి అన్న భావన పాతదని.. ఇప్పుడు మహిళల మార్గదర్శకత్వంలో అభివృద్ధి అనేది కొత్త దృక్పథమని.. అదే తన 'నవభారతం-2022' విజన్ అని తెలిపారు. ఆదివారం.. 41వ 'మన్ కీ బాత్'లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం (మార్చి 8), అంతర్జాతీయ సైన్స్ డే (ఈ నెల 28) అంశాలపై ఆయన మాట్లాడారు. అభివృద్ధిలో మహిళలను శక్తిమంతమైన, సాధికారతగల సమాన భాగస్వాములుగా చేయడమే నవభారత స్వప్నమని తెలిపారు. 'ఆత్మస్థైర్యం, ఆత్మవిశ్వాసమే ప్రస్తుత మహిళ బలం. మహిళల వల్లే మగవారు గుర్తింపు పొందే సంప్రదాయం మనది. యశోదానందనుడు, కౌసల్యానందనుడు, గాంధారీపుత్రులు.. ఇలా తల్లి ద్వారానే గుర్తింపు పొందారన్నారు.

ఎందుకు, ఏమిటి, ఎలా..?

సత్యశోధనకు నిరంతర కృషి జరగాలని ప్రధాని అన్నారు. శాస్త్రీయ పరిశోధనలకు, ఆవిష్కరణల సారాంశం ఇదేనని చెప్పారు. 'ఎందుకు, ఏమిటి, ఎలా అన్న ప్రశ్నలకు సమాధానాలు దొరికేదాకా విశ్రమించకూడదు' అని సూచించారు. కృత్రిమ మేధను ఉపయోగించి దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపాలని శాస్త్రవేత్తలను అభ్యర్థించారు. 'కృత్రిమ మేధతో జాతీయ విపత్తుల గురించి ముందే అప్రమత్తం చేయగలమా? పంట దిగుబడి ఎలా ఉండబోతోందో రైతులకు తెలియజేయగలమా? ప్రజలకు ఆధునిక పద్ధతుల్లో వ్యాధులకు చికిత్స అందించేందుకు కృత్రిమ మేధను ఉపయోగించుకోవచ్చా' అని ప్రధాని శాస్త్రవేత్తలను ప్రశ్నించారు. భారత సంతతి శాస్త్రవేత్తల పేర్లను ఈ సందర్భంగా ప్రస్తావించారు. 'బోసన్' కణానికి సత్యేంద్రనాథ్ బోస్ పేరు పెట్టిన సంగతి గుర్తుచేశారు. గణితంలో బోధాయన, భాస్కరుడు, బ్రహ్మగుప్త, ఆర్యభట్ట దిట్టలని.. శస్త్రచికిత్సల్లో చరక, శుశ్రుతులు నిష్ణాతులని తెలిపారు.

భద్రత ప్రాధాన్యం గుర్తెరగాలి..

వచ్చే నెల 4న జాతీయ భద్రతా దినమని మోదీ చెప్పారు. మన దైనందిన జీవనంలో భద్రత ప్రాధాన్యాన్ని అందరూ గుర్తెరగాలన్నారు. మూడేళ్ల క్రితం వరకు వడగాడ్పులకు దేశ వ్యాప్తంగా వేల మంది ప్రాణాలు కోల్పోయేవారని.. తర్వాత జాతీయ ప్రకృతి విపత్తుల నివారణ సంస్థ (ఎన్‌డీఎంఏ) ప్రజల్లో చైతన్యం తెచ్చే కార్యక్రమాలు చేపట్టిందని.. దీనివల్ల నిరుడు వడగాడ్పుల వల్ల మరణించిన వారి సంఖ్య 220కి తగ్గిందని వెల్లడించారు.

70 ఏళ్ల తర్వాత ఆ గ్రామంలో వెలుగులు..

'రెండ్రోజుల క్రితం నేను టీవీ చూస్తున్నాను. స్వాతంత్ర్యం వచ్చిన 70 ఏళ్ల తర్వాత ఎలిఫెంటా దీవిలో మూడు గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించారని చూసి ఎంతో సంతోషించాను. అది చాలా గొప్ప పర్యాటక ప్రాంతం. యునెస్కో దానిని ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తించింది. ముంబైకి ఎంతో సమీపంలో ఉన్నప్పటికీ ఇప్పటివరకు అక్కడ కరెంటు సౌకర్యం లేదు. ఇప్పుడు అభివృద్ధి దిశగా కొత్త శకం ఆరంభమైంది' అని మోదీ తెలిపారు.

'గోబర్ ధన్'తో శుద్ధ ఇంధనం..

స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ప్రధాని ఈ సందర్భంగా ప్రస్తావించారు. గ్రామాల్లో పశు విసర్జితాలతో బయోగ్యాస్ ద్వారా శుద్ధ ఇంధనం తయారీని 'గోబర్ ధన్'పథకం ప్రోత్సహిస్తోందని గుర్తుచేశారు. భారత్‌లో ప్రపంచంలోకెల్లా అత్యధిక పశు సంపద (30 కోట్లు) ఉందని, రోజూ 30 లక్షల టన్నుల పేడ వస్తోందని చెప్పారు. ఈ వ్యర్థాల సేకరణ, రవాణా, బయోగ్యాస్ విక్రయం.. ఇలా అన్నిటిలో కొత్త ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు.

ప్రపంచానికి ఆధ్యాత్మిక కేంద్రంగా భారత్

ఆరోవిల్ స్వర్ణోత్సవాల్లో మోదీ

ఆరోవిల్/పుదుచ్చేరి, ఫిబ్రవరి 25: ప్రపంచానికి ఆధ్యాత్మిక కేంద్రంగా భారత్ భాసిల్లుతోందని ప్రధాని మోదీ అన్నారు. పరస్పర గౌరవం, వివిధ మతాలు, సంస్కృతుల వారు కలిసి జీవించడం ఇక్కడే సాధ్యమన్నారు. ఆదివారం తమిళనాడులోని ఆరోవిల్ ఇంటర్నేషనల్ టౌన్‌షిప్ స్వర్ణోత్సవాల్లో మోదీ మాట్లాడారు. చాలా మతాలకు చెందిన ప్రముఖులు ఇక్కడే జన్మించారని, తమ బోధనలతో ప్రజలను ఆధ్యాత్మిక బాటలో నడిపారన్నారు. అంతకుముందు అరబిందో ఆశ్రమాన్ని సందర్శించి, శ్రీ అరబిందోకు నివాళులర్పించారు. ఆశ్రమం ఆధ్వర్యంలో నడుస్తున్న ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ విద్యార్థులతో ముచ్చటించారు. బీజేపీ నిర్వహించిన బహిరంగ సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. దేశంలో 48 ఏళ్ల ఏక కుటుంబ పాలనతో అభివృద్ధే లక్ష్యంగా సాగిన 48 నెలల ఎన్డీయే పాలనను పోల్చుకోవాలని ప్రజలను కోరారు.


కర్ణాటక బాగల్‌కోట్ జిల్లాలోని జమాఖండిలో ఎన్నికల సభకు హాజరైన మద్దతుదారులకు రాహుల్ అభివాదం



ధనికులకే రుణ మాఫీ

అదే బీజేపీ నీతి.. రైతులపై పట్టింపే లేదు

▸ చదువు'కొనాల్సిన' దుస్థితి.. రోడ్‌షోలలో రాహుల్ విమర్శలు

బీజాపూర్, ఫిబ్రవరి 25: 'మోదీజీ.. దేశంలోని పది మంది గొప్ప ధనికులకు రుణ మాఫీ చేశారు. మరి రైతుల రుణమాఫీ ఎప్పుడు చేస్తారు?' అని ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. బీజేపీ సర్కారు ధనికులకే రుణమాఫీ చేస్తుందని ఎద్దేవా చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మూడు రోజుల కర్ణాటక పర్యటనలో ఉన్న రాహుల్.. పలు ప్రాంతాల్లో బహిరంగ సభలు, రోడ్‌షోలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీజేపీ హయాంలో చదువును కొనాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ఆరోపించారు. 'ఎక్కడో ఎందుకు.. గుజరాత్‌లోనే చూడండి. బడా విశ్వవిద్యాలయాలు కార్పొరేట్ కబంధ హస్తాల్లో ఉన్నాయి. నేను గుజరాత్ ఎన్నికల ప్రచారానికి వెళ్లినప్పుడు.. పేదలు తమకు చదువుకునే యోగం లేదంటూ వాపోయారు. చదువుకోవడం ఖర్చుతో కూడిన విషయమని చెప్పారు. బీజేపీ హయాంలో.. ఆరోగ్యానికీ భద్రత లేకుండా పోయింది' అని విమర్శించారు.



సేవాగ్రామ్... గొప్ప అనుభూతి

▸ గాంధీజీ 12 ఏళ్లు గడిపిన చోటు జాతీయ ఉద్యమాలకు కేంద్రం


▸ నాలుగు దశాబ్దాల ప్రజా జీవితాన్ని ఇక్కడ పూర్తి చేసుకోవడం నా అదృష్టం

▸ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): వార్ధా(మహారాష్ట్ర)లోని చారిత్రాత్మక సేవాగ్రామ్‌లో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తన ప్రజా జీవితాన్ని, ప్రస్థానాన్ని గుర్తుచేసుకున్నారు. ట్విటర్, ఫేస్‌బుక్ ఖాతాల్లో ఆదివారం తన అభిప్రాయాలను పంచుకున్నారు. గాంధీజీ 12ఏళ్లు గడిపిన సేవాగ్రామ్ ఆశ్రమంలో తన నాలుగు దశాబ్దాల ప్రజా జీవితాన్ని పూర్తి చేసుకోవడం గొప్ప అనుభూతిని ఇస్తోందన్నారు. "సర్దార్ వల్లభాయ్ పటేల్, ఆచార్య కృపలానీ, సరిహద్దు గాంధీ ఖాన్ గఫార్ ఖాన్ వంటి వారు ఈఆశ్రమంలో గడిపారు. మధ్యభారతంలో ఒక గ్రామాన్ని కేంద్ర కార్యాలయంగా మార్చుకున్న ఘనత గాంధీజీకే దక్కుతుంది. జాతీయ ప్రాధాన్యత కల ఎన్నో ఉద్యమాలకు ఇక్కడ రూపకల్పన జరిగింది"అన్నారు. సేవాగ్రామ్‌లో తిరుగుతుంటే 4 దశాబ్దాల క్రితం నెల్లూరు జిల్లాలోని ఉదయగిరి నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు తొలి అవకాశం లభించిన రోజులు గుర్తొచ్చాయని జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. "భారీ మెజారిటీతో తనని గెలిపించిన ఉదయగిరి ప్రజలను ఎన్నడూ మరిచిపోను. 28వ ఏట శాసనసభ్యుడిగా ఎన్నికైన తరువాత ఒక చరిత్రాత్మక ప్రయాణాన్ని ప్రారంభించాను. విద్యార్థి నాయకుడి నుంచి అధికార పార్టీ జాతీయ అధ్యక్షుడి వరకు అంచలంచెలుగా నా రాజకీయ ప్రస్థానం సాగింది. రెండు సార్లు ఎమ్మెల్యేగా, నాలుగుసార్లు రాజ్యసభ సభ్యుడిగా, రెండు ప్రభుత్వాల్లో కేంద్ర మంత్రిగా బాధ్యతలు నిర్వహించి దేశంలో రెండో అతిపెద్ద రాజ్యాంగ పదవిని అధిష్ఠించడం ప్రజాసేవ వల్లే సాధ్యమైంది" అన్నారు. ఎందరో అభినందిస్తున్న వేళ సేవాగ్రామ్ ఆశ్రమంలో గాంధీజీ స్మృతుల మధ్య గడపడం తన అదృష్టమన్నారు. గ్రామాలకు తరలి వెళ్లాలన్న బాపూజీ పిలుపు తనకెంతో స్ఫూర్తి నిచ్చిందన్నారు. సేవాగ్రామ్‌లో వెంకయ్యనాయుడు పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

చైనా శాశ్వత అధ్యక్షుడిగా జిన్‌పింగ్!

2 పర్యాయాల ఎన్నిక పరిమితి తొలగింపునకు సీపీసీ ప్రతిపాదన



బీజింగ్, ఫిబ్రవరి 25: జీ జిన్‌పింగ్(64).. చైనా అధ్యక్షుడు, చైనా కమ్యూనిస్టు పార్టీ(సీపీసీ) చీఫ్, శక్తివంతమైన సెంట్రల్ మిలటరీ కమిషన్ చైర్మన్. అప్రతిహత అధికారాలతో దేశ పాలనపై తనదైన ముద్రవేస్తూ మావో తర్వాత ప్రజాదరణ పొందిన నాయకుడు. ఆయన పేరు, సిద్ధాంతాలు సీపీసీ రాజ్యాంగంలో ఉన్నాయంటే ఆయనకు ఎంత గౌరవం ఉందో అర్థం చేసుకోవచ్చు. పార్టీపై పట్టును, ప్రజాభిమానాన్ని చూరగొన్న జీ.. చైనాకు శాశ్వత అధ్యక్షుడిగా ఉండిపోతారా? సీపీసీని చీల్చేందుకు యత్నించిన నేతల భరతం పట్టిన చాతుర్యంతో పార్టీ ప్రధాన కార్యదర్శి పదవిపై ఎప్పటికీ ఆధిపత్యం కొనసాగించనున్నారా? దేశ రాజకీయాల్లో తిరుగులేని రాజకీయ నాయకుడిగా ముద్ర వేయనున్నారా? అంటే అవుననే సమాధానాలు వస్తున్నాయి. సాధారణంగా సీపీసీ పార్టీ సిద్ధాంతాల ప్రకారం.. ఒక వ్యక్తి రెండు పర్యాయాలు మాత్రమే దేశ అధ్యక్షుడిగా కొనసాగుతారు. ఆ నిబంధనల తొలగించాలని సీపీసీ సెంట్రల్ కమిటీ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడికి రెండు పర్యాయాల పరిమితి నిబంధనను తొలగించాలని ఆదివారం ఆ దేశ నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్(పార్లమెంటు)కు ప్రతిపాదించింది. ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం జిన్‌పింగ్ 2023 వరకే అధ్యక్షుడిగా కొనసాగుతారు. ఆ నిబంధనను తొలగిస్తే ఆయన సుదీర్ఘ పాలనకు అడ్డే ఉండదు. ప్రతిపాదనను సోమవారం కమిటీ జిన్‌పింగ్‌కు అప్పగించనుంది. ఆయన అధ్యక్షుడి హోదాలో దాన్ని పార్లమెంటులో ప్రవేశపెడతారు. అక్కడ ఆమోదం పొందితే రెండు పర్యాయాలు మాత్రమే నిబంధన తొలగిపోనుంది. 2017 అక్టోబరు నుంచి రెండోసారి సీపీసీ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న జిన్‌పింగ్ ఈ ఏడాది మార్చిలో రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నికవుతారు. చైనా పార్లమెంటులో ఉండే సభ్యులంతా పార్టీ ఏ నిర్ణయం తీసుకున్నా దానికి అడ్డుచెప్పరు. ఎందుకంటే పార్టీకి నమ్మకంగా పనిచేస్తేనే వారిని పార్లమెంటుకు పంపుతారు. కాబట్టి సీపీసీ తీసుకున్న తాజా నిర్ణయానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అడ్డగించే ఆస్కారం ఉండదు.

ఎందుకీ నిర్ణయం?

రెండు పర్యాయాల నిబంధన తొలగింపు ప్రతిపాదనకు ప్రధాన కారణం.. దేశంలో స్థిరమైన, ధృఢమైన నాయకత్వాన్ని పెంపొందించేందుకేనని ఆ దేశ మీడియా తెలిపింది. 2020-2035 చైనాకు సామ్యవాదపరంగా చాలా కీలకమని దానికోసం సీపీసీ ఈ నిర్ణయం తీసుకుందని వెల్లడించింది. 'సామ్యవాదానికి కొత్త యుగం ప్రారంభం కాబోతోంది. సీపీసీ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది.' అని సు వేయ్ అనే ప్రొఫెసర్ తెలిపారు.

ఎప్పటికీ జిన్‌పింగ్‌కే అధికారాలు!

సీపీసీ నిబంధనల ప్రకారం దేశాధ్యక్షుడి కంటే పార్టీ ప్రధానకార్యదర్శికే అధికారం ఎక్కువ. దీని ప్రకారం పార్టీ ప్రధాన కార్యదర్శి, దేశాధ్యక్షుడు రెండూ ఆయనే కాబట్టి ఆయనకు ఇష్టమున్నన్ని రోజులు పదవిలో కొనసాగవచ్చు. ఏ నిర్ణయం తీసుకున్నా స్వంతంగా తీసుకోవచ్చు.

బీజేపీకి కోత తీర్మానాల గండం

▸ 5 నుంచి పార్లమెంటు భేటీ

▸ లోక్‌సభలో ప్రవేశపెట్టేందుకు కాంగ్రెస్ నిర్ణయం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ సమావేశాలు మార్చి 5న ప్రారంభమైన వెంటనే లోక్‌సభలో కేంద్ర బడ్జెట్‌పై కోత తీర్మానాలు ప్రవేశపెట్టాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. కోత తీర్మానాలు పెడితే మోదీ ప్రభుత్వం తీవ్ర ఇబ్బందుల్లో పడుతుందని కాంగ్రెస్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. బీజేపీకి లోక్‌సభలో 274 మంది మద్దతు ఉన్నా.. కనీసం 10 మంది అసమ్మతివాదులు ఉండొచ్చని కాంగ్రెస్ అంచనా వేస్తోంది. బీజేపీ మిత్రపక్షాలు కలిసి వస్తే కాని తమ వ్యూహం నెరవేరదని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. లోక్‌సభలో బీజేపీ తరువాత ఎక్కువ మంది సభ్యులు కాంగ్రెస్‌కే ఉన్నారు. అన్ని పార్టీలు కలిసివస్తే బీజేపీకి సమస్యాత్మకంగా మారవచ్చని కాంగ్రెస్ భావిస్తోంది. కోత తీర్మానంలో ఏపీకి జరిగిన అన్యాయాన్ని ప్రస్తావించే అవకాశాలు ఉన్నాయి.



కర్ణాటకలోని కార్వారలో 'సీ బర్డ్' నావికాదళ కేంద్రానికి సంబంధించి నిరాశ్రయులకు రూ.587 కోట్లకు గాను రూ.534 కోట్లు విడుదల చేశామని కేంద్ర రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. నిరాశ్రయులకు పరిహారం పంపిణీ చేశారు. మిగిలిన రూ.53 కోట్లు ఈ నెల 27న విడుదల చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఓ నిర్వాసితురాలి కాళ్లు మొక్కారు.

- బెంగళూరు, ఆంధ్రజ్యోతి



'రుస్తుం-2' డ్రోన్‌ని పరీక్షించిన డీఆర్‌డీవో

బెంగళూరు, ఫిబ్రవరి 25: స్వదేశీ పరిజ్ఞానంతో 'మేక్ ఇన్ ఇండియా'లో భాగంగా తయారు చేసిన 'రుస్తుం-2' మానవ రహిత నిఘా డ్రోన్‌ను రక్షణ పరిశోధన, అభివృద్ధి కేంద్రం (డీఆర్‌డీఓ) ఆదివారం విజయవంతంగా పరీక్షించింది. బెంగళూరు చిత్రదుర్గ సమీపంలోని చల్లాకేరేలో జరిగిన ఈ పరీక్షల్లో డీఆర్‌డీఓ చైర్మన్ ఎస్ క్రిస్టోఫర్, ఏయిరోనాటికల్ సిస్టం డీజీ సీపీ రామనారాయణన్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ డీజీ మంజుల పాల్గొన్నారు. ఈ డ్రోన్‌కు నిఘాతోపాటు.. ఆయుధాలను మోసుకెళ్లగల సామర్థ్యముందని, హైకాన్ఫిగరేషన్ ఇంజన్‌తో.. 24 గంటలపాటు నిరాటంకంగా పనిచేయగలదని డీఆర్‌డీఓ అధికారులు తెలిపారు.

మీ వైవాహిక జీవితాన్ని విజయవంతం చేసుకోండి
మీ అంగం చిన్నదిగా, సన్నగా, వంకరగా ఉంటే మీ ఇష్టానుసారం 8-9 అంగుళాలు పొడవుగా, లావుగా, ధృఢంగా చేసుకోండి. లైంగిక సమయం 30-45 ని. పెంచుకోండి, నపుంసకత్వము, శీఘ్రస్ఖలనం, స్వప్నస్ఖలనం, సంతానలేమికి సఫలమైన చికిత్స
9958745170
9643504091, 8743055897

సాగు వినియోగంలోకి ఆధునిక పరిజ్ఞానం

తిరువనంతపురం, ఫిబ్రవరి 25: వ్యవసాయంలో ఉపయోగిస్తున్న పరిజ్ఞానానికి బదులు కొత్త టెక్నాలజీని ఉపయోగించడానికి పరిశోధకులు కృషి చేస్తున్నారు. దీని కోసం దేశంలోని మూడు ప్రముఖ సంస్థల భాగస్వామ్యంతో పరిశోధకుల కన్సార్టియంను ఏర్పాటు చేశారు. తిరువనంతపురంలోని ఐఐఐటీకే పరిశోధక శాస్త్రవేత్తలు, ఉత్తరాఖండ్‌లోని జీబీ పంత్ అగ్రికల్చరల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ యూనివర్సిటీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ టెక్నాలజీతో ఈ కన్సార్టియంను ఏర్పాటు చేశారు.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: K. Srinivas, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .Managing Director : Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.



1963-2018

1

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం

సోమవారం • 26 ఫిబ్రవరి 2018



భూలోకానికి అతిథిలా వచ్చిన వెన్నెల
మళ్లీ నింగిలోకి మరలిపోయింది...
ఆమని విరిసే తోటల్లో కథగా కదిలిన దొరసాని
కల్పనలా మాయమైపోయింది...
పూల రెక్కలూ, తేనె చుక్కలూ రంగరించి చేసిన బొమ్మ
ఆ రెక్కలు వాడిపోయి, ఆ చుక్కలు తొణికిపోయి
చెదిరిపోయింది, ఇగిరిపోయింది ...
తెరమీద ప్రేమాభిషేకాలూ... అభిమానుల హృదయాభిషేకాలూ
బద్దలైన గుండెల బాష్పాభిషేకాలైపోయాయి...
ఆకాశమా... ఓ శూన్యమా....
ఏ ముచ్చట కోసమో ఎత్తుకుపోయావు, కానీ...
అంత అందాన్ని నువ్వేం చేసుకుంటావ్?



అంతరంగం

అతిలోక సుందరి

అందం ఈమెలా ఉంటుందా? అనిపించేంత అందం ఆమెది. శతాబ్దాలపాటు వెండి తెరనేలిన నట విశ్వరూపం ఆమెది. పరిమితులు లేని నటనా ప్రతిభతో అభిమానుల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న ఆ రారాణి ఇక లేదనే నిజం జీర్ణించుకోవటం కష్టం. తిరిగిరాని లోకాలకు తరలిపోయిన శ్రీదేవి మనసు విప్పి చెప్పిన మాటల్లో కొన్ని...

నా జీవితంలో ప్రధాన భాగం సినిమాలే! నన్ను తీర్చిదిద్దింది కూడా సినిమాలే! సినిమా లేని నా జీవితాన్ని ఊహించలేను. ఆ మధ్య కొంత కాలం పాటు సినిమాలకు దూరంగా ఉన్న మాట నిజమే! కానీ, నా కుటుంబం, పిల్లల కోసం బ్రేక్ తీసుకోక తప్పలేదు. ఆ సమయంలో కూడా బోనీ కపూర్ ప్రొడక్షన్ కంపెనీ పనుల్లో క్రియాశీలకంగా ఉండేదాన్ని.

తల్లిదండ్రులే మూల స్తంభాలు



నా పేరెంట్స్ (రాజేశ్వర్, అయ్యప్పన్) చాలా మంచి వాళ్లు. ఎదుటివారి పట్ల గౌరవ మర్యాదలు, పెద్దల పట్ల వినయవిధేయతలు వాళ్ల నుంచే నేర్చుకున్నాను. వాళ్లు ప్రతి విషయంలోనూ నాకు మార్గదర్శకంగా ఉండేవాళ్లు. గురుదేవ్ (అనిల్ కపూర్, రిషి కపూర్) రూప్ కి రాణి చోరోంకా రాజా (అనిల్ కపూర్), లమ్హే (అనిల్ కపూర్) సినిమాల షూటింగ్ విదేశాల్లో జరిగినప్పుడు మినహా నేనెప్పుడూ వాళ్లను చూడకుండా ఎక్కువ రోజులు ఉండలేదు. షూటింగ్‌కి బయల్దేరే ముందు తప్పకుండా వాళ్లతో మాట్లాడతాను. వాళ్లూ నాతో ఫోన్లో టచ్‌లో ఉంటారు. ఒకరోజు నాన్న దగ్గర్నుంచి నాకు ఫోన్ రాలేదు. ఆ తర్వాత నాన్నగారికి ఆరోగ్యం బాగోలేదని తెలిసింది. కానీ, నిజానికి అప్పటికే ఆయన పోయారు. మా అమ్మ విషయంలోనూ ఇలాగే జరిగింది. ఆమె పోయినప్పుడు 'జుదాయి' (అనిల్ కపూర్) సినిమా షూటింగ్ కోసం నేనెక్కడో దూరంగా ఉన్నాను. మా అమ్మ నన్ను కొడుకుగానే భావించేది. నాతో ఆ విషయం ఎప్పుడూ చెబుతూ ఉండేది. అందుకే ఆమె చితికి నేనే నిప్పు అంటించాను. ఆమె చితికి నిప్పంటించాను అంటే, అది ఆమె నామీద ఉంచుకున్న నమ్మకానికి న్యాయం చేయటం కోసమే! అదొక దుర్భరమైన, భావోద్వేగభరిత నిర్ణయం. అయినా ఆ పని చేయటం నా బాధ్యత అనిపించింది.

ఆయనే సర్వస్వం

1984లో మిస్టర్ ఇండియా చిత్రంలో సీమా పాత్ర కోసం నిర్మాత బోనీ కపూర్ నన్ను మొదటిసారి కలిశారు. అయితే, తొలి చూపులోనే నాతో ప్రేమలో పడ్డట్టు ఆ తర్వాత చెప్పారు. 1993లో నన్ను ప్రపోజ్ చేయటానికి ముందు, అందుకు అడ్డుపడే వీలున్న అంశాలన్నిటినీ సరి చేసుకోవటానికి కొన్నేళ్ల సమయం తీసుకున్నారు. ఆయనేంటో తెలిశాక నేనూ ఆయనతో ప్రేమలో పడ్డాను. అయితే, ఆయనతోనే నా జీవితం ముడిపడి ఉందనే విషయాన్ని అంగీకరించటానికి నాకు కొన్నేళ్ల సమయం పట్టింది. నిజానికి, చెప్పిన వెంటనే ఆయన ప్రేమని అంగీకరించి ఉంటే బాగుండేదని ఎప్పుడూ అనిపిస్తుంటుంది. నేనెప్పుడూ నా మనసు చెప్పిందే వింటాను. ఆయన విషయంలో కూడా! నా తల్లిదండ్రులు పోయి, నేనూ, చెల్లి ఒంటరిగా మిగిలిపోయిన సమయమది. ఆ టైంలో బోనీ కపూర్ విషయంలో నేను తీసుకున్న నిర్ణయంతో చెల్లి షాక్ అయింది. కానీ తర్వాత బోనీతో తనకి కూడా మంచి అనుబంధం ఏర్పడింది. నా జీవితంలో నేను తీసుకున్న మంచి నిర్ణయాల్లో బోనీని పెళ్లి చేసుకోవటం ఒకటని మా చెల్లెలు ఎప్పుడూ అంటూ ఉంటుంది. మా అత్తింటి వాళ్లతో నాకున్న అనుబంధం అద్భుతమైనది. మా అత్తగారికి నా పట్ల ఎంతో ఆరాధన. ఆమెనెప్పుడూ నేను గారం చేస్తూ ఉంటాను. నా తోడి కోడలు సునీత (నటుడు అనిల్ కపూర్ భార్య), బోనీ కపూర్ చెల్లెలు, రీనా క్లిష్ట సమయంలో నాకిచ్చిన సపోర్ట్, బలాలను నేనెప్పటికీ మర్చిపోను. బోనీ చిన్న తమ్ముడు సంజయ్ కపూర్, అతని భార్య మహదీప్‌లతో కూడా నాది ప్రత్యేకమైన బంధం.



నేనే నంబర్ వన్!

ఈ స్థానానికి చేరుకోవటం కష్టమేం కాదు. 'హిమ్మత్‌వాలా' అనే ఒకే ఒక్క హిట్‌తో బాలీవుడ్‌లో సూపర్ స్టార్‌ని అయిపోయాను. అయితే ఈ స్థానాన్ని నిలుపుకోవాలనే ఆందోళన మాత్రం ఎప్పుడూ ఉండేది. కానీ, పేరు ప్రతిష్టలు, డబ్బు నా జీవిత లక్ష్యాలు కావు. జీవితంలో చిన్న చిన్న విషయాలే నన్ను సంతోష పెడుతూ ఉంటాయి. మావారి నులివెచ్చని చేతుల స్పర్శ, మాతృత్వ మధురిమలనే నేనెప్పుడూ కోరుకుంటూ ఉంటాను.

నేను ఇంట్రావర్ట్!



చిన్నప్పుడు నేను సిగ్గరిని. ఎప్పుడూ ఒంటరిగా ఉండటానికే ఇష్టపడతాను. నాకు గుంపులు, మనుషులు అంటే ఇష్టం ఉండదు. గదిలో ముగ్గురు, నలుగురు మనుషులు కనిపిస్తే చాలు! పరిగెత్తుకుంటూ వెళ్లి మా అమ్మ కొంగు వెనక దాక్కునేదాన్ని. ఆమెతో నాకు అనుబంధం ఎక్కువ. నాది సున్నిత స్వభావం. చిన్నదానికే ఏడ్చేసేంత ఎమోషనల్. చిన్న విషయాలకే మనసు కష్టపెట్టుకునే తత్వం మంచిది కాదని, కొంత రాటుదేలాలని మా అమ్మా, నాన్నా చెబుతూ ఉండేవారు. కానీ ఈ విషయంలో నేనేం మారలేదు. పైగా అంతర్ముఖురాలిని కూడా! ఎంత బాధ కలిగినా నోరు తెరిచి ఎవరికీ చెప్పుకోను. చిన్నప్పుడు స్కూల్లో కింద పడిపోయి దెబ్బ తగిలింది. ఆ విషయం చెల్లెలితో కూడా చెప్పలేదు. నొప్పితో రాత్రంతా అటూ ఇటూ మసలుతూ తెల్లారి లేచేసరికి ముఖం ఎర్రగా కంది, వాచిపోయింది. అప్పుడుగానీ నాకు దెబ్బ తగిలిన సంగతి ఇంట్లో వాళ్లకు తెలియలేదు. నాకు ప్రతి రాత్రీ కలలొస్తాయి. ఎక్కువసార్లు దెయ్యాలు, పాములు, ఫాంటమ్స్ కల్లోకొచ్చేవి. ఆ కలలన్నిట్లో ఓ కలంటే నాకు చాలా ఇష్టం. దాన్లో ఓ అందమైన యువకుడు, తెల్లని దుస్తుల్లో నా దగ్గరకొచ్చి ముద్దు పెట్టుకుంటాడు. అలా ముద్దు పెట్టుకోగానే, మేం పెళ్లి దుస్తుల్లోకి మారిపోతాం. దేవుడా! అంత అందమైన అబ్బాయిని ఎక్కడా చూడలేదు.



డాన్సులంటే అసహ్యం!

దక్షిణాది ఆడపిల్లలందరూ శాస్త్రీయ నృత్యాన్ని చిన్నప్పటి నుంచే నేర్చుకుంటూ ఉంటారు. కాబట్టి నృత్యం లేకుండా నా జీవితాన్ని ఊహించలేను. అయితే, వేలాడే దుస్తుల్లో వెండితెర మీద గంతులేయటం అంటే నాకు అసహ్యం. నా వృత్తిలో భాగం కాబట్టి అలాంటి నృత్యాలు చేయక తప్పలేదు. నిజ జీవితంలో నేనెప్పుడూ డిస్కోలకు వెళ్లలేదు. ఒకవేళ వెళ్లినా అసహ్యించుకునేదాన్ని. పైగా గుంపులుగా జనం గుమికూడి ఉంటే నాకు నచ్చదు. నేను డిస్కోలకు వెళ్లటం మా అమ్మకూ ఇష్టం ఉండదు. ఆమెకసలు నేనెక్కడికి వెళ్లడమూ ఇష్టం ఉండదు.

ఉదయమే ఉత్సాహం...

పాటల్లో నేను మరింత అందంగా కనిపించడానికి కారణం ఒకటుంది. ముఖ్యంగా క్లోజప్ షాట్స్‌లో. ఓ పాటలో ఎక్కువ క్లోజప్స్ ఉన్నాయంటే ఉదయం ఏడుగంటలకే ఈ సీన్లు తీసుకోమని చెప్పేదాన్ని. ఎందుకంటే ఉదయం ఉన్న ఉత్సాహం, ఫ్రెష్‌నెస్ సాయంత్రం అయ్యే సరికి ఉండదని నా అభిప్రాయం. అందుకే రాఘవేంద్రరావులాంటి దర్శకుడు క్లోజప్ షాట్స్ ఉన్నప్పుడు ఉదయం ఏడు గంటలకే అవన్నీ చిత్రీకరించేవారు. ఆ తర్వాత చక్కని టిఫిన్ తిని క్రేన్ షాట్స్, లాంగ్ షాట్స్ మధ్యాహ్న సమయంలో తెరకెక్కించేవారు. నేను కూడా అదే సమయాన్ని ప్రిపర్ చేసేదానిని.

అమాయకురాలిని కాదు...

సినిమాల్లో కాకుండా నా రియల్ లైఫ్‌లో నా మొహం చూసిన ప్రతి ఒక్కరూ నన్ను అమాయకురాలని అనుకుంటారు. 'పదహారేళ్ల వయసు'లో నా పాత్ర అలా ఉంటుంది కాబట్టి చాలామంది అమాయకురాలని అనుకుంటారు. నేను కనిపించినంత అమాయకురాలిని కాదు. అలాగే నాకు జ్ఞాపక శక్తి కూడా చాలా ఎక్కువ. వంద ఫొటోలు, సీన్లు చూపించి సందర్భం ఏంటో అడిగితే ఇట్టే సమాధానం చెప్పేస్తా.

గుర్రానికి కళ్లెం వేసినట్టే...

గుర్రానికి కళ్లెం వేస్తే సూటిగా ఎలాగైతే పరిగెడుతుందో నేనూ అంతే. దర్శకులు చెప్పిందే వేదంగా భావించేదాన్ని. సీన్ వివరించి యాక్షన్ అనగనే దర్శకులు ఏది చెప్పారో అదే చేసేదాన్ని. రోడ్డు మీద రన్నింగ్ సీన్ అయితే ముందూవెనుకా ఏ వాహనం వస్తుందో కూడా చూసుకునే దానిని కాదు. అంతగా ఇన్‌వాల్వ్ అయిపోయేదానిని. ప్రమాదాల గురించి పట్టించుకోకుండా ఎన్నోసార్లు గాయాలపాలయ్యాను. ఛైల్డ్ ఆర్టిస్ట్‌గా చేసిన సమయంలో 'నా తమ్ముడు' చిత్రంలో ఓ ప్రమాదకర సన్నివేశం నాకు బాగా గుర్తుంది. పరిగెడుతూ రోడ్డు దాటే సన్నివేశమది. యాక్షన్ చెప్పగానే రోడ్డు అవతల కర్చీఫ్ ఎగరేస్తూ నిలబడిన వ్యక్తిని చూస్తూ రోడ్డు దాటాలి. మౌంట్ రోడ్‌లో చిత్రీకరించిన ఆ సన్నివేశం నా ప్రాణాల మీదకొచ్చింది. రోడ్డు దాటుతుంటే నాకు తెలియకుండానే ఓ కార్ నా కాలిని ఢీ కొడితే రెండు మూడు పల్టీలు కొట్టి స్పృహ కోల్పోయాను. ఆ తర్వాత నాకేం తెలియలేదు. ఆ సినిమాకు కె.ఎస్.ప్రకాశ రావుగారు దర్శకుడు. సీన్ టేక్ చేసింది మాత్రం రాఘవేంద్రరావుగారు. ఆ ప్రమాదం తర్వాత ఆయన చాలా భయపడిపోయారు. మా అమ్మ కలలోకి వచ్చి ఆయన మీద పెద్దపెద్దగా అరుస్తూ పోలీస్ కేస్ పెట్టినట్లు కల కన్నారట. ఆయనకు ఆ భయం ఎందుకొచ్చింది అంటే షూటింగ్‌కు నేనూ వస్తాను అని అమ్మ అంటే మీ అమ్మాయిని జాగ్రత్తగా తీసుకొచ్చి అప్పగించే బాధ్యత నాది' అని రాఘవేంద్రరావుగారు చెప్పారట. అందుకే ఆయన అంతగా భయపడ్డారు. ఓ రోజు షూటింగ్‌లో ఆ విషయాలన్నీ చెప్పి సరదాగా నవ్వించారు.

ఆ సదుపాయాలు లేవు...

పాతరోజుల్లో షూటింగ్ కోసం ఉభయ గోదావరి జిల్లాలకు వెళ్లిన సంగతులెన్నో నాకు గుర్తున్నాయి. అప్పట్లో కేర్‌వాన్ వసతి ఉండేది కాదు. కనీస అవసరాలకు ఎంతో దూరం వెళ్లాల్సి వచ్చేది. అక్కడ పడిన ఇక్కట్లు ఇప్పటికీ మదిలో మెదులుతున్నాయి. సీన్ పూర్తి కాగానే చెట్ల నీడ ఎక్కడ ఉందా అని వెతుక్కునేవాళ్లం. గోదావరి వంటకాల్ని నేను ఎంతో ఇష్టంగా తినేదానిని. మాతో పోల్చితే నేటి తరం నాయికలు చాలా అదృష్టవంతులు. ఈ రోజున సెట్‌లో వారికి అందని సదుపాయం లేదు. ఆ రోజున ఉన్న అనుబంధాలు, ఆప్యాయతలు ఇప్పుడు లేవు. ఇప్పుడంతా హాయ్, బాయ్ జనరేషన్.

నేనూ అమ్మనే కదా!

'మామ్' సినిమాలో నా క్యారెక్టర్ చూసి 'ఎందుకంత డీ గ్లామర్‌గా కనించారు' అని చాలామంది అడిగారు. 18 ఏళ్ల అమ్మాయికి తల్లిగా నటించాలంటే మొహంపై ముడతలతో అలా డీ గ్లామర్‌గానే కనిపించాలి. నిజ జీవితంలో ఇద్దరు బిడ్డల తల్లి పాత్ర పోషిస్తూ సమాజంలో జరుగుతున్నవి చూస్తున్నాను కాబట్టి ఆ పాత్రను ఓన్ చేసుకుని పోషించా. 'మామ్'లో నా పాత్రను చూసిన ప్రతి తల్లీ నన్ను ప్రశంసించారు.

నేను ఫుడ్ లవర్!

నాకు తినటమంటే ఇష్టం. నాకెంతో ఆనందాన్నిచ్చే పని....తినటం. రోజులో కనీసం ఆరు సార్లు భోం చేస్తాను. ప్రతి రెండు గంటలకూ నాకు ఆకలేస్తుంది. ఉదయం సుష్టుగా తిని స్టూడియోకి బయల్దేరతాను. అక్కడికి చేరుకోగానే ఇంకో బ్రేక్‌ఫాస్ట్ నాకోసం సిద్ధంగా ఉంటుంది. నాకు చైనీస్ ఫుడ్ ఇష్టం. వాటిలో చికెన్, లాబ్‌స్టర్...నా ఫేవరెట్. నాకు స్వీట్లు, ఐస్‌క్రీమ్‌లు, పేస్ట్రీలన్నా ఇష్టమే! అయితే అన్నం, పెరుగు లేకుండా మాత్రం నా భోజనం పూర్తి కాదు. చైనీస్ ఫుడ్ తిన్నా చివర్లో కొద్దిగానైనా అన్నం తినాల్సిందే!


హై హీల్స్ ఇష్టం

నా ఎత్తు 5 అడుగుల ఏడంగుళాలు. అయినా నేను హై హీల్స్ వేసుకుంటాను. అమ్మాయిలు ఎత్తుగా ఉండే హుందాగా కనిపిస్తారు. అయితే కొన్ని సినిమాల్లో ఎత్తు చెప్పులు వేసుకోవటానికి వీలుండదు. కొంతమంది హీరోలు ఎత్తు తక్కువగా ఉంటారు. కర్మ సినిమాలో కొన్ని షాట్లలో నేను జాకీ ష్రాఫ్ కంటే ఎత్తుగా కనిపిస్తాను...ఎందుకో తెలుసా? ఆ షాట్లలో జాకీ చెప్పుల్లేకుండా ఉంటే, నేనేమో హైహీల్స్ వేసుకున్నాను. నాకు ఏది ఫ్యాషనో, ఏది కాదో తెలియదు. నా షాపింగ్ అంతా మా చెల్లెలే చేసేది. ఇంట్లో డ్రస్సింగ్ టేబుల్ మీద మా అమ్మ, చెల్లెలు వాడే సెంటు బాటిళ్లు బోలెడన్ని ఉండేవి. వాటి పేర్లేంటో కూడా నాకు తెలియదు. నేను స్నానానికి సబ్బు కూడా వాడను. శనగపిండితో రుద్దు కుంటాను. పౌడర్ మాత్రం రాసు కుంటాను. అప్పుడప్పుడూ గంధం వాడతాను.



'సిల్వెస్టర్ స్టాలెన్' నా ఫస్ట్ క్రష్

నాకు హాలీవుడ్ ఫేమ్ సిల్వెస్టర్ స్టాలెన్ అంటే పిచ్చి. ఆయన రాకీ సిరీస్ లెక్కలేనన్ని సార్లు చూశాను. నాకు కనిపించిన మగాళ్లందర్లో అతనే అందరికంటే సెక్సీయెస్ట్ మ్యాన్. గొప్ప నటుడు కూడా! అతని గొంతు వినిపిస్తే నా రోమాలు నిక్కబొడుచుకుంటాయి. ఆయన గురించి మాట్లాడేటప్పుడు కూడా నాకేదోలా అయిపోతుంది. నాకెప్పుడు కాస్త విచారంగా అనిపించినా స్టాలన్ సినిమా చూస్తాను. వెంటనే హుషారొచ్చేస్తుంది. ఎప్పుడూ ఏ మగాడికీ నేనింతలా అట్రాక్ట్ అవలేదు. బహుశా నా కలలోకొచ్చిన వ్యక్తి ఇతనేనేమో! అతను నన్ను ప్రపోజ్ చేస్తే మరో ఆలోచన లేకుండా ఠక్కున ఒప్పేసుకుని ఉండేదాన్ని.



ప్రేమ అద్భుతమైన భావన

ఈ కాలం పిల్లలకి ప్రేమ విలువ తెలుసో లేదో నాకు తెలియదు. నా వరకు నాకు ప్రేమంటే 'ఐ లవ్ యు' అని చెప్పటం, శారీరక ఆకర్షణ కాదు. ప్రేమ ఓ అద్భుతమైన భావన. పెళ్లయ్యాక భర్తకు కానుకగా ఇవ్వటం కోసం అపురూపంగా దాచుకోవలసిన నిధి...'స్త్రీత్వం' అని ఎక్కువ మంది నమ్మకం. ఈ విషయాన్ని నేనూ అంగీకరిస్తాను. కానీ, ఇప్పట్లో పెళ్లికి ముందే ఎంతోమందితో సంబంధాలు నెరిపి, శారీరకంగా దగ్గరయ్యే ట్రెండ్ నడుస్తోంది. నేనైతే అలా చేయలేను. వాళ్లెలా అలా చేయగలుగుతున్నారో అర్థం కాదు. ■

చెరగని జ్ఞాపకాలు



'యశోదకృష్ణ'లో శ్రీదేవి

1963-2018

సినీ సమ్మతులు

హిట్ పెయిర్

'బడిపంతులు'లో..

నటనకు వయసు ప్రామాణికం కాదని చెప్పిన హీరోయిన్ శ్రీదేవి. సీనియర్ హీరోల సరసన నటించడానికి ఈతరం కథానాయికలు వెనకడుగు వేస్తుంటారు. ఏజ్‌ను దృష్టిలో పెట్టుకొని చేయడానికి ఆలోచిస్తుంటారు. ఎక్కువ పారితోషికం ఇస్తామన్నా ఒప్పుకోరు. కానీ శ్రీదేవి అలా ఎప్పుడూ ఆలోచించలేదు. 'బడిపంతులు' చిత్రంలో ఎన్టీఆర్‌కు మనవరాలిగా నటించి, 'బూచాడమ్మా బూచాడు' పాటతో అందరినీ ఆకట్టుకొన్నారు శ్రీదేవి. ఆరేళ్ల తర్వాత అదే నటిని ఎన్టీఆర్ సరసన కథానాయికగా ఎంపిక చేయడం అప్పట్లో సంచలనం అయింది. ఆ రోజుల్లో 'స్కైలాబ్' నేల మీద పడుతోందన్నది సంచలన వార్త. దానికి మించిన సంచలనం సృష్టించింది ఈ కాంబినేషన్. 'వేటగాడు' సినిమా తీసే ముందు రాఘవేంద్రరావు పెట్టిన ప్రపోజల్‌కి రామారావు ఒప్పుకుంటారో లేదో అని నిర్మాతలే భయపడ్డారు. ఎందుకంటే అప్పుడు శ్రీదేవి వయసు 16 సంవత్సరాలు. అదే విషయాన్ని రామారావుగారితో చెబితే 'నా వయసు పదిహేనే కదా' అని స్పోర్టివ్‌గా మాట్లాడారు. దాంతో రాఘవేంద్రరావు నమ్మకానికి మరింత ధైర్యం చేకూరింది. 'వేటగాడు' చిత్రం సంచలన విజయం సాధించింది. ఎన్టీఆర్ ధైర్యాన్ని, దర్శకుడి నమ్మకాన్ని, శ్రీదేవి కమిట్‌మెంట్‌ను ఆ సినిమా రుజువు చేసింది. ఆ చిత్రంతో ఓవర్‌నైట్ స్టార్ హీరోయిన్ అయ్యారు శ్రీదేవి. అక్కడి నుంచి ఎన్టీఆర్, శ్రీదేవి కాంబినేషన్‌లో మూడేళ్ల కాలంలో 12 సినిమాలు వచ్చాయి. 1979 నుంచి 82 మధ్యకాలంలో సినిమా ప్రేక్షకులు ఇచ్చిన తీర్పు ప్రకారం ఎన్టీఆర్, శ్రీదేవి హిట్ పెయిర్‌గా నిలిచారు.

'జస్టిస్ చౌదరి'లో..

అటు తండ్రితో.. ఇటు తనయుడితో..

మొదట బాలనటిగా.. తర్వాత హీరోయిన్‌గా

బాలనటిగా హీరో కృష్ణ కాంబినేషన్‌లో ఐదారు చిత్రాలు చేసిన శ్రీదేవి హీరోయిన్‌గా ఎదిగిన తర్వాత ఆయన పక్కన నటించిన తొలి సినిమా 'బుర్రిపాలెం బుల్లోడు'. విజయనిర్మల, జయప్రద తర్వాత కృష్ణ సరసన అత్యధిక చిత్రాల్లో నటించిన ఘనత శ్రీదేవిదే. ఈ జంట 31 చిత్రాల్లో నటించారు. మరో విషయమేమిటంటే మిగిలిన హీరోలను తెరపై చూడటం తప్ప వ్యక్తిగతంగా చూసే అవకాశం శ్రీదేవికి ఉండేది కాదు. కానీ...

శోభన్ జోస్యం నిజమైంది

తండ్రితో.. ప్రియునిగా..

మెగాస్టార్ సరసన..

ఆడిస్ట్ ధర్మగా..

ఒకే ఒక్క సినిమా

వాన పాటల క్వీన్..!



'వేటగాడు'లో ఎన్టీఆర్‌తో..

సిల్వర్ స్క్రీన్‌మీద వాన పాటలకు ఉన్న క్రేజే వేరు. తెరమీద నాయిక అందాలు తడిసి ముద్దవుతుంటే చూసే కుర్రకారు థియేటర్లలో ఈలలేసి గోలలు చేస్తుంటారు. మాస్ అట్రాక్టివ్ ఫార్ములాల్లో వాన పాటలదే పెద్దపీట. అందాల నాయికగా తెరమీద వెలుగు వెలిగిన శ్రీదేవి కూడా పలు వాన పాటల్లో నటించారు. 'వేటగాడు'లో ఎన్టీఆర్ సరసన 'ఆకు చాటు పిందె తడిసె' చిత్రంలో ఆడిన పాడిన ఆమె, శోభన్ బాబుతో 'కోడె తాచు'లో 'ఇరుకులో పడ్డావె రైకమ్మత్త..' పాటలో నర్తించారు. కృష్ణ సరసన 'కంచు కాగడ'లో 'వైశాఖ మాసాన.. వయసొచ్చెనమ్మా..'లో ఆడి పాడారు. వారిద్దరి కాంబినేషన్‌లో వచ్చిందే 'గుండె చాటు గూటిలో గుట్టులాంటి చోటులో' అనే మరో పాట. 'ఆఖరి పోరాటం'లో నాగార్జునతో సైతం 'స్వాతి చినుకు సందె వేళలో..' పాటకు స్టెప్పులు వేశారు. హిందీలోనూ బారిష్ పాటల్లో ఆమె డ్యాన్సులు చేశారు. 'మిస్టర్ ఇండియా'లో 'ఐ లవ్యూ', 'ధరమ్ అధికారి'లో 'ఎక్ తో కామ్ జిందాగని..', 'జస్టిస్ చౌదరి'లో 'ముఝె క్యాహువా ఏ బతావ్..', 'బలిదాన్'లో 'ఆజ్ ఏక్ హోజా'.. వంటివి అందులో కొన్ని. ఆమె నటించిన వాన పాటలు ఇప్పటికీ యువకుల గుండెల్లో జల్లులై కురుస్తూనే ఉన్నాయన్నది వాస్తవం.

ఆ పాటకు దక్కిన గౌరవం

కె.రాఘవేంద్రరావు దర్శకత్వం వహించిన 'అడవి రాముడు' చిత్రంలోని 'ఆరేసుకోబోయి పారేసుకు...

హిందీ కెరీర్

ఉత్తరాది మది దోచిన...
చాందినీ... ఓ చాందినీ!



'చాందిని'లో రేఖ, 'నగీనా'లో జయప్రద హీరోయిన్లుగా నటించాల్సింది. ఆఖరికి ఆ పాత్రలు శ్రీదేవికి లభించాయి. హిందీ సినీరంగంలో అగ్రస్థానాన్ని ఆమె స్థిరపరుచుకోవడానికి ఆ పాత్రలు దోహదం చేశాయి.

...హీరో, శ్రీదేవి హీరోయిన్. తెలుగులో హిట్టయిన అనేక సినిమాలు వరుసగా హిందీలోకి వెళ్ళాయి. ఆ వరుస విజయాలను చూసి, మద్రాస్ ఫార్ములా సౌతిండియన్ సినిమాలుగా అప్పట్లో ఉత్తరాది దర్శక, నిర్మాతలు నోళ్ళు నొక్కుకొనేవారు. హిందీలో హేమమాలిని, రేఖల శకం ముగిసిపోవడం, శ్రీదేవి హవా ప్రారంభమవడం... దాదాపు ఒకేసారి జరిగాయి. ఒక రకంగా శ్రీదేవి అంత ఉన్నతస్థాయికి ఎదగడానికి అది కూడా ఒక కారణమని చెప్పుకోవాలి...



'మిస్టర్ ఇండియా'లో

మరపురాని అభినయం

మళ్లీ మళ్లీ పాడుకోనేలా..

అమితాబ్‌కు ముందే తెలుసా?

ఇంకొక్క సినిమా చేస్తే... 25



అప్పుడూ అలాగే...

బోనీకపూర్‌కు మొదటి వివాహం మోనాషౌరీతో జరిగింది. కొన్ని కారణాల వల్ల వారిద్దరూ విడిపోవడం, బోనీకపూర్ శ్రీదేవిని పెళ్లి చేసుకోవడం జరిగాయి. కొంతకాలానికి మోనా అనారోగ్యంతో చనిపోయారు. ఆమె కుమారుడు అర్జున్ కపూర్ అప్పటికే 'ఇషక్ జాదే' చిత్రంలో నటిస్తున్నారు. అర్జున్ కపూర్ నటించిన తొలి చిత్రమది. 2012 మేలో ఆ చిత్రం విడుదలైంది. అయితే అంతకుముందు మార్చిలో అర్జున్ తల్లి మరణించారు. దాంతో తన కుమారుడు నటించిన తొలి సినిమా చూడలేకపోయారు. ఇప్పుడు శ్రీదేవి విషయంలోనూ ఇదే జరిగింది. శ్రీదేవి మొదటి కుమార్తె జాన్వి కపూర్ ప్రస్తుతం 'ధడక్' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమా జూన్‌లో విడుదల కావాల్సి ఉంది. శ్రీదేవి సలహాతోనే జాన్వి ఈ సినిమాకు ఒప్పుకొన్నారు. అమ్మ ఉంటేనే ధైర్యంగా షూటింగ్ చేస్తాననేవారు జాన్వి. అందుకే శ్రీదేవి జాన్వి కోసం సెట్‌లోనే ఉండేవారు. ఈ సినిమాలని ఫస్ట్‌లుక్ విడుదలైనప్పుడు జాన్వి.. సేమ్ తన తల్లిలాగే ఉన్నారంటూ ఫ్యాన్స్ మురిసిపోయారు. తొలి సినిమాతో జాన్వికి మంచి గుర్తింపు వస్తుందని శ్రీదేవి ఈ మధ్యన చాలా సందర్భాల్లో చెప్పారు. కానీ తన కూతురిని తెరపై చూసుకోకుండానే శ్రీదేవి మరణించడం బాధాకరం.

2013లో పద్మ పురస్కారం...

తన నటనతో ఎన్నో ప్రశంసలు అందుకున్న శ్రీదేవి పలు అవార్డులు కూడా అందుకున్నారు. నటిగా సినిమా పరిశ్రమకు ఆమె చేసిన సేవలను గుర్తించి 2013లో...



మలుపులు.. మజిలీలు

తమిళ ప్రేక్షకుల డ్రీమ్ గర్ల్






సంధ్య 35 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,2.00,6.00,9.00

లక్ష్మి 70 ఎంఎం ఎ/సి - శంషాబాద్ 11.30,2.30,6.30,9.30

PRASADS ఎ/సి - 10.00 5.45	Cinemax అమీర్‌పేట్ 1.50PM	T ఇ.సి.ఐ.ఎల్ క్రాస్ రోడ్ - 6.15PM
PVR మాదాపూర్ - 2.10PM	Cinepolis కూకట్‌పల్లి 4.35PM	ASIAN ఉప్పల్ 1.45PM
PVR బంజారాహిల్స్ - 11.00AM	Cinepolis మల్కాజిగిరి 1.20PM	ASIAN కూకట్‌పల్లి 7.30PM
PVR పంజాగుట్ట 1.55PM	Cinepolis అత్తాపూర్ 5.10PM	ASIAN అత్తాపూర్ 1.45PM
PVR L&T - పంజాగుట్ట 8.00PM	TIVOLI 11.15AM,5.00PM	ASIAN రాధికా - కాప్రా 1.30PM
PVR కూకట్‌పల్లి - 10.30PM	Cine Planet కొంపల్లి 1.45PM	ASIAN హన్మకొండ 4.50PM
PVR ICON - మాదాపూర్ 3.15PM	దిల్‌సుఖ్‌నగర్ - 7.45PM	GEETHA ASIAN నిజామాబాద్ - 4.20PM
INOX బంజారాహిల్స్ 5.10PM	మూసాపేట్ 2.45PM	SVC కరీంనగర్ 5.00PM
INOX కాచిగూడ - 4.55PM	MULTIPLEX ఎల్.బి.నగర్ 4.40PM	ఎ/సి వరంగల్ - 12.15PM

నర్తకి 70 - ఖమ్మం	రంగ 70 - వనపర్తి	అనురాగ్ - జహీరాబాద్
సాయికృష్ణ - కరీంనగర్	నవరంగ్ - గద్వాల్	శారద 70 - పరిగి
జయ డీలక్స్ - పరకాల	దేవి 70 ఎ/సి - జడ్చర్ల	లక్ష్మి 70 - అచ్చంపేట
వెంకటేశ్వర - తొర్రూర్	పార్థసారథి - కల్వకుర్తి	భవాని - కొత్తకోట
లక్ష్మి 70 - మరిపెడ	కృష్ణప్రియ - కోదాడ	వెంకటేశ్వర - చేవెళ్ళ
అన్నపూర్ణ - హుజూరాబాద్	కెజిఆర్ సినిమా - భువనగిరి	గణేష్ - ఆదిలాబాద్
బృందావన్ - ఆర్మూర్	వెంకటేశ్వర - నిర్మల్	గోపాలకృష్ణ - భద్రాచలం

విజయవంతమైన 4వ వారం



శాంతి 70 - నారాయణగూడ 11.00,2.00,6.00,9.00

లక్ష్మీకళ - మూసాపేట 11.30,2.30,6.30,9.30

తాళ్లూరి - ఇసిఐఎల్ క్రాస్‌రోడ్స్ 11.30,2.30,6.30,9.30

శివపార్వతి 70 - కూకట్‌పల్లి 2.30,6.15,9.30

వెంకటాద్రి - దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.15,6.15,9.15

ప్రశాంత్ - సికింద్రాబాద్ 11.00,2.00,6.00,9.00

శ్రీలత 70 - ఆర్.సి.పురం 11.15,2.15,6.15,9.15

సూపర్ - బాలాపూర్ 11.00,2.00,6.00,9.00

ASIAN కూకట్‌పల్లి 10.45,4.30PM	Cine Planet కొంపల్లి 4.45PM	PVR కూకట్‌పల్లి 1.10PM
	PRASADS ప్రసాద్స్ 11.00AM	PVR పంజాగుట్ట 4.20PM
ASIAN ఉప్పల్ 10.30PM	Cinepolis అత్తాపూర్ 5.15PM	MULTIPLEX ఎల్బీనగర్ 4.15PM
ASIAN అత్తాపూర్ 10.50PM	GLOBAL CINEMAS RELEASE	GLOBAL



తారకరామ 70 - కాచిగూడ 11.15,2.15PM

రాజధాని కాంప్లెక్స్ - దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.15

ఆరాధన - తార్నాక 11.00,2.00,6.00,9.00

రాఘవేంద్ర కాంప్లెక్స్ మల్కాజిగిరి 6.15PM	PVR పంజాగుట్ట 11.25AM	T ఇసిఐఎల్ 11.15AM
	PVR కూకట్‌పల్లి 11.00AM	ASIAN కూకట్‌పల్లి 10.30AM
మూసాపేట్ 11.30AM	ASIAN ఉప్పల్ 10.45AM	GEETHA ASIAN నిజామాబాద్ 10.30PM

లక్ష్మణ్ 70 - వరంగల్	శివశక్తి - తాండూర్	సంధ్యారాణి - గంగావతి
శివ 70 ఎ/సి - కరీంనగర్	శ్రీకృష్ణ ఎ/సి - నిజామాబాద్	లలిత ఎ/సి - ఇల్లందు
మయూరి - మంచిర్యాల	భువనేశ్వరి ఎ/సి - బోధన్	శ్రీనివాస - ఎ/సి - జల్	సత్యలక్ష్మి - అచ్చంపేట్
శ్రీనివాస ఎ/సి - జగిత్యాల	మహేశ్వరి - నారాయణపేట	అన్నపూర్ణ - మణుగూరు
మహేశ్వరి - ఆదిలాబాద్	శ్రీదేవి ఎ/సి - కొత్తకోట	శారద - కమలాపూర్
రాఘవేంద్ర - జడ్చర్ల	వెంకటేశ్వర - జడ్చర్ల	అలంకార్ - సూర్యాపేట
సాయిరాజ - షాద్‌నగర్	వెంకటేశ్వర - తిరుమలగిరి	రాజేశ్వరి - రాయికల్

RELEASE



సుదర్శన్ 35 - ఆర్‌టిసి క్రాస్ రోడ్స్ 11.00,2.15,5.45,9.15

రాజధాని కాంప్లెక్స్ - దిల్‌సుఖ్‌నగర్ 6.15,9.15

అంజలి సినీప్లెక్స్ - సికింద్రాబాద్ 11.15,2.15,6.15,9.15

శివపార్వతి 70 ఎ/సి - కూకట్‌పల్లి 11.30 AM | పెలికాన్ - మచ్చబొల్లారం 11.00,2.00,6.00,9.00

రాఘవేంద్ర కాంప్లెక్స్ - మల్కాజిగిరి 2.15,9.15 | వెంకటసాయి - కీసర 11.00,2.00,6.00,9.00

పంచవటి సినీప్లెక్స్ - 11.00	MULTIPLEX ఎల్.బి.నగర్ 11.00AM	PVR మాదాపూర్ 4.15PM
ప్రసాద్స్ మూసాపేట్ 11.30AM	Cinepolis కూకట్‌పల్లి 4.35PM	PVR పంజాగుట్ట 1.15PM
T ఇసిఐఎల్ 2.15PM	Cinepolis అత్తాపూర్ 11.15AM	Cinepolis దిల్‌సుఖ్‌నగర్ 5.10PM
SVC మహాలక్ష్మి కొత్తపేట 11.15AM	PVR అత్తాపూర్ 1.25PM	ASIAN హన్మకొండ 10.55AM
	PVR పంజాగుట్ట 4.45PM	GEETHA ASIAN నిజామాబాద్ 10.30AM

కిన్నెరసాని - ఖమ్మం	కెజిఆర్ - భువనగిరి	వెంకటేశ్వర - మహబూబ్‌నగర్	తిరుమల - గద్వాల్
వినాయక సినీప్లెక్స్ - కరీంనగర్	వెంకటేశ్వర - పెద్దపల్లి	వెంకటేశ్వర - తిరుమలగిరి	ఎస్‌ఎస్ - రాయచూర్
శివ 70 ఎ/సి - కరీంనగర్	పరమేశ్వరి - షాద్‌నగర్	రాజ్యలక్ష్మి - ఖానాపూర్	అమర్ - గంగావతి
మయూరి - మంచిర్యాల	నటరాజ్ - జగిత్యాల	శాంభవి - ఖాజీపేట	భువనేశ్వరి - బీదర్
సినీమ్యాక్స్ - జహీరాబాద్	రామకృష్ణ - నర్సాపూర్	అన్నపూర్ణ - చెన్నూర్	SSV తిరుమల - గద్వాల్
బాలాజీ - సత్తుపల్లి	శ్రీనివాస - సిద్దిపేట	సాగర్ - మెదక్	రాఘవేంద్ర - జడ్చర్ల
శాంతామహల్ - ఆదిలాబాద్	వెంకటేశ్వర - బాన్సువాడ	లలిత - ఇల్లందు	
శివ శంకర్ - మెట్‌పల్లి	రాజశ్రీ - రాయికల్		
అశ్విని 70 - తొర్రూర్		MGM 9296509333 9989522999	



సంధ్య 70 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,2.00,6.00,9.00

భ్రమరాంబ ఎ/సి - కూకట్‌పల్లి 11.30,2.45,6.30,9.45

రాజధాని కాంప్లెక్స్ దిల్‌సుఖ్‌నగర్ 11.00,2.00,6.00,9.00

PRASADS 10.30,3.20,6.15,8.30,11.00	Cine Planet కొంపల్లి 10.40,1.15,7.20,10.10
PVR మాదాపూర్ 10.55,1.30,7.35,10.10	MULTIPLEX దిల్‌సుఖ్‌నగర్ 11.30,8.30,11.00
PVR బంజారాహిల్స్ 11.10,4.40,11.00	T ఇ.సి.ఐ.ఎల్ 2.15,6.00,9.15
PVR పంజాగుట్ట 11.20,5.20,7.45,10.20	ASIAN ఉప్పల్ 10.40,1.40,7.35,10.05
PVR 11.40,2.15,4.50,7.25,10.00	Lakshmikala మూసాపేట్ 11.00,2.15,6.00,9.30
PVR ఐకాన్ 12.15,7.15,10.00	ASIAN కూకట్‌పల్లి 10.50,1.50,7.40,10.30
PVR పంజాగుట్ట 11.15,2.20,4.55,7.25,11.00	ASIAN అత్తాపూర్ 1.50,7.50,10.20
INOX బంజారాహిల్స్ 12.05,2.30,7.45,10.10	ASIAN కాప్రా 1.40,7.40,10.25
INOX కాచిగూడ 11.45,2.10,7.25,9.50	ASIAN దిల్‌సుఖ్‌నగర్ 11.00,6.00,9.00
Cinemax అమీర్‌పేట్ 11.10,4.50,10.25	Cinepolis మియాపూర్ 11.30,6.15,9.30
Cinemax శామీర్‌పేట్ 11.10,2.00,7.40	MULTIPLEX ఎల్బీనగర్ 11.00,3.45,7.15,8.35
Cinepolis 11.15,1.50,7.30,10.00	ASIAN చింతల్ 11.15,6.15,9.15
Cinepolis 11.00,2.00,7.00,9.30	ASIAN హన్మకొండ 1.40,7.25,10.15
Cinepolis అత్తాపూర్ 11.25,2.15,8.05	GEETHA ASIAN నిజామాబాద్ 11.00,1.50,7.40
TIVOLI సికింద్రాబాద్ 1.15,7.15,10.00	వరంగల్ 12.45,3.50,7.30,10.15

రాఘవేంద్ర కాంప్లెక్స్ - మల్కాజిగిరి 11.15,2.15,6.15,9.15

అలంకార్ 70 - లంగర్‌హౌస్ 11.00,2.00,6.00,9.00

శ్రీదేవి 70 ఎ/సి - ఆర్.సి.పురం 11.15,2.15,6.15,9.15

BR హైటెక్ 70 - మాదాపూర్ 11.00,2.00,6.00,9.00

రాజ్యలక్ష్మి 70 ఎ/సి - ఉప్పల్ 11.00,2.00,6.00,9.00

SVC మహాలక్ష్మి కాంప్లెక్స్ - కొత్తపేట 2.15,6.15,9.15

శ్రీరమణ కాంప్లెక్స్ - అంబర్‌పేట 11.00,2.00,6.00,9.00

స్వప్న కాంప్లెక్స్ ఎ/సి - కాటేదాన్ 11.15,2.15,6.00,9.00

వైజయంతి ఎ/సి - నాచారం 11.00,2.00,6.00,9.00

SV సినీప్లెక్స్ 70 - పటాన్‌చెరు 11.00,2.00,6.00,9.00


విష్ణు 70 ఎ/సి - వనస్థలిపురం 11.15,2.15,6.15,9.15

నాగేంద్ర 70 ఎ/సి - కర్మన్‌ఘాట్ 12.00,3.00,7.00,10.00

సప్న 35 ఎంఎం ఎ/సి - అబిడ్స్ 2.30,6.00,9.00PM

రామ్ 70 - వరంగల్	దుర్గ కెంపా - జగిత్యాల	అన్నపూర్ణ - జమ్మికుంట	రామకృష్ణ - నకిరేకల్
అశోక్ - కరీంనగర్	విజయ్‌శంకర్ - కోరుట్ల	వెంకటేశ్వర 70	శ్రీనివాస ఎ/సి - పెద్దపల్లి
శ్రీనివాస - ఖమ్మం	నటరాజ్ - సిరిసిల్ల	మహబూబాబాద్	వెంకటేశ్వర - ఆర్మూర్
నిజామాబాద్	వెంకటేశ్వర - నల్గొండ	వెంకటేశ్వర - సూర్యాపేట	కృష్ణ కెంపా - జనగాం
తిరుమల - ఆదిలాబాద్	శ్రీనివాస - సిద్దిపేట	మహేశ్వరి - జహీరాబాద్	లక్ష్మి 70 - మెట్‌పల్లి
కృష్ణ కమాండర్ - జనగాం	గోపాలకృష్ణ - భద్రాచలం	మహేశ్వరి - మహబూబాబాద్	లక్ష్మి 70 - కోరుట్ల
ఊర్వశి - గోదావరిఖని	లక్ష్మి - నర్సంపేట	సీతారామ - మణుగూరు	పరమేశ్వరి - బెల్లంపల్లి

KFC ENTERTAINMENT RELEASE



దేవి 70 ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,2.15,5.45,9.15

Enjoy 4k Digital Projection & Dolby Atmos Sound System

SVC మహాలక్ష్మి కాంప్లెక్స్ - కొత్తపేట 11.00,2.00,6.00,9.00 | SVC ఈశ్వర్ 11.00,2.00,6.00,9.00

SVC సంగీత - ఆర్.సి.పురం 11.00,2.00,6.00,9.00 | శ్రీలక్ష్మి - కర్మన్‌ఘాట్ 12.00,3.00,7.00,10.00

PRASADS 10.45,4.45,7.35,10.50	Cinemax ఎ/సి - 1.40,7.20	ASIAN 1.55,4.40,7.50
PVR 10.50,1.45,7.45,10.40	Cinepolis 11.30,4.45,10.20	ASIAN 4.50,10.20
PVR 1.15,7.50,11.00	Cinepolis 10.45,1.35,7.15,10.05	ASIAN 4.45,10.35
PVR 11.00,7.55,10.50	Cinepolis 10.45,4.25,10.10	ASIAN RADHIKA 4.40,10.15
PVR 1010,11.10,2.05,5.00,7.55,1050	TIVOLI 11.00AM,7.45PM	MULTIPLEX 1.15,10.50
INOX 10.30,4.15,10.30	Cine Planet 1.30,4.30,7.30	ASIAN చింతల్ 2.45,9.30
INOX ఎ/సి - 4.35,10.20	1120,5.30,10.45	ASIAN 11.05,1.45,7.30,10.30
Cinemax 11.00,4.40,10.20	T 11.00,2.00,6.00,9.00	GEETHA ASIAN 1.50,7.30,10.30

మల్లిఖార్జున - కూకట్‌పల్లి 11.30,2.30,6.30,9.30

మెగా ఎ/సి - దిల్‌సుఖ్‌నగర్ 11.00,2.00,6.00,9.00

శ్రీరాములు ఎ/సి - మూసాపేట్ 11.30,2.30,6.30,9.30

SVR శివశక్తి ఎ/సి - కాప్రా 11.00,2.00,6.00,9.00

గోకుల్ ఎ/సి - ఎర్రగడ్డ 11.15,2.15,6.15,9.15

శ్రీనివాస ఎ/సి - ఉప్పల్ 11.15,2.15,6.15,9.15

నర్తకి 70 ఎ/సి - అల్వాల్ 11.30,2.30,6.30,9.30

గెలాక్సీ ఎ/సి - టోలిచౌకి 11.00,2.00,6.00,9.00

శ్రీసాయిరామ్ - మల్కాజిగిరి 11.15,2.15,6.15,9.15

భుజంగ ఎ/సి - జీడిమెట్ల 11.00,2.00,6.00,9.00

సుష్మ ఎ/సి - వనస్థలిపురం 11.15,2.15,6.15,9.15

శ్రీదేవి ఎ/సి - చిలకలగూడ 1130,2.30,6.30,9.30

SVC ప్రతిమ మల్టీప్లెక్స్ - కరీంనగర్ | SVC దేవి 70 ఎంఎం ఎ/సి - జనగాం

SVC రామకృష్ణ 70 ఎ/సి - సంగారెడ్డి | SVC నటరాజ్ 70 ఎ/సి - నల్గొండ

వరంగల్	కరీంనగర్		ఆదిలాబాద్
రాధిక 70 ఎ/సి - వరంగల్	తిరుమల - కరీంనగర్	శ్రీసాయిరామ - అచ్చంపేట	మహేశ్వరి - ఆదిలాబాద్
అమృత ఎ/సి - హన్మకొండ	రాజేశ్వర్ - గోదావరిఖని	రవి ఎ/సి - నాగర్‌కర్నూల్	మహేశ్వరి - మంచిర్యాల
భవానీ ఎ/సి - మహబూబాబాద్	బాలాజీ ఎ/సి - జగిత్యాల	వేణుగోపాల్ - కల్వకుర్తి	నారాయణ 70 - నిర్మల్
జనార్దన్ - నర్సంపేట	విమల్ 70 - కోరుట్ల	బాలాజీ - వనపర్తి	బాలాజీ - భైంసా
ఉషోదయ ఎ/సి - భూపాలపల్లి	సంగీత 70 ఎ/సి - పెద్దపల్లి	వెంకటేశ్వర - కొల్లాపూర్	
వెంకటేశ్వర - జనగాం	సాయిసిరి - సిరిసిల్ల	రాఘవేంద్ర ఎ/సి - జడ్చర్ల	మెదక్
తిరుమల - మహబూబాబాద్		సత్యనారాయణ - మక్తల్	బిగ్‌మాక్స్ 70 ఎ/సి - మెదక్
మహేంద్ర రంగ - పరకాల	హరిహరమహల్ - వేములవాడ		సీతారామ - సిద్దిపేట
కృష్ణ సినిమా - తొర్రూర్	నిజామాబాద్	నల్గొండ	లక్ష్మి ఎ/సి - సంగారెడ్డి
ఖమ్మం	విజయ - నిజామాబాద్	శ్రీవెంకటేశ్వర - నల్గొండ	సీతారామ - జహీరాబాద్
వినోద 70 - ఖమ్మం	రాజశ్రీ - కామారెడ్డి	కిషోర్ ఎ/సి - సూర్యాపేట	సంతోష్ ఎ/సి - గజ్వేల్
దుర్గ 70 - కొత్తగూడెం	ప్రియ 35 - బోధన్	రంగ 70 ఎ/సి - కోదాడ	సాయిరామ్ - రామాయంపేట
ఉదయభాస్కర్ - సత్తుపల్లి		దేవి - హుజూర్‌నగర్	మహిత 70 - నారాయణఖేడ్
సాయి బాలాజీ - మణుగూరు	మహబూబ్‌నగర్	శ్రీకృష్ణ - భువనగిరి	లక్ష్మి - జోగిపేట
వెంకటేశ్వర - పాల్వంచ	మహేశ్వరి - మహబూబ్‌నగర్	వెంకటేశ్వర - దేవరకొండ	రంగారెడ్డి
కళాంజలి ఎ/సి - ఇల్లందు	శ్రీనివాస ఎ/సి - వనపర్తి	సుధా 70 - మిర్యాలగూడ	చంద్ర 70 ఎ/సి - తాండూర్
శ్రీనివాస ఎ/సి - భద్రాచలం	శ్రీనివాస ఎ/సి - గద్వాల్	సాయిరాం - చౌటుప్పల్	భవాని 70 ఎ/సి - వికారాబాద్
మహాలక్ష్మి - వెంకటాపురం	బాబా 70 - నారాయణపేట	శ్రీవెంకటేశ్వర - నేరేడుచర్ల	



సప్తగిరి 70 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,2.00,6.00,9.00

అర్జున్ 70 ఎంఎం ఎ/సి - కూకట్‌పల్లి 11.30,2.30,6.30,9.30

కోణార్క్ 70 ఎ/సి - దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.15,6.15,9.15

మంజు 70 ఎ/సి - సికింద్రాబాద్ 11.00,2.00,6.00,9.00

PRASADS ఎ/సి - 12.05,11.10	INOX కాచిగూడ - 11.30,7.45	MULTIPLEX దిల్‌సుఖ్‌నగర్ - 2.30,10.30	Cinepolis మియాపూర్ 11.15,6.15
PVR ఇన్ ఆర్బిట్‌మాల్ - మాదాపూర్	Cinemax అమీర్‌పేట్ 2.00,7.40	T ఇసిఐఎల్ క్రాస్ రోడ్ 11.15,6.15	11.15,1.50,4.30,10.00
PVR ఆర్.కె. కాంప్లెక్స్ - బంజారాహిల్స్	Cinemax శామీర్‌పేట్ 4.50,10.30	ASIAN ఉప్పల్ 10.35,7.25,10.15	చింతల్ 11.30,2.30,6.30
PVR పంజాగుట్ట - 11.00,7.40	Cinepolis కూకట్‌పల్లి - 11.25,4.15	Lakshmikala మూసాపేట్ 11.15,2.30,6.15,9.15	ASIAN హన్మకొండ 10.10,1.25,7.15
PVR పంజాగుట్ట - 11.10,5.05,10.50	Cinepolis మల్కాజిగిరి - 11.30,7.00	ASIAN కూకట్‌పల్లి 10.40,1.30,7.20	GEETHA ASIAN నిజామాబాద్ 10.50,1.40,7.20
PVR కూకట్‌పల్లి - 10.10,4.10,10.40	Cinepolis అత్తాపూర్ - 11.30,7.40	ASIAN అత్తాపూర్ 10.30,4.35,7.40	SVC కరీంనగర్ - 2.10,7.40,10.30
PVR హైటెక్‌సిటీ - 12.15,7.45	TIVOLI సికింద్రాబాద్ - 11.00,4.20	ASIAN కాప్రా 10.45,4.30,7.20	12.50,4.00,6.50,10.10
INOX బంజారాహిల్స్ - 12.10,5.40,10.10	Cine Planet కొంపల్లి 10.30,7.45,10.40	దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.00,6.15	

SVC మహాలక్ష్మి కాంప్లెక్స్ - కొత్తపేట 11.00,2.00

రాఘవేంద్ర కాంప్లెక్స్ - మల్కాజిగిరి 11.15,2.15,6.15,9.15

శ్రీకృష్ణ - ఉప్పల్ 11.00,2.00,6.00,9.00

సంపూర్ణ - వనస్థలిపురం 11.00,2.00,6.00,9.00

ఇంద్ర - కర్మన్‌ఘాట్ 12.00,3.00,7.00,10.00

జ్యోతి - ఆర్సీపురం 11.00,2.00,6.00,9.00

శ్రీరమణ కాంప్లెక్స్ - అంబర్‌పేట 11.15,2.15,6.15,9.15

స్వప్న కాంప్లెక్స్ - కాటేదాన్ 11.00,2.15,6.00,9.00

విజేత - బోరబండ 11.00,2.00,6.00,9.00

విమల్ - బాలానగర్ 11.15,2.15,6.15,9.15

అంబ - మెహిదీపట్నం 11.30,2.30,6.30,9.30

శ్రీప్రేమ - తుక్కుగూడ 11.00,2.00,6.00,9.00

లక్ష్మీ కళామందిర్ - అల్వాల్ 11.30,2.30,6.30,9.30

శ్రీరామ - బహదూర్‌పుర 11.30,2.30,6.30,9.30

సాయిపూజ - సూరారం 11.00,2.00,6.00,9.00

సెన్సేషన్ సన్‌షైన్ - ఖైరతాబాద్ 11.00,2.00,6.00,9.00

జ్యోతి - ఐడిఎ బొల్లారం 11.00,2.00,6.00,9.00

రుక్మిణి - పటాన్‌చెరు 11.00,2.00,6.00,9.00

శివరంజని డీలక్స్ - ఇస్నాపూర్ 11.00,2.00,6.00,9.00

శారద 70 ఎ/సి - కాప్రా 11.00,2.00,6.00,9.00

కళ్యాణి - బోయిన్‌పల్లి 11.00,2.00,6.00,9.00

సంతోష్ - ఇబ్రహీంపట్నం 11.00,2.00,6.00,9.00

గణేష్ - శంషాబాద్ 11.15,2.15,6.00,9.00

కృష్ణ సినిమా - నాగారం 11.00,2.00,6.00,9.00

జగదాంబ - ఘట్‌కేసర్ 11.00,2.00,6.00,9.00

వెంకటేశ్వర - మేడ్చల్ 11.00,2.00,6.00,9.00

శ్రీకృష్ణ - అలియాబాద్ 11.00,2.00,6.00,9.00

వెంకటసాయి 70 - కీసర 11.00,2.00,6.00,9.00

రంగా 70 - జీడిమెట్ల 11.00,2.00,6.00,9.00

జెమిని కాంప్లెక్స్ - వరంగల్	తిరుమల - నిర్మల్	లక్ష్మి 70 - శంకర్‌పల్లి	వెంకటేశ్వర - వరిగొండ	తారా సినిమా - మొత్కూర్
వెంకటరామ - వరంగల్	వెంకటేశ్వర - సిద్దిపేట	సాయికృష్ణ - పరిగి	లక్ష్మి - యాదగిరిగుట్ట	నారాయణ - హుస్నాబాద్
విజయ - హన్మకొండ	సితార - జహీరాబాద్	మోహన్ - జహీరాబాద్	మల్లేశ్వరి - ఇల్లందు	సందీప్ - గంగావతి
ఆదిత్య 70 - ఖమ్మం	శ్రీనివాస - కోదాడ	యాదగిరి - గజ్వేల్	లక్ష్మి 70 ఎ/సి - మాల్	వెంకటేశ్వర - ఉట్నూర్
వెంకటేశ్వర - కరీంనగర్	మనోజ్ - దేవరకొండ	స్వర్ణ కెంపా - జనగాం	శ్రీనివాస - సత్తుపల్లి	మనోహర్ - నారాయణపేట
శ్రీదేవి - నిజామాబాద్	పరమేశ్వరి - కొత్తగూడెం	కాకతీయ - పరకాల	సీతారామ - ఇల్లందు	వెంకటేశ్వర -
నటరాజ్ - ఆదిలాబాద్	విజయభాస్కర్ - భద్రాచలం	భవాని - కాజిపేట	లక్ష్మి - ఖానాపూర్	నటరాజ్ - హుజూరాబాద్
బాలాజీ - మహబూబాబాద్	లక్ష్మి 70 - తాండూర్	వెంకటరామ - మహబూబాబాద్	శ్రీదేవి 70 - చెర్ల	సినీమ్యాక్స్ - వికారాబాద్
సాయిదత్త శ్రీనివాస - మెదక్	శ్రీరామ - జగిత్యాల	మహేశ్వరి - సదాశివపేట	కిన్నెర 70 - కోరుట్ల	సత్యలక్ష్మి - అచ్చంపేట
తిరుమల - నల్గొండ	సాయికృష్ణ - మెట్‌పల్లి	సంతోష్ - రామాయంపేట	వెంకటేశ్వర - గద్వాల్	శరణబసవేశ్వర - బీదర్
శ్రీనివాస - మిర్యాలగూడ	హరిహర - జమ్మికుంట	సాయి డీలక్స్ - నర్సాపూర్	రామకృష్ణ - బెల్లంపల్లి	అపర్ణ చిత్రమందిర్ - మాన్వి
సప్న - సూర్యాపేట	సాయిబాబా - షాద్‌నగర్	మణికంఠ - చేవెళ్ళ	సూర్య కెంపా - నెక్కొండ	కనకాంజలి - కొప్పళ్
శ్రీనివాస - గోదావరిఖని	వెంకటరామ - జడ్చర్ల	శ్రీనివాస - చౌటుప్పల్	శాంతి - మరిపెడ	పద్మావతి 70 - కర్నూలు
వెంకటేశ్వర - మంచిర్యాల	వెంకటేశ్వర - వనపర్తి	సుజన - చిట్యాల	ఓంకార్ - భువనగిరి	బస్వరాజ్ - కుష్టగి
ప్రియ - కామారెడ్డి			ఆనంద్ - భూపాలపల్లి	లక్ష్మీశ్రీనివాస - మథిర





ట్రెండీ శ్రీదేవి @ ఎయిర్‌పోర్ట్!

అందంలోనే కాదు... ఎప్పటికప్పుడు ఫ్యాషన్ ట్రెండ్స్ అందిపుచ్చుకోవడంలోనూ శ్రీదేవికి నేటితరం కథానాయికలకు గట్టి పోటీ ఇచ్చారు. ఎయిర్‌పోర్ట్ ట్రెండ్... ఇటీవల ఫ్యాషన్ సర్కిల్స్‌లో, ముఖ్యంగా ముంబయ్‌లో తరచూ వినిపించే మాట! సోషల్ మీడియా వచ్చిన తర్వాత కథానాయికల ప్రతి అడుగు చర్చనీయాంశం అవుతోంది. వాళ్ళు ఎక్కడ కనిపించినా అభిమానులు ఫొటోలు తీసి నెట్‌లో పెడుతున్నారు. దాంతో తెరపై ఎప్పుడూ అందంగా, ట్రెండీగా కనిపించే కథానాయికలు బయటకు వచ్చే సమయాల్లోనూ చక్కగా రెడీ అయ్యి వస్తున్నారు. ముఖ్యంగా ఎయిర్‌పోర్ట్‌కి వచ్చేటప్పుడు (వివిధ నగరాలకు ప్రయాణం అయ్యేటప్పుడు) సరికొత్త ఫ్యాషన్‌లను పరిచయం చేస్తున్నారు. ఈ విషయంలోనూ శ్రీదేవి ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ వచ్చారు. అలాగని, చిట్టిపొట్టి బట్టలు వేసుకోలేదు. హుందాగా బట్టలు వేసుకుని నేటితరం కథానాయికలకు సవాల్ విసిరారు. దటీజ్ శ్రీదేవి.









శ్రీదేవితో కలిసి తొలిసారి కెమెరా ముందుకు

బాలీవుడ్ నటుడు హృతిక్‌రోషన్ శ్రీదేవితో తనకున్న తీపి జ్ఞాపకాలను పంచుకున్నారు. బాలనటుడిగా ఆమెతో కలసి నటించినప్పటి ఫోటోను ట్విట్టర్లో పోస్ట్ చేశారు.

"నేను చాలా చిన్న పిల్లాడిగా ఉన్నప్పుడే శ్రీదేవితో కలిసి నటించాను. అదే నేను తొలిసారి షూటింగ్‌లో పాల్గొనటం. దీంతో ఆ సమయంలో చాలా ఒత్తిడికి గురయ్యాను. నాలో భయం పోగొట్టటానికి ఆమె నాతో చక్కగా కలసిపోయి నవ్వించారు. సరదాగా ఉండి నా భయాన్ని పోగొట్టారు. శ్రీదేవి అద్భుతమైన నటి. ఆమె లేని వెలితి తీర్చలేనిది. ఆమె ఆత్మకు శాంతి కలగాలి" అని హృతిక్ తన బాధను వ్యక్తం చేశారు.

ROMANTIC LOVE STORY
నేడే చూడండి



శ్రీమయూరి
70 ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
11.00,2.00,6.00,9.00

మూసాపేట్ 6.15PM	కూకట్‌పల్లి 4.40PM
PRASADS ఎన్టీఆర్ గార్డెన్స్ 1.10PM	అత్తాపూర్ 10.45PM
కొంపల్లి 11.00AM	కాప్రా 11.00AM
ఇ.సి.ఐ.ఎల్ క్రాస్ రోడ్ 9.15PM	TIVOLI సికింద్రాబాద్ 2.15PM
ఉప్పల్ 1.20PM	అమీర్‌పేట 7.30PM
PVR మాదాపూర్ - 4.30PM	INOX బంజారాహిల్స్ 2.55
PVR పంజాగుట్ట - 1.40PM	INOX ఎ/సి - 3.55PM
PVR కూకట్‌పల్లి 11.20 AM	Cinépolis ఎ/సి - 4.05PM
PVR హైటెక్‌సిటి 1.00PM	Cinépolis ఎ/సి - 2.15PM
PVR పంజాగుట్ట 11.00AM	ఎ/సి - 11.00AM

లక్ష్మణ్ 70 - వరంగల్	శ్రీరమణ - నాగర్‌కర్నూల్	శ్రీనివాస - నర్సాపూర్
రాజా డీలక్స్ - కరీంనగర్	మహేశ్వరి - నారాయణపేట	శ్రీమాధవ - ఐజ
వెంకటాద్రి 70 ఎంఎం ఎ/సి - మహబూబ్‌నగర్	సాయిరాం - అచ్చంపేట	సాయికృష్ణ - కోదాడ
	బాలాజి - సిద్దిపేట	వెంకటేశ్వర - ఆమన్‌గర్
శ్రీనివాస - తాండూర్	తిరుమల - గజ్వేల్	శ్రీదేవి 70 - కొత్తకోట
రాఘవేంద్ర - జడ్చర్ల	SSV గణేష్ - షాద్‌నగర్	సత్యసాయి - కొల్లాపూర్

AMAZING ARTS RELEASE












ఫ్యాషన్ క్వీన్.. శ్రీదేవి!


సినిమా - ఫ్యాషన్.. రెండూ పరస్పరాధారితాలే. ఆ విషయం చాలా బాగా అర్థం చేసుకున్న తార శ్రీదేవి. అందుకే ఆమె మధ్యలో కొంత కాలం సినిమాలకు దూరమైనా... ఫ్యాషన్ ప్రపంచానికి మాత్రం దగ్గరగానే ఉన్నారు. తరచూ ఫ్యాషన్ షోల్లోనూ పాల్గొనేవారు. ఎప్పటికప్పుడు ట్రెండీగా కనిపిస్తూ కుర్రహీరోయిన్లకు సవాల్ విసిరేవారు. ఫ్యాషన్ షోలు, సినిమా ఫంక్షన్లు, శుభకార్యాలు.. ఏవైనా సరే ఆమె అలంకరించుకున్న ఆభరణాలు, ధరించిన దుస్తులు, తలకట్టు గురించి అందరూ ప్రత్యేకంగా మాట్లాడుకోవాల్సిందే. అలా ఆమె అందంగా ముస్తాబై కెమెరా కంటికి చిక్కిన సందర్భాలు...







PRASADS మల్టీప్లెక్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్	PVR ఐకాన్ - హైటెక్ సిటీ
Cinépolis మంజీరా మాల్ - కూకట్‌పల్లి	PVR గల్లేరియా - పంజాగుట్ట
Cinépolis CCPL ఎ/సి - మల్కాజ్‌గిరి	బిగ్‌సినిమాస్ - అమీర్‌పేట్
Cinépolis మంత్రామాల్ - అత్తాపూర్	లియోనియో - శామీర్‌పేట్
INOX జి.వి.కె. మాల్ - బంజారాహిల్స్	TIVOLI కాంప్లెక్స్ ఎ/సి - సికింద్రాబాద్
INOX ఎం.పి మాల్ - కాచిగూడ	మీరజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
PVR ఇన్ ఆర్బిట్‌మాల్ - మాదాపూర్	ASIAN సినీస్క్వేర్ ఎ/సి - ఉప్పల్
PVR ఆర్.కె. కాంప్లెక్స్ - బంజారాహిల్స్	ASIAN ఎంక్యూబ్ ఎ/సి - అత్తాపూర్
PVR సెంట్రల్ మాల్ - పంజాగుట్ట	Cine Planet మల్టీప్లెక్స్ ఎ/సి - కొంపల్లి
PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి	



మరోసారి కోల్పోయా

\- సజల్

"నా వెండితెర అమ్మను మరోసారి కోల్పోయాను" అని సజల్ అలీ అన్నారు. 'మామ్' చిత్రంలో శ్రీదేవి కుమార్తెగా నటించారు సజల్. 'మామ్' షూటింగ్ సమయంలో శ్రీదేవితో తీసుకున్న ఫొటోను ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. 'మామ్' సినిమా షూటింగ్ చేస్తుండగా సజల్ తల్లి కన్నుమూశారు. ఆ సమయంలో సజల్‌ని శ్రీదేవి ఓదార్చేవారట. ఓ సందర్భంలో ప్రెస్‌మీట్‌లో శ్రీదేవి మాట్లాడుతూ "సజల్ నా కుమార్తె. తనను గురించి మాట్లాడుతుంటే ఎందుకు ఎమోషన్ అవుతున్నానో కూడా అర్థం కావడం లేదు" అని అంటూ కళ్లనీళ్లు తుడుచుకున్నారు. శ్రీదేవి మరణంతో తను మరోసారి తల్లిని కోల్పోయానని సజల్ ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన వాక్యం అందరినీ కదిలిస్తోంది.



శ్రీదేవిగారి హఠాన్మరణం బాధాకరం!

- నందమూరి బాలకృష్ణ



“శ్రీదేవిగారితో నాన్నగారు చాలా సినిమాల్లో నటించారు. ఎలాంటి భావాన్ని అయినా కళ్ళతోనే పలికించగల మహానటి శ్రీదేవిగారు. ఆవిడ హఠాన్మరణం చిత్రసీమకు తీరని లోటు, బాధాకరం.”

భారతీయ చిత్రసీమకు తీరని లోటు!

- డా. మోహన్‌బాబు



“శ్రీదేవి కుటుంబంతో నాకు తిరుపతి నుండి మంచి అనుబంధం ఉంది. ఆమె తల్లి తిరుపతికి చెందినవారు. శ్రీదేవితో కలిసి చాలా సినిమాల్లో నటించాను. భారతీయ చిత్రసీమ మంచి నటిని మాత్రమే కాదు, ఉన్నతమైన వ్యక్తిని కూడా కోల్పోయింది. నా 42వ సినీ జీవిత ఉత్సవాలు విశాఖపట్నంలో జరుగుతున్నప్పుడు కేవలం ఫోన్ చేయగానే వైజాగ్ వచ్చి, ఆ వేడుకల్లో పాల్గొన్నారు.”



లెజెండ్ ఇక లేరు!

- రజనీకాంత్

“చిత్రపరిశ్రమ ఒక లెజెండ్‌ని, నేను అత్యంత ఆత్మీయురాలిని కోల్పోయాం! ఆమె మరణ వార్త విని నేనెంతో కలత చెందాను. షాకయ్యాను. ఇది కల అయితే... బాగుంటుంది. కెమెరా వెనుక మౌనంగా ఉండే ఆమె కెమెరా ముందుకు రాగానే తన విశ్వరూపాన్ని ప్రదర్శించేవారు. ఎవరి మీదా శ్రీదేవి కోప్పడిన సందర్భాలు నేను చూడలేదు. హిందీ కూడా తెలియని ఆమె ముంబయ్ వెళ్ళి బాలీవుడ్‌లో అగ్రతారగా ఎదగడం అందరికీ ఆశ్చర్యంగా ఉంటుంది. ఆమె మరణం చిత్రసీమకు తీరని లోటు”

శ్రీదేవికి నటన నేర్పించా!

- కమల్‌హాసన్



“అమాయకపు టీనేజ్ అమ్మాయి నుంచి గొప్ప నటిగా ఎదిగిన శ్రీదేవిని నేను చూశా. స్టార్‌డమ్‌కు నిజంగా ఆమె అర్హురాలే. ఆమెతో నాకెన్నో మధుర జ్ఞాపకాలున్నాయ్. చివరిసారి ఆమెను కలిసిన క్షణాలతో సహా ఒక్కసారిగా నా కళ్ళ ముందు అవన్నీ మెదులుతున్నాయ్. ‘సద్మా’ చిత్రంలోని ‘లాలి...’ పాట ఇప్పుడు నన్ను వెంటాడుతోంది. శ్రీదేవితో కలిసి 27 చిత్రాల్లో నటించా. అప్పట్లో దర్శకులు, మా గురువుగారు బాలచందర్ సూచనల మేరకు ఆమెకు నటన నేర్పించా. ఇది వాస్తవం.”



ఆ పాత్ర కోసమే పుట్టిందా అనేంతగా...


- చిరంజీవి



అందం అభినయం కలబోసిన నటి శ్రీదేవి. ఇలాంటి నటి ఇంతవరకు లేరు. ఇకమీద వస్తారని కూడా నేను అనుకోవటం లేదు. నిజంగా భగవంతుడు ఆమెకు అన్యాయం చేశాడు. శ్రీదేవి హఠాన్మరణాన్ని జీర్ణించుకోలేకపోతున్నాను. చిన్నప్పట్నుంచీ ఆమెకు నటన తప్ప మరో వృత్తి తెలీదు. ఇంకో ధ్యాస, వ్యాపకం లేదు. నటన నటన అంటూ తన అంకిత భావాన్ని తెరమీద చూపింది. మా ఇద్దరి కాంబినేషన్‌లో వచ్చిన అత్యద్భుత దృశ్యకావ్యం ‘జగదేక వీరుడు అతిలోక సుందరి’. దేవకన్య పాత్రలో ఎంతగా ఒదిగిపోయిందంటే.. ఆమె కోసమే ఆ పాత్ర సృష్టించబడిందా.. ఆ పాత్ర కోసమే శ్రీదేవి పుట్టిందా అన్నంతగా నటించింది. శ్రీదేవితో నేను చేసిన ఆఖరి సినిమా ‘ఎస్పీ పరుశరాం’. సినిమా పరంగానే కాకుండా శ్రీదేవి నాకు మంచి ఆప్తురాలు. మా ఇరు కుటుంబాల్లో ఏ వేడుక జరిగినా ఆత్మీయంగా కలిసేవాళ్లం. ఆమె మరణించిందంటే ఇప్పటికీ నమ్మలేకపోతున్నాను. ఆ వార్త విని షాకయ్యా. తన నటనతో కోట్ల మంది ప్రేక్షకుల హృదయాలను ఆకట్టుకున్న శ్రీదేవి చనిపోయిందని నేను అనుకోవట్లేదు. ఎప్పటికీ ప్రేక్షకుల హృదయాల్లో శ్రీదేవి చిరస్థాయిగా జీవించే ఉంటారు. ఈ సినిమా ప్రపంచం ఉన్నంత వరకు శ్రీదేవి బ్రతికే ఉంటుంది. గొప్ప నటిని పోగొట్టుకోవడం భారత ప్రజలు, సినీ ప్రజలందరి దురదృష్టమని భావిస్తున్నా. శ్రీదేవి ఆత్మకి శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను.

నవ్వాలో... ఏడవాలో... తెలియడం లేదు!

- నాగార్జున



“శ్రీదేవి మనల్ని వదిలి వెళ్ళిందనే నిజాన్ని జీర్ణించుకోవడానికి నాలోని శక్తిని అంతటినీ కూడదీసుకుంటున్నా. ఇదొక చెడు కల అని నమ్మడానికి ప్రయత్నిస్తున్నా. ఆమెతో కలిసి నటించిన, మాట్లాడిన జ్ఞాపకాలన్నీ గుర్తొస్తున్నాయి. నాకు నవ్వాలో... ఏడవాలో... తెలియడం లేదు! వుయ్ లవ్ యు డియర్ శ్రీదేవి”


దురదృష్టకరమైన రోజు!

- వెంకటేశ్



“ఈ రోజు నిజంగా దురదృష్టకమైనది. అద్భుతమైన, ప్రతిభావంతురాలైన నటిని మనం కోల్పోయాం. ‘క్షణక్షణం’లో ఆమె కో-స్టార్‌గా చెబుతున్నా... ఆ చిత్రంలోని ఆమె పలికించిన ప్రతి హావభావం నా మనసులో గుర్తుంది. చిన్న వయసులోనే ఎంతో పేరు, ప్రఖ్యాతలు వచ్చినా... ఎప్పుడూ వినయంగా ఉండేవారు. చిత్రపరిశ్రమలోకి రావాలనుకునే ప్రతి ఒక్కరికీ శ్రీదేవి సినిమా ప్రయాణం స్ఫూర్తినిస్తుంది. ఆమె ఆత్మని, కుటుంబాన్ని దేవుడు చల్లగా చూడాలని కోరుకుంటున్నా. వాళ్ళ కుటుంబ సభ్యులతో పాటూ నేనూ బాధను అనుభవిస్తున్నా. ఎప్పటికీ శ్రీదేవిని మిస్సవుతా”

ఆల్‌టైమ్ ఫేవరెట్



“శ్రీదేవిగారు ఇక లేరనే వార్త విని కలత చెందాను. నా ఆల్‌టైమ్ ఫేవరెట్ నటి. మహిళగా, నటిగా ఆమె జీవిత సారాంశం ఎంతో అద్భుతం. చాలా త్వరగా వెళ్ళిపోయారు. ఆమె కుటుంబ సభ్యులకు, ఆమెను ప్రేమించేవాళ్ళకు బలం చేకూరాలని దేవుణ్ణి ప్రార్థిస్తున్నా. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలి”

- మహేశ్‌బాబు

ఎందరికో ఆదర్శం




“నాలాంటి ఎందరో నటీమణులకు శ్రీదేవిగారు ఆదర్శం. ఆమె మృతి నన్నెంతో దిగ్భ్రాంతికి గురిచేసింది”

- రోజా

శ్రీదేవిగారు లేరనే మాట నమ్మలేనిది!

- పవన్‌కల్యాణ్



“అసమానమైన అభినయ ప్రతిభతో భారతీయ ప్రేక్షకలోకం అభిమానాన్ని చూరగొన్న నటి శ్రీదేవి. దుబాయ్‌లో వివాహానికి వెళ్లిన శ్రీదేవి చనిపోయారని తెలియగానే దిగ్భ్రాంతికి లోనయ్యాను. ఆమె ఇక లేరనే మాట నమ్మలేనిది. కానీ, వెండితెరపై ఆమె పోషించిన పాత్రలన్నీ చిరస్మరణీయాలే. భౌతికంగా శ్రీదేవిగారు ఈ లోకాన్ని వీడినా... నటిగా చిత్రసీమలో ఆమె ముద్ర సుస్థిరం. వాళ్ళ కుటుంబానికి ఈ విషాదాన్ని తట్టుకునే మానసిక స్థైర్యాన్ని భగవంతుడు అందించాలని ప్రార్థిస్తున్నాను. బాలనటిగా, కథానాయికగా దక్షిణ భారత సినీ రంగంలో విజయాలు అందుకున్న శ్రీదేవిగారు అదే స్థాయిలో హిందీ ప్రేక్షకుల అభిమానాన్ని పొందారు. ‘బడిపంతులు’ చిత్రంలో బాలనటిగా ‘బూచాడమ్మా... బూచాడు’ పాటలో కళ్లు అటూ ఇటూ తిప్పుతూ పలికించిన హావభావాల్ని ప్రేక్షకులు మర్చిపోలేరు. అలాగే, అన్నయ్యతో ‘జగదేక వీరుడు అతిలోక సుందరి’లో దేవకన్య ఇంద్రజగా కన్పించిన తీరు... ‘మానవా’ అంటూ చెప్పే సంభాషణలూ ప్రజలంతా గుర్తు చేసుకునేవే. విరామం తర్వాత ‘ఇంగ్లిష్ వింగ్లిష్’, ‘మామ్’ చిత్రాల్లో నటించి తన శైలిని ఈ తరానికి చూపించారు. పెద్ద కుమార్తె జాన్వీని కథానాయికగా చిత్ర సీమలోకి తీసుకువస్తున్న తరుణంలో ఈ లోకాన్ని వీడటం బాధాకరం.”

మనసుల్ని గెలిచారు




“(స్వర్గం నుంచి) ఆమె వచ్చారు. (మనల్ని) చూశారు. (ప్రేక్షకుల మనసుల్ని) గెలిచారు. స్వర్గం నుంచి వచ్చిన ఆమె మళ్ళీ అక్కడికే తిరిగి వెళ్లిపోయారు. శ్రీదేవిగారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నా. ఆమె స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరు”

- ఎన్టీఆర్

నా విజయంలో సగభాగం శ్రీదేవిదే!

- కె. రాఘవేంద్రరావు



“స్వయంకృషితో ఎదిగిన నటి శ్రీదేవి. ‘పదహారేళ్ళ వయసు’ నుంచి ‘అతిలోక సుందరి’ వరకు... తెలుగు, తమిళం నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయి వరకు... శ్రీదేవి అధిరోహించని మైలు రాయి లేదంటే అతిశయోక్తి కాదు. బాలనటి నుంచి మహానటి వరకు నాతో ప్రయాణం చేసిన శ్రీదేవి హఠాన్మరణం అత్యంత బాధాకరం. భారతీయ చిత్ర పరిశ్రమకి తీరని లోటు. ఈ మధ్య ‘మామ్’ ప్రచారం నిమిత్తం హైదరాబాద్ వచ్చినప్పుడు కలిశా. నేనూ ‘మామ్’ ప్రచార కార్యక్రమానికి వెళ్ళా. మా ఇద్దరి కాంబినేషన్‌లో 24 చిత్రాలు వచ్చాయి. 25వ చిత్రం ఎప్పుడు చేస్తారు? అనే ప్రస్తావన వచ్చినప్పుడు తప్పకుంగా సిల్వర్ జాబ్లీ చిత్రం చేద్దామనుకున్నాం. ఈలోపు ఇలా జరగడం చాలా దురదృష్టం. ఎందుకంటే... నాకు ఆ అమ్మాయి బాలనటిగా ఉన్నప్పటినుంచి పరిచయం. మా నాన్నగారి (దర్శకుడు కె.ఎస్. ప్రకాశ్‌రావు) వద్ద నేను సహాయ దర్శకుడిగా ఉన్నప్పుడు, ఆయన దర్శకత్వం వహించిన ఒక చిత్రంలో శ్రీదేవి బాలనటిగా చేసింది. బాలనటి నుంచి మహానటి అయ్యేవరకూ ఆ అమ్మాయితో నా జర్నీ మర్చిపోలేనిది. ఇటీవల నా ‘సౌందర్యలహరి’ కార్యక్రమానికి తను వచ్చినప్పుడు ‘నా విజయంలో సగభాగం శ్రీదేవికి కూడా ఉంటుందని చెప్పాను. విచ్ ఈజ్ ఎ ఫ్యాక్ట్. అలాంటి శ్రీదేవి ఇంత చిన్న వయసులో చనిపోవడం నేను ఊహించలేకపోతున్నా”.

సినిమాల్లో అంత అందమైన నటి లేదు!

- జమున



“కాఫీ కోసం డైనింగ్ హాల్‌లోకి వెళ్తుంటే... శ్రీదేవి చనిపోయారనే వార్తను మా అమ్మాయి స్రవంతి చెప్పింది. మొదట నేను నమ్మలేదు. ‘ఏ శ్రీదేవి... ఏ శ్రీదేవి’ అనడిగా. ‘నటి శ్రీదేవి’ అని చెప్పింది. చాలా షాకయ్యా. నాకు తెలీకుంగా నా చెయ్యి గుండెల మీదకు వెళ్ళింది. మాట రాక ఒక్క సెకన్ అలా ఉండిపోయా. మెల్లగా కోలుకున్నా... ఎంత ఏడుపు వచ్చిందో. చాలా ఏడ్చేశా. ఆ దుఃఖం ఇంకా తగ్గలేదు. అయినా.. కంట్రోల్ చేసుకుంటున్నా. ఉదయం నుంచి శ్రీదేవి గురించిన ఆలోచనలు, ఊసులే. రాత్రి కలలోకి కూడా ఆ అమ్మాయి వస్తుందేమో... చెప్పలేం! వ్యక్తిగతంగా నాకు మాత్రమే కాదు... సినిమా ప్రపంచానికి తీరని లోటు. ముఖ్యంగా తను అందాల నటి, అతిలోక సుందరి మాత్రమే కాదు. అద్భుతమైన మహానటి. శ్రీదేవి పదేళ్ళ వయసున్నప్పుడు ‘మమత’ అనే చిత్రంలో నాకు మేనకోడలుగా నటించింది. ఎంత ముద్దు ముద్దుగా మాట్లాడేదో... ముద్దొచ్చేదో! అంత చిన్న వయసులో క్రమశిక్షణతో మెలిగేది. చక్కటి భాషా జ్ఞానంతో ముఖంలో పెద్దవాళ్ళ కంటే అద్భుతంగా ఉండే హావభావాలు పలికించేది. ఇటీవల చాలాసార్లు ఆమెను కలిశా. శ్రీదేవి పెద్ద స్టార్ అయినా కూడా అదే వినయం, అదే సత్ప్రవర్తన, నిగర్వత్వంతో ఉండేది. సీనియర్లను గౌరవించే విషయంలో ఏం మారలేదు. తను నటించిన ప్రతి చిత్రంలోనూ ఒక విభిన్నత్వం చూపించింది. సినిమా తారల్లో అంత అందమైన నటి ఎవరూ లేరు. నన్నూ అందాల తార అంటారు కానీ.. ఆమె అందం వేరు. ‘మిస్టర్ ఇండియా’లో చార్లీ చాప్లిన్‌లా మారు వేషంలో టోపీ పెట్టుకుని నటించిన సన్నివేశం నాకిష్టం.”

దేవుడా.. ఓడిపోయావ్!

- వైవీయస్ చౌదరి



“దేవుడా... నువ్వు సృష్టించిన శ్రీదేవిగారు నాలాంటి కోట్లాది మంది అభిమానులు, ప్రేక్షకుల మనసులను రంజింపజేస్తున్న దేవకన్య/దేవదూత. శ్రీదేవిగారిని మా నుంచి తీసుకెళ్ళిపోవడంతో... మేము అనుభవిస్తున్న ఈ బాధని నీ సృష్టిలోని ఎవరూ, ఏ వస్తువూ ఓదార్చలేకపోతోంది. ఈ విషయంలో నువ్వూ, నువ్వు సృష్టించిన ఈ సృష్టి రెండూ ఓడిపోయాయి.”

పిల్లల భవిష్యత్ చూడకుండానే...

- కృష్ణంరాజు



“శ్రీదేవి లేదంటే... చిత్రపరిశ్రమకు పెద్ద లాస్. పాపం... ఆమె పిల్లలు ఇద్దరూ ఇప్పుడే పైకి వస్తున్నారు. పెద్దమ్మాయి హీరోయిన్‌గా నటిస్తోంది. తన పిల్లల భవిష్యత్ చూడకుండా ఆవిడ ఈలోకం విడిచివెళ్ళడం చాలా దురదృష్టకరం. ఆ పిల్లలకు, కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలుపుతూ... శ్రీదేవి ఆత్మకు శాంతి కలగాలని దేవుణ్ణి కోరుకుంటున్నా. శ్రీదేవికి తోటి నటీనటులను డామినేట్ చేయాలనే ఆలోచనలు, ఈగో వంటివి లేవు. చాలా స్పోర్టివ్‌గా ఉండేది. సినిమాలో ముగ్గురు హీరోయిన్లు ఉంటే ముగ్గురితోనూ హ్యాపీగా ఉండేది. అందితోనూ సరదాగా ఉండేది. ఉన్నత వ్యక్తిత్వం కల మనిషి.”

అద్భుతమైన నటి...

- మురళీమోహన్



“యావత్ భారతదేశానికి ఒక అతిలోక సుందరిగా, ఒక అద్భుతమైన నటిగా పరిచయమైన శ్రీదేవి ఇక లేరు. భారతీయ ప్రేక్షకుల గుండెల్లో గూడు కట్టుకున్న శ్రీదేవి ఇక రారు. తిరిగిరాని లోకాలకు వెళ్ళిపోయారనే నిజాన్ని విన్న తర్వాత చాలా దిగ్భ్రాంతికి లోనయ్యాను.

కలగానే మిగిలింది!

- జయప్రద



“శ్రీదేవి మరణవార్తను మొదట పీడకలగా భావించాను. టీవీల్లో చూసేంత వరకు నేను నమ్మలేదు. ఆమెతో కలిసి చాలా సినిమాల్లో నటించా. తను అద్భుతమైన నటి, మంచి తల్లి. తనలా కుమార్తెలు జాన్వి, ఖుషిలను వెండితెరపై స్టార్లుగా చూడాలన్నది ఆమె కల. కానీ, ఆ కల కలగానే మిగిలింది. పెద్దమ్మాయ్ జాన్వికి తల్లి చివరి చూపు దక్కలేదు. నా హృదయం బాధతో విలవిలలాడుతోంది.”

ఆ మహా నటిని శ్రీదేవిలో చూశా!


- సి. అశ్వినీదత్



“మా కుటుంబానికి అత్యంత ఆత్మీయురాలు, మా సోదరి శ్రీదేవి హఠాన్మరణం జీర్ణించుకోలేకపోతున్నాం. మా కుటుంబంలో ప్రతి ఒక్కరూ ఆమెకు ఎంతో క్లోజ్. మా సంస్థలో ‘గోవిందా గోవింద’, ‘గురుశిష్యులు’, ‘అడవి సింహాలు’, ‘ఆఖరి పోరాటం’, ‘జగదేకవీరుడు అతిలోక సుందరి’ తదితర చిత్రాల్లో నటించారు. వ్యక్తిగతంగా నాకు ఎంతో సహాయపడిన గొప్ప హృదయం కల వ్యక్తి. ‘ఆఖరి పోరాటం’ తీసే రోజుల్లో బాంబేలో ఒక్క క్షణం తీరిక లేకుండా చాలా బిజీగా ఉన్నారు. “అయినా సరే... మీరు ఈ చిత్రం చేయాలి. తండ్రితో చేశారు. తనయుడితోనూ చేస్తే... ఆ ఘనత నీకే వస్తుంది. యువతరానికి ఒక సందేశంలా ఉంటుంది’ అని నేను అడిగితే.. ఒక్క క్షణం కూడా ఆలోచించలేదు. ‘మీకు ఓకే అంటే నాకు ఓకే’ అని అంగీకరించారు. అవసరం అయితే... రాత్రి ఫ్లైట్‌కి హైదరాబాద్ వచ్చి షూటింగ్ చేసి, తెల్లారి ఫ్లైట్‌కి బాంబే వెళ్ళి హిందీ చిత్రాల్లో నటిస్తానన్నారు. చెప్పినట్టుగా 20రోజులు అలా చేశారు. ‘జగదేకవీరుడు అతిలోక సుందరి’కి సొంత చిత్రంలా పని చేశారు. ఆ రెండు చిత్రాలతో నేనెంతో ఉన్నతస్థాయికి వెళ్ళా. నేను పరిశ్రమలోకి వెళ్ళక ముందు, వెళ్ళగానే తెలుసుకున్నది సౌతిండియన్ సూపర్‌స్టార్, మహానటి సావిత్రిగారు అని. ఆవిడ గురించి రామారావుగారు, నాగేశ్వరరావుగారు చెబుతుంటే... ఆవిడతో నేను పని చేయలేకపోయానే అనుకున్నా. తర్వాత నేను నిజంగా ఒక మహానటిని శ్రీదేవిలో చూశాను. ఆమెతో పని చేశాను. ఈవిడ ప్రపంచ స్టార్. నిజంగా అతిలోక సుందరి. ఒక తార దిగి వచ్చి మళ్ళీ వెనక్కి వెళ్ళింది. ఊహించడానికి చాలా కష్టంగా ఉంది.”

మకుటం లేని మహారాణి!

- నిర్మాత బి.వి.ఎస్.ఎన్ ప్రసాద్



“మా సంస్థ ‘శ్రీ వేంకటేశ్వర సినీ చిత్ర’లో మొదటి సినిమా, కృష్ణగారితో తీసిన ‘మకుటం లేని మహారాజు’లో శ్రీదేవి హీరోయిన్. మా ఫస్ట్ హీరోయిన్ ఆవిడ. ‘మకుటం లేని మహారాణి’లా చిత్ర పరిశ్రమలో వెలుగొందిన శ్రీదేవి ఫ్యామిలితో మాకు ఎంతో అనుబంధం ఉంది. శ్రీదేవి లేరన్న వార్తని నమ్మలేకపోతున్నాను.”



“శ్రీదేవి కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సానుభూతి. తను బాలనటిగా ఉన్నప్పటి నుంచీ నాకు తెలుసు. అందరితోనూ ఎంతో సరదాగా ఉండేది.”

- చంద్రమోహన్



